మననమే జపం

(ఆధ్యాత్మిక వ్యాస సంపుటి)

డా॥ కొప్పరపు నారాయణమూర్తి, Ph.D.,

ముద్రణ : 2024 మే

ప్రతులు : 500

డా॥ కొప్పరపు నారాయణమూర్తి, ఆంధ్రప్రదేశ్, 7671909759

ఐ.ఎస్.బి.ఎన్. సంఖ్య : 978-93-343-2528-7

టైటిల్ డిజైను : రాపిక్సల్.కామ్ సౌజన్యంతో

వెల రూ. : 225/-

ప్రచురణ కర్త : డా॥ కొప్పరపు నారాయణమూర్తి Ph.D.

ప్రింటర్స్ :
విజయసాయి ప్రింటర్స్, రామ మందిరం వీధి, ఏలూరు రోడ్, విజయవాడ.

డి.టి.పి. :
శ్రీ దుర్గ గ్రాఫిక్స్, తెనాలి, సెల్ : 9110761291

విషయసూచిక

నా మాట

'మననమే జపం' అన్నది అన్ని జపాలలో చాలా సులువైనది. అది ఆధ్యాత్మికంగా ఎదగడానికి, మన ఔన్నత్యానికి మార్గదాయని. ఒక జపమాల తీసుకొని ఒక చోట కదలకుండా చేసేది జపం. దానికి కొన్ని పరిమితులుంటాయి. వేగం పెరిగిన జీవితం, మారిన అవసరాలు మనకు అంత తీరికను ఇవ్వకపోవచ్చు. రెండవది ఒక పక్కన కూర్చుని జపం చేయటం అనేది నిరంతర ప్రక్రియగా పరిణమించదు కూడ. కానీ, 'మననం' అలా కాదు. ఇది అను నిత్యం స్థలం, సమయంతో సంబంధం లేకుండా చేయదగ్గది. ఇదో రకం మానసిక జపంగా భావించవచ్చు.

ఇదేదో కొత్త విషయమేమీ కాదు. ఈ 'మననం'ను మనం దైవసంబంధం కాని అనేక లౌకిక విషయాల గురించి కుడా చేస్తుంటాము. కొన్ని కొన్ని సంఘటనలు మనల్ని నిస్సహాయులని చేసినప్పుడు, మన నిస్సహాయత మనల్ని వీడిస్తున్నట్టు ఉంటుంది. పదే పదే గుర్తుకొస్తుంటుంది. అలానే ఎవరైనా మనం నమ్మినవాళ్లు మనల్ని మోసం చేసినప్పుడు, హేళన చేసినప్పుడు అదే మాటిమాటికి గుర్తుకొస్తుంటుంది. అలాగే మనల్ని ఒక స్త్రీ ప్రేమించానని చెప్పి (నిజంగా ప్రేమించక పోయినా), నాలుగు తీయని మాటలు మనగురించి మాట్లాడినా మనకు అవే మళ్ళీ మళ్ళీ గుర్తుకొస్తుంటాయి. ఇలా ప్రాపంచిక విషయాలు రాగ ద్వేషాలుగా మనల్ని నిరంతరం లోబరుచుకుని, వాటిగురించే ఆలోచింప చేస్తుంటాయి. ఇదంతా 'మననమే'. అయితే ఇది అజ్ఞాన జనితమైన, అజ్ఞాన భరితమైన 'మననం'.

ఇలా లౌకిక ప్రపంచ రాగ ద్వేష 'మననం' కాకుండా అలౌకిక మైన ఈశ్వర 'మననం' కూడా మానవ జీవితంలో నిత్య కృత్యం కావాలి. అది జరగాలంటే, మనిషికి ఈశ్వరానురక్తి కలగాలి. అది అంత సులభం కాదు. మనిషి స్వాభావికంగా దైవ ప్రతిబింబం. కానీ, 'తాను వేరు, పరమాత్మ వేరు' అనే భావనలో పుట్టుకనుంచి ఉంటాడు కనుక 'దైవ' విషయం ప్రాపంచిక వ్యవహారాలలో ఒకటిగానే చూస్తాడు. 'దైవమే జీవితం' అన్న భావన పొందడు. పుట్టుక ఈశ్వర వరమని, ఆ ఈశ్వర సన్నిధానం చేరటమే జీవిత పరమార్ధమని తెలిసే వరకూ ఇందాక చెప్పినట్టు లౌకిక విషయ రాగ ద్వేష రంజితుడవుతుంటాడు.

కొందరు మిడిమిడి వేదాంతులు ఉంటారు. వారి వాదన వింటే 'పిచ్చి' ఇన్ని రకాలుగా ఉంటుందాని అనిపించకమానదు. 'ఈశ్వరుడే సుఖభోగాలు ఇచ్చాడు. రాగద్వేషాలు ఇచ్చాడు. పులుపు, తీపి ఇచ్చాడు. అన్నీ రుచి చూసి ఆనందించటానికే గదా ఇచ్చాడు. కాబట్టి వాటిని ఎందుకు త్యజించాలి? సుఖించాలన్న ఆలోచన వీడి దైవానికే జీవితం మొత్తం వెచ్చించటం సరి కాదు కదా!' అని ఒక వితండవాదన చేసే రకం వీళ్ళు. ఈ వాదన కూడ సబబే అనే 'తలతిక్క' వేదాంతులు మరి కొందరుంటారు. వారు సందర్భం లేకపోయినా, అసంబద్ధమైన వేవో వాక్యాలు ఎక్కడినుంచో ఉటంకిస్తూ తమ వాదనలను సమర్ధించు కొంటారు. ఇవన్నీ మన ఆధ్యాత్మిక సాధనకు ప్రతిబంధకాలు. మనకు ఈశ్వరుడు పెట్టే పరీక్షలే అని నమ్మితే కాని ఈ కుతర్కాల విషవలయం నుంచి బయట పడం.

ఈ శుష్క వేదాంతుల వలన ఎవరికీ ప్రయోజనం లేదు. కేవలం పాండిత్యంతోనే తాము జ్ఞానులమైపోయామని భావించే మూర్ఖులు వీళ్ళు . వాళ్ళు తప్పు దోవలో పోతూ మరికొందరిని ఆధ్యాత్మిక మార్గంలోకి పోకుండా వినష్టం చేసి పోతుంటారు ఈ శుష్క వేదాంతులు. ఆధ్యాత్మికకు కావలసినది శుద్ధ భక్తి. శుద్ధ భక్తే శుద్ధ జ్ఞానం అన్నారు శ్రీ రామకృష్ణ పరమహంస. వినయం, 'నాకు అంతా తెలుసు అనే అహం సమర్పణ'– అవి శుద్ధభక్తి హేతువులు. 'ఈశ్వరమననమే' ముక్తి దాయకం అన్న నమ్మకమే జ్ఞానం.

తీరా చేస్తే, ఎదో ఒక సంఘటన మానవ జీవితాన్ని మలుపు తిప్పుతుంది. ఒక సాధువుకాని, ఒక దైవం పట్ల అనుకోకుండా కలిగిన అనురక్తి గాని, ఒక సత్పురుషుడి వాక్యాలు కాని మనిషి మార్గాన్ని మార్చేస్తాయి. అప్పటినుంచి మనిషి తన జీవితంలో ఆ ఈశ్వరుడి నామ జపం పుణ్య కార్యంగా భావించడం ఆరంభిస్తాడు. కానీ, అది ఆరంభమే. ఒక్కోసారి ఇది ఆరంభ స్థాయిలోనే ఆగిపోతుంది. కొందరికి అలా కాక దీని అంతు తేల్చుకోవాలని అనిపిస్తుంది. సత్పురుష సందర్శన, పుణ్యక్షేత్ర దర్శన, క్షేత్రమహిమ తెలుసుకోవాలనే జిజ్ఞాస వంటివి కలగనారంభిస్తాయి. కొందరికి సత్పురుష దర్శనం కూడ సంభవిస్తుంది.

ఇలా ప్రేరేపితమైన వారు ధన్యులు. వారు ఆ సత్పురుషుల జీవిత విశేషాలు తెలుసుకోవడానికి ఇష్టపడతారు. ఆ విషయాలలోనే అనురక్తి, ఆసక్తి పెంచుకొంటారు. చివరకు అది 'రాధాకృష్ణు'ల ప్రేమ కథామృతంగా మారుతుంది. ఈ విధంగా ఏర్పడిన అనురక్తే మననానికి సోపానం అవుతుంది.

కొందరు ఇలాంటి 'మననం'ను 'సగుణోపాసన'అని, ఇది దేహభావం కారణంగా కలుగుతున్న మొహం అని, దీనిని కుడా అధిగమించి 'నిర్గుణోపాసన', 'అద్వైతసిద్ధి' పొందాలని వ్యాఖ్యానిస్తుంటారు. కానీ, 'బ్రహ్మసూత్రాలను' పూర్వ మీమాంస, ఉత్తర మీమాంస అని రెండు భాగాలుగా వ్యాసుడు విభజించాడు. సగుణోపాసన దైవారాధన, నిత్య నైమిత్తిక కర్మలు, యజ్ఞ యాగాదులు, క్రతువులు, హోమాలు ఇవన్నీ దేహభావం కలిగించేవే అయినా చిత్త శుద్ధి ద్వారాలను తెరిచేవేనని పూర్వ మీమాంస చెబుతుంది. కొందరు జన్మతః చిత్త శుద్ధి పొందిన వారు నేరుగా ఉత్తరమీమాంస ప్రకారం నడుచుకోవచ్చు. వారు ప్రాణాయామ, ధ్యాన, సమాధి, ప్రత్యాహార ప్రక్రియల వలన కానీ, శుద్ధ జ్ఞానం వలన కానీ నేరుగా అద్వైతారాధన చేసి ఆ పరబ్రహ్మంలో విలీనం కాగలరు. కొందరు ఋషులు ఈ రెండింటినీ తమ శిష్యగణానికి ఉపదేశించిన సందర్భాలు ఉన్నాయి. ఈ విషయంలో మనకు స్వేచ్ఛ ఉంది.

ఎవరికీ ఈశ్వరుడు ఏది నిర్దేశిస్తాడో వాళ్ళు అదే మార్గంలో ఉంటారు. మనం చేసే కర్మలు ఈశ్వరపరమై, నిస్వార్ధమై ఆత్మ దర్శన మార్గమై ఉండగా 'మీమాంస' అనవసరం. అంతిమంగా మనల్ని సరైన సమయంలో తనవైపు పూర్తిగా తిప్పుకొనే బాధ్యత ఆ ఈశ్వరుడిదే. ఆయన కటాక్షం లేనిదే మన ఆధ్యాత్మికత పురోగతి చెందదు. మన ఆధ్యాత్మికత పురోగతి చెందుతున్నదా లేదా అన్నది మనకు ఎప్పటికప్పుడు తెలుస్తూనే ఉంటుంది. బ్రహ్మ సూత్రలాధారంగా, ఉపనిషత్తుల ఆధారంగా మనం సరైన మార్గంలో ఉన్నామా లేదా అని మనమే పరీక్ష పెట్టుకోవాలి.

ఇందుకు పఠనం చాలా అవసరం. దివ్య పురుషుల జీవితాలు, మహిమలు, ఉపదేశాలు, ప్రసంగాలు చదవాలి. వాటిని 'మననం' చేస్తూ పది మందికి'చెప్పాలి. ఈ కాలంలో అలా వినేందుకు మనుషులకు తీరిక లేదు కనుక మనం ఏదైనా పుస్తకం రాయటమో, వ్యాసం రాయటమో వంటి సత్కార్యం చేస్తూ ఉండాలి. పాతకాలంలో మధ్యాహ్నం వేళ జ్ఞానేశ్వరి మహారాజ్ రాసిన భగవద్గీత చదివేవారు. పారాయణ చేసేవారు. కొందరు, 'రామ, రామ' అంటూ రామకోటి జపం, మననం చేసేవారు. నేడు అవి వీలైనా వీలు కాకపోయినా మహనీయుల జీవిత విశేషాలు తరుచూ 'మననం' చేసికోవడం చిత్తశుద్ధికి హేతువులవుతాయి. 'చిత్తశుద్ధి' దేహభావం వలన ఉత్పన్నమయ్యే నీచ సంస్కారాల నుంచి మనస్సును పావనం చేసి సన్మార్గంలోకి మళ్ళిస్తుంది. అప్పుడు మనలోని 'జ్ఞానం' ఉద్దీపనం చెందుతూ మనల్ని మోక్షమార్గం వైపుకు మళ్ళిస్తుంది. ఇవన్నీ ఆధ్యాత్మిక మార్గంలోని రహస్యాలు. సాధన ఆరంభించినవానికి ఒకదాని తర్వాత ఒకటిగా ఇవి తామంతట తామే తెలుస్తాయి. ఈ పుస్తకంలోని వ్యాసాలు అన్నీ ఆవిధమైన మార్గగమనంలో జనించినవే.

ఇందులో వ్యాసాలు అచ్చువేసిన భక్తి పత్రిక సంపాదకులు నేతి సూర్యనారాయణ శర్మగారికి, వారి యాజమాన్యానికి, ఋషిపీఠం సంపాదకులు సామ వేదం షణ్ముఖ శర్మ గారికి, దర్శనం మాస పత్రిక సంపాదకులు శర్మ గారికి నా కృతజ్ఞతాభివందనాలు.

– డా కొప్పరపు నారాయణ మూర్తి Ph.D

సెల్ : 7671909759

1
అనిర్వచనీయం - కృష్ణతత్త్వం

వాసుదేవం మహాత్మానం లోకానా మీశ్వరేశ్వరం
జానామి భరత శ్రేష్ఠ! కృష్ణం నారాయణం ప్రభు!
కృష్ణ తత్త్వం – సకల కళాత్మకం – సృష్టేకత్వం

కృష్ణుడే వాసుదేవుడు, లోకేశ్వరుడు , నారాయణుడు. 'కృష్ణ' శబ్దానికి వ్యుత్పత్తి అర్థం కన్నా భావార్థమే హృదయ రంజకమైనదంటే సందేహించవలసిన పని లేదు. కృష్ణ శబ్దానికి పులకించే హృదయాలెన్నో. తొలినాళ్లలో యశోదమ్మ పులకిస్తే, తరువాత కాలంలో పదహారువేల గోపికలు, సత్యభామలు, రాధలు, ఆండాళ్ళు దేహం మరచి తరించారు. ఇలా నేటికీ ఎందరెందరో కృష్ణ శబ్దానికే దేహ భావం కోల్పోయి, 'కృష్ణాత్మైక్యం' పొందుతున్నారంటే కృష్ణతత్త్వం ఎంత గాఢమైందో, ఎంత నిగూఢ మైందో ఇట్టే ద్యోతకమవుతుంది. 'కృష్ణతత్త్వం' జాతి, కుల,

మతాలకతీతమైంది. సకల కళలకు నిలయమైంది'. గానం, వేణువు, నృత్యం ంమూడు కలిసి కృష్ణ తత్వాన్ని దేహాతీతం చేసిందంటే అతిశయోక్తి కాదు. 'కృష్ణ తత్వం' ఎంత అద్భుతమంటే 'ఆయనే'స్వయంగా దేహాతీతం. కనిపించీ కనిపించకుండా, క్షణం ఇక్కడుండి, మరో క్షణం మరెక్కడో నిలిచే తత్త్వమది. అందుకే అయిస్కాంతాన్ని రాచుకొన్న ఇనుప ముక్కకూడా అయిస్కాంతమైనట్టు, కృష్ణ తత్వంలో లీనమైతే దేహభావం కూడ తుత్తునియలు కాక ఏమవుతుంది?అందుకే 'కృష్ణం కమల పత్రాక్షం పుణ్య శ్రవణ కీర్తనం, వాసుదేవం జగద్యోనిం, నౌమి నారాయణం హరి' అని శ్రీ హరిని కీర్తించటం.

వివశుల్ని చేసే సమ్మోహనం

'దోర వయసున్న కన్నియల హృదయాలను, దోచుకున్నాడని విన్నాను చాడీలను' అన్న చరణాలవెనుక అర్ధం ఇదే."వేణు గానమ్ము వినిపించెనే, చిన్ని కృష్ణయ్య కనిపించడే..." అని కవి ఆత్రేయ ఊరికే అన్నాడా మరి. "మన్ను తిన్నావని యశోదమ్మ అడిగిందట, లేదు లేదనుచూ లోకాలు చూపాడట", అని కవియంటే అందులో అతిశయోక్తి ఏముంది? లేకపోతే బుడతడేమిటి? తల్లి యశోదమ్మకు పదునాల్గు లోకాలు నోటిలో చూపడమేమిటీ?ఇవన్నీ కృష్ణుడే స్వయంగా దేహాతీతుడనడానికి చిరు ఉదాహరణలు. ఇక్కడ 'మన్ను' శబ్దం వాడటం కవి తాత్వికతకు నిదర్శనం. నిజానికి పదునాలుగు భువనాలు కూడా మన్నుతో కూడినవే. దేవుడితో సహా అన్నీ నశించిపోతాయి. ఒక్క పరబ్రహ్మమే శాశ్వతం అన్న లోతైన అద్వైతార్ధ   మిమిడి ఉంది. భారతీయ, సామాజిక, నైతిక, రాజకీయ చింతనాసరళినీ, లలితకళా జగత్తును, భక్తి తత్వాన్ని ఆమూలాగ్రంగా

ప్రభావితం చేసింది కృష్ణతత్వం. తన జీవితకాలంలోనే కృష్ణుడు భక్తికి, కర్మకు, జ్ఞానానికి సంపూర్ణ నిర్వచనం అయి నిలవటమే గాక అటువంటి వారుండటం సాధ్యమేనని నిరూపించాడు. 'అహం ' తీరుతెన్నులను స్పష్టంగా కళ్ళముందు సాదృశంగా,రమ్యంగా చిత్రీకరించి చూపించిన పరబ్రహ్మ శ్రీకృష్ణుడు.

శ్రీకృష్ణ రాధాతత్వం

కృష్ణతత్వం రాధాకృష్ణ సమన్వితం. మహాభారతంలో లేని కృష్ణ-రాధ సరాగం భాగవతంలో సృజించాడు వ్యాసుడు.భాగవతంలోని రాధతో కూడిన కృష్ణుడు, భారతంలోని కృష్ణుడు ఒక్కరే. ఇందులో ప్రాచీన, అర్వాచీన ప్రసక్తే రాదు. రాధా కృష్ణ రస రమ్య గాన, నృత్య కేళి వాసుదేవుడి లీలనే. భక్తి మార్గానికి, భక్తి ద్వారా దేహాతీత స్థితి పొంది ప్రకృతి పురుషుల ఏకత్వానికి, సృష్టైక్యానికి రాధా కృష్ణ మార్గం సులువైన మార్గం. ఇది అద్వైతానికి దారి చూపే ఉపాసనా మార్గం. వ్యాసుని బ్రహ్మ సూత్రాలలో పూర్వ మీమాంసలో నిర్దేశించిన ఉపాసనా మార్గం. కొందరు దీనిని ద్వైతభక్తిగా భావిస్తారు. ఇది అద్వైతానికి రహస్య ఆచరణాత్మక మార్గం. జయదేవుని అష్టపదులు రాధాకృష్ణుల రాసలీలలకు శబ్దాక్షర రూపం. జయదేవుని భార్య నృత్యం దృశ్య కావ్యం. ఉభయులకు మోక్షమార్గమై, సుసంపన్నమై నేటికీ అలరారే మార్గం జయదేవ భక్తి మార్గం. నారద భక్తి సూత్రాలను నిరూపించే ఏకైక కావ్యం రాధాకృష్ణతత్త్వం. నేటి భౌతిక ప్రేమలకు, ఆత్మ-దేహ రతులకు, ఉపరతులకు పరాకాష్ఠ రాధాకృష్ణ దేహాతీత ప్రేమతత్త్వం. ఈ మహత్తర తత్త్వం నేడు భౌతికాలకే పరిమితమవటం ప్రపంచానికే గొప్ప దార్శనికతనిచ్చిన మనదేశానికి దురదృష్టం.

కృష్ణ లీలలు

వేదపురాణ ఆగమాలలో కృష్ణ తత్వాన్ని నిరూపించే ప్రమాణాలు విస్తృతంగా ఉన్నాయి. పద్మ, వైవర్తన, బ్రహ్మ పురాణాలలో కృష్ణతత్వ నిరూపణ భిన్న రీతులలో సాగుతుంది. ఇక మహాభారతం, భాగవతాలలో దాని (కృష్ణతత్వ) విలక్షణకదే సాటి. మహాభారత రచన కేవలం కృష్ణ తత్వ నిరూపణే ప్రధాన లక్ష్యంగా వ్యాసుడు నిర్వర్తించాడు. భీష్మ వధ పర్వంలో సుయోధనుడి కోరిక మేరకు భీష్ముడు కృష్ణతత్వాన్ని, కృష్ణ మాహాత్మ్యాన్ని బ్రహ్మస్తుతి ప్రస్తావనతో కలిపి ఇలా వివరిస్తాడు. "కృష్ణ! త్వమాత్మనో అస్రాక్షి, ప్రద్యుమ్నంచాత్మసమ్భవం .....వాసుదేవమయ: సోహం త్వయ్యేవాస్మి వినిర్మితః." వైష్ణవ మూర్తులైన వాసుదేవ,సంకర్షణ, ప్రద్యుమ్న, అనిరుద్ధులే భూమిపై కృష్ణ, బలదేవ, ప్రద్యుమ్న, నిరుద్ధులుగా అవతరించారు అని చతుర్ముఖ బ్రహ్మ తెలిపాడు. అందుకే మనం చేసే క్రతువులలో చదివే కేశవనామాలలో ఈ పేర్లు అవేక్రమంలో (వాసుదేవ, సంకర్షణ, ప్రద్యుమ్న, అనిరుద్ధ) వస్తాయి.

కృష్ణతత్వంలోని కృష్ణప్రశస్తి లీలల రూపంలో ఉంటుంది. భగవానుడు చేసిన అతిలోక కృత్యాలను, లోకానుకరణతో చేసిన కృత్యాలను లీలలని వ్యవహరిస్తారు. ఏ వైష్ణవ అవతారంలోనూ ఇంత ఘనంగా లీలల ప్రశస్తి ఉండదు. కృష్ణ లీలలను నాలుగు రకాలుగా తాత్వికులు విశ్లేషించారు. అవి 1. వ్రజలీలలు 2. బృందావన లీలలు 3. మధురా లీలలు 4. ద్వారకా లీలలు. మహాభారతంలో కురుపాండవుల మధ్య జరిగిన ఘటనల ఆధారంగా కురుక్షేత్ర సంగ్రామం ఎలా సంభవించిందో తెలియచేస్తూ రేఖామాత్రంగా, పరోక్షంగా కృష్ణుని బాల్య ప్రస్తావన సూత్రీకరిస్తుంది. ఈ సందర్భంలోకృష్ణుని బహుముఖ చిత్రణకు భారతం,

భాగవతం రెండూ సమజోడీల్లా పోటీ పడటం వ్యాసుని విలక్షణ రచనా దక్షతకు పరాకాష్ట.

కృష్ణుని రాజనీతి : కర్మసు కౌశలం

కృష్ణ తత్వంలోని గొప్ప విషయం కృష్ణుని రాజనీతి. ఇప్పటి రాజనీతి గాని, ఒక రెండు వేల సంవత్సరాల క్రితం కౌటిల్యుడి రాజనీతి గాని మహాభారతంలోని కృష్ణ రాజనీతి ముందు ఏమాత్రం నిలవవు. ఇందుకు కారణం రెండు అద్భుత సూత్రాలు. ఒకటి కృష్ణుడు మానుష రూపంలో ఉన్న పరబ్రహ్మం అవటం, రెండవది భూత, భవిష్యద్, వర్తమానాలు తెలిసి ఉండటం. ఈ రెండవది భీష్మ, ద్రోణ, కృపాచార్యుల వంటి వారికి కూడా తెలిసే వీలున్నది. ఈ కారణంగా వాళ్లకు కృష్ణుని అవతార రహస్యం తెలుసు. మహాభారతం మొత్తం కృష్ణుడి లీలని గూడా తెలుసు. వాళ్ళని వాళ్లు నిమిత్త మాత్రులుగా భావించి కృష్ణుడు కథ ఎలా నడిపితే అలా నడిచారు. విదుర, సంజయులవంటి మహనీయులకు కూడా తెలుసు. ధర్మనందనుడు, ద్రౌపది, కుంతిలకు తెలుసు. తక్కిన కౌరవులకూ, కర్ణుడికీ తెలియదు. ఈ కారణంగానే రాయబారానికి వెళ్లిన కృష్ణుడు, కౌరవులు తనను బందీ చేయ ప్రయత్నించినపుడు, తన విశ్వరూపం ప్రదర్శిస్తాడు. పైన పేర్కొన్న వారు మినహా తక్కిన వారంతా ఆ రూపం వెలుగు చూడలేక స్పృహతప్పి పడిపోతారు.

కృష్ణుడి ఈ లీల రాజనీతిలో భాగమే. ధృతరాష్ట్రుడికి దివ్య నేత్రాలను ఇచ్చి మరీ తన విశ్వరూపం చూపుతాడు కృష్ణుడు. తిరిగి ధృతరాష్ట్రుడి కోరికపైనే ఆ నేత్రాలను ఉపసంహరిస్తాడు. మహాభారతంలో కృష్ణుడు, పంచ పాండవులు తొలిసారిగా తారసపడే సందర్భం ద్రౌపదీ స్వయం వారంలో. ఆదిపర్వంలో ఈ ఘటన జరుగుతుంది. అయితే కథా కథన

పరంగా ఇదే తొలి ముఖాముఖి అయినప్పటికీ, అర్జునుడు మత్స్య యంత్రాన్ని ఛేదించటానికి ముందు కృష్ణ ధ్యానం చేసి విల్లు ఎక్కుపెడతాడు. దీనిని బట్టి పాండవులకు కృష్ణ పరిచయం అంతకు పూర్వమే ఉన్నట్టు వ్యాస రచన ద్వారా వెల్లడవుతుంది. ఆదిపర్వంలో "ప్రణమ్య శిరసా దేవ మీశానం వరదం ప్రభుమ్, కృష్ణంచ మనసా కృత్వాచగృహే చార్జునో ధనుః " అనే శ్లోకం ఈ విషయం వెల్లడిచేస్తుంది. కృష్ణుడు అప్పటికే ప్రౌఢుడు. ఎదిగిన వయసున్న పుత్రుడున్న వాడని దుష్టద్యుమ్నుడి పరిచయ వాక్యాలను బట్టి గ్రహించవచ్చు.

కృష్ణుడు ధర్మపక్షపాతి. అధర్మ పరులైన వారి జన్మ వృత్తాంతములు, పాపపంకిలమైన మనస్సులను గ్రహించ గలవాడై వారిని నాశనం చేయటానికై అవతరించిన వాడు. అందువలన ఎప్పుడు తాను యుద్ధం చేయాలో, ఎప్పుడు పాండవులతో యుద్ధం చేయించి దుష్టులను సంహరించాలో బాగా ఎరిగిన వాడు. కంస, శిశుపాలురను తానే వధించాడు. జరాసంధుడిని భీముడితో చంపించాడు. కృష్ణునికి తెలిసిన ధర్మ సూక్ష్మము అన్యులకు తెలియకపోవటం కృష్ణుని తప్పు కాదు. దుష్ట సంహారం కోసం అవతరించిన కృష్ణుడు అన్నీ తెలిసే ఎవరిని ఎలా మట్టుబెట్టాలో అలా మట్టుబెట్టించాడు. జరాసంధునించి రక్షించుకోవడానికి మధురకు ప్రత్యామ్నాయంగా ద్వారకను పటిష్టంగా నిర్మిచుకొన్న రాజు కృష్ణుడు. చివరకు భీముడితో జరాసంధుడిని యుక్తితో చంపించాడు. తన బలమే పాండవుల బలంగా వారికి అర్ధమయ్యేలా చెప్పిన వాడు కృష్ణుడు. పేరుకు అన్న బలరాముడు చక్రవర్తి అయినా, కృష్ణుడే యుద్ధాలు చేసి యాదవ రాజ్యాలను విస్తరించింది. కృష్ణుని వల్లనే అర్జునుడు తామిద్దరూ నర నారాయణ రూపం అని గ్రహించాడు.

తన బలమే పాండవుల బలంగా వారికి అర్థమయ్యేలా చెప్పిన వాడు కృష్ణుడు. పేరుకు అన్న బలరాముడు చక్రవర్తి అయినా, కృష్ణుడే యుద్ధాలు చేసి యాదవ రాజ్యాలను విస్తరించింది. కృష్ణుని వల్లనే అర్జునుడు తామిద్దరూ నర నారాయణ రూపం అని గ్రహించారు. రాజసూయ యాగం, మయసభ నిర్మాణానికి మయుడితో, ధర్మరాజుతో బిందు సరోవరంలో యజ్ఞం జరిపించింది శ్రీ కృష్ణుడే. రాజసూయ యజ్ఞం తో కురు పాండవ సంగ్రామానికి బీజం వేసింది కృష్ణుడే. యుద్ధం అనివార్యమని, కాల రూపంలో తాను కౌరవులతో సహా అనేక రాజ్యాల దుష్ట రాజుల సంహారం ఎప్పుడో చేశానని, కేవలం యుద్ధం ఒక దృశ్య నాటకం కాబోతుందని ముందే తెలిసినా కృష్ణుడు తానే స్వయముగా రాయభారం నడపటానికి పూనుకోవటం మానుషరూపంలో భగవానుడు జరిపించిన రాజనీతి తంత్రం తప్ప మరొకటి కాదు. అందుకే కృష్ణుడు గీతను అర్జునుడికి బోధించేప్పుడు 'కర్మసు కౌశలం' అని కర్మలను కౌశలం తో లాఘవంగా తమకు అనుకూలంగా జరిపించుకోవాలని సూచించాడు. కృష్ణుని వంటి అవతారం 'న భూతో న భవిష్యతి' వంటిది. కృష్ణునికి ముందు గురువులున్నారు. కృషుని తరువాత కూడా గురువులు అవతరించారు. కానీ కృష్ణావతారం 'యోగేశ్వరావతారం'. జగత్తుకే గురువుగా నిల్చిన మృదు మధుర గంభీరావతారం. ధర్మ స్థాపనకన్నా అధర్మ నాశనమే లక్ష్యంగా కృష్ణుడు ఈ భూమిపై నడయాడాడు. యోగమాయను తన ఆధీనం లో ఉంచుకొని జగత్తు మొత్తాన్ని మాయలో ఆట లాడించాడు. ఆ ఆటకు పాండవులు ఏ మినహాయింపు పొందలేదు. స్వర్గారోహణ పర్వంలో రాలిపోయారు. యుగం ముగిసింది. ద్వారక నీట మునిగింది. కృష్ణుడు వైకుంఠానికి చేరినా, కృష్ణతత్త్వం మనల్ని

నిత్య చైతన్యులుగా అనుక్షణం ఉంచుతూనే ఉంది. మనల్నందరినీ సంగీత, సాహిత్య, నృత్య గాన రూపంలో ముంచి తెలుస్తూ కృష్ణుని వేణువు వేల స్వరాల రూపంలో మోగుతూనే ఉంది. ఈ భూమిని ఆవరించే ఉంది అనుక్షణం.

మదిలో నీస్మరణ సలిపిన హాయిగా
బ్రతుకే తీయనయై వెన్నెలయై కాయగా
త్రిభువన పావన శరణా సనాతనా!
కరుణా చూడవయా పరము జూపవయా
మురళీ మోహనా వినీల మేఘశ్యామా!

(భక్తిమాసపత్రిక, ఆగస్టు 2024)

2

అనుష్ఠాన అద్వైతి - అరుణాచల రమణులు

చాలామంది జిజ్ఞాసువులకు అద్వైతానుభవం అపరోక్షానుభూతితో కలుగుతుంది. ఇదైనా ఈశ్వరానుగ్రహం లేకపోతే కలగదు. అందుకు ప్రమాణం గీతలోని ఈ శ్లోకమే. భగవద్గీతలో 'చతుర్విధా భజంతే మాం జనాః సుకృతినోర్జున ఆర్తో జిజ్ఞాసురర్థార్థీ జ్ఞానీచ భరతర్షభ' (ఏడవ అధ్యాయం, 16వ శ్లోకం).కానీ, ఈ అద్వైతానుభవం స్థిరంగా ఉండదు. ఎందుకంటే మనలోని గుణత్రయాలు (సత్వ,రజస్తమోగుణాలు) మనలను స్థిరంగా అద్వైతానుభూతిలో ఉండనీయవు. గీతలోనే చెప్పినట్టు ప్రతిక్షణం ఏదో ఒక గుణం, మనలోని మిగతా రెండు గుణాలపై ఆధిపత్యం చేయటానికి ప్రయత్నిస్తుంటాయి. జిజ్ఞాసువు ఆత్మసాక్షాత్కారం పొందే దాకా ఈ గుణాలతో నిరంతరం పోరాటం చేయవలసి ఉంటుంది. ఆ పోరాటమే ' నేను ఎవరూ? తత్వవిచారం' గా శ్రీ రమణ భగవానులు ఆచరించి కృతకృత్యుయిలైనారు.

'నేను ఎవరు?' అని జిజ్ఞాసువు నిరంతరం తనను తాను ప్రశ్నిస్తూ గడపాలి. ఏ గుణ ప్రభావం వల్లనైనా జిజ్ఞాసువుకు మొట్టమొదట ఎదురయ్యే అవరోధం 'ఆలోచన'. గుణం, దేహభావం పరస్పరాస్రితాలు. గుణం దేహాధారం.దేహభావం లేకపోతే 'గుణం' లేనట్టే. గుణం ద్వారా దేహభావం, దేహభావం వలన 'ఆలోచన'లు కలుగుతాయి. ఇవి ఎంత వేగంగా మానవ జీవితంలో జరుగుతాయంటే మనిషికి తనలో ఈ గుణాల ప్రభావం వలన ఎన్నో వికారాలు, స్పందలు, తదనుగుణ ఆలోచనలు కలుగుతున్నాయన్న సంగతి కూడా తెలియదు. 'నే నెవరు?' అన్న స్పృహ కూడా ఉండదు. క్షణాల్లో మనకి తెలియకుండానే మనం గుణ, దేహ, ఆలోచనల బానిసలం అయిపోయి అజ్ఞానంలో మునిగి పోతామ్. ఫలితంగా వారు (గుణములు సామ్య స్థితిలో లేనివారు) శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాదుల వలనను, రాగద్వేషములతోనూ పీడితులై అపరోక్షానుభూతితో కలిగిన ఆధ్యాత్మిక సమతుల్యతను తరుచూ కోల్పోతుంటారు. ఇప్పుడు ఈ ప్రతిపాదన శ్రీ రమణ భగవానుల జీవితంలో, ముఖ్యంగా అరుణాచల ఆశ్రమంలోఎలా ఆచరణలో అమలైందో కొన్ని ఉదాహరణల పరిశీలనద్వారా గ్రహించటమే ఈ వ్యాస ప్రధాన లక్ష్యం.

శ్రీ రమణ భగవానులు కొండ దిగువన కట్టిన పర్ణశాల వంటి కుటీరంలో ఉంటున్న రోజులవి. రమణ మహర్షులు అప్పడప్పుడు కొండపైన ఉన్న స్కందాశ్రమానికి, విరూపాక్ష గుహకు కూడా వెళ్లి అక్కడ కొంతకాలం ఉండేవారు. అయితే ఎక్కువ సమయం కొండ కింద ఆశ్రమంలోనే గడిపే వారు.ఆ ఆశ్రమంలో వారితో పాటు అనేక జంతువులు, పక్షులు కూడా ఉండేవి. రమణ మహర్షి వాటికి పేర్లు పెట్టి, వాటితో మనుషులతో

మాట్లాడినట్టు మాట్లాడేవారు. ఇది గీతలో అయిదవ అధ్యాయంలోని 18వ శ్లోకాన్ని స్ఫురణకు తెస్తుంది. అదేమిటంటే 'విద్యావినయసంపన్నే బ్రాహ్మణే గవిహస్తిని శుని చైవశ్వపాకే చ పండితాః సమదర్శినః' అంటే బ్రహ్మవేత్తయగు జ్ఞాని అన్నింటా పరబ్రహ్మమునే దర్శిస్తాడని. అయితే అక్కడ రమణ మహర్షిని దర్శించవచ్చినవారు శ్రీ రమణ భగవానుని ఆధ్యాత్మికస్థాయి 'నిత్యాద్వైత దర్శన స్థాయని' తెలియక తికమక పడేవారు. ఒకింత ఆశ్చర్యంగా చూసేవారు. కేవలం వచ్చే భక్తులే కాదు, ఆఖరికి ఆశ్రమంలో ఉండి, ఆయన సేవ చేసికొంటామని రమణుని ప్రాధేయ పడ్డవారు సహితం అయోమయానికి గురయ్యే వారు. ఈ విషయాలను విపులంగా 'సెల్ఫ్ రియలైసెషన్ ది లైఫ్ అండ్ టీచింగ్స్ ఆఫ్ శ్రీ రమణ మహర్షి'అనే పుస్తకంలో, వారి తొలి శిష్యుడు శ్రీ బి వి నరసింహ స్వామి గారు సోదాహరణంగా 'ఏనిమల్ కంపానియన్స్' అనే అధ్యాయంలో రాశారు.

రమణుల ఆశ్రమంలో లక్ష్మి అనే ఆవు ఉండేది. ఆ ఆవును చూస్తూ రమణ భగవానులు 'లక్ష్మి వస్తున్నది . అన్నం, కూరలతో భోజనం వడ్డించండి' అని తన ఆశ్రమ సేవకులకు కేకేసి చెప్పేవారు. అక్కడ రమణులను దర్శించడానికి వచ్చిన భక్తులు ఆ లక్ష్మి అంటే ఎవరో చిన్న 'ఆడపిల్ల' అయి ఉంటుందని, ఆ పాపకు భోజనం వడ్డించమని రమణులు ఆశ్రమ సేవకులకు చెబుతున్నారని అనుకొనే వారు. కానీ , తీరా ఆవునే రమణ భగవాన్ 'లక్ష్మి' అని సంబోధించారని తెలుసుకొని ఆశ్చర్య పోయేవారు. ఇంతే కాదు. అదే సమయంలో "అబ్బాయిలు వచ్చారు. వారికి అన్నం వడ్డించమని" రమణులు ఆశ్రమ సేవకులను పురమాయించే వారు. మళ్ళీ భక్తులు అయోమయంకు లోనయ్యే వారు. తీరా చూస్తేఅక్కడికి

రెండు కుక్కలు వచ్చి నిల్చునేవి. 'కుక్కలను అబ్బాయిలు అని పిలవటమేమిటి?' అని భక్తులు నివ్వెరపోయేవారు. అలాగే అక్కడికి ఒక పిల్లి వస్తే 'రోజ్ వచ్చింది , దానికి మంచినీళ్లు ఇవ్వండి', అని చెప్పి, రోజ్ కు ' పడుకో, ఒక్క క్షణంలో నీళ్లు వస్తాయి' అని చెప్పే వారు. ఇలా రమణులు జంతువులతో మనుషుల్ని సంబోధించినట్లు మాట్లాడుతుంటే, వారిని చూడడానికి వచ్చిన భక్తులు నివ్వెర పోయేవారు. అంటే, వారికి శ్రీ రమణుల 'అద్వైతవైభవం', 'అద్వైతానుభూతి' పట్ల ఏ మాత్రం అవగాహన లేదన్న మాట. ఇలా ఏళ్ల తరబడి రమణులను దర్శించడానికి వచ్చిన భక్తులు ఆ వింతలను గమనించి ఆశ్చర్యానికి లోనయ్యే వారు.

ఇక్కడ బి వి నరసింహ స్వామి వారిచ్చిన వివరణ వింటే మనకో కొత్త విషయం తెలుస్తుంది. అదేమిటంటే, ఈ జంతువులు ఏవైతే శ్రీ రమణులను ఆశ్రయించి ఉన్నాయో అవి సాధారణ జంతువులో లేదా అన్ని జంతువుల వంటివో కాదు. ఇవి అంతరిక్షంలోని ఎక్కడెక్కడో ఉండే నక్షత్రాల రూపంలో ఉండే మహర్షులు. అవి శ్రీ రమణ భగవానుల సన్నిధిలో ఉండటంకోసం తమ నక్షత్ర రూపం నుంచి జంతువు రూపంకుమారి శ్రీ రమణుల వద్దకు వచ్చిన మహర్షులు. ఇవి సాధారణ జంతువుల లాగానే ప్రవర్తించటం చూసి అందరూ అయోమయానికి లోనయ్యే వారు. కానీ, రమణులకు, వాటికి చాలా స్పష్టత ఉండటం ఆశ్చర్యకరం. అవి రమణ భగవానుని తప్ప వేరెవరినీ పట్టించుకొన్న దాఖలాలు లేవు. రమణులు కూడా వాటితోనే కుటుంబీకులను సంబోధించినట్టు మాట్లాడేవారు.

అక్కడ ఆయన ఆశ్రయయంలో ఉన్న ప్రతిజంతువు వంశ పుట్టు పూర్వోత్తరాలు భక్తులకు వివరించేవారు. అవి ప్రసవించినప్పుడు

వాటిపిల్లలకు పేర్లు తానే పెట్టేవారు. ప్రతి జంతువుకు పుట్టే పిల్లలకు తరం వారీగా ఆ తల్లి పేరునే కొనసాగిస్తూ అది ఎన్నో తరమో ఒక సంఖ్యతో ఆ పేరును కలిపే వారు(జాక్, జాక్ అలా అన్నమాట). వీటివిషయాల్లో మరెవ్వరి జోక్యం రమణులు అంగీకరించేవారు కాదు. అన్నీ వారే చూసుకొనే వారు. కొన్ని కుక్కలు శ్రీ రమణుని నిత్యం ఆశ్రయించి ఉండేవి. అందులో ఒక కుక్క పేరు కమల. అది తనకు తరతరాలుగా పరిచయమున్న కుక్క . నీల, జాక్ దాని పిల్లలు. అలాగే రోజ్ అనే పిల్లి పిల్లలు తరతరాలుగా దాని (కమల) మనుమలు , మనుమరాళ్ళు. కమల మృత్యువు సమీపించిన సంగతి గ్రహించిన రమణులు వారు పిల్లలైన నీల, జాక్ లను పిలిచి, 'మీ తల్లి ఈ ప్రపంచం విడిచేందుకు సిద్ధంగా ఉంది. మీరోసారి వెళ్లి కమలను చూడరా?' అని సంబోధించాడు. వెంటనే అవి కమల దగ్గరకు పరుగుతీసాయి. కమల కాలం చేశాక, రమణులు రోజ్ తో 'మీ అమ్మమ్మ 'కమల' మనల్ని విడిచి వెళ్ళిపోయింది' అని చెప్పటం అందరినీ ఆశ్చర్య పరించింది.

పైన పేర్కొన్న లక్ష్మి అనే ఆవు.ఇదే జన్మలో రమణులు కుర్రవాడుగా విరుపాక్షగుహ లో తపస్సు చేసేటప్పుడు నిత్యం ఆకుకూరలు , అన్నం తెచ్చి వారికి భోజనం పెట్టేది. ఆ జన్మలో ఆవిడపేరు లక్ష్మి . రమణులు క్రమంగా పెద్దవాడయ్యేసరికి ఆమె కళ్ళు మూసింది . కానీ,ఆమె ఆవుగా జన్మించి తిరిగి శ్రీ రమణుల ఆశ్రమమే చేరింది . ఆమే చేరిందో, శ్రీ రమణులే రప్పించుకొన్నారో తెలియదు. కానీ , ఆమెకు ఆశ్రయం కలిపించి, భోజన పానీయాదుల వసతి కలిపించి రమణులు ఆమె రుణం తీర్చుకోవటమే గాదు, పురుడుపోసిన పరబ్రహ్మ కూడాఅయినారు. అంత్యకాలంలో ఆమె గుండె పైచేయి వేసి తుది శ్వాస విడిచే సమయానికి

ఆమెకు మోక్ష ద్వారాలు తెరిచింది కూడా శ్రీ రమణులే. ఆ ఆశ్రమంలోనే వేదమంత్రాల మధ్య ఆమెకు అంత్యక్రియలు జరిపి, ఆమెకు ఒక సుందర మందిరం కట్టించిన చిన్మయుడు రమణభగవానుడే. భగవంతుడు దయామయుడు, కృపాసాగరుడు అని వేదాలు వర్ణిస్తాయి. అంటే ఏమిటో చాలామందికి తెలియదు. కానీ, శ్రీ రమణుల ఈ సేవ చూశాక అది అర్థం కాని వారెవ్వరూ ఉండరు.

అలానే రమణుల వద్దకు ఒక నల్ల కుక్క వచ్చింది . దానికి రమణులు చిన్న కరుప్పన్ అని పేరు పెట్టారు. ఈ కుక్కకు చాలా నీతి నియమాలు ఉండటం ఆశ్రమం లో అందరినీ ఆశ్చర్యపరిచేది. దానికి ప్రాపంచిక విషయవస్తువులపట్ల ఆసక్తి ఉండేది కాదు. మనుషులకు దూరంగా ఉంటూ, రమణ భగవానుని నిత్యం చూస్తూ కాలం గడిపేది. మనుషుల నుంచీ దూరంగా ఉండేది. అయితే కొంతకాలం తరువాత అది కేవలం బి వి నరసింహస్వామి దగ్గరకు మాత్రమే రావటం ప్రారంభించింది. రమణులు , నరసింహ స్వామి ఎలా ఆదేశిస్తే అలానే వినేది. ఆశ్రమంలో ఎవ్వరూ దాని జోలికి పోవద్దని రమణులు చెప్పినా కొందరికి అది 'కుక్క'అనే చులకన భావన ఉండేది. ఈ కారణంగా కొన్ని సార్లు వారు దానిని విసుక్కోని, కసురుకొనే వారు. అలా చేసిన వారిలో రమణుల అత్యంత ప్రియ శిష్యుడు పళనిస్వామి కూడా ఉన్నారు.

అలా ఒకసారి పళనిస్వామి కసురుకోవటంతో అది ఒక రాత్రి అంతా చలిలో ఆశ్రమం బయటనే గడిపింది. ఇది గ్రహించి రమణులు వెళ్లి దానిని లోపలి తోడ్కొని వచ్చేవారు. వారి కరుణా సాగర హృదయం అహంకార పీడితులైన ఆశ్రమ వాసులకు అర్థమయ్యేది కాదు. మరో సారి ఆశ్రమంలోని ఒక బ్రాహ్మణ సన్యాసి (రమణుని శిష్యుడు/

పరిచారకుడు) ఈ కుక్క అక్కడి భక్తుల సమీపంలోకి రావటం ఇష్టం లేక ఒక కర్రతో దాని తలపై కొట్టారు. అది పెద్దగా బాధగా అరుస్తూ అక్కడినుంచి ఆశ్రమం బయటికి వెళ్ళిపోయింది. ఆ తరువాత అది అక్కడ ఉన్న పవిత్ర తీర్ధంలో శవం అయి కనిపించింది. అది తెలిసి రమణులు ఎంతో దుఃఖితులైనారు. తన శిష్యులతో మాట్లాడకుండా కొండపైన స్కందాశ్రమానికి వెళ్లిపోయారు. ఆ తరువాత ఆశ్రమంలో జంతువుల పట్ల క్రూరత్వం చూపటం ఆగిపోయింది .

ఆశ్రమంలో ఉండే కుక్కలన్నీ ఎదో కారణం చేత అక్కడున్నట్టు స్పష్టంగా తెలుస్తుంది. అవేమి నేటి ఆధునిక ట్రైన్డ్ కుక్కలు కావు. కానీ, అనూహ్యమైన తెలివిని ప్రదర్శించేవి. రమణుని ఆజ్ఞలను అర్ధంచేసికొని తూ చ తప్పకుండా ఆచరించేవి. శ్రీ రమణ భగవాన్ కొండపై ఎక్కడెక్కడ పర్యటిస్తారోతో ఆరంభించి, గిరిప్రదక్షిణానికి వారు వెళ్లే మార్గం అంతా క్షుణ్ణంగా తెలుసు. కమల, సెగప్పన్ వంటి కుక్కలు రమణుల భక్తులను కొండపైన అన్ని క్షేత్రాలకు చక్కగా తీసుకెళ్ళేవి శ్రీ రమణుల ఆజ్ఞతో. రమణుల ఆశ్రయంలో కుక్కలే కావు , కోతులు కూడా ఉండేవి. వాటిలో కొన్ని రమణుని వద్దకు ఎంతో చనువుగా వచ్చేవి. వాటిలో ఒకదానికి నంది అని, మరో దానికి రాజా అని పేర్లు పెట్టారు రమణ భగవానులు . సాధారణంగా కోతులు ఎప్పుడూ సమూహాలుగా ఉంటాయి. వాటిలో ఏ ఒక్కటైనా మనిషికి దగ్గరైతే ఆ కోతిని మిగతా కోతులు బహిష్కరించేవి. కానీ, రమణ మహర్షి మాత్రమే ఇందుకు మినహాయింపుగా ఉండినట్లు కనపడేవారు. ఆయన వాటికి శనగలు, ధాన్యాలు, పండ్లు ఇచ్చేవారు. అవి ఆయన తొడపైకి, భుజంపైకి ఎక్కి కుర్చునేవి . ఒక్కోసారి ఆయనతో చిలిపిగా కూడా ప్రవర్తించేవి. అలంటి సందర్భాలలో ఆయనకు చిన్న, చిన్న గాయాలు కూడా అయ్యేవి. అప్పుడు రమణులు మీరు 'మీ ఆటలతో

నన్ను గాయ పరుస్తున్నారు కనుక నా వద్దకు రావద్ద'ని బహిష్కరించేవారు. అప్పుడవి తమ తప్పు తెలిసినట్టుగా, క్షమాపణ కోరి తిరిగి ఆయన తొడపైకి ఎక్కి కుర్చునేవి. రమణుల దయార్ద్ర హృదయానికి , ఆయన క్షమా శక్తికి ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే. అలాగే కోతుల రాజు/ నాయకుడు రాజా అంత్యకాలం సమీపించినప్పుడు శ్రీ రమణులు దాని దగ్గరే ఉండి, దాని అంత్యక్రియలు జరిపించారు. రమణులు తన ఆశ్రమం లోని అన్ని ప్రాణులను మనుషులను ప్రేమించినట్టే ప్రేమించారు.

వారు విరూపాక్ష గుహలో 1900-1922 వరకూ తపస్సులో కాలం గడిపారు . ఈ కాలంలోనూ, తరువాత కొండ కింద ఆశ్రమానికి వచ్చినప్పుడు కూడా జంతువుల పట్ల కృప , దయ, ప్రేమలను వీడ లేదు . అప్పుడప్పుడు ఆయన ధ్యానములో ఉన్నప్పుడు ఆయనపైనుంచి భయంకరమైన విష సర్పాలు వెళ్ళేవి. అక్కడ ఆయన దర్శనానికి వచ్చేవారు ఆయన ధ్యానం నుంచీ బయటికి వస్తారేమో, దర్శించుకొని వెళదామని గంటలతరబడి వేచి ఉండేవారు. ఎప్పుడైతే వారు ఈ సర్పాలు ఆయన శరీరంపై పాకి , కిందకు దిగటం చూసేవారో , వెంటనే అరిచి గగ్గోలు పెట్టేవారు. అయినా శ్రీ రమణులు తన ధ్యాన సమాధి నుంచీ బయటికి వచ్చేవారు కాదు. అలా అరిచి గగ్గోలు పెట్టిన వారిలో మహానుభావులు కావ్యకంఠ గణపతి మునికూడా ఉన్నారు . ఆయన ధ్యానం నుంచీ బయటికి వచ్చాక అందరితో 'ఎందుకు అలా అరిచి గోల చేశారు? ఇన్నేళ్లు నేను ఈ సర్పాలతో కలిసి మెలిసి ఉన్నాను . అవి నన్ను ఏనాడూ ఏమీ చేయలేదు. మీరెందుకు నా గురించి ఆందోళన చెందుతున్నారు ?' అని అడిగే వారు. అలాగే తేళ్లు కూడా రమణ భగవానుని పైనుంచి పాకుతూ వెళ్ళేవి. అవి ఆయనను కాటేసాయా, లేదా ఎవ్వరికీ తెలియదు. కానీ , రమణులు మెలుకువగా ఉన్నప్పుడు

తానే జాగ్రత్తగా వాటిని పట్టుకొని ఆశ్రమం బయట వదిలేసేవారు.

ఇవే కాదు, రమణాశ్రమంలో రామణుని వద్దకు వచ్చే జంతువులలో ఉడుతలు కూడా ఉండేవి . సాధారణంగా మనిషి అలికిడి వింటే పారిపోయే ఉడుతలు, రమణుని దగ్గరకు వచ్చి ఆయన చేతిలోని గింజలను ఒక్కొక్కటి తీసుకొని అక్కడే కూర్చుని తినేవి. వాటికి ఏ భయం కలగకుండా రమణులు వాటిపైన తన ముని వేళ్ళతో నిమిరేవారు. అలా అవి తినటం ముగిశాక భగవానుని వద్ద శలవు తీసుకోని వెళ్లిపోయేవి . ఎప్పుడు ఆకలి వేసినా అవి రమణుని వద్దకు వచ్చి కనపడేవి. రమణులు దగ్గరకు రమ్మని సైగ చేసిన తరువాత అవి వారివద్దకు వెళ్లి క్రమశిక్షణ గల పిల్లల్లా చుట్టూ కూర్చుని ఆయన ఇచ్చినవి తిని వెళ్లిపోయేవి .

'ఇదంతా ఎలా సాధ్యం?' అని ఎవరైనా అనుకొన్నా, ఈ వ్యాసం ప్రారంభంలో చెప్పిన 'గుణాతీత' అద్వైత వైభవం వల్లనే నన్నది స్పష్టం. వారికి దేహభావం లేదు. వారి దేహం ఒక పరబ్రహ్మాంశ. అవిచ్ఛిన్న పరబ్రహ్మంతో నిత్య తాదాత్మ్యం పొందుతూ కూడా దేహాన్ని ఒక నిలయంగా చుసినవారు మహర్షి రమణ భగవానులు. ఈ నాటికి రమణాశ్రమంలో ఏ జంతువు పట్ల హింసాత్మకంగా ప్రవర్తించకూడదని నియమం ఉంది. అక్కడ ఇప్పటికీ నెమళ్ళు తమ మధుర స్వరముతో నృత్యం చేయటం చూడవచ్చు. రమణాశ్రమం 'ప్రత్యక్షాద్వైతానుభూతి'కి ఒక సజీవ సాక్ష్యం. శ్రీ రమణ భగవానులు స్వయంగా 'అనుష్టాన అద్వైతి'.

(ఋషిపీఠం, డిసెంబర్ 2024)

3
కలలు - వెంటపడే యోగులు

ఇంగ్లాండు నుండి ఉద్యోగరీత్యా ఇండియా వచ్చిన ఎఫ్. హెచ్. హంఫ్రీ అనే బ్రిటీష్ పోలీస్ ఆఫిసుర్కు కలలో కనబడి తన వద్దకు వచ్చేలా కథ నడిపిన రమణ మహర్షి, గ్వాలియర్లో నున్నగోవా పెద్దమనిషికి కల్లో కనపడి షిర్డీకి రప్పించుకొన్న సాయిబాబా, గ్వాలియర్ లోని కెప్టెన్ హాటేను స్వప్నములో కనిపించి రెండు రూపాయల దక్షిణా, ఆనపకాయ కూర నైవేద్యం అడిగిన షిర్డీబాబా, కన్యా కుమారి వద్ద విహ్వలుడై కూర్చున్న వివేకానందుడికి తక్షణమే అమెరికాకు బయల్దేరమని స్వప్నంలో సాక్షాత్కరించి ఆదేశించిన శ్రీ రామకృష్ణ గురుదేవులు వంటి యోగులు ఇలా కలల్లో కనిపించటం దేనికి సంకేతం? ఇవి కేవలం యాదృచ్ఛికంగా జరిగినవనుకొంటే పొరబాటే. ఇటు వంటి వాటిని లోతుగా అధ్యయనం చేస్తే ఇవి నాస్తికులను ఆస్తికులుగా మార్చే శక్తి కలిగినవని బోధపడుతుంది. కొందరికి భారతీయ ఆధ్యాత్మికత గొప్పతనాన్ని తెలిపాయి. ఇవి కొన్ని

సార్లు ఆయా వ్యక్తుల జీవితాలను ఉన్నత ఆధ్యాత్మిక మార్గాల వైపు మళ్ళీమ్చాయి. కొందరి విషయంలో ఈ ఘటనలు భారతీయ ఆధ్యాత్మిక శక్తిని ప్రపంచానికి చాటాయి.

కలల విషయంలో భారతదేశానికి తనదైన ఒక ప్రత్యేక చరిత్ర ఉంది. రామాయణ కాలం నుంచి మనకు కలల ప్రస్తావనలు వినవస్తాయి. ముఖ్యంగా 'త్రిజటా స్వప్నం' చాలా మందికి తెలిసే ఉంటుంది. అంతేగాదు. కలలు వచ్చే సమయాన్ని బట్టి వాటి ఫలాలు చెప్పే ఒక ప్రత్యేక పరిజ్ఞానం కూడా మన వైదిక సాహిత్యములో కనిపిస్తుంది. ఇంకా పగటి కలలు, అర్ధరాత్రి కలలు, వేకువ ఝాము కథలు ఎఅంటూ కలల శాస్త్రం కూడా ఒకటి ఉత్పన్నమైంది. పైపెచ్చు, కలలో కనిపించే రూపాలు, వస్తువులను బట్టి కూడా ఫలాలు, వివరణలు, పరిహారాలు కూడా చెప్పే పద్ధతి ఒకటి మనదేశంలో ఉంది. ఈ విధంగా 'కలలను' పరిశీలించి, విశ్లేషిస్తే మనదేశంలో రెండు రకాల కలల శాస్త్రాలు ఉన్నట్టు స్థూలంగా అవగతమవుతుంది.

ఒకటి మానసిక అంతః పొరలలో ఏర్పడిన కోరికలు, ఘర్షణలు, భయాలు, ఆందోళనలనుంచీ బహిర్గతమయ్యే కలలు. రెండవది మనిషిలోని ఆధ్యాత్మిక భావజాలం, ఆధ్యాత్మిక శక్తి నుంచీ ఉద్భవించేది. మొదట చెప్పినది పాశ్చాత్య మనో వైజ్ఞానికులు విశ్లేషించే 'కలవిశ్లేషణ' (డ్రీం ఎనాలిసిస్)కు దగ్గరగా ఉంటుంది. రెండవది పాశ్చాత్య మనో వైజ్ఞానికులకు మింగుడు పడనిది, కేవలం భారతీయమైనది.

ఇంత వివరంగా ఎందుకు చెప్పుకోవలసివచ్చిందంటే మన దేశానికి వచ్చిన కొంతమంది విదేశీయులకు మన యోగులు కలలో కనబడి, వారి వెంటబడి, వారిని తమ వద్దకు తెప్పించుకోవటం ఏదో

ఒక సామాన్య విషయంగా తీసుకోకూడదని తెలియపరచడానికే. ఉదాహరణకు ఎఫ్ హెచ్ హంఫ్రీ కలల ద్వారా తనకు రమణ మహర్షి సాంగత్యం ఎలా లభ్యమైందో తెలుపుతూ 'ఇంటర్నేషనల్ సైకిక్ గజెట్' లో రాసిన వ్యాసం తరువాత కాలంలో అనేకమంది మనోవైజ్ఞానికులను, జర్నలిస్టులను, రచయితలను రమణాశ్రమానికి వచ్చేలా చేసింది. వారిలో ప్రముఖ బ్రిటీష్ నవలా రచయిత, నాటక ప్రయోక్త, కధకుడు సోమర్సెట్ మాం ఒకరు. ఆయన రమణమహర్షితో తన అనుభవాలను 'ది సెయింట్' అనేవ్యాసం ద్వారా 'పాయింట్స్ ఆఫ్ వ్యూ' ఆంగ్ల పత్రికలో పంచుకొన్నారు. అంతే గాదు, 'రేజర్ ఎడ్జ్' అనే నవల రాసి, అందులో శ్రీరమణ భగవానులను పోలిన సాధువును ఒక పాత్రగా రూపు దిద్దారు.

భారతీయ 'ఆధ్యాత్మిక భావజాలం/సంస్కృతి' వల్ల సంభవించే కలల గురించి పాశ్చాత్య మనో వైజ్ఞానికులను, రచయితలను భారతీయ ఆధ్యాత్మికత పై ఆలోచించేలా చేయటం ఆ యోగుల సంకల్పం కావచ్చు. భారత దేశం ఒక మూఢ నమ్మకాల పుట్టని భావించే పాశ్చాత్య దేశాలకు ఈ దేశ ఆధ్యాత్మిక సౌరభం, ఔన్నత్యం వివరించడానికే గదా గురుదేవులు శ్రీ రామకృష్ణులు వివేకానందను అమెరికా పంపారు. అలా గత శతాబ్దంలో మనకు సుపరిచయమైన యోగులనేక మంది పాశ్చాత్యుల దృష్టిని భారతీయ ఆధ్యాత్మికత వైపు ఆకర్షించే ప్రయత్నాలు ఎన్నో చేశారు. కేవలం పాశ్చాత్యులకనే 'కలలో కనిపించటం' అనే దానికి పరిమితం కాలేదు ఈ యోగులు. 'వసుధైక కుటుంబకం' ను చాటి చెప్పే మన ఋషులు, యోగులూ ఈ దేశంలోని అనేక మందిని కూడా 'కలల' ద్వారానే తమ వద్దకు రప్పించుకొనే పద్ధతమలు జరిపారు. అలాంటి వారిలో గత శతాబ్దంలో శ్రీరమణ మహర్షి, షిర్డీ సాయిబాబా, శ్రీ రామకృష్ణ గురుదేవులు ప్రముఖంగా కనిపిస్తారు.

ఇలా కలలో కనబడటం ద్వారా మన రమణ మహర్షి వద్దకు చేరిన మొదటి విదేశీ (బ్రిటిష్) అధికారి ఎఫ్ హెచ్ హుంఫ్రీ. ఇతను జనవరి 1911 లో భారత దేశం వచ్చాడు. బొంబాయిలో దిగిన వెంటనే ఆయనకు తీవ్ర అనారోగ్యం కలిగి, బొంబాయి ఆసుపత్రి లో చేరాడు. రెండునెలలు అలా ఆసుపత్రిలోనే చికిత్స పొందినానంతరం ఆయన మార్చ్ 18, 1911న వెల్లూర్ లోని తన పోలీస్ ట్రెనింగ్ డిపార్ట్మెంట్ కు చేరాడు. అక్కడ తెలుగు నేర్చుకోవడానికి ఎస్ నరసింహయ్య అనే ఒక తెలుగు ఉపాధ్యాయుడిని నియమించుకున్నాడు. తెలుగు నేర్చుకోవడంతో పాటు హుంఫ్రీ తన ఉపాధ్యాయుడిని జ్యోతిష శాస్త్రం గురించీ, అందులో నిష్ణాతులైన వారెవరన్నా అక్కడ ఉన్నారాని అడిగాడు. విదేశీయులంటే అంత సదభిప్రాయం లేని ఆ తెలుగు పండితుడు తనకెవ్వరూ తెలియదని చెప్పి తప్పించుకున్నాడు.

అలాగే ఆ మర్నాడు 'ఇక్కడ నీకు తెలిసిన మహాత్ములెవరైనా ఉన్నారా?' అని ఆ పండితుడిని అడిగాడు హుంఫ్రీ. ఎప్పటిలాగే ఎవ్వరూ తెలియదని బదులిచ్చాడు తెలుగు పండితుడు . ఆ మరుసటి రోజు యధావిధిగా ఆ పండితుడు తెలుగు చెప్పడానికి హుంఫ్రీ ఇంటికి వచ్చాడు. వెంటనే హుంఫ్రీ 'ఇక్కడెవరైనా మహాత్ముడు ఉన్నారా అని నే అడిగితే, నీకెవరూ తెలియదన్నావు. నిన్న నీ గురువు నా కలలో కనిపించాడు' అంటూ ఆయన చిత్రపటం పెన్సిల్ తో గీచి చూపించాడు. ఆశ్చర్యపోయాడు తెలుగు పండితుడు నరసింహయ్య ఆ చిత్ర పటం చూసి. అది తన గురువు అయిన కావ్య కంఠ వాసిష్ఠ గణపతి మునిది. 'ఆయన ఉదయం వచ్చిన కలలో నా పక్కనే కూర్చున్నాడు. నీకో నిజం

చెప్పనా? బొంబాయి ఆసుపత్రిలో నాకు కలలో కనిపించిన తొలి వ్యక్తివికూడా నువ్వే', అంటూ కొనసాగించాడు హంఫ్రీ. ఇందుకు జవాబుగా నరసింహయ్య, 'అయ్యయ్యో, నేనెప్పుడూ బొంబాయి రాలేదు. అది అసలు ఎలా ఉంటుందో కూడా నాకు తెలియదు', అంటూ భయం భయంగా చెప్పాడు.

ఆ తరువాత తిరిగి హంఫ్రీ అనారోగ్యం పాలై, కోలుకోవడానికి ఊటీ వెళ్ళాడు. అక్కడఉంటుండగా ఒకనాడుఒక సాధువు హంఫ్రీకికలలో కనిపించి, 'నువ్వు ప్రాణాయామం చేయి. నీ ఆరోగ్యం బాగుపడుతుందని చెప్పాడు'.ఆ కల వివరిస్తూ,'మరి నేను మాంసాహారం తింటూ ఈ ప్రాణాయామం చేయవచ్చా?' అంటూ వెల్లూరులో ఉన్న తెలుగుపండితుడికి ఉత్తరం రాశాడు. అందుకుతెలుగు పండితుడు నరసింహయ్య ఏమీ జవాబు ఇవ్వలేదు. కొంత కాలానికి హంఫ్రీ వెల్లూరు తిరిగి వచ్చాడు. రాగానే తన తెలుగు పండితుడిని పిలిచి, ఒక సాధువు ఒక గుహ మొదట్లో నిల్చొని ఉన్న బొమ్మ గీచి ఆయనకు చూపించి 'ఇది ఎవరు? అని అడిగాడు. వెంటనే ఆ సాధువు ఎవరో గుర్తు పట్టాడు తెలుగు పండితుడు. ఆయనెవరో కాదు ,విరూపాక్ష గుహ వద్ద నిల్చొని ఉండే శ్రీ రమణ భగవానులు'. అప్పటికి ఆయన వయస్సు 32 సంవత్సరాలు.

ఇది జరిగాక కొన్ని రోజులకే హంఫ్రీ, తన తెలుగు గురువు నరసింహయ్యతో, కావ్యకంఠ వాసిష్ఠ గణపతి ముని వెంట రాగా నవంబర్, 1911 న రమణ మహర్షిని విరూపాక్ష గుహలో కలిశారు. ఆ తరువాతనే 'తనకు దేహం వేరని, ఆత్మ వేరని తెలిసిందని, తనతో మహర్షి మాట్లాడటం కన్నా, తన కళ్ళల్లోకి తదేకంగా మహర్షి రెప్పార్పకుండా చూసిన చూపేదో తనలో ఈ అనుభవాన్ని స్థిరంగా, శాశ్వతంగా మార్చిందని' హంఫ్రీ

'ఇంటర్నేషనల్ సైకిక్ గజెట్' లో రాశాడు. ఆ తరువాత 1932లో పాల్ బ్రంట్టన్, 1938 లో సోమర్సెట్ మామ్, 1942లో ఆర్థర్ ఒస్బోర్న్ ఇలా ఒకరి తరువాత ఒకరు రమణ భగవానులను ఆశ్రయించారు. మనో వైజ్ఞానికులైన ముగ్గురు పాశ్చాత్య శాస్త్రవేత్తలలో (ఫ్రాయిడ్, ఆల్డర్, జంగ్) ఒకరైన జంగ్ భారతదేశములోని తాత్వికత పట్ల ఆకర్షితుడై ఇండియా వచ్చాడు (1937-38). ఆయన శ్రీ రమణ భగవాన్ 'హూ ఆమ్ ఐ?" అనుభవం గురించి, 'కల విశ్లేషణ గురించి' తెలుసుకొని రమణ భగవాన్ను కలవకుండానే వెళ్లి పోయాడని తెలుస్తుంది. అలా ఎందుకు చేశారో తెలియదు. కానీ, చాలామటుకు ఆయన సమకాలికులు జంగ్ రమణ భగవాన్ ను చూసాక తన అభిప్రాయం మార్చుకొనే స్థితిని తట్టుకొనలేననే భయంతోనే కలవకుండా వెళ్ళిపోయాడని భావిస్తారు.

ఇక స్వదేశీయుల విషయంలోనూ సాయి బాబా, శ్రీ రమణులు, శ్రీ రామకృష్ణ పరమహంసలు ఇలాంటి ఇతివృత్తాలనే నెరిపారు. ఉదాహరణకు సాయిబాబా గోవా పెద్దమనిషికి కలలో కనబడి ఏమి చేశారన్నది ఆ పెద్దమనిషి షిర్డీ వచ్చి భక్తులందరికీ చెబితే తప్ప మరెవ్వరికీ తెలియదు. ఈ వృత్తాంతం పత్తి నారాయణ రావు రాసిన 'సాయిబాబా సచ్చరితం' పారాయణ గ్రంథంలో కనిపిస్తుంది. ఆ పెద్దమనిషి ఒకప్పుడు మహారాష్ట్రలోని లోయ ప్రాంతంలో ఉండేవాడు. చాలా బీద కుటుంబమ్. అందువల్ల ఉద్యోగం కోసం గోవా వెళ్ళ వలసి వచ్చినది. ఆ సమయంలో దత్తాత్రేయుడిని తనకు త్వరగా ఉద్యోగం వచ్చేలా అనుగ్రహించమని ప్రార్థించాడు. దత్త భగవానుడి దయతో తనకు ఉద్యోగం లభిస్తే, తన మొదటి నెల జీతం మొత్తం ఆయనకి దక్షిణగా సమర్పిస్తానని మొక్కున్నాడు. గోవా చేరిన కొద్దీ రోజులలోనే తనకి మంచి ఉద్యోగం లభించింది. దాని

ప్రారంభ జీతం రు. 15 లు. కానీ , తను ఆ మొక్కు ప్రకారం ఆ పదిహేను రూపాయలు చెల్లించటం మరిచిపోయాడు. ఆ తరువాత తనకి కాలం కలిసి వచ్చి జీతం రు. 700లకు పెరిగింది. అయినా మొక్కు చెల్లించాలని తనకు గురుతుకు రాలేదు. ఒక నాడు సాయిబాబా తన కలలో కనిపించి 'దత్తాత్రేయుడినే' మరిచావా?' అని పదే పదే ప్రశ్నించటంతో తనకు ఈ మొక్కు సంగతి గుర్తుకొచ్చి, తను నేరుగా షిర్డీ రావటం జరిగిందని వివరించాడు. వస్తూనే బాబాకు ఆ రు. 15 లు దక్షిణగా సమర్పించటం వలన తన మనస్సు శాంతించిందని మసీదులో అందరికీ తెలిపాడు.

ఇలాంటిదే మరో ఘటన బికానెర్లో ఉండే కెప్టెన్ హాటేకు జరిగింది. అతను బాబా భక్తుడు. కానీ , ఎందుకో ఒకరోజు బాబా వాని కలలో కనిపించి, రెండు రూపాయల దక్షిణ, ఆనపకాయతోకూర కావాలని అడుగుతున్నట్లు అనిపించింది. వెంటనే అతనికి మెళుకువ వచ్చింది. బాబా ఎందుకలా తనను అడిగాడో తెలియదు. ఏది ఏమైనా తను వెంటనే షిర్డీలోని నిమోన్కర్ కు డబ్బులు పంపి బాబా అడిగిన వాటిని సమకూర్చమని చెప్పాలనుకున్నాడు. గ్వాలియర్ వెళ్లి అక్కడినుంచి పన్నెండు రూపాయలు నిమోన్కర్ కు ఎం ఓ చేశాడు. ఆ డబ్బు అందుకున్న నిమోన్కర్ వెంటనే మసీదుకు వెళ్లి బాబాకు రు. 2 లు దక్షిణగా సమర్పించాడు. నిమోన్కర్ తిరిగి బయలు దేరుతుండగా ఆయన చేయి పట్టుకొని ఆపి, 'ఆనపకాయ కూర ఏది? అని అడిగాడు బాబా. తను చేసిన తప్పిదం గ్రహించిన నిమోన్కర్ తక్షణమే కావలసిన సామానులు కొని, ఆనపకాయ కూర చేయించి బాబాముందు భోజన సమయానికి ఉంచారు. అయితే , మిగతా అందరూ పెట్టిన వంటకాలను విడిచి బాబా హాటే పంపిన ఆనపకాయ

కూరనే తినటం అందరినీ ఆశ్చర్య పరిచింది. ఈ విషయాలను నిమోన్కర్ హాటే కు తెలుపగా అతను ఎంతో సంతోషించారు. ఇలా సాయిబాబా కలలో కనిపించి అనారోగ్యాలు నయంచేయటం నుంచీ ఎన్ని విధాలుగానో మనుషులకు ఉత్తమ మార్గం కలిగించటం చాలా ఆశ్చర్యం కలిగిస్తుంది. అనేక సందర్భాలలో సాయిబాబా కలలో కనిపించిన వారు 'ఇది కేవలం కలేగా' అని నిర్లక్ష్యం చేస్తే, మళ్ళీ మళ్ళీ కనిపించి వారిని షిర్డీ వచ్చే దాకా కూడా విడిచిపెట్టలేదు.

శ్రీ రమణ భగవానుల కాలంలోనే పాశ్చాత్య మనో వైజ్ఞానిక శాస్త్ర వేత్తలమధ్య 'శ్రీ రమణ భగవాన్' తీవ్రమైన చర్చకు కారణం అయినారు. జంగ్ లాంటి వారు శ్రీరమణులను దర్శించడానికి భయపడితే, హీన్రిచ్ జిమ్మెర్ లాంటివారు రమణ మహర్షి భారతీయ ఋషి సంప్రదాయానికి సజీవ రూపంగా భావించారు. ముఖ్యంగా మహర్షి తపోవిధానం, కలల్లో కనబడి మార్గ దర్శకం చేయటం, మౌనంగానే మనుషుల్లో 'హూ ఆమ్ ఐ ?' ఆలోచనను రేకెత్తించి వారికి దేహం, ఆత్మ వేరని భావం కలిగించటం వంటివి వారికి శాస్త్రీయంగా ఎలా అర్థం చేసుకోవాలో బోధపడలేదన్నది వాస్తవం. నేటికీ రమణాశ్రమానికి వేలల్లో విదేశీ భక్తులు రావటం , అక్కడే ఉండి 'హూ ఆమ్ ఐ ?' సాధన చేయటం మనం గమనించవచ్చు.

(భక్తిమాసపత్రిక, జూన్ 2024)

4
గురు మీమాంస : అసలు గురువెవరు? గురువావశ్యకత ఏంటీ ?

ఆధ్యాత్మిక గ్రంధాలైన ఉపనిషత్తులు చదివితే గురు ముఖతః ఆత్మ తత్త్వం బోధ పడేమాట నిజమే నని అర్ధం అవుతుంది. కానీ అజ్ఞానం నశించదు. అజ్ఞానం అంటే ఆత్మని, మాయని వేరు వేరుగా దర్శించలేని 'అయోమయం' అనే ఇక్కడ అర్ధం చెప్పుకోవాలి. ఇదే నిర్వచనం స్వామి వివేకానంద ఒకానొక సందర్భంలో తన 'థౌసండ్ ఐలాండ్ పార్క్ 'ప్రసంగాలలో విదేశీ జ్ఞానార్ధులకు వివరించాడు. అయితే, అజ్ఞానం నశించటం అంటే ఏమిటి ? జ్ఞానం కలిగితే అజ్ఞానం ఉండదు. ఇదెలా సాధ్యం ?

ఇందుకు సమాధానాలు వేరు వేరు ఆధ్యాత్మిక గ్రంధాలలో వేరు వేరుగా లభించటం వల్ల 'ఆత్మను' కోరుకొనే వారికి కొన్ని సందేహాలు కలగక మానవు. ఇక్కడ 'ఆత్మను కోరుకొనే వారు' అన్న పదం వాడటం వెనుక ప్రత్యేక ఉద్దేశ్యం లేకపోలేదు. భగవద్గీతలో 'ఆత్మని ఎవరు

కోరుకొంటారో వారినే ఆత్మ వరిస్తుంది' అని శ్రీ కృష్ణ పరమాత్మ అర్జునుడికి బోధించాడు . అందువల్ల 'ఆత్మ 'ను కోరుకొన్న వారికే ఈ గురు మీమాంస వర్తిస్తుంది . అసలు గురువెవరు? గురువవశ్యకత ఏమిటి? వంటి ప్రశ్నలు ఈ ఆత్మాన్వేషకుల సాధనా యజ్ఞములో భాగమే . ఈ ప్రశ్నలకు జవాబు వెతికే ప్రయత్నంలో కొంతమంది మహర్షుల జీవిత చరిత్రలు చదవటం జరిగింది . 'మహర్షుల జీవిత చరిత్రలు సముద్రం మధ్యలో దీపస్తంభాల వంటివి' అని హేమాడపంత్ రాసిన 'సాయి సచ్చరిత' గ్రంథం తెలుగు అనువాదం చేసిన పత్తి నారాయణ రావు గారి వాక్యం నాకు వెంటనే గుర్తుకువచ్చింది. కంచి పరమాచార్య జీవిత చరిత్ర ఆసాంతం చదివితే కొన్ని అద్భుత సత్యాలు తెలుస్తాయి . అందులో స్విట్జర్లాండ్ దేశస్తుడైన పాల్ బ్రన్టన్తో పరమాచార్య సంవాదం చాలా ముఖ్యమైనది.

పాల్ బ్రన్టన్‌కు రమణమహర్షిని దర్శించమని కంచి పరమాచార్య ఆదేశం

పాల్ బ్రన్టన్ అసలు పేరు రాఫెల్ హ్యూస్ట్ . బ్రిటిష్ పౌరుడు. వృత్తి రిత్యా పశువుల వైద్యుడు. ప్రవృత్తి రీత్యా జర్నలిస్టు. క్షుద్ర విద్యలు, మార్మిక విద్యలు, తంత్రం, తత్వ శాస్త్రం వంటి విషయాల్లో ఆసక్తి ఎక్కువ ఉండేది. భారతీయ తత్వ శాస్త్రం, తంత్రం, మహిమలు, మార్మిక విద్యలు గురించి , ఇక్కడ నిజంగా దైవాన్ని చుసిన వారిని కలవాలన్న ఆసక్తితో భారత దేశం వచ్చాడు. హిమాలయాలనుంచి కంచి దాకా భారత దేశం లోని వివిధ ఆధ్యాత్మిక ప్రదేశాలకు వెళ్లి తను చదువుకొన్న పాశ్చాత్య విజ్ఞాన కోణం నుంచి అన్నింటినీ పరిశోధించే వాడు. ఆవిధంగా జరిపిన పర్యటనలలో ఆయనకు నిజంగా దేవుడిని చూపించగల ఋషి అన దగ్గ వ్యక్తి ఎవ్వరూ తారస పడకపోవడంతో చాలా నిరుత్సాహ పడ్డాడు. తిరిగి స్వదేశం వెళ్ళటం కోసం చెన్నై వచ్చిన ఆయనకు మద్రాస్ విశ్వవిద్యాలయం

లో తత్వ శాస్త్రం లో ఆచార్యుడుగా పనిచేస్తున్న సుబ్రమణియన్ గారు కంచి పరమాచార్యను కలిసి ఒకసారి మాట్లాడమని సలహా ఇచ్చాడు. ఇవ్వటమేగాక స్వయంగా ఆయనను కుంభకోణం లో ఉన్న కంచి స్వామి వారి వద్దకు తీసుకువెళ్లాడు సుబ్రమణియన్ గారు.

కంచి స్వామితో స్వల్ప సమయానికి మాత్రమే మాట్లాడే అవకాశం లభించింది పాల్ బ్రన్టన్ కు. ఆ కొద్ది సమయంలోనే పాల్ బ్రన్టన్ కుకంచి స్వామి సామాన్యుడు కాడని, ఆయన ప్రాపంచిక జ్ఞానానికి హద్దులు లేవని, ఆయనకు ఆంగ్ల భాషే గాక, అనేక ఇతర యూరోపియన్ భాషల్లో కూడ పట్టున్న సంగతి అవగతం అయింది . కాకపోతే భారత దేశంలో భగవంతుడిని చూసిన మహర్షులు చాలామంది ఉంటారని, వాళ్ళు తనకూ భగవంతుడిని చూపిస్తారని వచ్చానని, కానీ తనకు నిరాశే ఎదురైందని అంటాడు పాల్ బ్రన్టన్ పరమాచార్యతో. అది విని పరమాచార్య బ్రన్టన్‌కు అంతగా నిరుత్సాహ పడవలసిన పని లేదని, తిరువణ్ణామలై లోని రమణ మహర్షి బ్రన్టన్ కున్న సందేహాలను తీరుస్తాడని చెప్పి పంపించేస్తాడు. కానీ, బ్రన్టన్‌కు పరమాచార్య మాటలపై నమ్మకం కలగదు.

ఇక తన భారత పర్యటనకు ముగింపు చెప్పి, మరునాడు ఇంగ్లాండు బయల్దేరుదామని అనుకోని చెన్నై హొటల్లో తన రూంలో నిద్రిస్తాడు కానీ, అర్ధరాత్రి కంచి పరమాచార్య బ్రన్టన్ నిదురిస్తున్న గదిలో ప్రత్యక్షమై అతనిని నిద్రలేపి ఇంగ్లాండు వెళ్లే ఆలోచన మానుకొని, తిరువన్నామలై వెళ్ళమని మరో సారి చెప్పి అదృశ్యమై పోతాడు. ఆ తరువాత నిద్రపట్టని బ్రన్టన్ తెల్లవారాక తన అనుభవాన్ని సుబ్రమణియన్ గారికి తెలిపి వారి సహాయాంతో తిరువణ్ణామలై చేరతాడు తన కారులో.

అలా తిరువణ్ణామలై చేరిన బ్రన్టన్ కు రమణ మహర్షి సాన్నిధ్యం లో గడిపిన వారం రోజుల్లోనే 'ఆత్మ' శరీరానికి భిన్నంగా ఎలా ఉంటుంది, దానిని దర్శించటం ఎలా అనే విషయం బోధపడుతుంది. ఆ అనుభవంతోపాటు భారత దేశంలోని ఆయన పర్యటన వివరాలను, అభిప్రాయాలను నిర్దుష్ట విశ్లేషణలతో 'ఏ సెర్చ్ ఇన్ సీక్రెట్ ఇండియా' పేరుతో ప్రచురిస్తాడు పాల్ బ్రన్టన్. ఈ పుస్తకం ప్రపంచంలోనే అత్యధికంగా అమ్ముడైన పుస్తకాలలో ప్రప్రథమం అయింది చాలా కాలం పాటు. అంతే గాక రమణ మహర్షి చూపుల ద్వారా తనలో వచ్చిన మానసిక మార్పు, చైతన్యం గురించి బ్రిటిష్ జర్నల్ ఆఫ్ సైకాలజి జర్నల్ లో వివరంగా రాయటంతో అప్పటిదాకా పాశ్చాత్యదేశాలలో మానసిక శాస్త్రం పై ఉన్న అవగాహనలను సవాలు విసిరినట్లైంది. ఆ విధంగా భగవాన్ శ్రీ రమణులు ఒక్కసారిగా విదేశాలలో ప్రసిద్ధు డైనాడు.

ఇక్కడ ప్రశ్న ఏమిటంటే జగద్గురువుగా ప్రసిద్ధి కెక్కిన కంచి పరమాచార్య తానే స్వయంగా పాల్ బ్రన్టన్ కు 'ఆత్మాను భూతి ' ఎందుకు కలిగించలేదు? శ్రీరమణభగవానుల దగ్గరికి ఎందుకు పంపాడు? ఇక్కడ ప్రశ్న ఏమిటంటే జగద్గురువుగా ప్రసిద్ధి కెక్కిన కంచి పరమాచార్య తానే స్వయంగా పాల్ బ్రన్టన్ కు 'ఆత్మాను భూతి ' ఎందుకు కలిగించలేదు? శ్రీరమణభగవానుల దగ్గరికి ఎందుకు పంపాడు? ఇలాంటిదే మరో సంఘటన శ్రీరమణభగవాన్ జీవితం నుంచి ఉటంకించవలసి ఉంటుంది.

బి.వి నరసింహ స్వామికి శ్రీరమణభగవానులు ఏమి చెప్పారు?

బి.వి. నరసింహ స్వామి మద్రాస్ ప్రెసిడెన్సీ హైకోర్టులో అంత్యంత పేరు ప్రతిష్టలున్న లాయర్. ఆయనకు ఇద్దరు కుమారులు. చక్కగా ఎదిగివచ్చిన పిల్లలు వాళ్ళు . బాగా చదువుకొని తండ్రికి అండగా నిలిచే

సమయానికి వారిరువురూ మరణించటంతో కుంగిపోయి, తీవ్ర వైరాగ్య స్థితిలో తిరువణ్ణామలై లోని శ్రీరమణభగవానుని ఆశ్రయించారు. శ్రీ రమణుని సాన్నిధ్యంలో ఆయనకు స్వాంతన కలిగింది. అంతటితో తనకున్న ఆస్తినంతా విక్రయించి, ఆ ధనం తన శేష జీవితం పదిలంగా సాగ డానికి వీలుగా బ్యాంకు లో వేసికొని సతీ సమేతంగా శ్రీ రమణుని శరణు జొచ్చారు. సుమారు 10 సంవత్సరాలు శ్రీ రమణునికి, ఆశ్రమానికి నిస్వార్థ సేవలు అందించారు. అయితే వచ్చిన వారానికే పాల్ బ్రంటన్ కు ఆత్మానుభూతి కలిగించటం, ఇంకా అనేకమంది రమణాశ్రమానికి వచ్చిన వారికి కూడ 'నేనెవరు?' అనే విచారణ ద్వారా ఆత్మానుభూతి కలగటంతో బి.వి. నరసింహ స్వామి కలత చెంది తనకు కూడా 'నేనెవరు?' విచారణ ద్వారా 'ఆత్మ సాక్షాత్కారం' కలిగించమని వేడుకొన్నాడు. నిజానికి బి .వి. నరసింహ స్వామి 'శ్రీ రమణుల జీవిత చరిత్ర – భక్తుల అనుభవాలు' అనే పుస్తకం తొలి సారి రాసి, అచ్చు వేశారు. అటువంటి బి.వి. నరసింహ స్వామికి శ్రీ రమణులు ఇలా బోధించారు. 'నిజానికి నీకు నేను గురువును కాదు. నీ గురువు షిర్డి సాయి బాబా. నువ్వు అక్కడికి వెళ్ళు. నీకు ఆత్మానుభూతి, ఆత్మ దర్శనం భగవాన్ సాయిబాబానే కలిగిస్తారు' అని చెప్పారు అప్పటికే భగవాన్ షిర్డీ సాయి బాబా కాలం చేశారు. అయినా శ్రీ రమణులు అలా అనటంతో హతాశుడైన బి .వి. నరసింహ స్వామి రమణుల ఆజ్ఞ కాదనలేక, వదల లేక వదల లేక రమణాశ్రమాన్ని వదిలి షిర్డీ పయనమయ్యారు . రమణులు బోధించినట్టే అక్కడ సాయి అనుగ్రహం, దర్శనం లభించింది. ఆయనకు జీవన సత్యం, తత్త్వం, తన జన్మ కారణం అన్నీ బాబా తెలియ జేయటంతో సంతృప్తి చెందిన బి.వి. నరసింహ స్వామి 'సాయిబాబా జీవిత చరిత్ర' ను, సాయి బాబా

భక్తుల అనుభవాలను, సాయి బాబా 'దత్తాత్రేయ అవతారంగా ' శాస్త్రీయంగా వివరించారు . 'అల్ ఇండియా సాయి భక్త సమాజం' స్థాపించి, భారతదేశం అంతా పర్యటించి దేశ వ్యాప్తంగా దత్తాత్రేయ,సాయి బాబా దేవాలయాలను నిర్మించారు. చివరి వరకు బాబా సేవలో గడిపి కాలం చేశారు.

అయితే , ఇక్కడ మరో ప్రశ్న వస్తుంది . పాల్ బ్రన్టన్‌ను కంచి పరమాచార్య శ్రీరామనభగవాన్ వద్దకు పంపితే, శ్రీ రమణులు బి.వి. నరసింహ స్వామిని సాయి బాబా దగ్గరకు పంపారు. ఇప్పుడు ఆలోచించండి. ఎవరు ఎవరికి గురువులు ? గురువులను ఎవరు నిర్ణయిస్తారు? ఇలా రెండు భిన్న సంఘటనలలో, వేరు వేరుగా స్పందించటంతో కంచి పరమాచార్య, శ్రీ రమణులు తమ భక్తులకు గురువు గురించి ఏమి సందేశాన్నిచ్చారు ?

గురుతత్వం ఏమిటి?

ముందుగా తెలుసు కోవలసిన విషయం ఏమిటంటే ఈ విశ్వానికి 24 మంది గురువులు ఉంటారు. ఎందుకంటే ఉపనిషత్తుల ప్రకారంఈ సృష్టి (కేవలం భూమే కాదు) చతుర్వింసతి తత్వాలతో ఉంది కాబట్టి, ఒక్కో అంశానికి ఒక్కో గురువు అధిపతిగా ఉంటారు. అయితే ఈ గురువులు భౌతికంగా వేరుగా ఉన్నా, వాళ్ళ మధ్య భేదం ఉండదు. అభేదమై ఉంటారు. అయినప్పటికీ వీరంతా పరబ్రహ్మ సంకల్పానికి లోబడి ఉంటారు. సాయిబాబా 'అల్లా మాలిక్', అని అనటంలో 'రహస్యం' ఇదే. 'అంతా ఆయనే చేస్తాడు, కానీ, నేనే అంతా చేస్తున్నానని నన్ను నిందిస్తున్నారు. అల్లా ఒప్పుకోక పోతే నేనేమి చేయగలను ?' అని బాబా తరుచూ మసీదు లో తన భక్తులతో అనే వారు. 19,20 శతాబ్దాల మధ్య భారత దేశంలో అనేక మంది యోగులుండేవారు. అందరి మధ్య అభేదం

ఉన్నా పరబ్రహ్మ 'అధికారపత్రం' (బ్రహ్మసూత్రాలు) కొంతమందికే ఉండేది. వారు మాత్రమే భక్తులకు 'ఆత్మ సాక్షాత్కారం' చేయగలరు.

అయితే ఇక్కడ ఒక చిన్న కిటుకు ఉంది. ఎవరికి ఎవరు గురువుగా ఉండాలన్నది నిర్ణయించేది కూడ ఆ పరబ్రహ్మమే. ఇందులో 'ఆత్మ'ను కోరుకొనే వారు మొదట ఉంటారు. వారికి ప్రత్యేకించి గురువు అవసరం లేదు. అక్కడ 'ఆత్మ' నే గురువు. 'ఆత్మ సాక్షాత్కార దర్శనం' కు విరాగి 'ఆత్మ' నే నిర్దేశనం చేస్తుంది. కంచి పరమాచార్య, శ్రీ రమణులు ఈ కోవకు చెందిన వారు . ఇతరుల్లో కొంత మంది గత జన్మ కర్మల ద్వారా ఈ గురువులతో సాన్నిహిత్యం ప్రత్యక్షంగా గాని, పరోక్షంగా గాని కలిగి ఉంటారు. శ్రీ రమణుల జీవిత చరిత్ర, శ్రీ షిర్డీ సాయి బాబా జీవిత చరిత్ర చదివితే అలంటి వారిని ఈ సద్గురువులు ఎలా గుర్తించి వారికి సద్గతి కలిగించారో మనకు అవగతం అవుతుంది. 'నే నెవరు ?' విచారం లో మన గురువు మన ఆత్మేనా, లేక ఎవరైనా వేరే ఉన్నారా సంగతి సులువుగా తెలుస్తుంది. కొందరికి ఒక్కరే గురువు ఉంటారు.

కొందరికి పలువురు గురువులు ఉంటారు. సమయం వచ్చినప్పుడు ఆయా గురువులు సాక్షాత్కారమై మనల్ని సరైన గమ్యానికి నడిపిస్తారు. జీవన బంధాలనుంచి తగిన సమయంలో విముక్తి కలిగిస్తారు. ప్రతిఒక్కరూ గురువు కారు, కాబట్టి మనం గురువులను వెతికి పెట్టుకోవలసిన అవసరం లేదు. 'నే నెవరు?' అన్న విచార ధారా ప్రారంభించి ఒక స్థాయికి చేరేప్పటికి ఆ గురువులు తమంతట తామే మన ముందు సాక్షాత్కరిస్తారు. స్వామి రామతీర్థ 'రామ'నామ ధార లో 'ఉన్మాద 'స్థితి కి చేరే సమయానికి స్వామి వివేకానందకు శ్రీ రామకృష్ణ పరమహంస కనిపించి తక్షణమే లక్నో వెళ్లి రామతీర్థకు ఉపశమనం కలిగించమని ఆదేశించాడు. ఆ

సమయంలో గుజరాత్‌లో ఉన్న స్వామి వివేకానంద హుటాహుటిన లక్నో వెళ్లి స్వామి రామతీర్థ కు 'మోక్ష' మార్గం చూపుతాడు. ఆ తరువాత స్వామి రామతీర్థ కొంత కాలమే జీవించినా స్వామి వివేకానంద లానే జీవించి గంగా స్నానం చేస్తూ కాలం చేస్తారు . ఇది గురువు కథ – గురువు మీమాంస, కమామిషు.

(భక్తిమాసపత్రిక, మార్చి 2024)

5

గురువుకు ధీటైన శిష్యుడు - స్వామివివేకానంద

స్థాపకాయచ ధర్మస్య సర్వ ధర్మ స్వరూపిణే , అవతారవరిష్ఠాయ శ్రీరామకృష్ణాయతే నమః అని తొలిసారి స్వామి వివేకానంద తన గురువును కీర్తిస్తూ పలికిన శ్లోకం ఇది. అప్పటినుంచి అన్ని రామకృష్ణ మఠాలలో ఈశ్లోకం నేటివరకూ మారుమోగుతునే ఉంది. అందుకే ఇదే ప్రార్థనతో ఈ వ్యాసం పఠిస్తే మన మనస్సు దివ్యతేజోమయమై చదివిందిహ్రుదయ కమలంలో నాటుకుపోతుంది.

గురు–శిష్య సంబంధాలు : ఉపనిషత్ ప్రమాణాలు

పందొమ్మిదవశతాబ్దంలో భారతీయ రుషి పరంపరను తలపించే ఒకే ఒక రుషిద్వయం శ్రీరామకృష్ణ – వివేకానందలు. ఉపనిషత్తులు రుషులను, గురువులను, వారిజీవనశైలి, పాటించవలసిన నియమాలను నిర్దేశించాయి. జాగ్రత్తగా పరిశీలిస్తే శ్రీరామకృష్ణ, వివేకానందుల మధ్య జరిగిన ఘటనలన్నీ ఉపనిషత్ప్రమాణమై ఏ గీతా దాటకుండా

గడిచాయన్నది ఇట్టే అవగతమవుతుంది. శ్రీరామకృష్ణ గురుదేవులు ఒక రుషిగాఎన్ని కఠినాతి కఠినమైన నియమాలను పాటించాడో, ఆయన శిష్యుడైన నరేన్ (తర్వాతి కాలంలో స్వామి వివేకానందుడయ్యాడు) తన గురువుకు అంతే స్థాయి కఠిన పరీక్షలు పెట్టాడు. అదేమి విచిత్రమో గాని ఈ గురుశిష్య పరస్పర పరీక్షలు గూడ ఉపనిషత్ప్రమాణ పరిధిలోనే సాగుతాయి. ఎందుకిలా అనవలసి వచ్చిందంటే భారతీయ ఉపనిషత్తులు శిష్యులకు తమకు సరైన గురువు అవునా, కాదాని ఒక గురువును పరీక్షించుకొనే స్వేచ్ఛ, హక్కు కలిపించాయి. అలాగే గురువు కూడా తన శిష్యుడిని పరీక్షించుకొని, ఇతనుతనగురుత్వానికిఅర్హుడవునా, కాదా అని నిర్ధారించుకోవచ్చు. ఇరువురిలో ఎవరికి మరొకరిపై విశ్వాసం, నమ్మకం లేకపోయినా వారిని తిరస్కరించి ఆశ్రమం వదిలి వెళ్లిపోవచ్చు.

గురువును శిష్యుడు పరీక్షించటం

ఇందుకు ఉదాహరణగా ఒక ఉపనిషత్ కథ ఉంది. ఒకసారి ఒక బాలుడు ఒక రుషి వద్దకు వచ్చి తనని శిష్యుడుగా స్వీకరించి, తనకు జ్ఞానం కలిగించమని కోరతాడు. అందుకు అంగీకరించిన ఆ రుషి ఆ బాలుడికి ఒక మంత్రం ఉపదేశించి, దానిని నిత్యం జపించమని, జపిస్తూనే ఆశ్రమ నిత్యనైమిత్తిక కర్మలను చేయమని ఆదేశించారు. అందుకు ఆ బాలుడు అంగీకరించి కొన్నేళ్ళు గురువు ఆశ్రమంలో గడుపుతాడు. కాని, అతనికి ఎంతక్కీనం కలగదు. తాను రుషి ఆశ్రమంలో చేరిననాడు ఎలా ఉన్నాడో, ఇప్పుడు గూడ అలానే ఉన్నాడు. అతనికి తన గురువ్వుని కాకపోవటం వలననే తనలో ఏ మార్పు గురువు కలిగించలేక పోయాడనిపించింది. అందుచేత వేరే గురువు దగ్గరకి వెళ్లాలని నిశ్చయించుకొని, గురువుగారి వద్దకు వెళ్లి, తన సందేహం వెలిబుచ్చాడు. అక్కడనుంచి నిష్క్రమించడానికి అనుమతి కోరాడు.

శిష్యుడి మాటలకు ఏమాత్రం గురువు కోపగించుకోలేదు. పైపెచ్చు ఎంతో ప్రేమతో 'నీసందేహం న్యాయమైనదే. నీకు గురువును మార్చే స్వేచ్ఛ ఉంది. అయితే ఒక చిన్నపనిచేయి. ఒక చెంబులో నీరుతీసుకో. నీవు ఆశ్రమానికి వచ్చిన తొలి రోజు నీకు నేను ఉపదేశించిన మంత్రం పిస్తూ, నోట్లో ఆ చెంబులోని నీరు పోసుకొని పుక్కిలించి ఆ చెట్టుపై ఉమ్మేసి హాయిగా వెళ్లు' అనిచెప్పాడు. ఆ శిష్యుడలానే చేశాడు. నీరు చుట్టుపక్కల పడగానే భగ్గున మంటలెగసి ఆ చెట్టుదగ్ధమైంది. ఊహించని ఈ పరిణామానికి ఖిన్నుడైనాడు ఆ శిష్యుడు. తన గురువు ఎంతటి శక్తిమంతుడో అతనికి అర్థమైంది. తను అనవసరంగా గురుశక్తిని శంకించి పాపం మూటకట్టుకొన్నానని భావించి ఆయన కాళ్లపై పడిక్షమాపణకోరాడు. గురువు అతని భుజం పట్టుకు పైకిలేపి 'ఇదంతా నా సంకల్పం వలననే జరగింది. నీ తప్పేది లేదు. ఈ క్షణమే నీకు సకల విద్యలు కరతలామలకం అవుతాయి. నీవు గొప్ప జ్ఞానివై లోకంలోకీర్తి, ఐశ్వర్యం పొంది, అంత్యకాలంలో ఈశ్వర సాయుజ్యం పొందుతావు' అని దీవించి కానుకలనిచ్చి వీడ్కోలు పలుకుతాడు. సరిగ్గా శ్రీరామకృష్ణ, వివేకానందుల మధ్య ఇలాంటి సంఘటనలే చోటు చేసుకోవటం మనకు వారిరువురి జీవితంపట్ల ఎంతో ఆసక్తి రేపుతుంది.

నరేన్ గురువులను, మతాలను మార్చటం

నరేన్ (వివేకానందుడు) పైన చెప్పిన ఉపనిషద్ కథలోలా ఇద్దరు లేక అంతకంటే ఎక్కువ గురువులను మార్చాడు. చిన్నప్పటినుంచి తత్వ శాస్త్రం, తర్కం అంటే ఇష్టం ఉన్న వ్యక్తి అవటం వలన నరేన్ తొలుత కేశబ్ చంద్రసేన్ స్థాపించిన 'నవ విధాన్' అనే ఒక మతం లో సభ్యుడైనాడు.

అప్పటికే కేశబ్ చంద్రసేన్ కు శ్రీ రామకృష్ణ గురుదేవుల పరిచయం ఉంది. అయినా కేశబ్ రాంమ్మోహన్ రాయ్ స్థాపించిన బ్రాహ్మ సమాజ్ నుంచి సైద్ధాంతికంగా విభేదించి 'సాధారణ బ్రహ్మో సమాజ్' ను నెలకొల్పారు. ఇందులో కూడా నరేన్ (వివేకానందుడు) సభ్యుడైనాడు. కానీ ఇవేమి ఆయనను సంతృప్తి పరచలేదు.

నరేన్-శ్రీ రామకృష్ణుల తొలికలయిక

ఒకనాడు తన డిగ్రీ క్లాస్ లో ప్రొఫెసర్ విలియం హస్టి 'ట్రాన్స్' అంటే 'భావాతీత స్థితిలోకి సాధకుడు వెళ్ళటం' అనే దాని గురించి వివరిస్తూ, ఈ విషయంలో ఎవరికైనా సందేహాలుంటే దక్షిణేశ్వర్ లో ఉన్న శ్రీ రామకృష్ణులను కలసి సలహా చేస్తే మంచిదని చెప్పగా విన్న నరేన్, తొలిసారి శ్రీ రామకృష్ణ గురుదేవులను 1981 నవంబరులో సురేంద్రనాథ్ మిత్రా ఇంటిలో కలుస్తారు. ఆనాడు నరేన్ ను తొలిసారి చూసిన శ్రీ రామకృష్ణులు నరేన్ ను దక్షిణేశ్వర రమ్మని ఆహ్వానిస్తారు. ఆ తరువాత పలుసార్లు నరేన్ ఒక్కడిగాను, తనమిత్రులతోనూ కలిసి దక్షిణేశ్వర్ వెళ్ళి, శ్రీ రామకృష్ణులను పరిశీలించటం మొదలు పెడతాడు. నరేన్ కు శ్రీ రామకృష్ణుల భావాతీత స్థితి (ట్రాన్స్) ఒక మానసిక వ్యాధిగా తోస్తుంది. సాధారణంగా మానసికరోగులు గూడా 'భ్రాంతు'లకు, 'మూర్ఛ'లకుగురవటం లాంటివి చేస్తుంటారు. పాశ్చాత్య మానసిక శాస్త్రవేత్తల పరిశోధనలను, పాశ్చాత్య తత్వశాస్త్ర సిద్ధాంతాలను అప్పటికే విస్తృతంగా చదివున్న నరేన్‌కు శ్రీ రామకృష్ణులు ఒక పిచ్చివాడుగానే అనిపించాడు. అలా అనుకొని వదిలేస్తే పోయేది. కానీ, నరేన్ ఒకసారి ఆయనను 'నీవు దేవుడిని చూసావా?', నాకు చూపిస్తావా?" అని అడగటంతో అసలు కథ వారి మధ్య ప్రారంభం అయింది.

నరేన్ కు తొలిసారి దైవ సాక్షాత్కారం

నరేన్ ప్రశ్నలకు అంతవరకూ ఎవ్వరూ చెప్పని సమాధానాలు చెబుతాడు శ్రీ రామకృష్ణులు. "నేను నిన్నెలా చూస్తున్నానో, భగవంతుడిని కూడా అలానే చూస్తాను నిత్యం. కావాలంటే నీకుకూడా చూపుతాను చూస్తావా?' అని అడగటంతో ఖంగు తిన్న నరేన్ భగవంతుడిని చూపమని అడుగుతాడు. అలా మొదటి సారి కాళీ అమ్మవారి గుడిలోకి వెళ్లి అమ్మవారి దర్శనం ప్రత్యక్షంగా పొంది తిరిగి వస్తాడు నరేన్. దైవ దర్శనం అయినా అది నిజమన్న నమ్మకం కలగదునరేన్కు. తను కూడా శ్రీ రామకృష్ణులా మతి భ్రమణానికి గురైననేమో అని అనుకొంటాడు. అంతే గాదు, తనని నారాయణ అవతారంగా శ్రీ రామకృష్ణులు పేర్కొనటాన్ని అపహాస్యం చేస్తాడు. రామకృష్ణులకు పిచ్చి, మతి భ్రమించిందని నిందిస్తాడు. ఈ నిందలకు కలత చెందిన శ్రీ రామకృష్ణ గురుదేవులు కాళీ గుళ్లోకి వెళ్లి 'నరేన్ తను తీసుకొచ్చిన సప్తరుషుల్లో ఒకడేనా, కాదా?' అని కాళీ మాతను నిలదీస్తాడు. 'అతనే' అంటూ అమ్మ సప్తఋషిమండలం నుంచి ఒక కాంతిపుంజం నరేన్ వాళ్ళింటి వాకిలి ద్వారం దాకా ప్రసరించటం చూపిస్తుంది శ్రీ రామకృష్ణ గురుదేవులకు. అంతటితో సంతృప్తి చెందిన శ్రీ రామకృష్ణులు మర్నాడు నరేన్ కోసం నిరీక్షిస్తాడు.

నరేన్-శ్రీ రామకృష్ణుల మధ్య ఘర్షణలు

నరేన్ రాగానే 'అమ్మ చెప్పింది, నేను వేచి చూస్తున్న సరైన వాడివి నువ్వేనని. ఇక నువ్వు నన్ను మోసం చేయలేవు', అంటూ నరేన్ ఒకసారి తాకుతాడు. మరుక్షణం 'నరేన్ నాకేదో అవుతోంది. నన్నేం చేసావు? నాకు అమ్మ , నాన్నా సోదర సోదరీ మణులు న్నారు. వాళ్లకు

అన్యాయం చేయకు. ఈ దృశ్య ప్రపంచం అంతా క్రమంగా మాయమై పోతోంది. అంతా ఒక్కటై ఏదో అద్భుతంగా కనిపిస్తోంది' అని అరుస్తూ స్పృహ కోల్పోతాడు. కాసేపు అతని తో వచ్చిన స్నేహితులు కంగారు పడతారు నరేన్ కు ఏమో అయిందని. కానీ, శ్రీ రామకృష్ణులు నరేన్కు ఏమీ కాదని సమాధాన పరిచి కాసేపు గడిచిన తరువాత తిరిగి నరేన్ ను తాకుతాడు. మరు క్షణం నరేన్ నిద్రలోంచి లేచిన వాడిలా లేచి తనకు ఏమి జరిగిందని అందరినీ అడుగుతాడు. నరేన్ కు అతని తోటి వారు జరిగిందంతా వివరించి అక్కడినుంచి అతనిని తోడ్కొని ఇంటికి తీసుకు వెళ్తారు.

నరేన్ తన కాలేజ్ లో చదువుకొన్న అద్వైత సిద్ధాంతాన్ని విశ్వసించడు. అదంతా ఉట్టి కల్పన అని మరో సందర్భంలో శ్రీ రామకృష్ణులతో వాదించాడు. అప్పుడు మళ్ళీ శ్రీ రామకృష్ణులు హఠాత్తుగా నరేన్ ను తాకటం, నరేన్ స్పృహతప్పి పడిపోవటం జరుగుతుంది. కాసేపు గడిచిన తరువాత శ్రీ రామకృష్ణులు తిరిగి స్పృసించటంతో నరేన్ నిద్రలోంచి లేచి నట్టు లేస్తాడు. కానీ, ఈ సారి గతంలో లా వాదించాడు. ఎదో ఒక వింతానుభూతికి లోనైనా వాడిలా ఉంటాడు. ఇంటికి వెళ్తున్నప్పుడు రోడ్డు పైన బస్సుల కెదురు వెళ్తాడు. ఇంటిలో అమ్మ అన్నం వడ్డిస్తుంటే, అమ్మవడ్డించే గరిటె, వడ్డించే వంటకం అన్నీ ఏకమై ఎదో దివ్య శక్తిని వేద జల్లు తున్నట్టుంటే, దేనినీ వేరే దానినుంచి భిన్నంగా గుర్తించే శక్తి కోల్పోయి ఉంటాడు. ఈ స్థితి గురించి నరేన్ మిత్రుల ద్వారా తెలుసుకొన్న శ్రీ రామకృష్ణ గురుదేవులు అతనిని తిరిగి మామూలు స్థితికి తన మృదువైన స్పర్శతో వచ్చేలా చేస్తాడు.

ఇదంతా 1881-84 మధ్య జరుగుతుంది. 1884లో నరేన్ తండ్రి మరణంతో వాళ్ళ ఆర్థిక స్థితి ఒక్కసారి తల్ల క్రిందులవుతుంది. సమస్యలు చుట్టుముట్టి, సుడిగుండంలో చిక్కుకున్నవాడిలా గిలగిల లాడుతాడు నరేన్. ఆ స్థితిలో నరేన్ శ్రీ రామకృష్ణుల సహాయం అర్థిస్తాడు. మనుషులలో ఈ కష్టాలకు కారణాలు ఏమిటీ? ఎందుకు కొందరు దరిద్రంలో, కొందరు ఐశ్వర్యంలో పుడతారు?తన దారిద్రంకు పరిష్కారం ఏమిటీ?ువంటి ప్రశ్నలతో శ్రీ రామకృష్ణులను చేరి కాళీ మాతను సహాయం అడగమని కోరతాడు. అందుకు శ్రీ రామకృష్ణ నువ్వే లోపలి వెళ్లి అమ్మను అడగమని నరేన్ ను పురమాయిస్తాడు. గర్భ గుడిలోనికి వెళ్లిన నరేన్ కు అమ్మ ప్రత్యక్షమై ఏమి కావాలని అడిగితే ఏమీ వద్దని వెనక్కి వచ్చేస్తాడు నరేన్.

సన్యసించటం -గురువుకు పరీక్షలు

ఆ తరువాత నరేన్ శ్రీ రామకృష్ణుల శిష్యత్వం స్వీకరిస్తాడు. అయితే, 1885-86 మధ్య నరేన్ శ్రీ రామకృష్ణులకు అనేక పరీక్షలు పెడతాడు. శ్రీ రామకృష్ణులు కామినీ, కాంచనాలు ఆధ్యాత్మిక సాధనకు అవరోధాలని తరుచూ అంటుండేవారు. నిజానికి వివాహితుడైన శ్రీ రామకృష్ణులు వీటికి ఎంత దూరంలో ఉన్నారో నరేన్ స్వయంగా పరీక్షించి నిర్ధారించుకొన్నాడు. ఇది ఒక అపూర్వ సంఘటన. గురువు శిష్యుడిని పరీక్షించటం సహజం. అయితే ఆ అవకాశం ఉపనిషత్తులు శిష్యునికి కూడా కలిపించాయి మొదట్లో ఉదహరించిన కథలో వివరించినట్టు. నరేన్ శ్రీ రామకృష్ణులకు తెలియకుండా ఆయన శయనించే పరుపు కింద బంగారం, కొన్ని నాణాలు ఉంచాడు. ఆ విషయం తెలియని

గురుదేవులు ఆ పక్క పై కూర్చోగానే ఎగిరి కింద పడ్డారు. వెనువెంటనే పరుపుకింద ఏముందని చూడగా బంగారం, నాణాలు కనిపించినయి. ఇది నరేన్ చేసిన పనే అని గ్రహించటానికి శ్రీ రామకృష్ణులకు అట్టే సమయం పట్ట లేదు. మరునాడు శ్రీ రామకృష్ణులు వాటిని చిల్లపెంకులతో పోల్చిగంగానదిలో వదిలేశారు.

శ్రీ రామకృష్ణులు అద్వైత వేదాంతి. అద్వైత స్థితి ఒక్కటే సత్యం, శాశ్వతం అని తరుచూ చెప్పేవారు. ఒకసారి నరేన్ 'మీరు అద్వైతస్థితి సత్యమని చెబుతూ తమ సన్యాసం నామం 'రామ-కృష్ణులు' అని పెట్టుకోవడం ఏమిటీ?' అని గురుదేవులను ఎద్దావా చేస్తాడు. అందుకు బదులుగా శ్రీ రామకృష్ణులు 'ఎవరు రాముడో, ఎవరు కృష్ణుడో అదే ఈ దేహం' అని సమాధానం చెప్పటమే గాక , రాముడు, కృష్ణుడు నిజంగా భూమిపై అవతరించిన అవతారాలని, తాను వారినే గాక సీతమ్మను చూసినట్టు చెబుతాడు. సీతమ్మ వారు పొట్టిగా ఉండేదని, కొంచం చుట్టిముక్కు ఉండేదని, ఆవిడ చేతులకుండే బంగారు గాజులు ఈ డిజైన్ లో ఉన్నాయని కూడా చెప్పారు. దక్షిణేశ్వర్ యజమాని రాణి రాసమని దేవి శ్రీ రామకృష్ణులు గీచిన డిజైన్ మాదిరే బంగారు గాజులు చేయించి మందిరంలో సీతమ్మవారికి తొడిగించారు. అవి నేటికీ ఉన్నాయి.

ఒకసారి నరేన్ హనుమంతుని ఉనికిని, ఆయన గదను, తోకను కూడా ప్రశ్నిస్తాడు. 'అలా మనిషి ఎలా ఉంటాడు?'. అంతా కల్పన'అని శ్రీ రామకృష్ణులతో వాదిస్తాడు. అప్పుడు శ్రీ రామకృష్ణులు నరేన్ తో'ఒక హనుమంతుడి గుడికి వెళ్లి, హనుమంతుడి చుట్టూ మూడు ప్రదక్షిణాలు చేయి, అప్పుడు నీకే తెలుస్తుంది 'హనుమంతుడు నిజామా, అబద్ధమా?'అని

చెబుతాడు. అలాగే నరేన్ కలకత్తాలోని హనుమంతుడి గుడికి వెళ్లి మూడు ప్రదక్షిణాలు చేసేప్పటికీ, ఆయన మూతి వాచి, తోక బయటికి పొడుచుకువచ్చి ఉంటుంది. ఒక్క సారిగా భయపడి పోయిన నరేన్, పరుగు పరుగున శ్రీ రామకృష్ణుల వద్దకు వెళ్లి, తన పరిస్థితినిదీనంగా వివరిస్తాడు. నరేన్ స్థితిని గమనించిన శ్రీ రామకృష్ణులు ఒక సారి నరేన్ ను తాకగానే మూతి వాపు, పొడుచుకు వచ్చిన తోక మాయ మవుతాయి.

ఈ ఘటనలన్నీ అనేక మంది శ్రీ రామకృష్ణుల శిష్యుల సమక్షంలో, నరేన్ మిత్రుల సన్నిధానంలో జరిగినవే. శ్రీ రామకృష్ణులు లేకుంటే నరేన్ ఒక కొత్తమతాన్నే సృష్టించే వాడు. అంతటి ధీశాలి, వినమ్రుడై పై ఘటనలన్నీ తానే స్వయంగా తన ఉపన్యాసాల ద్వారా లోకానికి వెల్లడి చేశారు. ఇది కదా గురు-శిష్య బంధం అంటే.

(భక్తిమాసపత్రిక, జులై 2024)

6
ద్వితీయ అయోధ్య - ఒంటిమిట్ట రామాలయం

రామభక్తిలో తెలుగు రాష్ట్రాలదే అగ్రస్థానం. రామనామ సంకీర్తనల విషయము లోగాని, రామాయణ రచనల సంఖ్యా పరంగాగాని,రామభక్తుల్లో మహాభక్తుల మాటకు వస్తేగాని, రామ శతకాల ప్రసక్తి లో గాని తెలుగు రాష్ట్రాలదే అగ్రతాంబూలం. ఇక్కడున్నన్ని రామమాలయాలు భారతదేశంలో ఏ రాష్ట్రంలోనూ లేవంటే అతిశయోక్తి కాదు. అయితే తెలుగు రాష్ట్రాలలో భద్రాచలం రామాలయం (భద్రాచలం, ఖమ్మం, తెలంగాణా రాష్ట్రం), ఒంటిమిట్ట రామాలయం (ఒంటిమిట్ట, కడప, ఆంధ్రరాష్ట్రం), రామతీర్థం (విజయనగం, ఆంధ్ర రాష్ట్రం) అత్యంత విశిష్టమైనవి, శోభాయమైనవి, చారిత్రాత్మక మైనవి కూడా. భద్రాచలం రామాలయం త్రేతాయుగం నాటిది కాగా 16వ శతాబ్దంలో దానికి రూపురేఖలు ఏర్పడి ఒక నిర్మాణంగా మారింది. ఒంటిమిట్ట రామాలయం కూడా వేయి సంవత్సరాల నాటిది. అలాగే రామతీర్థం కూడా వేయి సంవత్సరాలనాటిది. చివరిసారిగా తెలుగు రాష్ట్రం ఆంధ్ర , తెలంగాణాగా విడిపోయాక 2014లో రాష్ట్ర ప్రభుత్వానికి

రాష్ట్ర స్థాయి రామాలయం ప్రకటించవలసిన పరిస్థితి ఉత్పన్నమైంది. ఎన్నో అంశాలను పరిగణించి ఒంటిమిట్ట రామాలయాన్ని రాష్ట్ర స్థాయి రామాలయంగా ప్రకటించటం జరిగింది. గత 10 సంవత్సరాలుగా ఇక్కడ రాష్ట్రప్రభుత్వం త్రరఫున సీతాసహిత రామలక్ష్మణులకు కట్నాలు చదివించటం జరుగుతున్నది.

ఒంటిమిట్ట రామాలయ వర్ణన, వైభోగం

ఈ రామాలయం ఒక అద్భుత ప్రాకారం.నాలుగు వైపులా ద్రావిడ పద్ధతిలో మలిచిన నాలుగు గోపురాలు, సౌందర్యమొలికించే శిల్పకళతోసువిశాల ప్రాంగణంలో ఉంటుంది. కడప, తిరుపతి వెళ్లే రహదారి పక్కనే ఉంటుంది. పాలకొండలు, శేషాచల కొండల పరివేష్టితమై సుందర పుష్కర ప్రాంగణం కలిగి పూర్తిగా హరితమయమైన ఆవరణంలో చూపరులకు ఆహ్లాదకరంగా ఉంటుంది. దీని నిర్మాణం మూడు అంచెలుగా జరిగింది. గర్భగుడి, అంతరాలయం ఒకసారి , ముఖమండపం ఒకసారి, గాలిగోపురం ఒక సారి నిర్మితమైనాయని అక్కడ వేసిన దేవస్థాన శాసనాల ద్వారా తెలుస్తుంది. దేవస్థాన ముఖమండపంలో 11వ శతాబ్దం నాటి చోళుల శిల్పములు, దేవాలయ చరిత్ర తెలిపే శాసనాలున్నాయి. ఆలయ చరిత్ర తెలిపే రెండు శాసనాలు మహాగోపుర ఉత్తర భాగాన ఉన్నాయి. ఇక్కడ దేవాలయ నిర్వాహకులు 1356 శాసనాలుగా ఒక బోర్డు పెట్టటం జరిగింది. అయితే ఆ శాసనాలలో ఏమి రాసుందో తెలిపే బోర్డు ఏదీ అక్కడ లేకపోవటం పర్యాటకులకు ఇబ్బందిగా ఉంది. అయితే ఇతరత్రా సేకరించిన సమాచారం బట్టి ఒక శాసనం 1555లో కల్లూరి లింగయ్య అనే గ్రామాధికారి వేయించినట్లు తెలుస్తుంది. ఇందులో విజయనగర పాలకుడైన విరసదాశివ రాయల సామంతుడు, మండలాధీశు

డైన ఎత్తితిరుమలయ్య, దేవమహారాజు పులపుత్తూరు గ్రామాన్ని, కంచిరాజు మాత్రజయ్య బోగేపల్లి గ్రామాలను, కొన్ని వరిసాగు మళ్లను ఒంటిమిట్ట రామాలయానికి దానంగా ఇచ్చినట్టు ఉందని తెలుస్తోంది. ఇక రెండవ శాసనానికి వస్తే 1558లో సిమాధికారి ఆ శాసనం వేసినట్టు తెలుస్తోంది. దీని ప్రకారం ఒంటిమిట్ట కోందండ రామాలయ గోపుర , ప్రాకార నిర్మాణాలకు రథం, బ్రహ్మోత్సవ నిర్వాహణకు గుత్తియెర తిరుమల రాజయ్య, జాబికాబ్రి కుమారుడైన నాగరాజయ్య దేవమహారాజులు ఒంటిమిట్ట గ్రామాన్ని, అందున్న పల్లెలకు, చతుస్సిమలకు పొలాలను దానంగా ఇచ్చారు. ఈ రెండు శాసనాలను సదాశివ రాయల ప్రధాని తిరుమల రాజు అనుమతితో వేయించారు.

ముఖమండపం 32 స్తంభాలతో పర్యాటకులకు కనువిందు చేస్తాయి. ఇక్కడ స్తంభాలపై రామాయణ , భాగవత కథల చిత్రాలు అద్భుతంగ మలిచారు. దేవస్థానం ముఖ ద్వారం 162 అడుగుల ఎత్తు గాలిగోపురంతో నిర్మితమైంది. ముఖద్వారంలో ఒకే రాతిపై ఏనుగు, ఆవు చిత్రనిర్మాణంతో ఎంతో శోభాయమానంగా కనిపిస్తుంది. 1652లో ఈ ప్రాంతానికి పర్యటనకు వచ్చిన ఫ్రెంచ్ యాత్రికుడు టవర్నిర్ ఈ ఒంటిమిట్ట దేవాలయ నిర్మాణాన్ని ఒక గొప్ప కట్టడంగా పేర్కొన్నాడు.

'ఒంటిమిట్ట'కు ఆపేరు ఎలా వచ్చింది? స్థల పురాణం

స్థలపురాణం ప్రకారం ఒంటిమిట్ట పూర్వనామధేయం 'ఏకశిలానగరం'.భద్రాచలానికి ఆపేరు ఎలా వచ్చిందో తెలిపే రామాయణ గాథను స్థలపురాణం కింద వివరిస్తారు. అందులో రాములవారు సీత,లక్ష్మణ సమేతంగా భద్రాచలం ప్రాంతంలో, గోదావరి తీర ప్రాంతంలో పర్ణశాల నిర్మించుకొని అక్కడే కొంతకాలం వసించినట్టు చెబుతారు. నేటికీ ఆ

పర్ణశాల అక్కడ ఉందని విశ్వసించి,భక్తులు దానిని దర్శిస్తుంటారు. అలాంటిదే ఒక కథ ఒంటిమిట్ట విషయంలో కూడా ప్రచారంలో ఉంది. రామలక్ష్మణులు విశ్వామిత్ర యాగాన్ని కాచినట్టు రామాయణంలో కనిపిస్తుంది. అలాగే ఒంటిమిట్ట ప్రాంతంలో కూడా రుషులు, మునులు వసించేవారు. వారు కూడా యజ్ఞ యాగాదులు నిర్వహించేవారు. సీతారామ కల్యాణానంతరం ఒకసారి ఒంటిమిట్ట ప్రాంతంలో తాము నిర్వహించే యాగాలను రాక్షసులు భంగపరుస్తున్నారని మృకుండ మహర్షి, శృంగి మహర్షి రాములవారిని శరణు కోరగా, వారికోర్కె మేరకు రాములవారు సీతా లక్ష్మణ సమేతంగా ఇక్కడికి వచ్చారని ఈ స్థలపురాణం వివరిస్తుంది. అందుకు ప్రతిగా మహర్షులు సీత,లక్ష్మణ సమేతంగా రాముల వారి విగ్రహలను ఏకశిలపై మలచారని, ఆ కాలంలో ఈ ప్రాంతాన్ని 'ఏకశిలానగరం'గా పిలిచేవారని ఈ స్థలపురాణాన్ని బట్టి తెలుస్తోంది. అంతేగాదు. అయోధ్య నుంచి ఇక్కడకు యాగరక్షణార్థం సీతా, లక్ష్మణ సహితంగా వచ్చి ఇక్కడ కొంతకాలం వసించటం వలన దీనిని 'ద్వితీయ అయోధ్య'గా కూడా ఇక్కడి భక్తులు భావిస్తారు. ఈ కారణంగా అయోధ్యనుంచి ఇక్కడకు నేరుగా ఒక రైలు ప్రవేశ పెట్టాలని ఒంటిమిట్ట దేవాలయ ప్రధాన అర్చకులు వీణ రాఘవాచారిగారు ప్రధానమంత్రికి ఎన్నో విజ్ఞప్తులు పంపి ఉన్నారు.

త్రేతాయుగానంతరం ద్వాపర యుగంలో జాంబవంతుడు ఈ విగ్రహాలకు ప్రాణప్రతిష్ట చేశారని కూడా వివరిస్తుంది ఈ స్థలపురాణం. కాబట్టి ఈ ఆలయంలో ఉన్న విగ్రహాలు జాంబవంతుడి ప్రతిష్ఠ అంటారు. రామలక్ష్మణులు ఈ ప్రాంతంలో ఉన్నప్పుడు సీతా దేవి కోరికపై ఆ ప్రాంత వన్యప్రాణులకు చాలినంత నీటి వసతి కలిపించడం కోసం

రామలక్ష్మణులు తమ బాణాలతో జలాశయాలను ఏర్పరచారని, వాటిని 'రామతీర్థం' అని, 'లక్ష్మణ తీర్థం' అని వ్యవహరిస్తున్నారు. ఆ చుట్టు పక్కల ప్రాంతాలలో నేటికీ నీటి ఎద్దడి ఉన్నా, ఈ తీర్థాలలో నీరు పుష్కలంగా ఉంటుంది. అంతేగాదు. మారిన కాలానికి అనుగుణంగా ప్రస్తుతం ఒంటిమిట్టకు రెండువైపుల నుంచి పెన్నా నది పాయలు కాలువల్ల ప్రవహిస్తున్నాయి. అందువల్లే గామోసు , ఇక్కడ పచ్చదనానికి ఏ కొరతా లేదు.

జానపదుల కథ

భద్రాద్రికి ఆ పేరు 'భద్రుడు' (ఆయన అక్కడ చేసిన తపస్సు ఫలంగా రాములవారు ప్రత్యక్షమవటం వలన వచ్చిందని స్థలపురాణం)అనే రామ భక్తుడి పేరుపై ఏర్పడిందని ప్రతీతి. అలాగే ఇక్కడకూడా 'ఒంటిమిట్ట' రామాలయం అనిపేరు రావడానికి ఒక జానపద గాథ బహుళ ప్రాచుర్యంలో ఉంది. ఒంటడు, మిట్టడు అనే ఇద్దరు అడవి దొంగలు తాము చుట్టూ పక్కల చేసే దొంగ సొమ్మును ఈ ప్రాంతంకొండల్లోని గుహల్లో దాచుకొనేవారు . ఒకసారి రామచంద్రమూర్తి వీరికి కనిపించి సద్బుద్ధితో మెలగమని హితోపదేశం చేయటంతో వీరిరువురు చోర వృత్తిని విడిచిపెట్టి, అక్కడున్న బంజరు భూమి ని సాగుచేసుకొని ఆ వచ్చిన పంటమీద జీవనం సాగించేవారు. వారు రామసాక్షాత్కారానంతరం సీతా సహిత రామలక్ష్మణ స్వాముల విగ్రహాలను ప్రతిష్టించి, ఒక చిన్న దేవాలయంను నిర్మించి, నిత్య పూజలను జరిపేవారు. అలా దాదాపు వేయి సంవత్సరాల క్రితం ఒంటడు, మిట్టడు నిర్మించిన ఈ దేవాలయం తర్వాతి కాలంలో వారిపేరునే 'ఒంటిమిట్ట' రామాలయంగా ప్రసిద్ధి పొందింది.

ఒంటిమిట్ట రామాలయ మహా భక్తులు

భద్రాచలం విషయంలో మనకు ప్రధానంగా స్ఫురణకు వచ్చే మహాభక్తుడు కంచెర్ల గోపన్న నామధేయం కల 'భక్త రామదాసు'. వారిముందు కానీ, వారి తరువాత కానీ ఆ స్థాయి భక్తుల పేర్లు మనం విని ఉండలేదు. కానీ ఒంటిమిట్ట విషయం అటువంటిది కాదు. ఒంటడు, మిట్టడుతో ప్రారంభించి అనేక మంది ఈ రాముల వారి కరుణాకటాక్షాలను రుచి చూసారు. మహాభక్తులుగా మారి ముక్తి పొందారు. వారిలో మహాకవులు అయ్యలరాజు తిప్పరాజు, అయ్యలరాజు రామభద్రుడు, బమ్మెర పోతనామాత్యులు, తాళ్ళపాక అన్నమాచార్యులు, పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి, ఉప్పుగుండూరు వెంకట కవి, వర కవి,వావిలికొలను సుబ్బారావు వంటి పండిత శ్రేష్టులున్నారు. ఇక అన్యమతస్తులు, ఇతరులు కూడా మహాభక్తులు అయి తరించారు.

వీరిలో మహాకవి అయ్యలరాజు తిప్పరాజు విజయనగర రాజైన ప్రౌఢ దేవరాయలు ఆస్థానంలో ఉండేవాడు. ఈ మహాకవి 'రఘు వీరశతకం'రాశారు. ఈయన కుమారుడు అయ్యలరాజు రామభద్రుడు. ఈయన విషయంలో ఒంటిమిట్ట రామాలయంలో ఒక లీల జరిగింది. వీరి బాల్యంలో వీరితల్లిదండ్రులు ఒంటిమిట్ట రాముల వారి బ్రహ్మోత్సవాలకు వచ్చి స్వామిని దర్శించి వెళ్లేప్పుడు, పసివాడైన అయ్యలరాజు రామభద్రుడు ఆడుకొంటూ గర్భాలయంలోకి వెళ్ళాడు. అది గమనించని పూజారులు ఉత్సవసమయం పూర్తవగానే దేవాలయం తలుపులు మూసి వెళ్లిపోయారు. ఆకలేసిన బాలుడు ఏడుపు లంఘించుకొనగా కరుణా మూర్తి అయిన సీతమ్మ తల్లి ఆ బాలుడికి పాలనిచ్చి నిద్రపుచ్చింది. అందుకు గుర్తుగా గర్భ గుడి యావత్తు

పాలాచారాలతో తడిసి, ఎండిపోయి కనిపించింది మరుసటి రోజున పూజారులు తలుపులు తెరిచేసరికి. బాలుడు ఆడుకొంటూ కనిపించటంతో ఆశ్చర్య పోయారు సీతమ్మ తల్లి కరుణకు. ఈ బాలుడే తరువాత మహాకవి అయి 'రామాభ్యుదయం అనే కావ్యం రచించాడు. తాళ్ళపాక అన్నమయ్య ఒంటిమిట్ట కు 30 కి మీ దూరంలో ఉంటారు. కావునా ఆయన తరుచూ ఇక్కడికి వచ్చి రాములవారిపై కీర్తనలు ఆలపించేవారు. పోతులూరి బ్రహ్మేంద్ర స్వామి వారి బ్రహ్మంగారి మఠం ఇక్కడకు 80 కి మీ దూరం మాత్రమే. ఆయన సిద్ధి పొందేవరకూ తరుచూ ఇక్కడికి వచ్చి రాములవారిని సేవించి వెళ్లేవారు.

ఒంటిమిట్ట దేవాలయాన్ని పోషించిన రాజులలో మట్లి రాజుల పాత్ర అధికంగా ఉండేది. ఉప్పుగుండూరు వేంకటకవి ఈ రాజా స్థానంలో ఉండి 'దశరధరామ' మకుటంతో శతకం రచించారు. వరకవి పూర్తిపేరు తెలియదు. ఇది ఆయన బిరుదు. వీరుకూడా మట్లి రాజుల ఆస్థానంలో ఉండేవారు. ఈయనకూడా ఒంటిమిట్ట కోదండ రాముని మీద శతకం రాశాడు. ఈ శతకముందు నాటి రాజకీయ పరిస్థితులను, ఆనాటి అల్లకల్లోలాలను ప్రస్తావించారు. బమ్మెర పోతనామాత్యునికి , ఒంటిమిట్ట రాములవారి మధ్య నున్న సంబంధం వివాదాస్పదమైంది. తొలుత ఈ వివాదంలో ఉత్తరాంధ్ర పండితులు, రాయలసీమ పండితులు వాదించుకొనేవారు. తెలంగాణా రాష్ట్రం ఏర్పడ్డాక ఈ వివాదం తెలంగాణా కు చెందిన కొందరు తమ భుజం మీదకు వేసుకొన్నారు. ఆ వివాదాల నిక్కడ ప్రస్తావించటం సముచితం కాదు. అయినా పోతన గారి పేరున ఇక్కడ రాములవారికి అర్చనలు జరుగుతాయి. ఆయన విగ్రహం ఉంది దేవాలయ ప్రాంగణంలో. ఇక్కడ వారు వ్యవసాయం చేసిన మడులు

ఉన్నాయి. చివరగా వావిలికొలను సుబ్బారావు గారు ఒంటిమిట్ట రాములవారికి వీర భక్తుడు. వీరు ఆ స్వామి వారి ఆజ్ఞ మేరకు వాల్మీకి రామాయణాన్ని యథాతథంగా తెలుగులోకి అనువదించిన మహాకవి. సంస్కృతాంధ్రాలలో దిట్ట. ఒంటిమిట్ట రామాలయ జీర్ణోద్ధరణకు స్వయంగా బిచ్చం ఎత్తి ఆడబ్బును దేవాలయానికి సమర్పించడమేకాదు. తన యావద్ ఆస్తిని దేవాలయానికి ఇచ్చి కాలం చేసిన మహనీయుడు. వీరు రామభక్తితో టెంకాయ శతకం రాశారు.

ఇలా ఒంటిమిట్ట రాములవారి రామాలయం అత్యంత సుందరమైన పరిసరాలలో నిర్మితమైన అద్భుత సౌందర్య దేవాలయమే గాక , ఎందరో మహనీయులను తన అక్కున చేర్చుకొని వారి ఘనతను, రాముల వారి అనుగ్రహ శక్తిని లోకానికి చాటిన ఏకైక దేవాలయం . ఇక్కడ రాముల వారికి కళ్యాణం భద్రాచలంలో లాగ నవమినాడు కాక, పౌర్ణమి నాడు నిర్వహించటం మరో విశేషం.

(భక్తిమాసపత్రిక, ఏప్రిల్ 2024)

7

భక్తికి మరో రూపం కంచెర్ల గోపన్న!

శ్రీ రఘురామ, చారు తులసీ దళధామ, శమక్షమాది శృంగార గుణాభిరామబీ త్రిజగన్నుత శౌర్య రమాలలామ దుర్వార కబంధరాక్షస విరామబీ జగజ్జనకల్మషార్ణవోత్తారకనామ భద్రగిరి దాశరథీ కరుణా పయోనిధీ.

భారతదేశం మహాభక్తుల నిలయం. ముఖ్యంగా మహారాష్ట్ర, బెంగాల్ రాష్ట్రాలు మహాభక్తులకు, యోగులకు నిలయమై విలసిల్లాయి. అంతే ధీటుగా నాదస్వర బ్రహ్మలైన మహాభక్తులకూ ఆంధ్రదేశం నిలిచింద నడంలో సందేహం లేదు. ఎందుకంటే భక్తికి కీలకమైన 'భజన' మార్గం సంగీతమే ఆలంబనగా మనగలుగుతుంది. అంతే గాదు, ఇక్కడ 'భక్తి' అనేది ఆషా మాషి 'పదం' కాదు. ఇక్కడ 'భక్తి' ఉపనిషద్ ప్రమాణమై, నారద భక్తిసూత్రాలకూ, గీతలో భక్తియోగానికీ 'ఆచరణ, అనుష్టాన' రూపంలో ఉంటుంది. ఇక అటువంటి భక్తికి ఆలంబనైనా సంగీతం

కూడా వేదస్వర ప్రమాణమై ఉంటుందంటే ఎంతమాత్రం సందేహించ వలసిన పని లేదు. అటువంటి సంగీతానికే జీవంపోసిన మహనీయుల్లో రెండవ మహాకవి, మహాభక్తుడు కంచెర్ల గోపన్న. ఈయనే తరువాత కాలంలో 'భక్త రామదాసు' గా జగత్ ప్రసిద్ధి గాంచాడు.

రామదాసుకు ముందుతరం వాడు 'అన్నమయ్య'. ఈయన శ్రీ వేంకటేశ్వరునిపై రాసిన కీర్తనల గురించి ఎంత రాసినా, చెప్పినా తృప్తి కలగదు. అన్నయ్యలా గానే కంచెర్ల గోపన్న కవిత్వ పటుత్వం ఉన్నవాడు. అందుకు తగ్గట్టు కొన్ని వేల కీర్తనలు రాముల వారిపై పాడేవారు . వీరి గానం ఆశువుగా ఉండేది . తరువాతి కాలంలో రామదాసు అనుచరులు వాటిని అక్షర బద్ధం చేశారు. వాగ్గేయకారులెవ్వరూ ముందుగా రాసి, తరువాత దానిని గానం చేయరు. ఆశువుగా అప్రయత్నంగానే వారి నుంచి వెలువడే పదాలే రాగ బద్ధమై గానం లాగా ప్రవహిస్తుంది. అందువల్ల గోపన్న అన్నయ్య లానే వాగ్గేయకారుడు. అయితే అన్నయ్య , త్యాగరాజు కు భిన్నంగా ఈయన 'దాశరథీ కరుణా పయోనిధీ'అనే పాదాంతంతో 'దాశరథీ శతకం' కూడా రాశారు. పై పద్యం అందులోనిదే .

జననం, స్వస్థలం

కంచెర్ల గోపన్న (1620-1680) మధ్య కాలంలో 60 ఏళ్ళు జీవించిన మహా భక్తుడు . వీరి స్వగ్రామం నేలకొండపల్లె . ప్రస్తుతం ఖమ్మం జిల్లాలో (తెలంగాణా రాష్ట్రంలో) ఉంది. వీరి తండ్రిగారి పేరు లింగన్న మంత్రి, తల్లి పేరు కాదంబ. ఈమె గోల్కొండ మహారాజైన అబుల్ హాసన్ తానాషా వద్ద మంత్రిగా పనిచేసే మాదన్న సోదరి. తానాషాకున్న బ్రాహ్మణ మంత్రుల్లో అక్కన్నా , మాదన్నలు ప్రముఖులు.

గోపన్న చిన్ననాటినుంచే తండ్రి నుంచి రామభక్తిని గ్రహించాడు. అప్పట్లో గ్రామంలో అందుబాటులో ఉన్న పండితుల వద్దనుంచి భాషా, సాహిత్యంలో ప్రావీణ్యం సంపాదించాడు. మధురమైన కంఠ స్వరం గోపన్నకు దైవదత్తమైన వరం. ఈ కారణంగా అన్నయ్య, పురందరదాసు పరంపరలో అప్పుడే పురుడు పోసుకొంటున్న సంగీతం ఆలంబనగా తన రామభక్తిని కీర్తనల రూపంలో గానం చేసేవాడు. ఈ కాలంలోనే రఘునాథ భట్టాచార్య అనే యోగి గోపన్నకు గురువయ్యాడు. ఆ తరువాత గోపన్నలోని రామ భక్తి పరాకాష్టకిచేరింది.

ఉద్యోగం

గోపన్నకు యుక్తవయస్సు రాగానే అతనికి ఏదైనా ఉద్యోగం ఉంటె బాగుంటుందని వారి తల్లి దండ్రులు భావించారు. ఈ విషయమై గోపన్న తల్లి తానాషా ప్రభువు వద్ద మంత్రిగా పనిచేస్తున్న తన సోదరుడు మాదన్నను ఆశ్రయించింది. అడిగినదే తడవుగా తన మేనల్లుడికి ఏదైనా ఉపాధి కలిపించమని తానాషా ప్రభువుకు విన్నవించుకున్నాడు మాదన్న . ఆ సమయంలో భద్రాచలం తెహసిల్ కు తాసిల్దార్ లేరు. ఈ కారణంగా గోపన్నను భద్రాచలం తాసిల్దార్ గా నియమించాడు తానాషా. గోపన్న చదివిన చదువు తక్కువైనా లెక్కల్లో గట్టి వాడు. అంతేగాక మాంచి జ్ఞ్యాపక శక్తి కలవాడు కుడా. ఈ కారణంగా అనతి కాలంలోనే గోపన్న మంచి నిజాయితీ పరుడుగా, సమర్థుడుగా పేరు సంపాదించాడు. తానాషాతో సహా గోపన్న బంధువులంతా గోపన్న సమర్ధతను ఎంతగానో ప్రశంసించారు.

భద్రాచలం – రామాలయ నిర్మాణం

భద్రాచలం నేలకొండ పల్లికి సుమారు 100 కి మీ పైనే దూరంలో ఉండేది. పైగా అది పూర్తిగా అడవి ప్రాంతం. దీనిని ఆనుకొని పవిత్ర గోదావరీ నది ప్రవహిస్తుంటుంది అక్కడ ఒక పాకలో రాముల వారి స్వయంభూ విగ్రహాలు ఉండేవి. అక్కడి ఆటవిక ప్రజలు ఈ రామ లక్ష్మణుల విగ్రహాలను పూజించుకొనేవారు. అయితే గోపన్న భద్రాచలం తహాసీల్దారు అయిన తరువాత తన రామ భక్తితో, రాముడు అనుగ్రహించిన భక్తి, జ్ఞాన, సంగీతాలతో అక్కడ ఆ స్వయంభూ మూర్తులకు దేవాలయం కట్టించాలని సంకల్పిస్తాడు. ఆ రోజుల్లో కూడా గోపన్న రాములవారిని కీర్తిస్తూ భజనలు చేసే వారు, కీర్తనలు పాడేవారు. వారి రామభక్తికి అక్కడి ప్రజలు ఎంతో సంతోషించేవారు తమ తాసిల్దార్ గొప్ప రామ భక్తుడు అయినందుకు . ఈ కాలంలోనే గోపన్నకు రాములవారికి ఒక పవిత్ర దేవాలయం నిర్మిస్తే బాగుంటుందన్న ఆలోచన కలిగింది.

భద్రాచలం వైశిష్ట్యం –భద్రగిరి–మేరు మహర్షి–పోకం ధర్మక్క

ఈ భద్రాచలం పేరు వెనుక ఒక స్థలపురాణం ఉంది. త్రేతా యుగంలో రాములవారు సీతా సమేతంగా సోదరుడు లక్ష్మణునితో తన వనవాస దీక్షను ఇక్కడ గడిపారని ప్రతీతి. ఇక్కడే పర్ణశాలలో వసిస్తున్న సీతమ్మ తల్లి రావణుని జిత్తులకు బలై అపహరణ పాలైంది. ఇక్కడికి కొద్దీ దూరం లోనే రావణునితో యుద్ధం చేసి రెక్కలు విరిగిపడిన జటాయు రాములవారికి కనిపించటం జరిగింది . ఆ కాలంలో రాముల వారి పాద స్పర్శ కారణంగా వారి పాదమునకు ఆలంబనగా నిలచిన రాయి మనిషిగా మారింది. ఆయనే భద్రుడు అయ్యాడు. ఈ భద్రుడు మేరు పర్వత పుత్రుడు. శాపవశాన రాయిగా మారిన భద్రుడు రామపాద స్పర్శతో

మనిషిగా తిరిగి రూపం పొందినందున అక్కడే రామ నామం చేస్తూ ఆకొండ పైనే తపస్సు చేస్తాడు . అందుకు మెచ్చి రాముల వారు భద్రుడిని తనకేమి వరం కావాలో కోరుకొమ్మని అనుజ్ఞ ఇస్తాడు. అందుకు భద్రుడు ఇక్కడే ఈ కొండపైనే శాశ్వతంగా సీతా సమేతంగా ఉండి తనకెప్పుడూ దర్శన కొరతలేకుండా అనుగ్రహించమని కోరతాడు. అందుకు రాములవారు తను మానవ శరీరం ధరించటం వెనుక లోక కళ్యాణం , రాక్షస వధ వంటి కార్యాక్రమం ఉన్నందున తాను అవతారం చాలించే ముందు భద్రుడి కోరికమేరకు అక్కడికొచ్చి అక్కడే భద్రుడు కోరినట్టు స్వయంభూ గా వెలుస్తానని తెలుపు తాడు. అప్పటినుంచి భద్రుడు రామనామ స్మరణతో అక్కడే తపస్సు కొనసాగిస్తాడు. ఈ లోగా రావణ సంహారం, రాముడు పట్టాభిషిక్తుడై రాజ్యం పాలించటం వంటివి జరిగిపోతాయి. కడకు భద్రుడి కోరిక తీర్చకుండానే రాముడు తన అవతారం చాలిస్తాడు.

ఆవిషయం తెలిసి భద్రుడు కడు దుఃఖంతో శ్రీ మహావిష్ణువుకై ఘోర తపస్సు చేస్తాడు. ఆ తపస్సుకు విభ్రమ చెందిన వాడై రాములవారు భద్రుడికి దర్శనం ఇచ్చి, ఆయన కోరినట్టే అక్కడ స్వయంభూగా నాలుగు హస్తాలతో, వాటి అలంకారాలతో, సీతమ్మవారు వారి ఎడమ తొడ పై కూర్చొని ఉన్న భంగిమలో వెలుస్తాడు. పక్కనే సోదరుడు లక్ష్మణుడు కూడా ఉండటానికి అనుగ్రహిస్తాడు రాములవారు. అలావెలసిన రామచంద్రమూర్తి విగ్రహాలను పుజుస్తూ భద్రుడు కొంతకాలానికి దేహం చాలించి వైకుంఠం చేరతాడు. నాటినుంచి ఆ విగ్రహాలు ఎటువంటి ఆదరణకు నోచుకోక ఎండకు ఏండి, వానకు తడిసి ఎటువంటి పూజాదికములు లేకుండా పడి ఉండేవి. యుగం గడిచిపోయింది.

కలియుగం వచ్చేసింది. రాముడి కాలంలోని మహాభక్తురాలైన శబరి వంశస్తురాలైన పాకం దమ్మక్కకు ఒకనాడు కల్లో కనిపించిన రామచంద్రమూర్తి తనవిగ్రహాలకు పట్టిన దుస్థితి వివరించి అక్కడో దేవాలయం నిరించామని ఆదేశిస్తాడు. ఆ కల ఆధారంగా పాకం దమ్మక్క ఆ అటవీ ప్రాంతం అంతా గాలించి భద్రుడు నిర్మించిన శిధిలమైన ఆ దేవతా విగ్రహాలను కనుక్కొని వాటికి నిత్య పూజా కార్య క్రమాలు నిర్వహిస్తూంటూంది. ఇప్పుడు అక్కడ ఒక భవ్యమైన దేవాలయ నిర్మాణం జరగాలని కంచెర్ల గోపన్న ఆశయం.

రామాలయ నిర్మాణం –నిధుల వివాదం – గోల్కొండలో కారాగార శిక్ష

గోపన్న భద్రాచలంలో నిర్మిచిన రామాలయం అనుకోనివిధంగా వివాదాల్లో చిక్కింది. ఎంతో నిజాయితీకల వ్యక్తిగా పేరుగాంచినకంచెర్ల గోపన్న ప్రభుత్వ నిధులు రామాలయ నిర్మాణానికి వాడాడన్న ఆరోపణ సందేహాస్పదమైనది. అందునా ఒక ముసల్మాన్ చక్రవర్తి పాలనలో తాసిల్దార్ గా పనిచేస్తూ ఇంతటి సాహసానికి గోపన్న ఒడిగట్టాడంటే ఎలా నమ్మటం? బుద్ధిజీవుల ఆలోచనకు అంతు బట్టదు. కానీ, ఆయనపై తానాషా మహారాజుకు అందిన అభియోగం ఏమిటంటే ప్రజల నుంచి వసూలు చేసిన శిస్తును నేరుగా రాజుగారి ఖజానాకు పంపకుండా దేవాలయ నిర్మాణానికి మళ్లించారని. నిజానికి ఇది కుట్రకుడా కావచ్చు. ఆలా ప్రజల నిధులతో రాములవారి దేవాలయం నిర్మిస్తే రాములవారు ఆ అవినీతి చర్యను ఆమోదిస్తాడని కల్లో కూడా గోపన్న తలచి ఉండడు. అయినా తగిన సాక్ష్యాధారాలు, నిష్పక్షపాత విచారణలు జరిపితే విషయం మరోలా ఉండేదేమో ! ఒక ముసల్మాన్ చక్రవర్తికి ఇటువంటి ఆరోపణ చేరినప్పుడు ఆ చక్రవర్తి ఎంత తీవ్రంగా స్పందిస్తారో అంతే తీవ్రంగా

స్పందించాడు తానాషా. తక్షణమే గోపన్నను పదవినుంచి తొలగించి బందీ చేసి గోల్కొండలోని తన కోట కారాగారంలో వేశాడు. ఏడు వత్సరాల కఠిన జైలు శిక్ష విధించాడు. అలా పురుగులు,రాళ్లు కలిపిన అన్నం, నిత్యం కొరడా దెబ్బలు తింటూ, తనని రక్షించమని రాములవారినీ, సీతమ్మను వేడుకొంటూ, కొండకచో రాములవారినీ సీతమ్మనూ తిడుతూ, ఎన్నో కీర్తనలు ఆలపించారు గోపన్న. రాముల వారిపై ఈ కాలంలో ఆలపించిన కీర్తనలే బహుప్రసిద్ధమైనాయి.

గోపన్న రామదాసుగా ప్రసిద్ధి పొందటం – రామదాసు కీర్తనలు – భక్తియోగ ప్రమాణం

కంచెర్ల గోపన్న భద్రాచలం రామాలయం నిర్మించినందుకు 'రామదాసు' కాలేదు. ఎందుకంటే అది వివాదాస్పద మైంది కనుక. ఆయన కారాగారంలో భయంకర శిక్షననుభవిస్తూ కూడా 'రామ'సంకీర్తనలు విడువక, రామునిపై విశ్వాసం వదలక చేసిన 'రామకీర్తన' వలననే ఆయన భక్తి పరాకాష్టకు చేరి, ఫలించి ఆయనకు 'భక్త రామదాసు' బిరుదును కొనిపెట్టింది. 'పలుకే బంగారామాయనా కోదండరామా ', నను బ్రోవమని చెప్పవే సీతమ్మతల్లి ', 'ఏతీరుగనను దయ చూచేతవో ఇంవంశోత్తమ రామా', 'పాహి రామప్రభో, పాహి రామప్రభో ,'రామచంద్రులు నాపై', 'ఇక్ష్వాకు కుల తిలకా ఇకనైనా బ్రోవరా', 'తక్కువేమి మనకూ , రాముడు ఒక్కడుండువరకూ,' వంటి భక్తి రస ప్రధానమైన కీర్తనలు ఆయన కారాగారంనుంచీ ఆలపించినవే. ఈ భక్తి ఆషామాషీ భక్తి కాదు. ఇందులో నారద భక్తి సూత్రాలకు ప్రామాణికంగా నిలిచే సఖ్య, దాస్య, విరహ, ద్వేష, వంటి నవ విధ భక్తులు ఇమిడ్చాడు. రాములవారు,సీతమ్మలు ఎదురుగా ఉంటే వారి తోటే జీవితం నెరుపుతున్న

మానసిక చిత్రంతో ఈ కీర్తనలు ఆలపించారు. అలా ధ్యానం, ధ్యాత, ధ్యేయం ఒకటైన తాదాత్మ్య స్థితి అది. గీతలో కృష్ణుడు భక్తియోగంలో చెప్పిన 'మయ్యేవ మన ఆధత్స్వ మయి బుద్ధిం నివేశయ ? నివసిష్యసి మయ్యేవ అత ఊర్ధ్వం న సంశయః' ('మీ మనస్సును నాపై స్థిరపరచండి మరియు మీ తెలివిని నాపై కేంద్రీకరించండి, మీరు ఇక నుండి నాలో ఒంటరిగా జీవిస్తారు, సందేహం లేదు. (భగవద్గీత 12: 8).

ఇలా రామదాసు పన్నెండు సంవత్సరాలు విలపించిన తరువాత రాములవారి అనుగ్రహించాలని సంకల్పం కలిగింది. రామలక్ష్మణ సమేతంగా విల్లంబులు ధరించి, తానాషాకు కనిపించి దేవాలయ నిర్మాణానికి ఎంత ప్రభుత్వ ధనం వాడాడని గోపన్నపై అభియోగం మోపారో అంత ధనం విలువ చేసే బంగారు నాణాలను ఆయన శయన మందిరంలో కుమ్మరించి తమ పరిచయం చేసుకొని నిష్క్రమించారు. ముందు ఇది కలా, నిజమా తెలియని అయోమయ స్థితిలో పడ్డ తానాషా కొంతసేపటికి తేరుకొని నాణాలను పరికించి,లెక్కించి అవి సరిగ్గా ఉన్నాయని గ్రహించి, నేరుగా గోపన్న బందీగా ఉన్న కారాగారానికి వెళ్లి రామదాసును తక్షణమే విడిపించాడు. తన సభకు తెచ్చి, అందరికీ కను విప్పు కలిగేలా నిండు సభలో జరిగిన దంతా వివరించి, గోపన్నను'మహాభక్త రామదాసు'గా శ్లాఘించాడు . రామదాసును సత్కరించి రామలక్ష్మణులు ఇచ్చిన నాణాలను రామదాసుకే ఇచ్చి తనపేరున ప్రతిసంవత్సరం రాముల వారి కళ్యాణం జరుపమని ఆదేశించాడు. అలా రామదాసు రామభక్తికి పరాకాష్ట శ్రీ రామ లక్ష్మణ దర్శనం , జైలునుంచి విముక్తి పొందటం ,విజయుడై తిరిగి భద్రాచలం రావటం. 'ధీరుడౌ రామదాసుని బంధము దీర్చినదని విన్ననురారామా?అంటూ 'ఇదిగో

భద్రాద్రి గౌతమి అదిగో చుడండి' అంటూ చిడతలు వేస్తూ నృత్యం చేసాడు రామదాసు.

లోపలినుంచి బయటికి వచ్చిన కళ్యాణ మంటపంలో నిత్య కళ్యాణాలు

ఏ కుల జాతి మతస్తులైనా రాములవారి కళ్యాణం వీక్షించేలా అప్పటివరకూ దేవాలయం లోపలే జరిగే కల్యాణాన్ని బయటకు మార్చారు రామదాసుగారు. నాటినుంచీ క్రమం తప్పకుండా తానాషా వారు ఇచ్చిన 'రామటెంకె' నాణాలను, మహారాజా వారు ఇచ్చిన ముత్యాలను రామ కళ్యాణానికి వాడారు రామదాసుగారు. ఆ సంప్రదాయం నేటికీ కొనసాగుతుంది. అంతే గాక రామదాసు వారు ఏరి కోరి ముచ్చటపడి చేయించిన ఆభరణాలు సైతం తానాషా దేవాలయానికే ఇవ్వటం వలన వాటిని కళ్యాణం అప్పుడు మూలవరులకు అలంకారం చేయటం నిత్యకృత్యం అక్కడ. ఈ ఆభరణాలన్నీ అక్కడ దేవాలయ ప్రాంగణంలోనే మ్యూసియంలో ఉన్నాయి. అలాగే రామ,లక్ష్మణ బొమ్మలు ఒక వైపు , హనుమంతుడి బొమ్మ మరోవైపు ఉన్న 'రామటెంకె' బంగారు మోహరిలు కూడా అక్కడే ఉన్నాయి.

భారత దేశంలో రాములవారికి కల్యాణాలు చేసేది ఆంధ్ర రాష్ట్రంలోనే . భద్రాద్రి రాములవారికీ , విజయనగరంలోని రామతీర్ధంలోని రాములవారికీ, కడప ఒంటిమిట్ట రాములవారికీ కల్యాణాలు జరుగుతాయి. రాష్ట్ర విభజన తరువాత 'ఒంటిమిట్ట'రామాలయం ఆంధ్రులకు ప్రధాన దేవాలయం అయింది . ఇక్కడ ప్రభుత్వ లాంఛనాలతో రాములవారి కళ్యాణం జరుపుతారు ప్రతి ఏటా. ఇది గాక తెలుగు రాష్ట్రాలలో ఉన్న వేలాది రామాలయాలలో నిత్యం, శ్రీ రామనవమి నాడు కళ్యాణాలు జరుగుతాయి.

ఏటా బ్రహ్మోత్సవాలు!

ఇక్కడ ఏటా జరిగే బ్రహ్మోత్సవాలు చూడడానికి రెండు కళ్ళు చాలవు. 'బ్రహ్మోత్సవం ఇది బ్రహ్మోత్సవం, బ్రహ్మాండ నాయకుని బ్రహ్మోత్సవం' అంటూ బ్రహ్మోత్సవ గానం మారుమోగుతుండగా, ఉత్సవమూర్తుల రూపంలో రామ లక్ష్మణ సీతమ్మలను అనేక రూపాలలో అలంకరించి ఊరేగిస్తారు. వరాహావతారం, మత్స్యావతారం, కూర్మావతారం,నరసింహావతారం, బలరామావతారం ఇలా అనేక అవతారాల అలంకరణతో నిత్యం స్వామి దశావతారాలను దర్శించే భాగ్యం మనకు కలిగించిన రామదాసు ఎంతటి ధన్యుడవుకదా !

(భక్తిమాసపత్రిక, ఫిబ్రవరి 2024)

8

యోగులు : పునర్జన్మలు - యోగుల జీవిత ఉదంతాలు

భారతీయ జీవన విధానంలో 'జన్మ–పునర్జన్మ' ఒక గొప్ప చర్చనీయాంశం. దైవాన్ని విశ్వసించే వారంతా మళ్ళీ జన్మ ఉంటుందని విశ్వసిస్తారు. సాధారణంగా నాస్తికవాదులు, హేతు వాదులు పునర్జన్మను విశ్వసించరు. వారి దృష్టిలో 'జననం' అనేది ఒకేసారి ఉంటుంది. అలానే 'మరణం' కూడాను. అంటే హఠాత్తుగా జన్మానికి ముందూ , వెనుకా ఏ కార్యాకారణ సంబంధం లేకుండా 'జననం' జరుగుతుందని నాస్తికుల, హేతువాదుల భావన. వాస్తవానికి ఇతర మతాలలో (ఇస్లాం, క్రైస్తవం వంటి మతాలలో) నాస్తికత్వం, హేతువాదం పైన తత్వశాస్త్ర చర్చలు లేవు. పాశ్చాత్యదేశాలలో నాస్తిక చర్చ, హేతువాద చర్చ 'విజ్ఞ్యాన శాస్త్ర' ప్రేరితమైంది మాత్రమే. కానీ , హైందవంలో ఈ చర్చలు వేదాంతశాస్త్ర పరంగా, షట్ దర్శనాల పరంగా గట్టి పునాదులతోనే సాగుతాయి. వీటిలో ఖండన, మండనాలు చాలా తార్కికంగా, శాస్త్రీయంగా ఉంటాయి. అయితే

చివరగా ఆదిశంకరుడు ఈ నాస్తిక, హేతువాద తార్కికులను ఓడించి, చర్చలకు ఒక ముగింపు పలికినా, పాశ్చాత్త్య వైజ్ఞానిక ప్రగతివలన ఈ చర్చలు భారత దేశంలో తరుచూ వినవస్తూనే ఉంటాయి.

అన్నింటికీ మించి ఆధ్యాత్మికత, నైతికత కలగలుపు పుట్టుక గల 'జన్మ–పునర్జన్మ' విషయం భారత దేశానికి, ఇతర ప్రపంచ దేశాలకూ వేరు వేరుగా ఉండటంతో నాస్తికులు, హేతువాదులు 'జన్మ' అనేది ఒక ఘటనాని మాత్రమే నిర్ధారణ కొచ్చారు. అలాంటి వాదాలు వైజ్ఞానిక విస్తరణతో బాటు, విదేశాలు పర్యటించటం ఇప్పుడు సులువు అవటంతో భారతీయ, విదేశ వైజ్ఞానిక జీవన విశ్వాసాలు చెప్పే విషయాలను ఒక 'పోలిక' (కంపారిసన్) ద్వారా విశ్లేషించుకొనే అవకాశం కలిగింది. ఈ ఒరవడిలో కొట్టుకు పోతున్న నేటి భారతీయ జీవనానికి 'జన్మ –పునర్జన్మ' గురించి సోదాహరణంగా తెలపాలంటే యోగుల జీవితాలనుంచి కొన్ని ఘటనలు ఉదహరిస్తూ హృద్యంగా వివరిస్తే తప్ప భారతీయ 'ఆధ్యాత్మికత'లోని సత్యం ఆవిష్కారం కాదు. ఇందుకు స్వామి వివేకానంద, రమణ మహర్షి, సాయి బాబా వంటి యోగుల జీవితాలలోని ఘటనలు మనకెంతో సత్యాసత్య నిరూపణకు సహకరిస్తాయి.

అవి స్వామి వివేకానందుడు సన్యాసం స్వీకరించి పతంజలి 'రాజయోగం' ద్వారా ఆత్మ సాక్షాత్కారానికి తపస్సు చేస్తున్న రోజులు. స్వామి వివేకానందుడికి జన్మతః కలిగిన ఏకాగ్రత వలన ఆయన త్వరత్వరగా రాజయోగంలో చెప్పిన ఫలాలు పొందటం మొదలు పెట్టాడు. రాజయోగ సాధకులందరికి ఈ ఫలాలు తొలినాళ్లలో లభించేవే. సాధకుడు కోరకపోయినా స్వతస్సిద్ధంగా ప్రాప్తించే ఫలాలవి. అందులో ఒకటి అవతలి వారి పూర్వ జన్మ ఏమిటో స్పష్టంగా వారిని చూడగానే సులువుగా

దర్శనమిచ్చే దృశ్యం ఒకటి. అలానే అవతలి వారి మనసులో ఏమను కొంటున్నారో కూడా తెలుసుకోగల శక్తి వశమయ్యేసమయం అది. ఇలాంటి ఫలం సిద్ధించటంతో స్వామిజి తన తోటి శిష్యులకు వారి వారి పూర్వ జన్మలేమిటో వారి ముఖం మీదనే చెప్పేసే వాడు. అలా స్వామి తన సహచర శిష్యులు గత జన్మలో కొన్ని జంతువులై ఉన్నారని చెప్పటంతో వారు అవమానంతో బాధపడి శ్రీ రామకృష్ణ గురుదేవుల వద్ద తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఈ విషయం విని, శ్రీ రామకృష్ణ గురుదేవులు తన శిష్యుడు 'రాజయోగ' సాధనలో పురోగమిస్తున్నాడని గ్రహించి, వివేకానందుని వద్దకు వెళ్లి తనకందిన ఫిర్యాదుల గురించి ప్రస్తావించారు. అప్పుడు స్వామి తను వారిని బాధ పెట్టాలని అలా చేయలేదని, వారికి వారి గత జన్మ గురించి చెబితే, ఈ జన్మనైనా సవ్యంగా ఆధ్యాత్మిక సాధనలో, మోక్ష మార్గం వైపు మళ్లిస్తారని తెలియపరచానని పలికాడు. తానొకటి తలిస్తే వారు మరోరకంగా దానిని పరిగణిస్తారని అనుకోలేదని అత్యంత వినయపూర్వకంగా గురువుగారికి వివరించాడు.

వివేకానందుని పసిహృదయం, నిర్మల అంతరంగం తెలిసిన శ్రీ రామకృష్ణ గురుదేవులు వివేకానందునికి 'రాజయోగం' సాధన ద్వారా లభించిన అటువంటి శక్తులను ఆపై పనిచేయకుండా నిర్వీర్యం చేశారు. అంతేగాదు, తాను వాటిని నిషేధించటం వలన ఇక ముందు ఆ ఫలాలు ప్రకటితం కావని, ఈ కారణంగా స్వామి ఆత్మ సాక్షాత్కార సాధనకున్న కొద్దిపాటి అవరోధాలు తొలగిపోయాయని గురుదేవులు చెప్పటంతో వివేకానందుడు స్వాంతన పొందారు. పూర్తిగా తన సాధనపై మనస్సు కేంద్రీకరించి, అనతి కాలంలోనే కుండలిని జాగ్రత్తగా సహస్రారం చేర్చటం, ఆపై ఆయన శిరస్సు చుట్టూ ఒక తేజోవలయం ఏర్పడటంతో ఆయన శిష్యులు కంగారు పడి పరుగులు తీస్తూ శ్రీ రామకృష్ణ గురుదేవుల

వద్దకు చేరి ఆ విషయం వివరించారు. ఆ సరికే శ్రీ రామకృష్ణులు విషయం గ్రహించి స్వామి వివేకానందుడి వద్దకు స్వయంగా బయల్దేరటం జరిగింది. అంటే ఈ ఘటన ద్వారా జన్మ – పునర్జన్మ ఉండటమే కాదు, ఆ జన్మలేమిటో కూడా యోగులు తమ సాధన ప్రారంభంలోనే తెలుసుకోగలుగుతారు అన్నది స్పష్టం.

ఇలాంటి ఘటనలనే శ్రీ రమణ మహర్షి తన జీవితంలో మరో రకంగా వ్యక్తీకరించే వారు. అది ఎలాగంటే శ్రీ రమణులు మౌనంగా ఉండటానికి ఎక్కువ ఇష్టపడేవారు. కానీ, వారి వద్దకు వచ్చే వారికి 'ఆధ్యాత్మిక సాధన' విషయంలో, ఆత్మ సాక్షాత్కారం విషయంలో అనేక సందేహాలుండేవి. వారు శ్రీ రమణుల వద్దకు చేరి వాటిని శ్రీఘ్రంగా నివృత్తి చేసుకోవాలని తహతహలాడే వారు. వారు శ్రీ రమణునికి ఎన్నో ప్రశ్నలు సంధించేవారు. కానీ వేటికీ శ్రీ రమణులు సమాధానం ఇచ్చేవారు కాదు. శ్రీ రమణుల వద్ద చేరిన అనేక మంది ఔత్సాహిక సాధకులు రమణులు దేనికీ సమాధానం ఇవ్వకపోవటం నచ్చేది కాదు. కొందరు ఓపిక పట్టలేక ఆ మాట పైకి కూడా అనేవారు. ఆ విధంగా ఎంతోమంది ఎన్నో సార్లు అడిగి విసిగిపోగా ఒక సారి రమణులు నోరు విప్పారు. 'నేను సమాధానం చెప్పటం లేదని మీరు ఎందుకు అనుకొంటున్నారు? మీలాగా గొంతు విప్పి , నోటితో మాట్లాడితేనే మాట్లాడినట్టా ? ఎవరు ప్రశ్నలు ఎందుకడుగుతారో తెలుసుకోవద్దా? నిజమైన ఆసక్తి గల సాధకులకు నా చూపే సమాధానం ఇస్తున్నది. ఇతరులకు అలా జరగదు. అది మీరు గ్రహించ లేకున్నారు'. నిజానికి రమణుని ఈ సమాధానం విన్న సాధకులప్పుడు గ్రహించారు ఁతాము రమణ భగవానుని కలిసిన మొదటిసారినుంచీ తమలో తమకు తెలియకుండానే 'నేనెవరు?' అనే విచారం ప్రారంభమైనట్లు .

ఆ క్షణం వరకూ వారికి తెలియదు తమలో కలిగిన ఈ 'నే నెవరు?' చర్చకు కారణం రమణుని చూపు కొద్దీ క్షణాలు వారి కళ్ళలోకి చొచ్చుకు పోవటమేనని. శ్రీ రమణ భగవానుని కళ్ళలో ఒక రకమైన కాంతివుండేది. ఆయన తన వద్దకు వచ్చిన సాధకుల కళ్ళలోకి ఒక సారి అవలోకనంగా పరికించే వారు. చాలామందికి ఆ 'చూపు' అర్థమయ్యేది కాదు లేదా అది సాధారణంగా చూసే 'చూపే' అనుకొనే వారు. కానీ, రమణ భగవానుని అలా 'పరికించటం' వలన సాధకులకు ప్రతిబంధకంగా మారిన సంస్కారాలు , వాసనలు బలహీనమయి వారి సాధన సత్ఫలితం వైపు ముందుకు నడిచేదని. తరువాత ఏదో సందర్భంలో శ్రీ రమణులే స్వయంగా పలికే వారు %-%'జన్మ జన్మల సంస్కారాలు, వాసనలే ఆధ్యాత్మిక పురోగతికి ప్రతిబంధకంగా మారుతుంది' అని. ఇలా శ్రీ రమణ భగవానులు 'జన్మ-పునర్జన్మ' ఉన్నాయని, ఆయా జన్మల వాసనలు, సంస్కారాలు ఆధ్యాత్మిక ప్రగతికిపెద్ద ప్రతిబంధకం' అని తెలిపేవారు.

ఒక్కోసారి శ్రీ రమణులు తన వద్దకు వచ్చే భక్తుల పట్ల అవ్యాజానురాగాగాలు చూపేవారు. ఆశ్రమంలో అందరూ ఆ భక్తులపట్ల శ్రీ రమణ భగవానునికి ఆసక్తి ఏమిటన్నట్లు ఆశ్చర్యంగా చూసే వారు. శ్రీ రమణులకు వారి అంతరంగంలో జరుగుతున్న అలజడి తెలుస్తుండేది. ఒక సారి ఒక అహ్మదాబాదు భక్తుడు శ్రీ రమణాశ్రమానికి వచ్చాడు. కాసేపు రమణుని వద్ద కూర్చొని తిరుగు ప్రయాణానికి సిద్ధమయ్యాడు. రమణులు ఆతని కళ్ళల్లోకి ఒక క్షణం చూసి, వెళ్లి రమ్మని తలూపారు. అతను సామాను సర్దుకొని తిరిగి ప్రయాణంకు బయటకు రాగా కొందరు శ్రీ రమణుల శిష్యులు ఆ అహ్మదాబాద్ భక్తుని వివరాలు తెలుసుకో గోరారు.

అతను తనకు రమణ భగవానులు నిద్రలో కనిపించి రమణాశ్రమం దర్శించమని పదే పదే చెప్పటంతో తాను ఈ ఆశ్రమం వివరాలు కనుక్కొని ఇక్కడకు రావటం జరిగిందని చెప్పాడు. అంతేగాక తను, విపరీతమైన లావు ఉండటం వలన వివాహం కావడంలేదని, దాని వలన తన తల్లిదండ్రులు దుఃఖ పడటం చూడలేక తన లావు తగ్గించమని భగవంతుని ఎన్ని సార్లు వేడినా ఏ భగవంతుడూ పలుక లేదని , ఆ సమయంలో ఈ విధంగా నిద్రలో రమణులు కనిపించి ఇక్కడికి రమ్మని చెప్పటంతో ఇక్కడకు వచ్చానని తెలిపాడు. ఆ కథనం అక్కడితో ఆగిపోయింది. ఆ తరువాత సంవత్సరానికి తిరిగి ఆ భక్తుడు శ్రీ రమణాశ్రమానికి వచ్చాడు. ఈ సారి భక్తులెవ్వరూ అతనిని గుర్తించలేదు. అతను శ్రీ రమణుని వద్ద కాసేపు కూర్చుని తిరిగి పయనమవటానికి లేచాడు. శ్రీ రమణులు అనుమతిస్తూ తలూపారు. ఆ భక్తుడు బయటికి వస్తుంటే కొందరు అతని వివరాలు తెలుసుకోగోరారు. అప్పుడతను సంవత్సరం క్రితం తనకు నిద్రలో రమణ భగవానుడు కనిపించి రమ్మని ఆహ్వానించటం, అహ్మదాబాదు నుంచి తను రావటం , కొంత తడవ అక్కడ గడిపి వెళ్ళటం, దరిమిలా తను ఎటువంటి వైద్యం లేకుండానే సన్న బడటం గురించి చెప్పాడు. అందుకు కృతజ్ఞతలు తెలుపటానికే తానూ వచ్చానని చెప్పాడు.

అందరూ ఆశ్చర్య పోయి రమణుని సమీపించి 'ఇదెలా సాధ్యం?' అని అడిగే లోపలే, శ్రీ రమణులు నోరు విప్పి 'ఇతను గత జన్మలో నాకు పాఠశాల స్థాయిలో మంచి స్నేహితుడు. మళ్ళీ ఇన్నాళ్లకు ఇలా కలిశాం. అప్పట్లో ఇతను నాకెంతో సాయం చేసేవాడు, నన్నెంతో ప్రేమించే వాడు. దాని గుర్తుగా నేను అతనికి ఈ జన్మలో సాయం చేసాను' అని రమణులు

వివరించారు. అప్పటికే రమణుల అనుమతి ఉండటంతో ఆ అహ్మాదాబాదు వ్యక్తి అక్కడినుంచి నిష్క్రమించాడు. కాని, ప్రతి ఏటా స్వామి దేహం చాలించే వరకూ వస్తూనే ఉండే వాడీ అహ్మాదాబాదు భక్తుడు. ఇలా భగవానులకు కూడా జన్మ జన్మ బంధాలు ఉండేవి. ఈ ఘటన ద్వారా భగవద్గీత నాల్గవ అధ్యాయంలో అయిదవ శ్లోకం 'బహూని మే వ్యతితాని జన్మాని తవ చార్జునతాన్యహం వేద సర్వాణి న త్వం వేత్థా పరంతప' అన్న పద్యంలో జన్మ-పునర్జన్మలు ఎంత సత్యమో వ్యక్తమవుతోంది. ఈ విషయాలను 'ది రెమినిసెన్సెస్ ఆఫ్ భగవాన్ శ్రీరమణమహర్షి' అనే పుస్తకంలో అచ్చువేశారు రమణాశ్రమం వారు. శ్రీరమణులకు అరుణాచలం కొండపై వసించే జంతువులకూ ఉన్న జన్మ జన్మల బంధం గురించి శ్రీ బి వి నరసింహస్వామి గారు రాసిన 'సెల్ఫ్-రియలైజషన్ : భగవాన్ శ్రీ రమణ టీచింగ్స్' అనే పుస్తకంలో విపులంగా రాశారు.

ఇక షిర్డీ సాయిబాబా గురించి రాసిన 'సాయి సచ్చరిత' (పారాయణ గ్రంథం)లో సాయి బాబాకు జన్మజన్మల సాన్నిత్యం ఉన్న వారిని గురించి కూడా కొన్ని అనుభవాలున్నాయి. రెండు మేకల కథ, బసవప్ప, చెన్నప్పల కథలు, కొన్ని ఇట్టే గుర్తుకు వచ్చే కథలు. ఇవిగాక ఎంతోమంది భక్తుల పూర్వికులు గతంలో దత్తాత్రేయుడిని, అక్కల్ కోట మహారాజును, నరసింహ సరస్వతి స్వామి వారిని, పండరీపూర్ పాండురంగని పూజించే వారు. కానీ, కాల క్రమంలో వారి పూజలను ఆపేశారు వారి వారసులు. అయితే వారి జీవితాల్లో క్లిష్ట సమయం రాగా వారికి షిర్డీ రాక తప్పలేదు బాబా దర్శనానికి. వారిని చూస్తూనే సాయిబాబా వారి పూర్వీకుల సేవలను గుర్తు చేసుకొని, ప్రస్తుతం నిర్లక్ష్యం కారణంగా తిరిగి కష్టాలను కొని తెచ్చుకొన్నట్టు వివరించే వారు. సాయిబాబా , శ్రీ రమణులు ఒకే కాలంలో

ఉన్నారు. వీరివురి ప్రవర్తన గమనిస్తే ఇద్దరి దేహాలు వేరు వేరు ప్రదేశాలలో ఉన్నా వారి మధ్య కార్యా కారణ సంబంధం ఎదో ఉన్నట్టు స్పష్టమవుతుంది. శ్రీ రమణులు తన దర్శనానికి వచ్చిన వారిని షిర్డీ బాబాను దర్శించి , ఆయనను గురువుగా స్వీకరించమని పంపించివేసిన సంఘటనలు కోకొల్లలు. ఆర్థర్ ఒస్బోర్న్, బి వి నరసింహస్వామి షిర్డీ బాబా జీవిత చరిత్ర రాశారు. అయితే వీరిరువురు శ్రీరమణుల ఆజ్ఞ మేరకే షిర్డీ వెళ్లి, అక్కడ కొంతకాలం ఉండి సాయి బాబా జీవిత చరిత్రలను రాశారు.

ఇలా యోగులు, వారి భక్తుల మధ్య కూడా జన్మ జన్మల అనుబంధం ఉండేదని వారి జీవిత ఉదంతాలు వివరిస్తుంటే 'ఇంకా పునర్జన్మ లేదని, ఈ జీవితం అంతటి తోటి సరి' అని నమ్మ బలికే నాస్తిక, హేతువాదం మనలను ఎంత తప్పు మార్గాన నడిపిస్తుందో ఊహిస్తేనే భయం వేస్తుంది. జన్మ-పునర్జన్మలుండబట్టే మానవ జీవితంలో ఎత్తు పల్లాలు, ఐశ్వర్యం, దరిద్రం, కీర్తి, అపకీర్తి కలుగుతున్నాయి. అందుకే స్వామి వివేకానందుడు, 'ఈ జన్మలోని ఒక జీవి స్థితి ఆ జీవి గత జన్మ సంస్కారాలు, వాసనాలని బట్టి ఉంటే, ఈజన్మలో ఆజీవి చేసే ఉత్తమ కర్మలు అతని మరుజన్మ నిర్ణయిస్తుంది ' అని అంటాడు. మనిషి తన భవిష్యత్తు తానే రాసుకొంటాడని స్వామీజి ఉపన్యసించేవారు.

ఒకసారి శ్రీ రమణుని దర్శించిన ఒక భక్తుడు భగవాన్ ను ఇలా అడిగాడు 'గత జన్మ ఉంటే మనకు ఈ జన్మలో అది ఎందుకు గుర్తుకు రాదు?' అని. అందుకు భగవాన్ ఇలా బదులు ఇచ్చారు. 'ఈశ్వరుడు మనకు గత స్మృహ లేకుండా చేసి మంచిపని చేశాడు. అది అలా ఉండకపోతే, సమస్త జీవజాతి గందర గోళానికి గురైయ్యేది. ఎందుకంటే పూర్వ జన్మలో ఒకరు లెక్కలేనన్ని దుర్మార్గాలు , దుష్టత్వాలు

చేసి, శిక్షగా ఈ జన్మలో విపరీతమైన దుఃఖం అనుభవిస్తుండవచ్చు. అది పాస్చాత్తాపానికి దారి తీసి, పాప ప్రక్షాళన దిశగా పయనించి ముందు జన్మ మానవత్వం , దైవతం కలిగి ఉండేలా తోడ్పడ వచ్చు. అలా అతనికి తన గతాన్ని సరిచేసుకునే అవకాశం దయామయుడైన ఈశ్వరుడు కలిగించాడు. ఇందుకు భిన్నంగా అతనికి తన పూర్వ జన్మ వృత్తాంతం, అందులో అతని నీచ ప్రవర్తన తెలిస్తే అతను మారడానికి అంగీకరించక పాత జీవితాన్నే మరింతగా పాటించ ఇచ్చగించవచ్చు. అప్పుడా ఆత్మా ఇంకా పాప కూపాలలో కూరుకుపోయి అధః పాతాళానికి జారిపోవచ్చు. అలా గత జన్మస్మృతి లేక పోవటం ద్వారా ఈ జన్మలో కొత్త సంస్కారాలు, ఉత్తమ సంస్కారాలు ఏర్పరచు కొనే అవకాశం ఈశ్వరుడు కలిగించాడు. అందుకు మనం ఎల్లప్పుడూ ఈశ్వరునికి రుణ పడి ఉండాలి. ఇది జన్మ పునర్జన్మల పైన యోగులైన శ్రీ రమణుల వ్యాఖ్యానం. ఎంత మానవీయంగా , దైవీయంగా ఉందో అలోచించి చూడండి.

(భక్తిమాసపత్రిక, మే 2024)

9
సాంస్కృతిక, ఆధ్యాత్మిక వారధులే గురువులు - సర్వేపల్లి రాధాకృష్ణ

రాధాకృష్ణన్ జయంతి –జాతీయ ఉపాధ్యాయ దినం

ప్రపంచ ప్రఖ్యాత తత్వవేత్త, వక్త, రచయిత సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినాన్ని (136 వ జయంతిని) 'జాతీయ ఉపాధ్యాయ దినంగా', ఏటా ఒక వేడుకగా సెప్టెంబర్ 5న జరుపుకొంటాం. కానీ, నేటి తరం ఉపాధ్యాయులలో ఏ కొందరికో మాత్రమే రాధాకృష్ణన్ భారతీయ తత్వ చింతనను ప్రపంచ వ్యాప్తం చేసేందుకు ఎలాంటి కృషి చేశారో తెలుసు. ఈ నేపథ్యంలో అందరికీ (ఉపాధ్యాయులకు, విద్యార్థులకు) తెలిసేలా రాధాకృష్ణన్ అందించిన సేవలను సంస్మరించుకోవడమే ఆ మహనీయునికి మనం సమర్పించుకొనే నిజమైన నివాళి.

ఉపాధ్యాయుల్లో తాత్వికతను పాదుగొలిపే వ్యాసంగాలు

సర్వేపల్లి రాధాకృష్ణన్ తన జీవితకాలంలో ఎన్నో తాత్విక రచనలు చేశారు. సుమారు రెండు డజన్ల పైన ఉండే ఆయన రచనల్లో అత్యంత

ప్రధానమైనది 'ది ప్రెసెంట్ క్రైసిస్ అఫ్ ఫైత్'. (నమ్మకం పై నేడు ఏర్పడిన సంక్షోభం). ఈ సంక్షోభం ఎలా తలెత్తిందో వివరించే ప్రయత్నంలో ఆయన మొదట చర్చించిన విషయం భారతీయులు తమ మతం పట్ల ఎటువంటి దృక్పథం ఏర్పరచుకొంటున్నారన్నది. దీనికి విరుగుడుగా రాధాకృష్ణనే 'రికవరీ అఫ్ ఫైత్' (నమ్మకం పాదుకొల్పటం) అనే పుస్తకాన్ని కూడా రాశారు. ఇవిగాక 'ది క్రియేటివ్ లైఫ్ ', 'ఔర్ హెరిటేజ్', 'రిలీజియన్ అండ్ కల్చర్', 'లివింగ్ విత్ ఏ పర్పస్', 'ట్రూ నాలెడ్జి', 'టు వార్డ్స్ ఏ న్యూ వరల్డ్' వంటి పుస్తకాలు కూడా రాశారు. ఈ పుస్తకాలన్నీ విద్యార్థులకు, ఉపాధ్యాయులకు, సాధారణ ప్రజలకు కూడా సుబోధకంగా సులువుగా అర్థమయ్యే రీతిలో జ్ఞాన ప్రదాయకంగా ఉంటాయి.

భారతీయ సంప్రదాయత, తాత్వికతపై నమ్మకం కోల్పోతున్న సమాజం

'సంప్రదాయ, సాంస్కృతిక, ఆధ్యాత్మిక చరిత్ర తెలుసుకోక పోతే ఆ సమాజం మనగలగదు' అంటారు సర్వేపల్లి రాధాకృష్ణన్. 'ఇందుకు ఎవరి సాంప్రదాయ, సాంస్కృతిక,ఆధ్యాత్మిక చరిత్ర పట్ల వారికి నమ్మకం ఉండాలి. దురదృష్టవశాత్తు ఈ నమ్మకం ఆధునిక కాలంలో తీవ్ర ఒడుదుడుకులు ఎదుర్కొంటున్నది' అని రాధాకృష్ణన్ ఆందోళన వ్యక్తం చేశారు.

మతం , నాగరికత, భవిష్యత్తు ఒకదానితో మరొకటి ఎలా ముడిపడి ఉన్నాయో తెలిస్తే మనం ఎక్కడ తప్పటడుగు వేశామో, ఎందుకు నమ్మకం కోల్పోతూ సంక్షోభంలో పడుతున్నామో వివరంగా తెలుస్తుంది. 'ఆత్మ తత్వం' తో మెలగటం వలన జాతి సురక్షితమవటమే గాక, జీవన విధానం కూడా సరళం అవుతుంది. అయినప్పటికీ మనం ఈ ఆలోచనా ధార పై నమ్మకం కోల్పోయాం. 'వ్యక్తి తనలో తాను నమ్మకం కలిగి

ఉండటం అంటే ఆత్మ తత్త్వం పై నమ్మకం కలిగి ఉండటమే. ఈ తత్వమే 'జాతి సమగ్రత'కు, నూతన ప్రపంచ వరవడికి దోహద పడుతుందంటారు రాధాకృష్ణన్. 'ఈ తత్త్వం పై నుండే నమ్మకమే మన సౌశీల్యత (క్యారక్టర్) కు పునాది. 'ప్రజాస్వామ్యం అనేది ఒక నమ్మకం' అని భావించారు రాధాకృష్ణన్. ఆత్మతత్త్వ భావన లేనిదే 'ప్రజాస్వామ్యం' డొల్లనే. సౌశీల్యత నేటి యువతకు, ఉపాధ్యాయులకు, చదువుకు, చరిత్ర పఠనానికి, సాహిత్య ప్రక్రియల అవగాహనకు, విద్యా విధానానికి, కళను అవగాహన చేసుకోవడానికి, ఆరోగ్యం –సామర్థ్యం పెంచుకోవడానికి ఉపకరిస్తుందని రాధాకృష్ణన్ 'నమ్మకంపై నేడు ఏర్పడిన సంక్షోభం' పుస్తకంలోఎంతో తార్కికంగా వివరించారు.

రాధాకృష్ణన్ జీవిత విశేషాలు –ఓ రేఖా చిత్రం

రాధాకృష్ణన్ సెప్టెంబర్ 5, 1888న నేటి తమిళనాడు లోని తిరుత్తణ్ణిలో జన్మించారు. తండ్రి పేరు వీరాస్వామి, తల్లి పేరు సీతమ్మ. మొత్తం కుటుంబంలోని ఆరుగురిలో ఈయన నాలుగో వాడు. వీరికి పైన నలుగురు సోదరులు, వీరి తరువాత ఒక సోదరి ఉన్నారు. వాళ్ళ కుటుంబం నెల్లూరు జిల్లాలోని సర్వేపల్లి నుంచి ఉద్యోగ రీత్యా తిరుత్తణ్ణి కి వెళ్ళవలసి వచ్చింది. వాళ్ళ నాన్న రెవిన్యూ శాఖ లో పనిచేసే వారు . ఆవిధంగా రాధాకృష్ణన్ కొంత కాలం తిరుత్తన్ని, తిరుపతి, వాలాజపేటల్లో చదివారు. ఉన్నత చదువులకు వెల్లూర్, మద్రాస్ క్రిష్టియన్ కళాశాలకు వెళ్లారు. రాధాకృష్ణన్ 16 ఏళ్లకే స్నాతకస్థాయి పట్టా పొందారు మద్రాస్ విశ్వవిద్యాలయం నుంచి. వాస్తవానికి ఆయన లెక్కలు స్పెషల్ సబ్జెక్టుగా తీసుకొందామనుకొన్నారు. కానీ, తన సోదరుడు నుంచి తీసుకొన్న తత్వ శాస్త్ర పుస్తకాలు చదివాక ఆయన తత్వ శాస్త్రమే తన స్పెషల్ సబ్జెక్టుగా తీసుకొన్నారు.

'వేదాంత శాస్త్రంలోని మౌళిక నైతికత, అధిభౌతిక ప్రతిపాదనలు'

'వేదాంత శాస్త్రంలోని మౌళిక నైతికత, అధిభౌతిక ప్రతిపాదనలు' అనే సిద్ధాంత వ్యాసానికి (థీసిస్) ఆయనకు మద్రాస్ యూనివర్సిటీ స్నాతక పట్టా అందించింది. అప్పటికే అనేక క్రిష్టియన్ స్కూళ్లలో చదువుకొని ఉండటంతో, క్రిస్టియన్ అధ్యాపకులు భారతీయ తత్వ శాస్త్రాలను విమర్శిస్తూ బోధనలు చేయటంతో చాలా కించబడి ఉండటంతో ఈ విషయాన్ని ఆయన తన క్రిష్టియన్ అధ్యాపకులకు, సహా విద్యార్థులకు ఒక ధీటైన జవాబుగా ఈ సిద్ధాంత గ్రంధాన్ని రాసి మద్రాస్ యూనివర్సిటీ కి సమర్పించాడు. ఈ నేపథ్యంలో ఆయనకు ప్రేరణగా నిలిచింది స్వామి వివేకానంద, ఆయన ఉపన్యాసాలు. ప్రొఫెసర్ హాగ్ అనే క్రిస్టియన్ మత ఉపన్యాసకుడు కాలెజ్ లో రాధాకృష్ణన్ బోధకుడు. అతను రాధాకృష్ణన్ సిద్ధాంత గ్రంధాన్ని చదివి హర్షించకుండా ఉండలేకపోయాడు. వేదాంత శాస్త్రంలోని అధిభౌతిక ప్రతిపాదనలను 'హేగిలియన్ ఆదర్శ శాస్త్రం' పరిధిలో వివరించాడు. ఇదో దుస్సాహసం అనాడు. అదృష్టవశాత్తు ఆయన ఈ ప్రయత్నంలో విజయం సాధించి హేగల్ను అనుసరించే సామాజిక శాస్త్రవేత్తల అంగీకారం పొందాడు. ఒకవేళ వాళ్ళు అంగీకరించి ఉండకపోతే మనం ఇవ్వాళ చెప్పుకొనేందుకు రాధాకృష్ణన్ మిగిలి ఉండేవాడు కాదు. అంటే ఆ ప్రయత్నం కత్తి మీద నడకతో సమానం అన్న మాట.

వేదాంత శాస్త్రంలో పట్టా పొందాక ఆయన పాశ్చాత్య విమర్శల ఝుడివాన నుంచి హిందూ మతాన్ని, భారతీయ తత్త్వ చింతనను రక్షించడానికే పూర్తి స్థాయిలో సంక్లిష్టమైన పరిశోధనకు ఉపక్రమించాడు. భారతియ తత్వ చింతనను సమకాలీన సమాజానికి వర్తిల్లజేస్తూ ఆయన

రాసిన వ్యాసాలు ఎంతోమంది పాశ్చాత్య తత్వ వేత్తల దృష్టిని ఆకర్షించింది. ప్రొఫెసర్ విలియం స్కిన్నర్ ఆయనను 'నేను ఇటీవలికాలంలో చూసిన ఉత్తమోత్తమ వ్యక్తి' అని అభినందించాడు పర్యవసానంగా రాధాకృష్ణన్ కు మద్రాస్ ప్రెసిడెన్సీ కాలేజీలో ప్రొఫెసర్ గా నేరుగా ఉద్యోగం లభించింది. ఇది విద్యారంగంలో ఆయన తొలి ఉపాధ్యాయ నియామకం. తన ఉపాధ్యాయ పరిశోధనా వృత్తిలో రాధాకృష్ణన్ బ్రిటిష్ విమర్శకులను, పాశ్చాత్య విమర్శకులను ధీటుగా ఎదుర్కొన్నాడు. ముఖ్యంగా భారతీయ వేదాంతంలో'నీతి, నియమాలుండవన్న' విమర్శకు జవాబుగా వేదాంత శాస్త్రంలోని 'అభేద' సిద్ధాంతం' పై దృష్టి కేంద్రీకరించాడు. ఈ 'అభేద' ప్రతిపాదన ద్వారా భారతీయ తాత్వికత, వేదాంత శాస్త్రం ఎంతో బలీయమైనదని, మరే మతానికి హిందూమతంలా సామాజిక రుగ్మతలను, ఉచ్చనీచాలను ఎదుర్కొనే సామర్థ్యం ఉండదని వాదించాడు రాధాకృష్ణన్. ఈ 'అభేద ' ద్వారా ఆత్మవత్ సర్వ భూతాని' ని ప్రతిపాదించాడు రాధాకృష్ణన్.

అభేద సిద్ధాంతం

'నిన్ను నువ్వు ఎలా చూసుకొంటావో అవతల వారిని కూడా అలాగే చూడమని చెబుతుంది' అభేద సిద్ధాంతం.'నిన్ను నీకు హింసించుకొనే హక్కు ఎలా లేదో, వేరే వారిని హింసించే హక్కు కూడా లేదు' అని ప్రతిపాదిస్తుంది 'అభేద' ప్రతిపాదన. 'ఏకాత్మ భావన తేవటం ద్వారా 'సమ సమాజం' సర్వకాల సర్వావస్థలందు వర్ధిల్లటం సాధ్యం' అని నిరూపించారు రాధాకృష్ణన్. భారతీయ తత్వ శాస్త్ర ఆధారంగా రాధాకృష్ణన్ ప్రపంచానికి అందించిన సామాజిక శాంతి, సమ సమాజ స్థాపన, దేశా భివృద్ధి, దేశ ప్రగతి వ్యాసాలు పాశ్చాత్య విమర్శకులకు మింగుడు పడలేదు. అలాని తిప్పి కొట్టేందుకు ఇతర మతాలలో ఇంతకు మించిన సిద్ధాంతాలు, ప్రతిపాదనలు లేవు.

ఒక రకంగా బ్రిటిష్ పాలన కాలంలో పెట్రేగిపోయిన క్రైస్తవ మిషనరీలు క్రైస్థవంలో ఉన్న మత సిద్ధాంతాలేవిటో చెప్పుకోలేని స్థితి. ఏమైనా సిద్ధాంతాల పై ఆధారపడి క్రైస్తవ మతం కానీ, ఇస్లాం మతం కానీ నిర్మాణం కాలేదు. ఏక మూర్తి లేక ఏక దేవతావాదం పై రెండు భిన్న మతాలు ఏర్పడటమే పాశ్చాత్య నాగరికత, సంప్రదాయాల్లో పెద్ద వింత. అవి మనుషులను పాపులుగాను , దేవతను/ఆరాధించే మూర్తిని పాప విమోచకుడిగా పాశ్చాత్య ఆధ్యాత్మికతను వివరిస్తాయి. ఇలాంటి మతాలనుంచి భారత దేశం భిక్షకు వచ్చిన వారు ఇక్కడ వ్యాపారం చేసుకోవటానికి పరిమితంకాక, 'అద్భుత తాత్విక ధార'ను, 'మోక్ష' మార్గాన్ని బోధించే వేదాంత శాస్త్రం ఉద్భవించిన భారతావనిని తమ మతప్రచారవేదికగా చేసుకోవటం ఎంత హాస్యాస్పదం' అంటారు ప్రొఫెసర్ మాక్స్ ముల్లర్. ఈయన భారతీయ వేదాలను, ఉపనిషత్తులను చదివిన తర్వాత 'బ్రహ్మ' తత్వాన్ని స్వామి వివేకానంద నుంచి గ్రహించి, క్రైస్తవ మత వ్యాప్తి ప్రచారాలను వ్యతిరేకించాడు. అంతే కాదు. రాధాకృష్ణన్ కు అత్యంత సన్నిహితుడైనాడు. రాధాకృష్ణన్ వంద సంవత్సరాలకు పూర్వమే బ్రిటిష్ ఎన్సైక్లోపీడియాకు 'ఇండియన్ ఫిలాసఫీ' అనే ఆంగ్ల పదం మీద సంపూర్ణ వివరణ ఇచ్చారు. నేటికీ అదే ప్రామాణికంగా నిలిచింది ఎన్సైక్లోపీడియాలో.

రాధాకృష్ణన్ కు ఉపాధ్యాయులకు మధ్య సంబంధం

రాధాకృష్ణన్ ఉపాధ్యాయుడవడానికి కారణం క్రైస్తవ మిషనరీల చేతిలో 'హైందవం' హీనమైన విమర్శకు గురవటమే. హైందవ మతవిమర్శకులకు ధీటైన సమాధానం ఇవ్వటం కోసమే ఆయన 'వేదాంతం' తన ప్రత్యేక విషయంగా తీసుకోవటం జరిగింది. అంతే గాదు. నాడు

బ్రిటిష్ వారి మద్దతుతో ఏర్పడ్డ క్రైస్తవ మిషనరీలు క్రైస్తవ వ్యాప్తికి విద్యాసంస్థలనే ప్రధానంగా వాడుకోవటం కూడా ఆయన్ను ఉపాధ్యాయ వృత్తిపట్ల ఆకర్షితుడిని చేసింది. ఏ మాధ్యమం ద్వారా తను క్రైస్తవ ప్రచారాన్ని ఎదుర్కొన్నాడో, అదే మాధ్యమం ద్వారా హైందవం పట్ల విష ప్రచారాన్ని తిప్పి గొట్టాలని అనుకొన్నాడు. మద్రాస్ ప్రెసిడెన్సీ లో ప్రొఫెసర్ గా పనిచేస్తున్న కాలంలోనే ఆయనకు కలకత్తా యూనివర్సిటీ లో ప్రొఫెసర్ గా పదవి లభించింది . ఇంగ్లాండ్ , పోర్చుగల్, జర్మనీ దేశాలలో విసిటింగ్ ప్రొఫెసర్ గాను వెళ్లివచ్చారు. తొలుత ఆంధ్ర విశ్వవిద్యాలయానికి కూడా వైస్-ఛాన్సలర్ గా (1931-36) పని చేశారు. తరువాత ఆయన బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంకు వైస్-ఛాన్సలర్ గా (1939-44) నియమితులయ్యారు.

అందుకే నోబెల్ బహుమతి ఇవ్వలేదు

ఆయన రచనలకు ఆయన పలుమార్లు నోబెల్ శాంతి బహుమతికి నామినేట్ అయ్యారు. భారత దేశంలో క్రైస్తవ మత వ్యాప్తికి వ్యతిరేకన్నా కారణంగానే ఆయనకు నోబెల్ బహుమతి ఇవ్వలేదని కొంతమంది ప్రాజ్ఞుల అభిప్రాయం. ఈ నేపథ్యంలో రాధాకృష్ణన్ రాసిన పుస్తకాలు, చేసిన ప్రసంగాలు ఉపాధ్యాయులకే ప్రాధమికంగా వర్తిస్తాయి. ఎందుకంటే వాళ్ళు పదికాలాల పాటు భారతీయ తత్వ చింతనను, రాధాకృష్ణన్ దానికి ఇచ్చిన నూతన వ్యాఖ్యానాలను భవిష్యత్ తరాలకు అందించగలుగుతారు. ఆఖరికి ఆయన రాష్ట్రపతి అయినప్పుడు కూడా తన పుట్టిన రోజును వ్యక్తిగా జరుపుకోవటం కన్నా దేశంలోని ఉపాధ్యాయులందరి జన్మ దినంగా జరుపుకోవాలని కోరుకున్నారు. అలా ఆయన జన్మ దినం జాతీయ ఉపాధ్యాయ జన్మ దినం అయింది. ఇంగ్లాండ్ లో ఆయన ఆక్స్ఫర్డ్ లో

ప్రొఫెసర్ గా పనిచేస్తున్న రోజుల్లో కింగ్ జార్జ్ రాధాకృష్ణన్‌కు 'సర్' (నైట్ హుడ్) బిరుదు నిచ్చి సన్మానించారు. కానీ, భారత దేశం స్వాతంత్రం పొందాక ఆయన 'సర్' బదులు తను ఉపాధ్యాయుడిని కాబట్టి 'డాక్టర్' రాధాకృష్ణన్ అని వ్యవహరించమని కోరారు.

నమ్మకం పై నేడు ఏర్పడిన సంక్షోభం – రాధాకృష్ణన్

మనిషి తనజీవితంలో ఎంత నిరాశని ఎదురొకొన్నా బతకాలనే కాంక్షనుంచి దూరం పోలేదు. దేశాలమధ్యయనా, మనుషుల మధ్యయినా ఒకరిని చూస్తే ఒకరికి భయం (ఫియర్), ద్వేషం (హెట్రేడ్) ఉండటమే అన్ని యుద్ధాలకు కారణం. మనుషులు, దేశాలుతమసమస్యల శాంతి యుత పరిష్కారంకన్నా, ఒకరినొకరు చంపుకోవటమే వివేకంగా భావిస్తున్నారు. ఇందుకు కారణం లేకపోలేదు. మనిషి తనలో మంచి ఉందన్న సంగతి మరిచిపోయాడు. అలాగే అవతల మనిషిలోగూడా మంచి ఉందన్న సంగతి విస్మరిస్తున్నాడు. ఇదే పరిస్థితి దేశాలమధ్య ఏర్పడింది. అంతర్జాతీయ సమావేశాల్లో గూడా దేశాల ప్రతినిధులు ఒకరినొకరు నిందించుకొంటూ సమావేశాలను రభసగా మారుస్తున్న సంగతి చూస్తే ఏమనిపిస్తుంది ? ఒకరి పై ఒకరికి నమ్మకం పోయిందనే గదా ! 'ఇదే 'నమ్మకం పైన ఏర్పడిన సంక్షోభానికి' ప్రధాన కారణం' గా చెప్పుకొచ్చారు రాధాకృష్ణన్.

'నమ్మక రాహిత్యం నుంచి నమ్మకం ఎలా వస్తుందంటారు?' రాధాకృష్ణన్. అందుకు మద్దతుగా ఆయన ఇలా వ్యాఖ్యానించారు: కోతి (మానవ పరిణామం క్రమంలో మనిషి కోతి నుంచి వచ్చాడని భావన) చేతిలో ఆటం బాంబ్ పెట్టి మనం సురక్షగా ఉన్నాం అని ఎలా అను కొంటాము? అన్నిమతాలు ఒకరోజు ఈ ప్రపంచం ముగిసిపోతుంది అని చెబుతున్నాయి. అంటే ఈ మతాలన్నీ ఏమి సూచిస్తున్నట్టు? నానాటికి

దిగజారిపోతున్న మానవజాతి నమ్మకం అది విడివిడిగా వ్యక్తులు కానీ, దేశాలు కానీ. దేశాలు కలవాలన్న, ఆ దేశాల సంప్రదాయాలు, నాగరికతలు ప్రజలను కలవకుండా వెనక్కి లాగుతున్నాయి. ఒకప్పటి నాగరికత, సంప్రదాయాలు కరిగిపోతున్నాయి. వాటి స్థానాల్లో కొత్తవి వచ్చి చేరుతున్నాయి. కొత్తవి వచ్చినప్పుడల్లా పాత, కొత్తల నైతిక విలువల మధ్య సంఘర్షణ విధిగా జరుగుతున్నది. ఇది హింసాత్మకంగా మారుతున్నది. ఈ విధమైన భావ దరిద్రం నుంచి మనిషిని, దేశాలను కాపాడేది 'మతమే'.అయితే, దురదృష్టవశాత్తు మతం పేరున గూడా మారణ హోమాలు సాగుతున్నాయి. ఇక్కడ ఇంకో నిజం చెప్పాలి. మతం గురించి గాని, మతం పట్లగాని విశ్వాసం లేని వారే యువతలో, నడివయసు వారిలో ఎక్కువ.

శాస్త్ర విజ్ఞాన ప్రగతి నమ్మక రాహిత్యానికి హేతువయిందా?

శాస్త్ర రంగాలలో, సమాచార వ్యవస్థల్లో, టెక్నాలజీ వచ్చిన జీవిత మార్పులలో మనిషికి ఇవ్వాళ దేవుడితో పనిలేదన్న నమ్మకం కలిగింది. పాప పుణ్యాల పట్ల, నైతిక శక్తి (మోరల్ ఎనర్జీ) పట్ల నమ్మకం సన్నగిల్లింది. దేవుడే ఉంటె ఈ ప్రపంచంలో జరిగే ఘోరాలన్నీ ఎలా చూస్తూ ఉన్నాడు? అనే నాస్తిక వాదనకు బలం చేకూరేలా మనిషి ప్రవర్తన మారిపోయింది. మన పాపాలను దేవుడు తీసుకొని, మనలను నిత్య శుద్ధి చేస్తాడనే పాశ్చాత్య భావనలు, దేవుడి పేరుతో హింసను చేస్తే తప్పులేదనే పాశ్చాత్య వ్యాఖ్యానాలతో 'హింస' వింత వింత పుంతలు తొక్కుతోంది. భగవంతుడున్నాడని సైన్స్ ప్రకారంగా నిరూపించలేం. అలా అని శాస్త్ర విజ్ఞానం (సైన్స్) మానవ జాతిని కాపాడలేదు. వైద్య వసతులు శాస్త్ర విజ్ఞానంతో పెరగవచ్చు. కానీ, అదే శాస్త్ర విజ్ఞానం ఒక్క దెబ్బతో మానవజాతి మారణ హోమం చేయగలదు. అప్పుడు శాస్త్ర

విజ్ఞానం వలన కలిగిన వైద్య లాభాలు ఏమైనట్టు? – అని ప్రశ్నిస్తాడు రాధాకృష్ణన్. ఇలా చూస్తే మతానికి, తర్కానికి సంబంధం లేనట్టు మతం ఒక 'మౌఢ్యము' అని అనిపించక మానదు. భగవంతుడిపై నమ్మకం అనుభవ ప్రమాణమైనది. సైన్స్ లాగా ప్రయోగశాలలో తెలుసుకొనేది కాదు. నిజానికి బ్రహ్మ సూత్రాలు ప్రవచించే మార్గాలను పరిశీలిస్తే భగవంతుడి దర్శించటం అంత దుస్సాధ్యం కాదని, తర్క రహితం కాదని ఇట్టే గ్రహించవచ్చు.

బ్రహ్మసూత్రాలు సాధన సాధ్యాలా? కావా?

అపరోక్షానుభూతి, లేదా లోకోత్తరజ్ఞాన రెండు బ్రహ్మ సూత్ర సాధన వల్లనే సాధ్యమవుతాయి. ఆధ్యాత్మిక శాస్త్రాలు అనుభవసారాలే తప్ప ప్రయోగశాల పరికరాలు కావు. భారత దేశములో ఉద్భవించిన అన్ని మతాలను పరిశీలిస్తే అన్నింటిలోనూ ఉపనిషద్ వ్మాయం, వేద వ్మాయం ఎంతో కొంత కనబడ్తుంది. అది చాలు అన్నిమతాలకు ఒకే ఉత్పత్తి స్థానం ఉందని:అదే వేద వ్మాయం, ఉపనిషత్తులు. తేడాలు ఉన్నా ఈ ప్రాథమిక ప్రాతిపదికను పక్కనపెట్టేంత పెద్దవి కాదు. ఆ ప్రకారంగా 'ప్రజాస్వామ్యం' ఒక మౌళిక నైతికతకు, సమాజంలోని అన్నివర్గాలను కలిపి ఉంచే ఒక మహత్తర శక్తికి ప్రతీక. అయితే కొందరు దీనిని ఒక రాజకీయ ఏర్పాటు (అరెంజిమెంట్) అని కూడా వాదిస్తారు. అలా వాదించటంవలన సమాజ శ్రేయస్సుకోరే శాంతి,అహింస,ఏకాత్మ భావనలను పక్కన బెట్టి,కేవలం తగులాటలకు, గొడవలకు అవకాశం కలిపించే ప్రజాస్వామ్యానికి ఆస్కారం కలిగిస్తున్నారు. అందువల్లే నేడు ప్రజాస్వామ్య దేశాలలో కూడా అల్లర్లు, హింస జరుగుతున్నాయి.

పాశ్చాత్య 'వ్యక్తి కేంద్రీకృత జీవనం' : సాధనకు ప్రథమ సోపానం

'పాశ్చాత్య వ్యక్తి కేంద్రీకృత జీవనం సాధారణ జీవన దృగ్విషయం. కానీ, భారతీయ ఆధ్యాత్మిక జీవనం 'వ్యక్తి కేంద్రీకృతం'. అది సాధనకు ప్రథమ సోపానం. కానీ, భారతీయ సాధారణ జీవనం 'సమాజసమిష్టి జీవనం' ప్రతిక. పాశ్చాత్యులకు 'ఆత్మ సాక్షాత్కార సాధనా మార్గం అంటూ విడిగా, భారతీయులకున్నట్టు లేదు. ఇదే ప్రాక్ పశ్చిమాల మధ్యనున్న స్థూల వ్యత్యాసం' అని వివరించారు రాధాకృష్ణన్. సాధన వలననే వ్యక్తిత్వ వికాసం సంభవిస్తుంది, అది స్థిరంగా ఉంటుంది. వ్యక్తిత్వ వికాస పుస్తకాలు, ఉపన్యాసాలు చదివినా, విన్నా వచ్చే' వ్యక్తిత్వ వికాసం స్థిరంగా అన్నివేళలకు వర్తించేలా ఉండదని రాధాకృష్ణన్ స్పష్టం చేశారు. సాధనవలన లభించిన 'వ్యక్తి వికాసం' చాలా ఉన్నతమైన అనుభవాన్ని ఇస్తుంది. స్థిరంగా, శాశ్వతంగా ఉంటుంది. మానవ సహజీవనానికి సహకరిస్తుంది. ప్రజా స్వామ్యాన్ని నిలబెడుతుంది. సాంప్రదాయ పరంపరలో మనకు వారసత్వంగా వచ్చిన ఉన్నత సంస్కారాలను పదిలపరిచి ఆచరించి చూపిస్తుంది.

'వేదాలు సకల కళలకు నిలయమై ఒప్పారింది. సంగీత, నృత్య, అభినయాలకు వేదాలే కారణం. బ్రహ్మనే వీటి సృష్టికి సూత్రధారి. వేదం సాహిత్యమే అన్ని సాహిత్యాల మూలాలకు మూలమై నిలిచింది. 'విద్య' అంటే సరైన నిర్వచనాన్ని గురుకుల వ్యవస్థ ద్వారా లోకానికి అందించింది. ఇదెలా సాధ్యమైందో తెలుసుకొన్నప్పుడే గదా 'నమ్మకం పైన ఏర్పడిన సంక్షోభం నుంచి మనిషి బయట పాడేది' అని ముక్తాయించారు రాధాకృష్ణన్.

(భక్తిమాసపత్రిక, సెప్టెంబర్ 2024)

10
సాయిబాబా, విజయదశమి సంబంధం - సాయిబాబా అవతార రహస్యం!

సాయిబాబా పేరు చెప్పగానే ప్రధానంగా గుర్తు వచ్చేవి మూడు ద్వారకామాయి, బూటీ కృష్ణ మందిరం (ఇప్పుడు సాయి బాబా మందిరం), విజయ దశమి. ఈ మూడింటి చుట్టూ అల్లుకొని ఉన్నదే బాబా అవతార రహస్యం.

బాబా గురించిన అనేక రచనలు బాబా జీవించి ఉన్న కాలం లోనే వచ్చాయి. వాటిలో ప్రధానంగా చెప్పవలసినది హేమాద్ పంతు రాసిన 'సాయి స్చచరిత్ర' అనేక రచనల సంగ్రహమేగాక, హేమద్ పంతు స్వీయ అనుభవం కూడా. ఈ పుస్తకాన్ని నిత్య పారాయణ గ్రంథంగా చదివే వారు కొందరైతే, కొందరు తమ కోరికలను నెరవేర్చమని చదివే వారు. అలాంటి వారికి వారి వారి భక్త్యానుసారం, గతజన్మ, ఈ జన్మ కర్మలానుసారం ఫలితాలు రావటం మనం అంతా చూస్తున్నదే. అయితే ఎవరు బాబాను సాత్విక భక్తి భావాలతో, ఆయన పటం ముందు ప్రణమిల్లి,

సర్వస్య శరణాగతి చేసి చదువుతారో వారికి సాయిబాబా అవతార రహస్యం అంతర్గతంగా వెల్లడవుతుంది.

బాబా ఎవరు? దత్తాత్రేయ పరంపర

ఈ ప్రశ్నకు సమాధానం హేమద్పంతుతన 'సాయిసచ్చరిత' గ్రంథంలోనే ఉపోద్ఘాతంలో చెప్పాడు. దీర్ఘాలోచన చేయకటప్పున సమాధానం చెప్పే అలవాటున్నవారు బాబాని 'ఒక పిచ్చి ఫకీర్'గా పేర్కొంటుంటారు. కానీ, లోతుగా తరచిచూసే వారికి బాబా ఎవరో సులువుగానే ఏ కష్టం పడకుండానే బోధపడుతుంది. ఇలా బాబాని 'పిచ్చిఫకీర్'గా తేలిగ్గా తీసుకున్నవారు తరువాతి కాలంలో బాబాని విధిలేని పరిస్థితుల్లో సందర్శించవలసి వచ్చింది. అప్పుడు బాబా వారిని మసీదుమెట్లు కూడా ఎక్కనీయలేదు. పైపెచ్చు 'ఈ పిచ్చి ఫకీర్'తో మీకేమిపని అని కూడా ప్రశ్నించాడు. చివరకు వాళ్ళు మనస్ఫూర్తిగా క్షమాపణ చెప్పాక బాబా వారితో 'కుండ మూతతీసుంచితేనేకదా నీరు పోయగలిగేది. కుండా మూత ఎప్పుడూ తీసుంచండి. అప్పుడు ఆ నీరు తాగితే ఏది మంచి నీరో, ఏది చెడ్డ నీరో తెలుస్తుంది' అని చెప్పేవాడు.

బాబాని ఒక్కక్కరు ఒక్కో రీతిలో దర్శించారు. యెవలా గ్రామానికి చెందిన ఆనందనాధుడనే యోగి 'రత్నం' గాను, పూణే 'ట్రాంబేకి చెందిన గంగాఘీరు అనే యోగి బాబాను 'మణి' గాను శ్లాఘించారు. గౌలిబువా అనే మరో యోగిబాబాను 'పండరి పురవిఠలు' గా వర్ణించాడు. మహారాష్ట్ర దేశంలో 'దత్తసంప్రదాయం' ఒక గురుపరంపరగా ఉండేది. దక్షిణ భారతదేశంలోని ఆదిశంకర ప్రతిపాదిత 'దక్షిణామూర్తి' సంప్రదాయం ఉత్తరాదిన కూడా ఉండింది. కానీ, మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాలలో దత్తసంప్రదాయంపరిఢవిల్లింది. ఏకకాలంలో రెండు భిన్నగురు

సంప్రదాయాలు అత్యంత బలంగా వ్యాప్తిలోకి రావటం వెనుక ఏదో ఆధ్యాత్మిక రహస్యం ఉండి ఉంటుంది.

అలా సాగిన గురుపరంపరలో కృష్ణానదీతీర శ్రీపాద శ్రీవల్లభులు, గానఁగాపూర్ను సింహ సరస్వతి, సజ్జనగడ్ సమర్ధ రామదాసు, నర్సోబాచి వాడికి చెందిన శ్రీనరసింహ సరస్వతి, అక్కల్ కోట మహారాజ్ మొదలైన వారంతా సాయిబాబాకు పూర్వమున్న గురుపరంపరలోనివారు. ఆశ్చర్యమేమంటే వీరి భక్తులందరికీ బాబా రెండువిషయాలు స్పష్టం చేసేవారు. మొదటిది ఒకప్పటి వారి గురువులెవ్వరూ ఇప్పుడులేరని, ఇక్కడున్న బాబానేవారని. రెండవది 'వారే ప్రస్తుతం సాయిబాబా' అని వారికి నమ్మకం కలిగేలా దర్శనం ఇవ్వటంతో పాటు,ఆయాగురువులు తమ ఆయాభక్తులను, వారి పూర్వీకులకు ఏమి ఆచరించమనిశాసించారో వాటిని గుర్తుచేసి, తిరిగి వాటిని ఆచరించమనిచెప్పటం. ఈవిధంగా గతంలోని దత్తాత్రేయ అవతారాలన్నీ తనలోనే ఇముడ్చుకొని ఆయాభక్తులకు ఉత్తరమార్గ నిర్దేశం చేయటం ద్వారా బాబా తానెవరో తొలుత వివరించే క్రమం మొదటి అంకం.

ఇందుకు తార్కాణం కృష్ణజీ ఆలి బాగ్కర్కు అక్కల్ కోట మహారాజ్ కల్లో కనబడి చెప్పిన వృత్తాంతమే. కృష్ణజీ ఆలి బాగ్కర్కు అక్కల్ కోట మహారాజ భక్తుడు. నిత్యం అక్కల్ కోట మహారాజును పూజించేవాడు. అతను షోలాపూర్లోని అక్కల్ కోట గ్రామంలో ఆ మహారాజుపాదుకలను దర్శించవలెనని ఎప్పటినుంచో తలపోస్తుండేవాడు. చివరకు ఆ అవకాశం కలిగి అక్కల్ కోట పోవాలని నిశ్చయించుకున్నాడు. ఆ రాత్రి కలలో అక్కల్ కోట మహారాజ్ దర్శనమిచ్చి, 'ప్రస్తుతం షిర్డీనానివాసం. అక్కడి సాయిబాబా నేనేను. అక్కడికెళ్లి వారిని దర్శించి పూజింపుము' అని చెప్పి

అంతర్ధానమయ్యాడు. ఆ విధముగా కృష్ణజీ ఆలి బాగ్కర్షిర్డీ వెళ్లి బాబా దర్శనం చేసి సంతుష్టుడైనాడు.

ఇలాంటిదే హరిశ్చంద్రపితళే అనుభక్తుని అనుభవం. అతని తండ్రి బతికిఉన్న రోజుల్లోవారు అక్కల్కోట మహారాజ్భక్తులు. వారు అక్కల్కోటమహారాజ్ని వ్యక్తిగతంగా దర్శించి ఉండిరి. అప్పుడు అక్కల్కోట మహారాజ్వారిని రెండు రూపాయలు దక్షిణ అడిగిరి. అడిగినదేతడవుగా వారు దానిని మహారాజ్వారికి సమర్పించిరి. ఆ నాణెమును పరికించి, మహారాజ్తిరిగివారికే ఇచ్చేసి తమ యింటిపూజలో ఉంచమని చెప్పిరి. కొంత కాలానికి అక్కల్కోటమహారాజ్కాలం చేసిరి. పితళే తండ్రిగారు మరణించిరి. వారు పూజగదిలో ఉంచిన నాణెం ఎక్కడోపోయినది. ఆస్థితిలో హరిశ్చంద్రపితళే తిరిగి బాబాని దర్శించినప్పుడు బాబా ఈ గతాన్ని గుర్తుచేసి, మరోమారు మూడు రూపాయలను పితళేకిచ్చి దీనిని పూజలో ఉంచి తండ్రి సంప్రదాయాన్ని కొనసాగించమని చేప్పారు. పితళేకి ఆనాటి నుంచి తిరిగి ఏ సమస్యలు రాలేదు.

రామ, కృష్ణ, శివావతారాలు

తనవద్దకు వచ్చే వివిధ దేవతల భక్తులకు ఆయా దేవతల రూపంలో దర్శనమిచ్చేవాడు. ఇదెలాసాధ్యం అని ఎవరైనా ప్రశ్నించవచ్చు. కానీ, సాధ్యమేనని బాబా అవతారం నిరూపించింది కాబట్టే ప్రస్తుత చర్చకు అవకాశం కలిగింది. బాబా వద్దకు వచ్చే వారిలో శ్రీరామభక్తులుండేవారు. విఠలు (కృష్ణ) భక్తులుండేవారు. శివభక్తులు ఉండేవారు. వారు బాబాను బాబాగా చూడటానికి ఇష్టపడేవారు కాదు. వారికి వారు పూజించే రాముడిగానో, కృష్ణుడిగానో, గురువుగానో దర్శనమిస్తేతప్ప వారు బాబా అవతార రహస్యంపైన ఇచ్చిన వివరణతో పూర్తికాదు. బాబాబాబాను అంగీకరించేవారుకాదు.

మేఘు శివభక్తిగాని, డాక్టర్ శ్రీరామ్ రామభక్తిగాని, మూలేశాస్త్రి గురువైన ఘోలౌప్ స్వామిభక్తిగాని, నానాసాహెబ్ వితలుడి భక్తిగాని బాబాలోనే దర్శించే వరకూ వారెవ్వరూ బాబాని సద్గురువుగా అంగీకరించ లేదు. ఆశ్చర్యమేమంటే వారలకువారు కోరుకొన్నదేవతల, గురువుల దర్శనం ఇచ్చినప్పుడు కూడా బాబా మసీదులోని ఇతర భక్తులకు సాయిబాబాగానే కనిపించేవారు. ఏకకాలంలో కృష్ణపరమాత్మలాగా వేరువేరు భక్తులకు వేరువేరు రూపాలలో దర్శనం ఇవ్వటం ఈ యుగంలో బాబా అవతార ప్రత్యేకత. ఈ ప్రత్యేకత ఆధ్యాత్మికంగా అత్యంతక్లిష్టమైంది కాబట్టే ఇంత వివరణాత్మక చర్చ అవసరమైంది. సాయిబాబా జీవించి ఉన్నకాలంలోనే ఎంతో మంది సద్గురువులు ఉండేవారు. కానీ, వారెవ్వరికీ ఈ అద్భుతశక్తి లేదు. బాబా పూర్ణశక్తి స్వరూపం అర్థం చేసికోవటానికి మరింత వివరణ అవసరం.

బాబా: హిందూ, ముస్లింల సఖ్యత

బాబా సాధారమైన యోగి పుంగవుడుకాడు. యోగులకే యోగి. యోగేశ్వరుడు. ఆయన అవతారం నిర్దిష్టమైనది, విశాలమైనది. ఆయన కలియుగ నియమాలను భక్తులకు అనువుగా మార్చి భక్తి, యోగమార్గాలను సులభతరం చేసినవాడు. ఆయన హిందువు అని కొందరు, ముస్లిం అని కొందరు అనవసర వాదనలు పెట్టుకునేవారు. కానీ, అవి చివరకు వాదనలకే పరిమితమయ్యాయి.

బాబానిత్యాగ్నిహెూత్రి. వేదమంత్రాలను, భగవద్గీతను వల్లవేసేవాడు. ఉద్దవ్ గీత, జ్ఞానేశ్వరి మహారాజ్ రాసిన భగవద్గిత వ్యాఖ్యానం, ఏకనాధభాగవతం మసీదులో నిత్యపారాయణ చేయించేవారు. మధ్యాహ్నం

పూటయోగులను, భక్తులను నిద్రించనిచ్చేవారుకాదు. హిందూ ఉపనిషత్తుల శాసనం ప్రకారం కేవలం ఏడు ఇళ్లలోనే భిక్ష చేసేవాడు. అదే సమయంలో 'అల్లామాలిక్ ', 'చేసేవాడు అల్లా. నేను ఆయన సేవకుడను ' అని చెప్పేవాడు. ఎవరెవరి భక్తిమార్గం ఏదోవారిని అదే భక్తిమార్గంలో కొనసాగమని చెప్పేవాడు. ప్రోత్సహించేవాడు. 'నన్నే పూజించమని' శాసించేవాడు కాదు.

ముస్లిం భక్తులను ఒకవైపు, హిందూ భక్తులను ఒకవైపు కూర్చోపెట్టుకొని చందం ఉత్సవం జరిపించేవాడు. బాబా జీవించినన్నేళు ్ళఏనాడూ, శిర్డిలో హిందూ, ముస్లిం గలాటాలు జరగలేదు. అందరిలో సత్వగుణంప్రోత్సహించి, ఆయా మతాలానుసారం అందరినీ సాధనా మార్గంలో ప్రోత్సహించేవాడు. ఒకరోహిల్లా ప్రతిరోజు ఉదయం నాలుగు గంటలకే 'అల్లా' అని రంకెవేసేవాడు. ఊళ్ళో హిందూవులు వాడి రంకెలకు నిద్రాభంగం అవుతుందని లబలబలాడుతూ బాబాకు ఫిర్యాదు చేసేవారు. కానీ, బాబా రోహిల్లాభక్తిలో జోక్యం చేసుకోవద్దని హిందువులకు నచ్చజెప్పేవాడు. మసీదులో హైందవ సంప్రదాయం ప్రకారమే అన్ని పూజలు, హారతులు జరిగేవి. బాబా దగ్గరుండి అన్నింటినీ జరిపించేవారు. అదేసమయంలో ముస్లిం సంప్రదాయం ప్రకారం మొహరం పండగ, పీర్ల ఊరేగింపు చందనోత్సవం జరిపించేవారు.

బాబాసర్వాంతర్యామిత్వం

బాబా ఏనాడూ షిర్డీ దాటివెళ్లలేదు. కానీ, ఆయనకు ప్రపంచంలో ఎక్కడెక్కడ ఏమేమి జరుగుతున్నాయో అన్నీ తెలిసేవి. ఉదాహరణకు షిర్డీనుంచి 80 మైళ్ళ ఉన్న మన్మాడుకు వచ్చేపోయే రైళ్ల రాకపోకలు

తెలిసేవి. వాటి ఆలస్యాలు తెలిసేవి. కానీ, షిర్డీనుంచి మన్మాడు ఎళ్ళే రైలందుకొందామనుకొనే భక్తులకు ఇలా తెలిసే అవకాశంలేదు గదా. వాళ్ళు షిర్డీ విడిచి వెళ్ళడానికి బాబాని అనుమతి కోరితే బాబా ఇచ్చేవారు కాదు. భక్తులు తమరైలు తప్పిపోతుందేమోనని ఎంతో ఆదుర్దా చెందేవారు. చివరకు బాబా అనుమతివ్వగా వారు పరుగుపరుగున టాంగాచేసికొని మన్మాడువెళ్లేవారు. అప్పటికే ఎన్నో గంటలు ఆలస్యం అవటం కారణంగా తాము రైలు తప్పిపోతామని ఎంతో వ్యధ చెందేవారు. అయితే, సరిగ్గా వాళ్ళు స్టేషన్ ప్లాట్‌ఫామ్ పైకివచ్చేసరికి రైలు ప్లాట్‌ఫామ్ పైకి వస్తూ దర్శనం ఇచ్చేది. అప్పుడువాళ్లు అంతవరకూ సాయిబాబాను తాము సరిగ్గా అవగాహన చేసుకోలేదని పశ్చాత్తాప పడేవారు.

తమ భక్తుల ఇళ్లలోఏమి జరుగుతున్నదో బాబాకు ఎప్పుడూ తెలుస్తూనే ఉండేది. ఒకసారి కట్టెల పొయ్యి వద్ద కూర్చొని అన్నం చేస్తున్న ఒక తల్లివళ్ళోబిడ్డ ఉన్న సంగతి మరిచి గబుక్కునలేచింది. అంతే ఆ బిడ్డ ఒక్కసారిగా ఎదురుగా మండే పొయ్యిలో పడింది. 'బాబా' అని ఆవిడకేక వేసింది. మరుక్షణం ఒకచేయి ఆబిడ్డను మంటలో పడకుండా కాపాడింది. ఆ బిడ్డను నిదానంగా మంట పక్కన పడుకోబెట్టి ఆ చేయి అదృశ్యమైంది. సరిగ్గా అదే సమయంలో మసీదులో నిధునిలో బాబా తన హస్తాన్ని పెట్టటం చూసి భక్తులు హాహాకారాలు చేశారు. బాబాచేయి నల్లగా కాలింది. అయినా ఆయన ఏమీ అయినట్టు కనిపించలేదు. డాక్టర్ను పిలవడానికి, వైద్యానికి కూడా నిరాకరించారు. ఇలా చెప్పుకొంటూ పోతే బాబా సర్వాంతర్యామిత్వానికి ఉదాహరణలు లెక్కలేనన్ని. నానాసాహెబ్కూ తురుమైనతాయి ప్రసవానికి బాబాటాంగా పంపటం నుంచి శ్యామాకు కాశీలో బాబా దర్శనం లభించటం వరకూ ఎన్నో చెప్పవచ్చు. ఒక్క

విషయం ఏమిటంటే ఎవ్వరు ఎక్కడ బాబా ఫొటోకు దణ్ణంపెట్టుకొన్నా, ఎవరు బాబా ఫోటోని ఎక్కడైనా తదేకంగాచూసినా మరుక్షణంఅది శిర్డిలోని బాబాకుతెలిసేది.

కృష్ణతత్త్వం, ద్వారకామాయి

బాబా దినచర్యలు, మాటలు నిఘాఢం. బాహ్య స్పృహలేనివాడుగా కనపడే బాబా నిత్యం జాగరూకుడై ఉండేవాడు. బాబాకు నిద్ర ఉండేది కాదు. కొన్నిసార్లు లీలా మానుషుడై ఉండేవాడు. ఒకప్పుడు బాబా మసీదు దంతం పట్టెల నుంచి ఒక చినిగిపోయిన పాతగుడ్డని వేలాడదీసి, దానిరెండు చివర్ల ఒకబల్ల పరుపు చెక్కకట్టి వేలాడేసేవాడు. భక్తులందరూ చూస్తుండగా ఆయన దానిపై పడుకొని ఊగేవాడు. వారు పడుకున్నప్పుడు ఆబల్ల చెక్క నాలుగువైపులా దీపాలు వెలుగుతుండేవి. ఆయన ఊయల బయటనిల్చుని ఉన్నట్టుండేవాడు. క్షణంలో ఊయలపైన పడుకొని కనబడేవాడు. ఎప్పుడు ఎక్కుతాడో కనుక్కొందామని షిర్డీ ప్రజలు ఎంతో ఆసక్తితో కనురెప్పలార్పకుండా చూసేవారు. కానీ, క్షణంలో వారు ఇక్కడ మాయమై అక్కడ ఊయలపై దర్శనమిచ్చేవారు శ్రీమహావిష్ణువులాపడుకొని. బాబా తను ఉండే మసీదును 'ద్వారావతి', 'ద్వారకామాయి' అని పిలిచేవారు. ఎక్కడెక్కడినుంచో విఠలు భక్తులు పండరీపురం పోవాలని, దారిలో షిర్డీ వెళ్లి బాబాదర్శనం చేసి పోవాలని భావించి షిర్డీ వచ్చేవారు. కానీ, ఆ అవసరంలేకపోయేది. షిర్డీలో బాబా దర్శనంలోనే విఠలుడుదర్శనం ఇవ్వటం జరిగిపోయేది. బాబా పారాయణ చదివిన వారికి, భాగవతం చదివిన వారికి కృష్ణలీలల్లో సామ్యం స్పష్టంగా కనిపిస్తుంది.

కృష్ణమందిరనిర్మాణం

బాబా కొద్ది రోజుల్లోనే కాలం చేస్తారనగా సాఠేవాడలో నిద్రిస్తున్న బూటీ అనే నాగపూర్కోటీశ్వరుడికి కలలో కనిపించి తక్షణమే కృష్ణ మందిరం నిర్మించమని చెబుతాడు. సరిగ్గా అదే సమయంలో షిర్డీలో స్వగృహంలో నిద్రిస్తున్న శ్యామాకు కూడా కలలో కనిపించికృష్ణ మందిర నిర్మాణంగురించి శ్రీమాన్ బూటీతో చర్చించి త్వరలో మందిర నిర్మాణం ప్రారంభించామని చెబుతాడు. ఇద్దరికీ ఒకేసారి ఒకే తీరు కలరావటంతో వారు భయులు బాబాను సంప్రదించి మరుక్షణమే ఆలస్యం చేయకుండా బాబా చెప్పిన స్థలంలో టెంకాయ కొట్టి మందిర నిర్మాణం ఆరంభిస్తారు.

విజయదశమి – అవతారసమాప్తం

ఈ క్రమంలో నిర్మాణం వేగం పుంజుకొంటున్న వేళ విజయ దశమినాడు బాబా తన శరీరాన్ని విడిచేస్తాడు. దేహత్యాగం ముందు తనదేహాన్ని బూటీ కట్టిస్తున్న మందిరంలో ఉంచమని చెప్పి కాలం చేస్తాడు. ఈ సంఘటన జరగడానికి ముందు సంవత్సరక్రితమే బాబా తాను విజయదశమి రోజు సీమోల్లం ఘన చేయనున్నట్లు భక్తులకు సూచన చేస్తాడు. కానీ, చాలామంది షిర్డీలోని వారికి ఆ సూచన అర్థం కాలేదు. ఆరోజు బాబా ఒక్కసారిగా దయ్యం పూనినవానిలా లేచి ఎగరటం ప్రారంభిస్తాడు. తన వంటి మీది బట్టలను విసిరేస్తాడు. ధునిలో మంటలను ఎగసేలా చేస్తాడు. అవి మసీదు దంతేలను తాకేలా ఎగిశాయి. కాసేపటికి బాబా శాంతిస్తాడు. శ్యామా ఆయనకు తీసేసిన అంగరఖా తొడిగి 'ఏమిటిబాబా? హఠాత్తుగా ఈ హోడావుడి ఏమిటి? సాధారణ మనుషులం, మాకెలాఅర్థం అవుతుంది నీ చేష్టలు?' అని అడుగుతాడు. 'ఈరోజు నాసీమోల్లంఘన' అని జావాబు ఇస్తాడు బాబా. కానీ, ఎవ్వరికీ ఆమాట

అర్థం కాలేదు. అంతటితో ఆవిషయం మరిచిపోతారు. సరిగ్గా సంవత్సరం తరువాత బాబా విజయదశమి రోజునే దేహం చాలించాక శ్యామాకు, బూటీకి విషయం బోధపడుతుంది.

శ్రీకృష్ణుడి జననం యోగ మాయ జననం తరువాత జరుగుతుంది భాగవతంలో. అంతే గాదు. కృష్ణుని జననం నుంచి కృష్ణుని దేహత్యాగం వరకూ యోగమాయ కృష్ణుని ఆధీనంలోనే ఉంటుంది. భారతంలో కౌరవులు కృష్ణుడిని 'మాయావి'గా వర్ణిస్తారు. కృష్ణునికి సర్వాంతర్యామిత్వం ఉంటుంది. కృష్ణుడు జగద్గురువుగాను, అవతారంగాను, మహావీరుడిగాను అద్భుత ప్రదర్శనచేస్తాడు భారతంలోనూ, భాగవతంలోనూ. సాయిబాబా అవతారంలో బాబాకు, యోగ మాయకు అన్యోన్య సంబంధం కనిపిస్తుంది. ఒకానొకసారి 'తానెవరు' అన్నదానికి వివరణ ఇస్తాడు బాబా హేమాడ్పంతుకు. 'తాను ఇంద్రియ చాలకుడినని, సృష్టికి మూలమైన మాయనని' చెబుతాడు. ఇంకా 'ఈ సృష్టి మొత్తం నా రూపమేనని, నాసగుణ రూపం ధ్యానించలేనివారు, ఈ సృష్టి రూపాన్ని ధ్యానిస్తే నన్ను ధ్యానించి నట్టేనని' చెబుతాడు.

విజయదశమి త్రిమూర్త్యాత్మకమైన జగన్మాత దుష్టులైన రాక్షసులను సంహరించిన శుభదినం. దీనినే ఇంద్రియాలపై జ్ఞానం జయించిన రోజు అని భావించవచ్చు. కృష్ణుడు తన మాయను ఇంద్రియ రూపంలో చరాచర జీవరాశుల్లో ఉంచినట్టు చెప్పాడు. ఎవరైతే కృష్ణుడిని శరణుజొచ్చుతారో వారిని ఆ మాయ నుంచి రక్షిస్తానని కూడా మాట ఇస్తాడు. అలా కృష్ణుడికి, యోగమాయకు, త్రిమూర్త్యాత్మకమైన జగన్మాతకు మధ్య సంబంధమే సాయిబాబా జీవితంలోనూ దర్శనమిస్తుంది. బాబానే స్వయంగా

చెప్పినట్టు తానే కృష్ణుడినని, బూటీకట్టే కృష్ణమందిరంలో తనని ఉంచమని చెప్పటం ద్వారా నిర్ధారణ అయింది గదా. అలా బాబాకు, ద్వారకామాయికి, కృష్ణభగవానుడికి, విజయదశమికి మధ్య సంబంధం అవగాహన చేసికోవచ్చు.

(భక్తి మాసపత్రిక,అక్టోబర్ 2024)

11
స్వామి వివేకానంద - పాశ్చాత్య శిష్యుల స్మృతులలో

'ఆత్మనోమోక్షార్థం జగత్ హితాయ చ' ఋగ్వేద సూక్తి భారతదేశ చరిత్రలో పందొమ్మిదవ శతాబ్దం ఒక వింతానుభవం. ఈ కాలంలో ఈ దేశం అనేక మంది మహర్షులను చూసింది. వారి తపస్సులకు, బాధలకు, మహిమలకు ఈ పవిత్ర భూమి నెలవయింది. అలాంటి ఋషితుల్యులైన మహనీయులలో ఒకరు శ్రీ రామకృష్ణ పరమహంస అయితే, మరొకరు ఆయన శిష్యులలో ప్రథముడు, అగ్రగణ్యుడయిన స్వామి వివేకానందుడు. ఇవ్వాళ మనం గొప్ప ఋషి పరంపరగా వ్యవహరించే ఈ పేర్లు వారి అసలు పేర్లు కావు. అసలు పేరు గదాధరుడైన శ్రీ రామకృష్ణ పరమహంస ఫిబ్రవరి 18, 1836 లో కామార్పుకూర్‌లో (నేటి పశ్చిమ బెంగాల్) జన్మించారు. శ్రీ రామకృష్ణ పరమహంసగా ఆగస్టు 16, 1886 లో దేహం త్యజించారు. అంటే సరిగ్గా 50 సంవత్సరాల పైన ఆరు నెలలు మాత్రమే జీవించారు. అలాగే మనం స్వామి వివేకానందుడని ఎంతో

ప్రేమతో, భక్తితో పిలిచే మహర్షి పుంగవుల అసలు పేరు నరేంద్రనాథ్ దత్త. జనవరి 12, 1863లో కోల్కత్తాలో జన్మించారు. జులై 04, 1902న కాలం చేశారు. అంటే 39 సం ఆరు నెలలు జీవించారు. మరో తమాషా విషయం ఏమిటంటే ఈ మహర్షి ద్వయం ఒకే శతాబ్దంలోనే జనించి, జీవితం ముగించటం.

ఎందుకిలా చెప్పుకోవలసి వచ్చిందంటే ఈ ఇద్దరు మహర్షులు జీవించిన కాలం బహు స్వల్పమైనా, ఆధ్యాత్మిక సముద్రాలనే సృజించారు. ముక్తి మార్గాలకు దారులు తెరిచారు. ఎంతోమంది స్వదేశీ, విదేశీయులకు ఆత్మ సాక్షాత్కార మార్గాల రహస్యాలు విప్పి చెప్పారు. ఎంతో మంది ఆ బాటలో పయనించి ఆత్మ సాక్షాత్కారం పొందారు. ఋగ్వేదంలో ఒక సూక్తి ఏమిటంటే ఎవరికి వారు 'ఆత్మ' సాక్షాత్కారం పొంది దేహం విడిచిపోవటం సరి కాదు. తాము ముక్తి పొందటమే కాదు, పలువురికి ముక్తి కలిగించే మార్గ దర్శకం చేయాలి. దీనినే 'ఆత్మనోమోక్షార్థం జగత్ హితాయ చ ' అని వర్ణించింది ఋగ్వేదం. ఈ సూక్తే తరువాతి కాలంలో శ్రీ రామకృష్ణ మఠం ప్రధాన లక్ష్యంగా నిర్దేశించారు దానిని స్థాపించిన స్వామి వివేకానంద.

వీరి సమకాలికులైన యోగులు ఆకాలంలో ఎందరో బెంగాల్ లోను, ఇతర రాష్ట్రాలలోనూ ఉన్నా, రెండు శతాబ్దాలు గడిచినా ఇంకా శ్రీ రామకృష్ణ గురుదేవులను, వివేకానందులను వారి జీవిత సందేశాలను విస్తృతంగా ఉదహరిస్తూ, ఆచరించేవారు కోట్లలో ఉండటం. శ్రీ రామకృష్ణుల శిష్య గణంలో ఎందరో ఉన్నా, వారిలో స్వామి వివేకానందకే తొలుత పాశ్చాత్య శిష్యులు ఏర్పడ్డారన్నది నిర్వివాదం. ఈ పాశ్చాత్య

శిష్యులెవ్వరూ సామాన్యులు కారు. అత్యంత ప్రతిభావంతులు, ధనవంతులు, పరమతానుష్టాన పరులు అయి ఉండి కూడా హైందవాన్ని స్వీకరించి, స్వామి చూపిన మార్గంలో రాజయోగ సాధన చేసి మోక్షమార్గం పొందారు. స్వామి వివేకానందుడు స్వయంగా రాజ యోగి కావటం వలన ఇది వారికి సాధ్యమైంది.

స్వామి వివేకానంద పాశ్చాత్య శిష్యులు

స్వామి ప్రధాన విదేశీ శిష్యులలో సిస్టర్ క్రిస్టీన్ ఒకరు. ఈవిడ అసలు పేరు క్రిస్టినా గ్రీన్స్టైడెల్ (1866–1930). జన్మతః జర్మనీకి చెందిన ఈమె తల్లిదండ్రులు అమెరికాలో స్థిరపడటంతో అక్కడే తొలిసారి స్వామి వివేకానందను 1894లో కలిశారు. స్వామి ఉపన్యాసాలకు, హైందవ మత ఔన్నత్యానికి ముగ్ధరాలైన ఈమె రెండో ఆలోచన లేకుండా సన్యాసం స్వీకరించారు. ఆమె స్వామితో తనకున్న గురుశిష్య సంబంధాన్ని వివరిస్తూ ఒక సందర్భంలో స్వామి గురించి ఇలా రాశారు. "ఒక క్లాసులో కొంతమంది ప్రతిభా వంతులుంటారు. వారిలో ఒకరు అందరికన్నా ముందు ఉంటారు. ఇలా ఒక విద్యాలయంలో కూడా అందరికన్నా ముందు ఒక వ్యక్తి ఉండవచ్చు. అలాగే ఒక ఊరిలో కూడా ఉండవచ్చు. కానీ, స్వామివివేకానందని ఇలా పోల్చలేము. ఆయనను కలిసిన తొలిసారే ఆయన ఈ లోకానికి చెందిన వాడుకాదని, వేరే లోకాలనుంచి ఇక్కడకు వచ్చార ని ఇట్టే గ్రహించవచ్చు. అలాగే ఒక రోజు చెప్పా పెట్టకుండా ఈయన తన లోకానికి తరలిపోతారని ముందుగానే మాకు తెలుసు. ఎందుకంటే ఏ విషయంలోనూ ఆయనతో పోల్చదగ్గ వ్యక్తి ఈ విశ్వంలో ఎవ్వరూ కనిపించరు' అని.

స్వామి కంటే మూడేళ్లు చిన్న వయస్సున్న క్రిస్టినాను స్వామి వివేకానంద తన సొంత కుమార్తెగా చూసేవారు. సిస్టర్ గార్గి, పరివ్రాజక వజ్రప్రాణలు స్వామి ఆమెను సొంత కూతురులా చూసేవారని తమ రచనల్లో పేర్కొనడం ఇందుకు నిదర్శనం. ఆవిడకు ఉపదేశం ఇచ్చేముందు స్వామి ఆమెతో 'నాకు కొన్ని దివ్య శక్తులున్నాయి. నేను వాటిని తరచూ వాడను. నువ్వు ఉపదేశం అడుగుతున్నావు కనుక నేను వాటిని వాడాలనుకొంటున్నాను. నీ అంతరంగాన్ని పరీక్షించనిదే నేను ఉపదేశం చేయలేను. అయితే అందుకు నీ అనుమతి కావాలి', అని అడిగారు. అంతవరకూ స్వామికి అటువంటి దివ్య శక్తులున్నాయని ఎవ్వరికీ తెలియదు. అందుకు ఆమె అంగీకారం తెలిపింది. ఆమె మనస్సును పూర్తిగా పరీక్షించాకనే స్వామి ఆమెకు దీక్షనొసగారు. తను కొద్దిరోజులలో దేహత్యాగం చేస్తారనగా చివరిసారి ఆమెకు ఉత్తరం రాస్తూ, ఆమెను తన ఆధ్యాత్మిక దేవత, గురువు అయిన కాళీమాత సంరక్షణకు పంపించేసానని రాశారు. ఆ తరువాత కొద్దీ రోజులకే స్వామి దేహత్యాగ వార్తను సిస్టర్ నివేదిత లేఖ ద్వారా తెలుసుకొన్నారు క్రిస్టీన్.

క్రిస్టినా గ్రీన్స్టైడెల్ తరువాత స్వామికి దగ్గరైన మరో విదేశీ భక్తురాలు జోసెఫిన్ మాక్ క్లియోడ్ (1858-1949). ఈమే జన్మతః అమెరికన్. క్రిస్టియన్ గా కొనసాగుతూనే ఈమె స్వామి వేదాంత ఉపన్యాసాలపట్ల తీవ్రంగా ఆకర్షితురాలైనారు. స్వామి వివేకానందకు శ్రీరామకృష్ణ మఠం నడపడానికి అవసరమైన నిధులను ఆమె తొలిసారి సమకూర్చారు. భారత దేశం వచ్చి వేదాంత సోసియేటీలలో గడిపే వారు. ఇందులో కొన్ని ఆవిడే కట్టించారు.

ఒక సారి స్వామిజి గీతపై చేసిన ప్రసంగాలు వింటూండగా ఆమెకు స్వామి వారు మాయమై, ఆ స్థానంలో 'కృష్ణ' పరమాత్మ గీతను ఉపదేశిస్తున్నట్టుగా కనిపించింది. ఆమె శ్రీ రామకృష్ణ మఠం పై నాటి బ్రిటీష్ వారు చూపిస్తున్న వ్యతిరేకతను ధైర్యంగా ఎదుర్కొంది. చివరికి వారిని స్వామిజి గొప్పతనం గురించి ఒప్పించింది. దానితో వారు రామకృష్ణమఠంను బ్లాక్ లిస్ట్ నుంచి తొలగించారు. జోసెఫిన్ శ్రీ రామకృష్ణ మఠానికి విస్తృత ప్రాధాన్యం కలిపించారు. రొమైన్ రోలా అనే ఫ్రెంచ్ నోబెల్ బహుమతి గ్రహీతను కలిసి శ్రీ రామకృష్ణ, వివేకానందుల గురించి వివరించి, ఆయనకు వారిపై ఆసక్తి రేకెత్తించారు. ఆ తరువాత రొమైన్ రోలా శ్రీ రామకృష్ణ, వివేకానందుల పైన జీవిత చరిత్రలు రాశారు.

మార్గరెట్ ఎలిజబెత్ నోబుల్ నే 'సిస్టర్ నివేదిత' అని స్వామి వివేకానంద పిలిచేవారు. స్వతః ఐరిష్ దేశస్థురాలైన మార్గరెట్ నోబుల్ (1867-1911) బాగా చదువుకొన్న స్త్రీ మూర్తి. ఆవిడ లండన్లో ఉద్యోగం చేసేకాలంలో డబ్ల్యు బి యేట్స్, బెర్నార్డ్ షాలతోకలిసి 'సీసమే క్లబ్' నడిపేది. అక్కడ అనేక సాహిత్య, చారిత్రక, వైజ్ఞానిక చర్చలు జరిగేవి. అలా లండన్లో ఉండే కాలంలోనే 1895 నవంబర్లో ఆమెకు స్వామి వివేకానందతో తొలి సారి పరిచయం జరిగింది. 63, జార్జ్ స్ట్రీట్ లోని ఒక ధనికులైన బ్రిటిష్ వారి ఇంట్లో వేదాంతం గురించి మాట్లాడమని స్వామి వివేకానందాను అమెరికానుంచి ఆహ్వానించారు. అక్కడ నేలపై బాస్పెట్లు వేసుకొని వివేకానంద వేదాన్త మార్గం ఔన్నత్యం వివరిస్తుండగా మార్గరెట్ నోబుల్ తొలిసారిగా ఆయన ఉపన్యాసం విన్నది. అత్యంత మధురమైన కంఠం వేదసూక్తులు ఆలపిస్తుంటే ఆమెకు తను కోల్పోయిందేదో ఇక్కడ తిరిగి పొందినట్లయింది. ఆమెకు మరో గౌతమ

బుద్ధుడు స్వామిలో కనిపించాడు. ఆవిడ అనేక సందేహాలు చిటికలో స్వామి నివృత్తి చేయటం ఆవిడని మరింత ఆశ్చర్య పరిచింది. భారత దేశం వచ్చి, ఇక్కడ స్త్రీల విద్యా బోధనకు కృషి చేయమన్న స్వామి వివేకానందుని పిలుపు మేరకు ఆమె కోల్కత్తాలో తొలి బాలికల పాఠశాల ఆరంభించింది. ఈ పాఠశాల ఆరంభానికి డా॥ జగదీష్ చంద్రబోస్, రబింద్రనాథ్ టాగోర్ వంటి అనేక మంది ప్రముఖులు వచ్చారు. ఆపై నివేదిత దేశ సేవలో వెను తిరిగి చూడలేదు. స్వామి వివేకానందతో కలిసి ఆమె హిమాలయాలు, అమర్నాథ్, కాశ్మీర్లు పర్యటించింది. అమెరికాకు పలుసార్లు వెళ్ళింది. స్వామి వెంట నీడలా నడిచింది.

ఆవిడ మిత్రులైన జోసెఫిన్ మాక్ లియోడ్, సారా బుల్ తో కలిసి స్వామి వెంట ఎప్పుడూ ఉంటూ స్వామి ఉపన్యాసాలను సంగ్రహంగా పుస్తకంలో రాసేది. 'ది మాస్టర్ ఐ సా హిమ్' (నేను చూసిన స్వామి వివేకానంద), 'సం వాండరింగ్స్ విత్ స్వామి వివేకానంద' (స్వామి వివేకానంద తో నా పర్యటనలు) అనే రెండు పుస్తకాలు రాశారు నివేదిత. ఆమె 'ది మాస్టర్ ఐ సా హిమ్ ' లో స్వామి వివేకానంద దేహం విడిచిన రోజు జులై 04, 1902 రాత్రి వచ్చిన తన కల గురించి చాలా వివరంగా రాసింది. అంతకు ముందు జులై 02, 1902 న ఏకాదశి రోజు ఉపవాసం చేసి, స్వామి వివేకానంద నోబుల్ను, సారా బుల్ ను, మాక్ లియో డ్ లకు భోజనం పెట్టి వారి కాళ్ళు, చేతులు తుండు గుడ్డతో తుడవటం తనకు బైబిల్ లోని 'లాస్ట్ సప్పర్' గుర్తు చేసిందని రాసింది. అలాగే స్వామి వివేకానంద జులై 04, 1902న రాత్రి తొమ్మిది గంటలకు దేహం విడిచిన సమయంలోనే, నివేదితకు కలలో శ్రీ రామకృష్ణులు రెండవసారి దేహత్యాగం చేస్తున్నట్టు కనిపించింది. ఆ మర్నాడే బేలూర్

మఠం అధ్యక్షులు శ్రీ శారదానంద నుంచి ఒకమనిషి ఒక ఉత్తరం తెచ్చి నివేదితకిచ్చాడు ఉదయం 7 గంటలకే. అందులో వార్త ఏమిటంటే 'స్వామి వివేకానంద ఇక లేరు' అని. సన్యాసి అయినా నివేదిత తన తండ్రిని కోల్పోయిన నాటికన్నా ఎన్నో రేట్లు దుఃఖం పొందానని రాసింది.

నివేదిత పదేళ్ల ప్రాయంలోనే తండ్రిని కోల్పోయింది. బాగా పెద్దయిన తరువాత తండ్రి లాంటి స్వామి వివేకానందాను కోల్పోవటం ఆమెకు చాలా పెద్ద దెబ్బ తగిలినట్లయింది. పుట్టెడు దుఃఖంతో బేలూరు మఠం చేరి, నేలపై పడు కోబెట్టిన స్వామి వివేకానందుడి పార్థివ దేహాన్ని చూసి తట్టుకోలేకపోయింది. స్వామి అంత్యక్రియలు అయ్యే వరకూ ఆయన శిరస్సు వద్దనే ఉండి, చేత్తో విసురుతూ కాలం గడిపింది. ఇక్కడ ఒక గమ్మత్తు జరిగింది. స్వామి వంటి పై ఉన్న కాషాయం వస్త్రం ముక్క కొంచెం తీసుకోవాలనుకొంది నివేదిత. ఆ విషయం శ్రీ శారదానందకు తెలియపరిచింది. ఆయన అనుమతి ఇచ్చారు కూడా. కానీ, ఆమె తీసుకోలేదు. వాస్తవంగా క్రైస్తవుల్లో శిలువ వేసిన ఏసు క్రీస్తు దేహం పైన కప్పిన వస్త్రాన్ని 'శ్రౌడ్ అఫ్ పురిన్' (పవిత్ర వస్త్రం) అంటారు. ఆ వస్త్రం తీసుకోవాలని ఎంతోమంది ఎన్నోప్రయత్నాలు చేసినా ప్రయోజనం లేకపోయింది. అలాంటి భావనేదో నివేదితను కాసేపు కదిలించినట్టున్నది. జులై 5 మధ్యాహ్నం స్వామి వివేకానందుని చితికి నిప్పంటించారు. అగ్ని శిఖలు ఆకాశాన్నంటాయి. సరిగ్గా ఆ సమయంలో నివేదితను వెనుకనుంచి ఎవరో తట్టినట్టయింది. ఒక్కసారిగా వెనక్కు చూసింది నివేదిత. ఖాళీ స్థలం తప్ప అక్కడ ఎవ్వరూ లేరు. సన్నగా పొడవుగా రిబ్బన్ లా, కొంత కాలినట్టున్న కాషాయం వస్త్రం ముక్క ఒకటి నివేదిత వెనుక నిలిచి ఉంది. ఒక్క సారిగా ఆమె రోమాలు నిక్కపొడుచుకొన్నాయి.

ఆ పీలికను అందుకొని కళ్ళకు అద్దుకొంది. ఆమె కడదాకా ఆ కాషాయం పీలికను అట్లాగే పూజలో తన వద్ద ఉంచుకొంది.

ఎమెర్సన్ వాల్డో, సిస్టర్ దేవతమ్మ వంటి స్వామి వివేకానంద సన్యాసినులు కూడా ఎన్నో గొప్ప గొప్ప అనుభూతులు పొందారు స్వామి సాన్నిధ్యంలో. వీరిద్దరూ అమెరికన్లు. ముందు స్వామి వివేకానంద ఎవరో తెలియదు. హఠాత్తుగా అనుకోని క్షణంలో స్వామి ప్రసంగాలు వినటం, ఆ తరువాత వీరు స్వామి ప్రసంగాలు ఎక్కడ ఉంటే అక్కడికి వెళ్ళటం మామూలు అయిపొయింది. ఈ ఉభయులు స్వామి ప్రసంగాల ద్వారా క్రిస్తు బోధలకు సరైన అర్థం తేలికోగలిగారు. ఎమెర్సన్ వాల్డో అంతకు ముందు ఎందరో సన్యాసులను చూసింది. కానీ, స్వామి వివేకానంద వేరని ఆమెకు స్పష్టంగా అర్థం అవటానికి ఎక్కువ సమయం పట్టలేదు. 'ది లైట్ అఫ్ ఆసియా' పుస్తకం రాసిన ఎడ్విన్ ఆర్నాల్డ్, ఎమెర్సన్ వాల్డోకు దూరపు బంధువు. ఈ పుస్తకంలో బుద్ధుడి జీవితం ఆసియాకు ఒక నూతన జవసత్వాలను ఇచ్చిందని రాసాడు ఎడ్విన్ ఆర్నాల్డ్. కడకు వాల్డోకు కూడా స్వామి వివేకానందుడు గౌతమ బుద్ధుడు లాగే కనిపించాడు.

వాల్డో తాను చుసిన సన్యాసుల్లో ఎదో ఒక బలహీనత గమనించిన వెంటనే వారిని వదిలేసి కొత్త వారికోసం వెతకటం చేసేది. అలాగే స్వామి వివేకానందలో కూడా ఎదో బలహీనత ఉండే ఉంటుందని ఆయనను అనుక్షణం గమనించ సాగింది. ముఖ్యంగా స్వామిజి కాషాయ దుస్తుల్లో న్యూయార్క్ విధుల్లో వెళుతుంటే స్థానిక క్రైస్తవుల నుంచీ అనేక ఇబ్బందులు, విమర్శలు, చెడు మాటలు వినవలసి వచ్చేది. అయినా స్వామి కాషాయాన్ని విడకపోవటం వాల్డోను ఆశ్చర్య పరచేది. పోరగా, పోరగా స్వామి వివేకానందుడు న్యూయార్క్ విధుల్లో కాషాయం బదులు అమెరికన్ సూటు, బూటు వేసుకోసాగాడు.

ఆయనకు న్యూయార్క్‌లో మంచి హెూటళ్లలో ఉండేందుకు రూములు దొరికేవి కావు. మత వివక్షనే కారణం. అందువల్ల ఆయన చాలా తక్కువ స్థాయి హెూటల్ గదుల్లో ఉండవలసి వచ్చేది. ఒక సారి ఆయన అలా సూటు, బూటు వేసుకొని హెూటల్ మెట్ల పైన తన డ్రెస్సును చూసుకో సాగాడు. అప్పుడు వాల్డో అనుకొంది 'స్వామి వివేకానందకు కూడా దేహ సౌందర్య భ్రాంతి ఉంది. అందువల్లే అద్దంలో పదే పదే చూసుకొంటున్నాడని.' నిజానికి స్వామి సూటు, బూటులో ఎప్పటికన్నా పదిరెట్లు అందంగా ఉండేవాడు. కానీ, ఎప్పుడైతే వాల్డో ఇలా మనస్సులో అనుకొందో, వెంటనే వెనుకకు తిరిగి స్వామి వివేకానంద ఆమెతో ఇలా చెప్పాడు. 'హరిదాసి, (వాల్డోకి స్వామి వివేకానందుడు ఇచ్చిన సన్యాస ఆశ్రమ నామం 'హరిదాసి'). నేను అద్దంలో చూసుకొని పక్కకు పోగానే అద్దంలో ఎలా ఉండేవాడినో గుర్తుండటం లేదు. ఎందుకని?' ఆమె ఒక్క క్షణం నిర్ఘాంత పోయింది. స్వామి వివేకానంద తనని అద్దంలో చూసుకొన్న సందర్భం, అప్పుడు ఆయనకు కలిగిన అనుభూతి గొప్ప అద్వైత వేదాంతా భాష్యానికి నిదర్శనం అన్న విషయం ఆమెకు చాలా ఆలస్యంగా అర్థమయింది.

ఇలా ఎందరో అమెరికన్, జర్మన్, ఇంగ్లీష్ దేశ పౌరులు స్వామి వివేకానందను కలిసిన మరుక్షణం నుంచీ ఆయన శిష్యులై ముక్తి పొందాలని తహ తహలాడిన వారే. కార్నెలియా కాంగేర్, మార్తా బ్రౌన్ ఫింకి, మేడం ఈ కాల్వ్, క్రిస్టినా అల్బెర్స్, ఇసబెల్ మార్గెస్సాన్ వంటి వారు స్వామి వారితో వారికి కలిగిన ఆధ్యాత్మిక ఉన్నత స్థాయిలను చక్కగా వివరిస్తూ 'రెమినిసెన్సెస్ అఫ్ స్వామి వివేకానంద: వెస్టన్ కొలీగ్స్' అనే పుస్తకం రూపంలో వెలుగులోకి తెచ్చారు. తరువాత కాలంలో శ్రీ

రామకృష్ణ మఠం వారే ఈ పుస్తకాన్ని 'రెమినిసెన్సెస్ అఫ్ స్వామి వివేకానంద: ఈ‌స్ట్రన్ అండ్ వెస్ట్రన్ కొలీగ్స్' అంటూ ఆసియా శిష్యులను కలిపి ప్రచురించారు. ఈ వ్యాసంలో కేవలం స్త్రీ భక్తుల మనో భావాలను, ఆధ్యాత్మిక భావాలను టూకీగా పేర్కొనడం జరిగింది. ఇంకా పురుష భక్తులవి పేర్కొనడం జరగలేదు. అవికూడా ఇంతకు మించి అలౌకిక, ఆధ్యాత్మిక ఆనందాన్ని ఇస్తాయి. ఇలా 'బహుజన హితాయ, బహుజన సుఖాయ' ఋగ్వేద సూక్తి ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పాడు స్వామి వివేకానంద.

(భక్తి మాసపత్రిక, జనవరి 2025)

12

ఉత్తరాయణం - భీష్మేకాదశి - భీష్మ నీతి

జనవరి నెల రాగానే మనకు సంక్రాంతికంటే ముందువచ్చే విశేష పండగ 'ముక్కోటి ఏకాదశి'. సూర్యుడు ఉత్తరాయణానికి మారే ముందు వచ్చే ధనుర్మాస శుద్ధ ఏకాదశినే వైకుంఠ ఏకాదశి లేదా 'ముక్కోటి ఏకాదశి' అంటారు. సూర్యుడు ధనుస్సులో ప్రవేశించిన అనంతరం మకర సంక్రమణం వరకు జరిగే 'మార్గం' మధ్య ముక్కోటి ఏకాదశి వస్తుంది. ఈ రోజున వైకుంఠ వాకిళ్లు తెరుచుకొని ఉంటాయని వైష్ణవాలయాలలో గల ఉత్తరద్వారం దగ్గర భక్తులు తెల్లవారుజామునే భగవద్దర్శనార్థం వేచి ఉంటారు. ఈ రోజు మహావిష్ణువు గరుడ వాహనారూఢుడై మూడు కోట్ల దేవతలతో భూలోకానికి దిగివచ్చి భక్తులకు దర్శనమిస్తాడు కనుక దీనికి 'ముక్కోటి ఏకాదశి' అనే పేరు వచ్చిందంటారు. ఈ ఒక్క ఏకాదశి మూడు కోట్ల ఏకాదశులతో సమమైన పవిత్రతను సంతరించుకున్నందువల్ల దీన్ని 'ముక్కోటి ఏకాదశి' అంటారని కూడా చెబుతారు. సూర్యుడు

మకరసంక్రాంతి నాడు మకరరాశిలో ప్రవేశించడంతో ఉత్తరాయణ పుణ్యకాలం ఆరంభం అవుతుంది.

భీష్మేకాదశి

మహాభారతంలో భీష్మాచార్యుడు ఈ ఉత్తరాయణ పుణ్యకాలం వచ్చేవరకూ యుద్ధభూమిలో 56 దినములపాటు అంపశయ్య పై పడుకొని ఉంటాడు. అప్పటికే భీష్ముడు 10 దినాల భీకర యుద్ధం చేసి నేల కొరిగే సమయంలో అర్జునుడు బాణాలతో ఏర్పరచిన అంపశయ్య పై వాలుతాడు. ఆనాటి యుద్ధం ముగిశాక శ్రీకృష్ణుడు పాండవులను వెంటబెట్టుకొని యుద్ధభూమిలో అంపశయ్య పై ఉన్న భీష్ముడి దగ్గరకు తీసుకెళ్తాడు. భీష్ముని ఆ స్థితిని చూసి పాండవులు చాలా దుఃఖిస్తారు. అప్పుడు కృష్ణుడు భీష్మునికి వారి తండ్రిచ్చిన స్వేచ్ఛామరణం వరాన్ని జ్ఞప్తికి తెస్తాడు. అప్పుడు భీష్ముడు ఉత్తరాయణ పుణ్యకాలం వచ్చాక తను కృష్ణునిలో విలీనమయ్యేలా అనుగ్రహించమని శ్రీ కృష్ణ భగవానుని కోరుకొంటాడు. అందుకు సమ్మతించిన శ్రీ కృష్ణ భగవానుడు అంతవరకూ ధర్మరాజుకు పాలనా నీతి, రాజ్య నీతి, గార్హస్త నీతిని బోధించి ధర్మశాస్త్రములో పరిపూర్ణుడిని చేయమని కోరుతాడు. అందుకు సంతోషంగా సమ్మతిస్తాడు భీష్ముడు.

మాఘ శుద్ధ అష్టమి నాడు భీష్మాచార్యుని ఆత్మ శ్రీకృష్ణునిలో లీనమైంది. భీష్ముడు మోక్షం పొందిన తర్వాత వచ్చిన మాఘ శుద్ధ ఏకాదశిని “భీష్మ ఏకాదశి”, “మహాఫల ఏకాదశి”, “జయ ఏకాదశి” అని అంటారు.

శాంతిపర్వం – అనుశాసనిక పర్వం – భీష్మ నీతి శాస్త్రం

భీష్ముడు యుద్ధం విజృంభించిన పర్వాన్ని 'భీష్మ పర్వం' అని, భీష్ముడు నిర్యాణం ముందు రాజనీతిని బోధించిన పర్వాన్ని 'శాంతిపర్వం అని అంటారు. శాంతి పర్వంలోనే భీష్మ నిర్యాణం జరుగుతుంది .

మహాభారతంలోని పద్దెనిమిది పర్వాలలో 'శాంతిపర్వమే' అతి పెద్దది. ఇది రాజధర్మానుశాసనపర్వ, ఆపద్ధర్మపర్వ మరియు మోక్షధర్మపర్వ అనే మూడు ఉప-పర్వాలను కలిగి ఉంది. మొత్తం మీద ఇది 365 అధ్యాయాలు మరియు 13,716 స్లోకాలను కలిగి ఉంది. శాంతిపర్వంలో ఆరు అశ్వాసాలు (భాగాలు) ఉన్నాయి. ప్రధమాశ్వాసంలో ధర్మరాజు స్త్రీలకు రహస్యాలు దాచకుండా శాపం ఇవ్వడం – వైరాగ్యం చెంది రాజ్యం స్వీకరించుటకు విముఖత, రాజ్యం స్వీకరించుటకు తిరస్కరణ. చదవడానికి గల సమయం, సామాజిక క్రమాన్ని, న్యాయాన్ని మరియు ప్రజల సంక్షేమాన్ని నిర్వహించడం ప్రాముఖ్యతను నొక్కి చెబుతుంది. ఆదర్శవంతమైన పాలకుడి లక్షణాలను కూడా చర్చిస్తుంది, జ్ఞానం, సమగ్రత మరియు కరుణ వంటి సద్గుణాలను నొక్కి చెబుతుంది. శాంతిపర్వలో, రాజధర్మం రాజకీయ మరియు పరిపాలనా కార్యకలాపాలకు సంబంధించిన విధులు వివరిస్తుంది. ప్రభుత్వం ద్వారా, శాంతి, శాంతిభద్రతలు, వేదవ్యాస రాజధర్మం రాష్ట్రంలో నిర్వహించడం ఎందుకు చాలా అవసరమో విశదపరుస్తుంది.

భీష్మ నీతి

అంపశయ్యపై పడుకొని ఉన్న భీష్ముడి వద్దకు ధర్మరాజుతో సహా మిగిలిన పాండవులు, ద్రౌపది, అనేకమంది ఇతర రాజులు, వశిష్ట మైత్రేయ, సనత్కుమార, వాల్మీకి , కపిల , వ్యాసుడు , నారదుడు వంటి మహర్షులు

కూడా విచ్చేశారు. అనుశాసన పర్వంలోని అశ్వాసాలలో కనిపించినట్టు ధర్మజుడు భీష్ముడిని అనేక సందేహాలు అడుగుతాడు. వాటికి భీష్ముడు చాలా వివరముగా జవాబులిస్తాడు. ఎనిమిదవ ఆశ్వాసంలో కృష్ణుడి మాయను మహర్షులకు నారదుడు వివరిస్తాడు. ఎందుకంటే అప్పటికే ఏడవ ఆశ్వాసంలోనే భీష్ముడు కాలం చేస్తాడు కనుక. ఇందులో అనేక విషయాలు భీష్ముడు ధర్మనందనుడికి కథల రూపంలో వివరిస్తాడు. ఈ కథలు కొన్ని ఇప్పటికే జనబాహుళ్యంలో ఉన్నాయి. కొన్ని పిల్లల పాఠ్య పుస్తకాలలో పాఠ్యఅంశాలుగా కూడా ఉన్నాయి.

ఉదాహరణకు మూడు చేపల కథ (దీర్ఘ దృష్టి, హ్రస్వ దృష్టి, ప్రాప్త కాలజ్ఞుడు) మనం అంతా ఎక్కడోకచోట వినే ఉంటాము. కానీ, అది మహాభారత కథ అని గాని , భీష్ముడు శాంతి పర్వం లోని అనుశాసన పర్వంలోనిదని కానీ మనకు తెలియదు.

'అలానే యుద్ధంలో ఒక వేళ ఓడిపోతే ఆ రాజు ముందున్న మార్గం ఏమిటీ?' అని అడిగిన ధర్మరాజుకు పూర్వం ఒక ఓడిన రాజు క్షేమదర్శి కథ చెబుతాడు భీష్ముడు. ఇతడు కోసల రాజు. విదేహ రాజు చేతులో ఓడిపోయి అడవులలోకి వెళ్ళిపోతాడు ఒంటరిగా. అతని మంత్రి కాలక వృక్షీయుడు. అతను రాజు ఎక్కడున్నాడో కనిపెట్టి వెళ్లి రాజును కలుసుకొంటాడు. రాజు తీవ్ర అశాంతిలో ఉన్నట్టు ఆయన మాటల్లో గ్రహిస్తాడు మంత్రి. అప్పుడా మంత్రి రాజా 'సిరి ఎవరి దగ్గర స్థిరంగా ఉండదు.' అంతేగాదు, మన ముందే ఆస్తులు, రాజ్యం , బంధువులు అన్నీ పోవటం చూసి దుఃఖించ వద్దు. మన్సశాంతి పోగొట్టుకోవటం మినహా వగచి సాధించేదేమీ ఉండదు. కాలం కలిసి వచ్చేవరకూ మీ

శాంతి చాలా అవసరం. కాలం మనకు అనుకూలంగా మారినప్పుడు ఈ మానసిక శాంతి మనకు బలానికి కారణం అవుతుంది. తిరిగి వివేకంతో వ్యూహం పన్ని శత్రువును జయించేలా తోడ్పడుతుంది. ఇదంతా విన్న రాజు క్షేమదర్శి మంత్రి కాలాక వృక్షియుడితో బాగా ఆలోచించి విదేహ రాజుతో సంధి ఒడంబడిక చేసుకొంటాడు. విదేహ రాజుకూడా క్షేమదర్శి శక్తి యుక్తులు తెలిసినవాడు కావటంతో తనకూతురు నిచ్చి వివాహం చేసి తన రాజ్యానికి వారసుడిని చేస్తాడు. ఇలా జ్ఞానంతో మనశాంతి పొంది వ్యూహంతో గెలవాలని బోధిస్తాడు భీష్ముడు యుధిష్ఠరుడికి.

ఇదే యుధిష్ఠర భీష్మ సంవాదంలో భీష్ముడు మానసిక శాస్త్రంపై తనకున్న పట్టును వివరించేందుకు పులి-నక్క కథ చెబుతాడు. పురికా అనే రాజ్యం ఒకటి ఉండేది. ఆ రాజ్యాన్ని పాలించే రాజు పేరు పౌరిక. అతను మరణించాక మరో జన్మలో నక్కగా పుట్టాడు. ఆ నక్కకు తన పూర్వ జన్మ జ్ఞానం ఉండేది. అది గత జన్మలో క్రూరుడుగా ఉండటం వలననే నక్కగా పుట్టినట్టు గ్రహించాడు. అందువల్ల ఈ జన్మలో క్రూరత్వాన్ని విడనాడి, అహింసే జీవన ధర్మంగా బ్రతకాలని నిశ్చయించుకొంది. ఆకులు అలములు తింటూ జీవించసాగింది . ఎందుకో తోటి నక్కలకు ఇది అంతుబట్టలేదు. మాంసాహారం తినవలసిన నక్క ఎందుకిలా ఉంటున్నట్టని దానిని అడిగాయి. అయినా ఏమి జవాబివ్వకుండా అది ఎప్పటిలాగే తన అహింసా జీవనం కొనసాగించింది. ఈ విషయం ఆనోటా, ఈనోటా పడి అడవికి రారాజైన పులి నోట్లో బడింది. పులి ఒకరోజు నక్కను వెతికి పట్టుకొని 'నీ సంగతి విన్నాను. నాతో స్నేహం చేయమని అడిగింది'. అందుకు నీకేమిటి ప్రయోజనం ?' అని నక్క అడిగింది. నీతో స్నేహం చేయటం వలన అడవిలో జంతువులన్నీ నన్ను క్రూర జంతువు అని భావించటం మానేస్తాయి' అని సమాధానం చెప్పింది

పులి. ఆ మాటలు విని నక్క ఒక షరతు పెట్టింది. 'ఏమిటంటే నువ్వు అలా ఉండటం వలన అందరికీ నా మీద అసూయ పెరుగుతుంది . అవన్నీ నీకు నా మీద రకరకాల చెప్పుడు మాటలు చెప్పడం మొదలుపెడతారు. ఆ మాటలు విని నువ్వు నన్నేమీ చేయవని మాట ఇస్తే నేను నీతో స్నేహం చేస్తాను' అని అంది. అందుకు పులి అంగీకరించటంతో వారి మధ్య స్నేహం మొదలైంది. అయితే నక్క ఊహించిందే నిజం అయింది. అడవిలోని పులులకు తమ పులి రాజు నక్క తో స్నేహం చేయటం సుతాము ఇష్టం లేదు. ఎలాగైనా ఆ బంధం తెగ గొట్టాలని నిర్ణయించుకొని ఒక పథకం ప్రకారంగా పులి రాజు తినవలసిన మాంసాన్ని నక్క గుహలో రహస్యంగా పెట్టి, పులి రాజుకు నక్క వంచన చేస్తూ , పులి రాజును మోసం చేస్తున్నట్టు నమ్మించాయి. ఈ తప్పుడు మాటలను క్షణంలో నమ్మేసిన పులి రాజు వెంటనే నక్కను చంపమని పులులను ఆజ్ఞాపించింది. ఇది తెలుసుకొన్న నక్క పులిరాజు వద్దకు వచ్చి 'నువ్వు చెప్పుడు మాటలు విని నాకు కీడు తలబెట్టావు. ఇకపై మనం స్నేహితులుగా ఉండలేము. స్వస్తి' అని చెప్పి వెళ్ళిపోయింది. పులి రాజు చేసిన పని గ్రహించి ఆ రాజు తల్లి పులిని కోప్పడింది. 'నీ తోటి పులులు అసూయతో చెప్పినవి విని నువ్వు నక్కకు కీడు తలబెట్టావు. రాజైనవాడు అసూయాపరులు చెప్పే మాటలను నమ్మగూడదు. నువ్వు తప్పు చేసావు' –నీవు రాజరికానికి అర్హుడవు కావని బోధించింది. ఈ లోగా నక్క ఆహారం మానేసి , ఆకలితో ప్రాణాలు విడిచింది. ఇలా రాజు చెప్పుడు మాటలు వింటే రాజ్య పాలన విషపూరితమవుతుందని భీష్ముడు ధర్మనందనుడికి తెలిపాడు.

ఇలాంటిదే రెండు పావురాల కథ. ఒక బోయవాడు పన్నిన వలలో కొన్ని పావురాలు చిక్కుకొంటాయి. ఇంతలో గాలి, వాన రావటంతో

బోయవాడికి ఆ పావురాలు చిక్కుకొన్న వలను తీసుకెళ్లటం సాధ్యం కాలేదు. వాన తగ్గే వరకూ అక్కడ ఉన్న ఒక చెట్టుకింద తల దాచుకొన్నాడు. ఆ చెట్టు పైన ఒక పావురాల జంట ఎప్పటినుంచో కాపురం ఉంటున్నాయి. ఆ రోజు దురదృష్టవశాతూ మగ పావురం చెట్టును చేరుకోగా, ఆడ పావురం కింద వలపన్నిన బోయవాడి వలలో ఇరుక్కొంది. బోయవాడు ఇంటిదగ్గర తన భార్య ఎంత భయపడుతున్నదో అని భావిస్తూ వగస్తున్నాడు. పైన మగ పావురం తన భార్య గురించీ అలానే వగస్తున్నది. అది గ్రహించిన ఆడ పావురం మగపావురానికి తాను బోయ వాడి వలలో అదే చెట్టుక్రిందున్నట్టు తెలియపరచింది. అంతేగాదు. భోజనం సమయమైనందున, బోయవాడు చలికి వణుకుతున్నందున అతనికి ఆతిధ్యం ఇమ్మని చెప్పింది. ఆవిధంగానే మగపావురం కొన్ని ఎండిన పేడు ముక్కలని చేర్చి మంట రాజేసింది. అంతేగాదు. వాని ఆకలి తీర్చేందుకు తానే చితిలోకి దూకి ఆహారం అయింది. అది చూసి బోయవాడు చలించి పోయి ఆ వలలో పావురాలన్నింటినీ విడిచిపెట్టేశాడు. అయినప్పటికీ విడుదలైనా తన భర్త అప్పటికే చితిలో పడి బోయవాడికి ఆహారం అయినందున, తను కూడా ఆ మంటల్లో దూకి చనిపోయింది. ఆ సంఘటన కనులారా చుసిన బోయవాడు నిర్ఘాంత పోయి, తన వృత్తి పై అసహ్యంతో పావురాలను పట్టి వాటి మాంసాన్ని అమ్మే వృత్తి మానేసి ఇతరత్రా వ్యాపారం చేసి బ్రతకు సాగించాడని భీష్ముడు ధర్మరాజుకు బోధించాడు.

భీష్ముడు ధర్మనందనుడికి వర్ణాశ్రమ ధర్మములోని నీతిని చక్కగా వివరించటంతో అనుశాసనాపర్వం ప్రారంభమవుతుంది. క్షాత్ర ధర్మాలే కాకుండా ఏ ఆశ్రమం వారైనా అహింసా ధర్మాన్ని ఎలా అనుసరించాలో పైన చెప్పినట్టు వివిధ దృష్టాంతాలతో కథలతో వివరిస్తాడు. జన్మలు,

పునర్జన్మలు, స్వర్గం, నరకం, కామక్రోధాదుల వలన మనిషి తన పూర్వ జన్మ స్మృతి ఎలా కోల్పోవుతున్నాడో కూడా వివరిస్తాడు. ఈ అనుశాసన పర్వాలలోనే ధర్మజుడు కుంతీ కథ, కర్ణ జన్మ వృత్తాంతం, తన తల్లి కర్ణుని జన్మ వృత్తాంతం దాచటం వలన కలిగిన అనర్థం తెలుసుకొని కుంతీదేవిని శపిస్తాడు. ఆ శాపం ఏమిటంటే 'స్త్రీలకు రహస్యం దాచే శక్తి లేకుండా పోవాలని'. మనుషుల జీవనానికి సంబంధించిన అనేక ప్రశ్నలకు పార్వతికి శివుడు చెప్పిన విధంగా భీష్ముడు ధర్మరాజుకు మానవుడి ఏ కర్మలు దోషపూరితాలు, ఏవి కావు వివరిస్తాడు.

అంతేగాదు, మరణానంతర స్థితి, జీవుడు ఏ దేహంతో ఊర్ధ్వ లోకాలకు వెళ్తాడో కూడా వివరిస్తాడు. మానవుడు తన పూర్వ జన్మ కర్మల వాసనా బలానికి ఎలా ప్రేరేపితమవుతాడు, ఎలా వాటిని జయించాలో కూడా బోధిస్తాడు. సాధారణ మనుషులకు నిత్య జీవితంలో కలిగే అనేక సమస్యలకు ధర్మారాజు ప్రశ్నలు కేవలం ప్రతీకలు మాత్రమే. భగవద్గీతను మించి భీష్ముడి సమాధానాలు, బోధించే నీతి అందరూ ఆచరణీయమైనవి. భీష్ముడి వలన అపారమైన విష్ణు సహస్రనామం ఉద్భవించింది. ఆయన విష్ణును స్తుతి అమోఘం. సమస్యల పరిహారం, మనః శాంతి కారకం. వారి బోధలనుంచి వచ్చే నీతి కథలు కథా సాహిత్యంలో దీప స్థంబాలు. భీష్మేకాదశి దినాన ఏకాదశి నియమాలతో పాటు , భీష్మ నీతిని ఒకసారి పఠించటం చిత్తశుద్ధికి, జీవన గతి సౌలభ్యానికి ఎంతో తోడ్పడుతుంది.

(భక్తి మాసపత్రిక, ఫిబ్రవరి 2025)

13
భర్తృహరి సుభాషిత త్రిశతి - నేటికీ ఆచరణీయమే!

'విభూషణం మౌనమపండితానాం, 'విద్యా విహీనః పశు:', 'సర్వే గుణాః కాంచన మాశ్రయంతి' వంటివి నేటికీ ప్రపంచానికి ఏక పక్షంగా వర్తించే భర్తృహరి సుభాషితాలు లేదా సూక్తులు. ఈ ప్రపంచాన్ని లౌకికంగా, పారమార్థికంగా లోతుగా పరిశీలించి రచించిన వాడు భర్తృహరి. అతను ఏ కాలం వాడనేది వివాదమే.

అనేకమంది ఈయన ఏడవ శతాబ్దానికి చెందిన వాడని భావిస్తారు. 'మహావైయాకరణి'గా ప్రసిద్ధుడైన భర్తృహరి, 'నీతి శతక' కర్త అయిన భర్తృహరి ఒకరే అని చాలామంది పండితుల అభిప్రాయం. ఇతడు రాజవంశస్థుడని, విక్రమాదిత్యుని జ్యేష్ఠ సోదరుడని కూడా ఒక బలమైన వాదన ఉంది. అదే సరి అనుకొంటే ఈయన కాలం క్రీస్తు పూర్వం ప్రథమ శతాబ్దానికి చెందినదని అనుకోవచ్చు. చైనా యాత్రికుడైన ఇతిసింగ్ భర్తృహరి బౌద్ధ మతస్తుడని అభిప్రాయ పడ్డారు. ఈయన గృహస్తు,

సన్యాసాల మధ్య ఏడు సార్లు అటూ, ఇటూ మారేవాడని ఇతిసింగ్ రాశారు. అదే సమయంలో ఈయన మహాయోగేశ్వరుడని కూడా చాలా విస్తృత భావన ఉంది.

భర్తృహరి 'త్రిశతి'-అద్భుత కవితా సృష్టి

ఈయన మూడు రకాల శతకాలు రాశారు. అవి: నీతి శతకం, శృంగార శతకం, వైరాగ్య శతకం. ఈ మూడు శతకాలు సంపూర్ణ పరిణతి ప్రదర్శించే శతకాలు. అంటే ఏ శతకం చదివేటప్పుడు దానికదే అంతిమం అన్నట్టు ఉంటుంది. అందువలన ఈ మూడింటినీ కలిపి 'సుభాషిత త్రిశతి ' అని గూడా అంటారు. భర్తృహరికి ఏ రాజుకు లేని అపార అనుభవం ఉండటం వల్లనే ఇంత పరిణతి ప్రదర్శించే నీతి శతకం రాసాడంటే నమ్మశక్యం కాదు. ఈయన అద్భుతమైన బ్రహ్మజ్ఞాని కాకపోతే సమస్త మానవ జాతి జీవితం తాలూకు అన్ని కోణాలను స్పృసించలేడు. ఈయన అద్భుత కవితాగుణం, విషయపరిపుష్టిని విదేశీ విశ్లేషకులు, విమర్శకులు మాక్డొవెల్, మోనియర్ విల్లియమ్స్ వేనోళ్ళ కొనియాడారు.

త్రిశతి – విశేషాలు

ఏ గుణాలను ఆచరించటం వల్ల సమాజంలో సుస్థిరమైన శాంతి, సుఖం వర్థిల్లుతుందో ఆ గుణాల ప్రాశస్త్యం వివరించడం జరిగింది నీతిశతకంలో. యువతీ యువకుల ప్రేమ భావాలను అమర కావ్యంగా, కృతిగా మల్చటంమే శృంగార శతకం విశేషం. ఇది ఒక లోకోత్తర రచన. సంసార జీవితంలో ఎదురయ్యే అనేక సమస్యలను, ఒత్తిడులను, విషమ పరిస్థితులను, మానవ జీవిత పరమార్థాన్ని వివరిస్తూ, ఏమి పాటిచండం వలన వీటినుంచి మనిషి సులువుగా బయట పడవచ్చో తెలి పేదే వైరాగ్య శతకం.

సంఘం పురోగతి అది అనుసరించే మార్గంలో ఉంటుంది. అదే నీతి మార్గం అయితే ఆ సమాజం కలకాలం పరిఢవిల్లుతుంది. అదే జాతికి ఖ్యాతి నొనరుస్తుంది. ఇలాంటి ధర్మ జీవన ప్రస్తావన, ఆవశ్యకత రామాయణం, మహాభారతం, భాగవతం వంటి గ్రంధాలలో తరుచూ ప్రస్తావనకొస్తుంటాయి. ప్రత్యేకంగా 'కామానందనీయాది' నీతి శాస్త్రాలు గూడా సమాజ హిత కావ్యాలుగా ప్రజలకు అందుబాటులో ఉండేవి ఒకప్పుడు.

విద్యా, ఆత్మ గౌరవం, కార్య సాధనకోసం పాటించవలసిన అచంచల దీక్ష, సౌశీల్యం, పరోపకారపారీణత ధైర్యస్థైర్యాలూ. ఇలాంటి ఆత్మ గుణాలు అలవరచుకోవాలని బోధించేదే భర్తృహరి నీతి శాస్త్రం.

సుభాషిత త్రిశతి: పలు వ్యాఖ్యానాలు, అనువాదాలు

భర్తృహరి సుభాషిత త్రిశతికి పలు వ్యాఖ్యానాలు, అనువాదాలు ఉన్నాయి. తెలుగు వాడైన రామచంద్ర బుధేన్ద్రుని వ్యాఖ్యానం చాలా ప్రసిద్ధమైనది. ఇది సంస్కృతంలో ఉంది. భర్తృహరి నీతి శతకానికి పలు తెలుగు పద్యానువాదాలు ఉన్నాయి. ఎలకూచి బాల సరస్వతి, ఏనుగు లక్ష్మణ కవి, పుష్పగిరి తిమ్మన తెలుగులో పద్యానువాదాలు చేసిన వారిలో ప్రముఖులు. అయితే ఏనుగు లక్ష్మణ కవి అనువాదమే ప్రజల నోటిపై నేటికీ ఒప్పారుతున్నది.

మూర్ఖ పద్ధతి, అర్ధపద్ధతి, మానసౌర్య పద్ధతి, దుర్జన పద్ధతి, సుజన పద్ధతి, పరోపకార పద్ధతి, ధైర్య పద్ధతి, దైవ పద్ధతి, కర్మ పద్ధతిల పరంగా సమాజం వర్తిల్లే విధానం, వాటిలోని అవలక్షణాలను గుర్తించడం, వాటిని నిర్మూలించి సజావుగా సమాజం సాగలా సహకరించటం వంటివి ఈ నీతి శతకంలోని ప్రధానాంశాలు.

నీతి శతకం : మూర్ఖ పద్ధతి

బహుశ ఎదో ఒక రీతిలో ఈ అవలక్షణాలు భర్తృహరిని కూడా బాధించి ఉండి ఉంటాయి. అందువల్ల ప్రార్ధనా శ్లోకంతో జ్ఞాన స్వరూపుడైన ఈశ్వరుని ప్రార్ధించిన తరువాతనే 'మూర్ఖ పద్ధతి'తో ప్రారంభిస్తాడు భర్తృహరి తన నీతి శతకాన్ని.

దిక్కాలాద్య నవఛిన్నానాస్తచిన్మాత్రమూర్తయే ।
స్వానుభూత్యైక మానాయా నమశాన్తాయ తేజసే ॥

దిక్కు, కాలము మొదలైన వాటి పరిమితికి లోబడక, అనంతమై, కేవలం జ్ఞాన స్వరూపమై స్వానుభవంతో తెలుసుకోదగిన ప్రసన్న జ్యోతి స్వరూపమైన పరబ్రహ్మకు నమస్కారం – అంటూ నీతి శతాకారంభం చేస్తాడు భర్తృహరి. ఈ మాటల భావాన్ని బట్టే ఇట్టే చెప్పవచ్చు – భర్తృహరి రుషి తుల్యుడు. పరబ్రహ్మ కటాక్ష సిద్ధి పొందినవాడని. కేవలం లోకానుభవం, రాజానుభవం మాత్రమే ఉన్నవాడు ఇటువంటి శ్లోకం రాయలేదు సుమా.

సమాజంలో పండితులకు ఎదురయ్యే ముఖ్యమైన సమస్య మూరు?లను ఎదుర్కొనటం. ఏ చదువులేని మూర్ఖులు ఈ సమాజానికి ఎంత పెద్ద బెడదగా పరిణమిస్తారో, అన్నీ తెలిసి, విజ్ఞులై కూడా అసూయా, ద్వేష పీడితులైన పండితులుకూడా మూర్ఖులతో సమానం అంటాడు భర్తృహరి. నిజానికి వీరు ఏమీ చదువుకోని మూర్ఖులకన్నా ప్రమాదకరం. ఇటువంటి మూర్ఖులు గురించి వివరిస్తూ ఇలా అంటారు భర్తృహరి.

బోద్ధారో మత్సర గ్రస్తాహః భగవ స్మయ దూషితాః ।
అబోధో వహతాశ్చాన్యై జీర్ణమన్గే సుభాషితం ॥

తెలిసినవాళ్ళు అసూయాగ్రస్తులు. ప్రభువులు గర్వంతో చెడిపోయారు. తక్కిన సామాన్య జనులు చెప్పినా తెలుసుకొనే స్థితిలో లేరు. అందువల్ల నేను చెప్పదలచుకొన్న మంచి మాటలు నాలోనే జీర్ణమై పోయినాయి.

అజ్ఞ సుఖమారాధ్య: సుఖతరమారాధ్యతే విశేషజ్ఞహః ।
జ్ఞానలవదుర్విదగ్ధం బ్రహ్మాపి నరం న రంజయతి ॥

ఏమీ తెలియని వాడికి సులభంగా తెలియ చెప్ప వచ్చును. తెలిసిన వాడికి తెలియచెప్పడం మరీ సులభం. తెలిసీ తెలియక 'అంతా నాకే తెలుసు' – అని గర్వంతో విర్ర వీగే వాడిని బ్రహ్మదేవుడుగూడ తెలియజెప్పి మెప్పించలేడు. ఇలా మూర్ఖుల మనస్తత్వం ఎలా కఠినంగా ఉంటుందో చెప్పే ప్రయత్నం లో ఏనుగు లక్ష్మణ కవి ప్రముఖ అనువాదం మనకు స్ఫురణకు వస్తుంది.

తివిరి యిసుమున తైలంబు దీయవచ్చు, దవిలి మృగతృష్ణలో నీరు ద్రావ వచ్చు। దిరిగి కుందేటి కొమ్ము సాధింప వచ్చు, జేరి మూరు?ల మనసు రంజింపరాదు ॥

దీనినే మహర్షి భర్తృహరి సంస్కృతంలో ఇలా రాశాడు.

'లభేత సికతాసు తైలమపి యత్నతః పీడయన్, పిబేచ్చ మృగతృష్ణికాసు సలిలం పిపాసార్థితః'। కదాచి దపి పర్యటన్ శశి విషాణ మాసాదయేత్, న తు ప్రతినివిష్ట మూర్ఖ జన చిత్తమారాధయేత్' ॥ అని

ఇలాంటి శ్లోకాలు సమాజంలో మూర్ఖుల విషయంలో జ్ఞానులు ఎంత స్పష్టమైన వైఖరితో కొన్ని వేల సంవత్సరాల క్రితమే జీవించారో మనకు జ్ఞప్తికి తెస్తుంది. ఈ సమాజంలో 'విజ్ఞులైనవారు మూర్ఖులతో

సమస్యలు తెచ్చుకోరాదు. కానీ, తెలిసి, తెలిసీ ఒక్కోసారి మనం ఈ మూర్ఖులతో వాదోపవాదాలకు వెళ్లి ఇక్కట్లపాలవుతాము. మూర్ఖులు మన సహచరులే కావచ్చు, లేక బంధువులే కావచ్చు, లేక పాలకులే కావచ్చు. మూర్ఖులెల్ల కాలాలలో ఇలానే ఉండేవారు. నేడుకూడా మనకు ఇలాంటివారు కొల్లలుగా ఎదురవుతుంటారు. అందువల్ల మనం నిత్య జాగరూకతతో ఉండాలి'. గీతాచార్యుడు గీతలో కూడా పదే పదే మనకు మూర్ఖుల వల్ల ఎదురయ్యే బెడదలను అర్జునునికి గుర్తు చేస్తూ ఉంటాడు.

శిరహాఃశార్వమ్ స్వర్గాత్ పశుపతి శిరస్తః క్షితి ధరం .... వివేకభ్రష్టానాం భవతి వినిపాతః శతముఖః, సర్వ స్యఔషధ మస్తి శాస్త్ర విహితం మూర్ఖస్య నాస్తి ఔషధం – వంటి శ్లోకాలు మూర్ఖులతో జీవితం ఎంత జటిలమో చెబుతాయి.

శిరహాఃశార్వమ్ స్వర్గాత్ పశుపతి శిరస్తః క్షితి ధరం .... వివేకభ్రష్టానాం భవతి వినిపాతః – అనే పద్యాన్నే ఏనుగు లక్ష్మణ కవి ఎంతో హృద్యంగా మలిచాడు ఇలా:

ఆకాశంబుననుండి, శంభుని శిరం బందుండి, శీతాద్రి సుశ్లోకంబైన హిమాద్రినుండి, భువి భూలోకంబునందుండి, గంగా కూలంకష పెక్కుభంగులు వివేకభ్రష్టసంపాతముల్."

అర్థ పద్ధతి

ఈ పద్ధతి వివరణలో ధనం, ధనవంతుడి ప్రభావం సమాజంపై ఎలా ఉంటుందో వివరించాడు భర్తృహరి.

యస్యాస్తి విత్తం స నరః కులీనః స పండితః స శ్రుతవాన్ గుణన్యః ।
స ఏవ వక్తా న చ దర్శనీయః సర్వే గుణాః కాంచన మాశ్రయంతి ॥

శ్లోకంతో ధనమూలం ఇదం జగత్ సత్యాన్ని నిరూపిస్తాడు భర్తృహరి. ఆ డబ్బున్నవాడే కులవంతుడుగా, పండితుడిగా, శాస్త్రగ్న్యుడిగా, గునగ్న్యుడిగా, ఉపన్యాసకుడిగా, అందగాడుగా చలామణి అవుతున్నాడు. అన్ని గుణాలు డబ్బుమీదనే ఆధారపడిఉన్నాయి అని భావించాడు భర్తృహరి. తత్వగ్న్యులైన పండితులను అవమానించవద్దని బోధిస్తాడు. బ్రహ్మకు తన హంస పై కోపం వస్తే సరోవరంలో సంచరించకుండా నిరోధించగలడు కానీ, హంస కున్న నీటిని, పాలను వేరుపరిచే గుణాన్ని హరించలేడు గదా. పండితులను ఆదరించమని విజ్ఞప్తి చేస్తాడు.

తత్వజ్ఞులైన పండితులను అవమానించవద్దని బోధిస్తాడు. బ్రహ్మకు తన హంస పై కోపం వస్తే సరోవరంలో సంచరించకుండా నిరోధించగలడు కానీ, హంస కున్న నీటిని, పాలను వేరుపరిచే గుణాన్ని హరించలేడు గదా. పండితులను ఆదరించమని విజ్ఞప్తి చేస్తాడు.

'విద్యానామ నరస్య రూపం అధికం ప్రచ్ఛన్న గుప్తం ధనం' శ్లోకంలో విద్యనే మనిషికి రూపం ఇస్తుంది. అది బయటికి దాయాలన్నా దాయలేని ప్రచ్ఛన్న ధనం అని విద్య ప్రాధాన్యాన్ని వివరిస్తాడు.

'జాడ్యం ధియో హరతి సించతి వాచి సత్యం మానోన్నతిం దిసతి పాపమపాకరోతి' అనే శ్లోకం ద్వారా సజ్జన సాంగత్యం చేసే మేలు గురించి చెబుతాడు. సజ్జన సాంగత్యం ఒక్కటే సకల పాపాలను హరిస్తుందంటాడు భర్తృహరి.

జయంతి తే సుకృతినో రస సిద్ధాహాః కవీశ్వరాః ।
నాస్తి తేషామ్ యసః కాయే జరామరణజం భయం ॥

రస సిద్ధిని సాధించిన కవీశ్వరులు ధన్యులు. వాళ్ళు సిద్ధౌషధాలను సేవించిన యోగుల్లాగా సర్వోత్కృష్టులై ప్రకాశిస్తున్నారు. వాళ్ళ కీర్తి శరీరాలెన్నటికినీ జరామరణాలు సోకుతాయని భయం లేదు అని దీని అర్థం.

మాన సౌర్య పద్ధతి

ఈ శ్లోకాలలో మానం, అభిమానం ఎంత గొప్పవో వివరిస్తాడు. ముఖ్యంగా సింహం సౌర్యం గురించి చెబుతూ సింహం ఏ స్థితిలో ఉన్నా చచ్చే వరకూ ఏనుగు కుంభ స్థలాన్ని పగులకొట్టి ఆ మాంసం తినాలనే చూస్తుంది తప్ప ఎండుగడ్డి తిని బ్రతకాలని చూడదంటాడు భర్తృహరి. (కిం జీర్ణం తృణమత్తి మాన మహతా మగ్రేసరః కేసరి) మనిషికూడా తన జీవితంలో తన మానాభిమానాలపట్ల అంత నిష్ఠ కలిగి ఉండాలని బోధించాడు. ఎలాగైతే సింహం తన చుట్టూ నక్కలున్నా ఏనుగు కోసం ఎదురు చూస్తుందో, మనిషి గూడా తన శక్తికి తగిన పరిహారం, పారితోషికమే ఆశించాలి. తన శక్తి ఒకటైతే, తను కోరేది వేరే స్థాయికి చెందినదై ఉండరాదు. వాంఛాతి జనః సత్వాను రూపం ఫలం-అర్థం ఇదే.

దుర్జన పద్ధతి

ఈ పద్ధతిలో జీవించే వ్యక్తులను దుష్టులుగా వర్ణించాడు భర్తృహరి. దయలేకుండా ప్రవర్తించడం, కారణం లేకుండా కలహించడం, పరుల ధనాన్ని, పరస్త్రీలను కాంక్షించడం, సజ్జనులన్నా, బంధువులన్నా సహించకపోవడం దుర్జనులు సహజ స్వభావాలంటాడు భర్తృహరి. (అకరుణత్వో మకారణ విగ్రహః - శ్లోకం ఇదే చెబుతుంది).

దుర్జనః పరిహర్తవ్యో విద్యాలంకృతోపి సన్ ।

మణినాభూషితో సర్పః కిమసౌ న భయంకరః ॥

పై పద్యం ప్రకారం చదువుకొన్న వాడైనా దుష్టుడైతే దూరంగా ఉంచాలి. తలపై రత్నం ఉన్నా పాము పామే కదా.

'శశీ దివసధూసరో గళిత యౌవ్వనా కామినీ, సరో విగత వారిజం ముఖమనక్షరం స్వాకృతేః ప్రభుర్ధన పరాయణః సతత దుర్గతి స్సజ్జనో, నృప్గాణ గతః ఖలో మనసి సప్త శల్యాని॥ – వంటి పద్యాలలో పగటి వేళ కాంతి విహీనుడైన చంద్రుడు, యవ్వనం కోల్పోయిన కాంత, తామరపూలు లేని కొలను, చదువు రాని అందగాడు, ధనం మీద అత్యాశ గల ప్రభువు, నిత్యపేదరికంతో మగ్గిపోయే సజ్జనుడు. రాజువద్ద ఉండి దుర్బోధలు చేసే దుర్జనుడు తనకు ఏడు శూలాలు వంటివని పేర్కొంటారు భర్తృహరి.

సుజన పద్ధతి

సేవకుడు మౌనంగా ఉంటే మూగ వాడని, బాగామాట్లాడితే వదరుబోతని , పక్కన నిలిస్తే భయభక్తులు లేనివాడని, దూరంగా ఉంటే చేతకాని వాడనీ, ఓర్చుకోనే వాడైతే పిరికి వాడని, ఓర్పులేనివాడైతే కులహీనుడని ప్రభువులు భావిస్తారు. అటువంటి సేవాధర్మం అర్థం చేసుకోడానికి యోగులు కూడా సరిపోరు అని అంటాడు భర్తృహరి ఒక శ్లోకంలో (మౌనన్మూకః ప్రవచన పటుర్వాచకో జల్ప కోవా...). దుర్జనులతోడి స్నేహం ప్రాతః కాల నీడలా మొదట పెద్దదిగా ఉండి క్రమంగా క్షీణిస్తుంది. 'సజ్జనులతోడి సహవాసం సాయం కాలపు నీడలా మొదట చిన్నదిగా ఉండి తరువాత వృద్ధిచెందుతుంది' అని ఒక అపూర్వ జీవిత సత్యాన్ని వెలువరుస్తాడు ఈ యోగిపుంగవుడు.

విపధీ ధైర్య మధాభ్యుదయే క్షమా, సదాసీ వాక్పటుతా యుధి విక్రమః।
యశసి చాభిరతి ర్వ్యసనం శ్రుతవ్, ప్రకృతి సిద్ధ మిదం హి మహాత్మానాం॥

ఆపదకలిగినపుడు ధైర్యమూ, ఐశ్వర్యం వచ్చినప్పుడు ఓర్పూ, సభలో వాక్ నైపుణ్యము, యుద్ధంలో పరాక్రమము, కీర్తిపై కోరికా, వేదాభ్యాసంపై ఆసక్తి ంవంటివి మహాత్ముల లక్షణాలు అని వివరించారు. మహాత్ముల మనస్సు సంపదలు కలిగినపుడు నల్ల కలువల్లా మృదువుగా ఉంటుందంటారు ఈ మహర్షి. ఆపదలు వచ్చినప్పుడు పెద్దకొండలోని గండ శిలలు గా కఠినంగా ఉంటుందని మహాత్ముల మనస్సు చిత్రీకరిస్తారు భర్తృహరి.

పరోపకార పద్ధతి

'మనసి వచసి కాయే పుణ్య పీయూష పూర్ణాహా త్రిభువన ముపకార శ్రేణిభిః ప్రీణయంతః' – అనే శ్లోకం ద్వారా మనోవాక్కాయములను పుణ్య కార్యక్రమమనే అమృతంతో నింపాలని చెబుతారు భర్తృహరి మహాశయుడు 'పరోపకార పద్ధతి'లో.

ఇలాంటి ఆణి ముత్యాల్లాంటి జీవన మార్గాలను మానవజాతికి బోధించిన భర్తృహరి 'సుభాషిత త్రిశతి' నుంచి గ్రహించగల వాస్తవాలు మనం విస్మరించలేము. ఒకటి మనుషులలో ఉండే 'గుణ దోషాలు' ఆ నాటికే పెక్కు రీతులలో ఈ మహర్షికి ద్యోతకమైనాయి. లేకుంటే ఇన్ని మార్గాలలో మానవ మనస్తత్వాలను, బలహీనతలను సాధికారంగా చర్చించటం సాధ్యమయ్యేది కాదు. నేడు మానవజాతి లో కనిపించే వికృత లక్షణాలు భర్తృహరి కాలం నాటికే ఉన్నట్టు అవగతమవుతుంది. లేదా భూత, భవిష్యత్తులను ఎరిగిన మహర్షిగా రాబోయే కాలంలో మానవ జాతి ఎలా ఉండబోతున్నదన్న స్పృహ తో ఈ శతక రచన చేసి ఉండవచ్చు.

ఏది ఏమైనా ఈ శ్లోకాలు నేడు ఎప్పటికన్నా ఎక్కువగా మానవ జాతికి వర్తిస్తాయి. వీటిని తూచా తప్పక గ్రహించి, ఆచరణలో పెడితే మానవ జాతి తప్పక సుఖ జీవితం గడప గలుగుతుంది. ఇంకా ధైర్య పద్ధతి, దైవ పద్ధతి, కర్మ పద్ధతిని గూడా భర్తృహరి చర్చించాడు. స్థలాభావం వలన టూకీగా కూడా వాటిని ఇక్కడ ప్రస్తావించలేకపోతు న్నాము. ఈ నీతి శతక పరిచయం తప్పక పాఠకులకు సత్యాలను మరో మారు కళ్ళముందు నిలబెట్టి, మానవ భవిష్యత్తు ఎలా చేస్తే పదిలంగా పది కాలాల పాటు ఉంటుందో అవగతం చేస్తుందని మా ప్రగాఢ విశ్వాసం.

(భక్తి మాసపత్రిక, మార్చి 2025)

14

నీతే విజయ సోపానం - విదుర నీతి రహస్యం

మహాభారత కాలానికి, నేటికీ సామాజిక జీవనంలో పెద్ద తేడా ఏమీ లేదు. మనుషులు మూడు రకాలని కృష్ణ పరమాత్మ గీతలో పేర్కొన్నారు. 'రాక్షసులు, దేవతలు, మనుషులు' అని మనకి కనిపించే వారిలో మూడు రకాలు ఉంటారని కృష్ణ పరమాత్మ వివరించాడు. వారి చుట్టూ అల్లుకొన్న జీవన వైవిధ్యమే సమాజం. ఇది పూర్తిగా అరిషడ్వర్గమయమై దుఃఖభాజితమై ఉంటుంది. ఆ జీవితంలో కాసేపు సంతోషం, కాసేపు దుఃఖం అనే ద్వంద్వాలు కరాళ నృత్యం చేస్తాయి.

మనిషిని తోలుబొమ్మలా ఆడించే ఈ అరిషడ్వర్గాలే మహాభారత కథను కూడా నడిపిస్తాయి. వీటిలో ఎత్తులు, పైఎత్తులు వేసి అవతలి వారిని చిత్తు చేయటం, కామ క్రోధాదులు రాచక్రీడల్లా మారి మానవజాతిని జంతువులకన్నా హీనంగా దిగజార్చటం కూడా గమనించవచ్చు. రాజులు ధర్మపాలనా, న్యాయ పాలనా విస్మరించి అధర్మ జీవితం వైపు మొగ్గు

చూపటం కూడా నిత్య కృత్యంగా మారుతుంది. ప్రజలు అశాంతితో రగిలి పోతుంటారు. ప్రభువులకు ఎదురు చెప్పలేక మౌనంగా అధర్మ పరమైన సామాజిక జీవనం గడుపుతుంటారు.

న్యాయ, పాలక వ్యవస్థలు అవినీతి మాయమవుతాయి. జీవితం గొంగట్లో భోంచేసే చందంగా మారుతుంది. సరిగ్గా ఇదే మహాభారత కాలం పరిస్థితి నేడూ ఉంది. నిండు సభలో, భీష్మ ద్రోణాది ధర్మస్వరూపులు ఉండి కూడా పాండవుల ధర్మపత్ని తీవ్రమైన అవ మానానికి గురవుతుంది. తిరిగి అటువంటి సభలోనే అందరూ చూస్తుండగా, రాయబారిగా వచ్చిన భగవంతుడైన శ్రీ కృష్ణుడినే పాతాళానికి నెట్టివేసే కుట్రకు శ్రీకారం చుడతారు కౌరవులు. ఆ సభలో కృష్ణ పరమాత్మ తన అనంత రూపాన్ని ధృతరాష్ట్రుడితో సహా ధర్మపరులైన భీష్మ ద్రోణ కృపాది మహనీయులకు చూపి మరీ తిరిగి వెళ్తాడు.

నిజానికి ఈ రెండు సందర్భాలలోనూ భీష్మ ద్రోణుల కృపాదులు దుర్యోధనుడిని ఎందుకు నిరోధించలేదన్న ప్రశ్నకు ఒకటే జవాబు కనిపిస్తుంది. తండ్రిపేరిట రాజ్యం, రాజ తంత్రం నడిపే దుర్యోధనుడికి విధేయులై ఉండటం కోసం, 'ధర్మరక్షణ' పేరుతో రాజును ధిక్కరించరాదనే నియమాన్ని భీష్మ ద్రోణులు పాటించారనిపిస్తుంది.

'అల్ప బుద్ధివారికధికారం ఇస్తే, దొడ్డవారినెల్ల వెళ్ళగొట్టు' అన్న చందంగా మారింది నాటి, నేటి సమాజం. అధికారం, ధనం, అక్రమార్జననే మానవ జీవిత గమ్యాలుగా సమాజం మారిపోయింది. అలా పొందిన వాటితో జీవితంలో సుఖం లభిస్తుందన్న నమ్మకం ప్రబలిపోయింది. సరిగ్గా మహాభారత కాలం నాడు గూడా ధృతరాష్ట్రుడు ఇలాంటి మానసిక భ్రాంతికి లోనై ఎంత దుఃఖం పొందాడో తెలిపేదే 'విదుర నీతి'.

విదుర నీతి రాజనీతి శాస్త్రానికే మకుటం లాంటిది. భారత దేశంలో భీష్మ నీతి, విదురనీతి, శుక్రనీతి, భర్తృహరి సుభాషితం, చాణుక్య నీతి మొదలైనవి నేటి రాజనీతిశాస్త్రాలకే పునాదులవంటివి. వాటి మార్గదర్శక పటిమ నేటికీ పదిలంగానే ఉంది. కాకపోతే వాటి పునశ్చరణ జరగాలి. వేల సంవత్సరాలక్రితమే సమాజ నైజం, ప్రభువుల తీరు, ప్రజల నడవడిక ఎలా ఉంటే మానవజీవితం నిజమైన శాంతిని, స్థితప్రజ్ఞతను పొందుతుందో చెప్పిన గొప్ప మానసిక సామాజిక శాస్త్రాలు అవి.

విదురనీతి ఉద్యోగపర్వం ద్వితీయాశ్వాసంలో వస్తుంది. పంచ పాండవుల అజ్ఞాతవాసం కూడా ముగిశాక తిరిగి తమకు న్యాయంగా దక్కవలసిన రాజ్యభాగం కోసం ధృతరాష్ట్రుని నుంచి శుభవార్త కోసం ఎదురుచూస్తున్న సమయం అది. ఆ సమయములో ధృతరాష్ట్రుడు తనవద్ద సాధువుగా పేరొందిన సంజయుని పాండవుల యోగక్షేమములను తెలుసుకు రమ్మని పంపాడు. అలా వెళ్లిన సంజయుడు ధర్మజుని ధర్మనిరతి, శాంతి – అహింసా వ్రతము, తమకు ధృతరాష్ట్రుని వలన జరిగిన అన్యాయానికి కోపగించు కొంటున్న తమ్ములను శాంత పరుస్తూ ధృతరాష్ట్రుని యోగక్షేమాలను తరచి తరచి అడిగే తీరు చూసి ముగ్ధుడైనాడడు. వారి సద్భావనలు, సందేశాలను మోసుకొని తిరిగి హస్తినకు చేరి ధృతరాష్ట్రునకు తన రాక గురించి భటుల ద్వారా తెలియ పరుస్తాడు. ధృతరాష్ట్రుడు అనుమతివ్వగా లోనికి వచ్చిన సంజయుడు పాండవుల యోగ క్షేమాలను ముందుగా వివరించి ధర్మరాజు, పాండవుల ధర్మనిరతి, దృతరాష్ట్రుడి ద్రోహ చింతన వంటి విషయాలను ఈసడించుకొంటూ ఇలా అంటాడు:

'రాజా, పెద్దవాడైన నీ అండ చేసుకొని వారంతా సుఖముగా నున్నట్లు తెలుపమని కోరారు. (శ్లోకం: వారెల్లను భవదీయ స్ఫారబలము గారణముగా సౌఖ్యంబున నున్నారమని పలుకుదురు నిజామారయగా నట్ల గాదే యది జన నాథా!). రాజా! ధర్మరాజు మీ వలే భోగ ప్రధానుడు గాడు. అతనికి ధర్మమే ముఖ్యము. అందునా అహింస అనగా అతనికి మిగుల ప్రియమైనది. మీరు ఇతరుల కీడున కెంతైనను పాల్పడేదరు. అతడు మీ వలె నధర్మపరుడు గాడు. మిక్కిలి ధర్మాత్ముడు. అంతేగాదు, ఒకరికి అన్నముబెట్టి మేలు చేయగలవారెవ్వరూ ఒకరికి అన్యాయము జరగటం చూసి మిన్నకుండ లేరు. కాబట్టి, నువ్వు నీకొడుకులు చేయు దుండగములను చూస్తూ ఊరికే ఉండవచ్చునా? నువ్వు, నీ వాళ్లు అంతా నీ అభీష్టం ప్రకారమే జరగాలని కోరుకొంటారు. కానీ, ధర్మజుడు అటువంటి వాడు కాదు. ఈశ్వర నిర్ణయంపై భారం వేసి తన వంతు ధర్మము మాత్రమే ఆచరించేవాడు. తన తమ్ములు నీపై ఆగ్రహించినప్పటికీ, వారిని శాంతింప చేసి, ధర్మ మార్గమున నడుపుతున్నాడు(శ్లో:అనుజులకు నడ్డుపడి యేమిని జేయగ నీమిన్ జూచి మెచ్చితిగావును సాదురేగినేనిన్వును తలపొలమునన కాని నిల్వదు సుమ్మీ). కానీ, నువ్వు దుష్టులైన దుర్యోధనాదులను సన్మార్గంలో పెట్టక, వారి ఇష్టం వచ్చినట్టు వారు చేయ, దానిని అంగీకరించి ప్రోత్సహిస్తున్నావు. ఇది ఎంతమాత్రం మంచిది కాదు. అయినను, నేను వేగముగా రథం తోలి బాగా అలిసిపోయి ఉన్నాను. కాబట్టి, వెళ్లి విశ్రాంతి తీసుకోని మళ్ళీ వస్తాను', అని చెప్పి నిష్క్రమించాడు'.

ఇది చదివిన వారికి ఒక విషయం సులువుగా అర్థం అవుతుంది. అవతల వారి రాజ్యాలు అక్రమంగా లాక్కోవాలనే దుర్బుద్ధి మహాభారత కాలం నుంచి నేటికీ మానవ జాతిని పీడిస్తూనే ఉంది. ఇందుకోసం ఎన్నో రకాల కుట్రలు, కుతంత్రాలు మహాభారతం లోనే మనకు కనిపిస్తాయి.

సంజయుడు చెప్పిన ఈ హిత వాక్యాలు ధృతరాష్ట్రునికి మనః శాంతి మరింత కరువయ్యేలా చేశాయి. వెంటనే పరిచారకులను పిలిచి త్వరగా పోయి విదురుడిని తీసుకురమ్మని ఆజ్ఞా పించాడు. ఆ వెంటనే వచ్చిన విదురునిచూసి ధృతరాష్ట్రుడు ఇలా అన్నాడు విదురునితో: 'అప్పటినుండియు నెవ్వగ గప్పికొనిన జిత్తవృత్తిగలంగెడు మేనున్ నిప్పుల బొరలినట్లయి చొప్పడ దించుకయు నిద్ర శుద్ధ విచారా' అని. సంజయుడు పలికిన మాటలతో నాకు నిద్ర కరువయింది. నిప్పులమీద పొర్లినట్టుంది.

అప్పుడు విదురుడు చాలా చక్కని జవాబు ఇచ్చాడు. 'నాల్గు రకాల వ్యక్తులకు నిద్రపట్టదు. బలవంతుడు బలహీనుడి పైకి వచ్చినప్పుడు వానికి నిద్రపట్టదు. ధనము పోగొట్టుకొన్నవారికి కూడా నిద్ర పట్టదు. చోరునకు ఎక్కడ దొంగిలించ పోవలెనని ఆలోచన వలన నిద్రపట్టదు. అలాగే పరస్త్రీ వ్యామోహం పొందిన వానికి కూడా నిద్రపట్టదు. ఇందులో నీదేరకం? (బలవంతుడు పై నెత్తిన బలహీనుడు ధనము గొలుపడిన యతడు మ్రుచ్చిల వేచువాడు గామాకులచిత్తుడు నిద్రలేకుందురు ధృతరాష్ట్ర)' అని అడిగాడు విదురుడు. 'వాస్తవముగా చెప్పు ం ఇతరుల ఆస్తి కొట్టేయాలని చూ శావా ఏమిటి?' అని ఎద్దావు చేశాడు విదురుడు.

అందుకు ధృతరాష్ట్రుడు 'సంజయుడికి ధర్మరాజు ఏమి చెప్పి పంపాడో తెలియక నిద్ర పట్టుట లేదు', అని సమాధానమిచ్చాడు. అందుకు విదురుడు 'రాజా! యుధిష్టరుడు ధర్మము తెలిసిన వాడు కదా! ఎంతో ఓర్పు కలవాడు. మీరు బాధపెట్టినా తిరిగి మీపై ప్రతీకార సంకల్పం లేని వాడు. హితవాక్యాలు పలికే వాడు. అటువంటి వాడు నీకు కీడు తలపెట్టగలడని ఎలా భయపడుతున్నావు?'అని అన్నాడు.

'దుర్యోధన, దుశ్శాసన, శకునుల అండతో నీవు పాండవులను జయించగలనని అనుకోవటం శుద్ధ పొరపాటు. చివరకు అది మీకు, మీ రాజ్యమునకు చేటు తేగలదు. నీతి మార్గాన అరిషడ్వర్గ ములను

త్యజించి రాజ్యపాలన చేయువానికే మన్సశాంతి. సూక్ష్మ బుద్ధితో చేసే ఆలోచన శత్రు రాజులను తప్పక తుదముట్టించ గలదు. లోకములో ఎవడైనా సరే సత్యమార్గమును త్యజింపరాదు. (నడవడియను మున్నింటి గడవం బెట్టగా నోడ కరుణిం దగి తానొడఁగూడు ననిన సత్యము గడచిన గుణ మింక నోండుగలదే యరయన్). ధర్మము తప్ప రాదు. తప్పిన వినాశనము తప్పదు. అలంకారములలోకెల్లా 'ఓర్పు'ను మించిన అలంకారము లేదు' అని బోధించాడు విదురుడు. (కొంచెమైనను దగబంచి కుడవమేలు పనుల యెడ దుఃఖమోర్చి అల్పంబు సుఖము ననుభవించుట). ఇటువంటి ఎన్నో సుగుణాలున్న ధర్మనందనుని ప్రేమతో ఆహ్వానించి తగిన భాగం రాజ్యమిచ్చి ధర్మము కాపాడు' అని విదురుడు ధృతరాష్ట్రుడికి తెలుపుతాడు.

అప్పుడు ధృతరాష్ట్రుడు 'నీ మాటలవలన నాకు ధర్మాధర్మములలో శాంతి నెలకొని ఉన్నదని అవగతమైంది. అయితే ఇంకా తెలుసుకోవాలని ఉంది. ఎటువంటి లక్షణములు రాజును ఉత్తమ మార్గంలో నడిపిస్తాయో వివరించు విదురా' అని అడిగాడు. (శ్లో.హితము గర్తవ్యమును నాకు నెరుగుదీప ధర్మసూత చందమును విదితంబు నీకు నట్లు గావున నెఱింగింపు మఖిల కార్యజాతమును జిత్తతాపోసనము గాక). అలాని దృతరాష్ట్రుడి కోర్కెపై విదురుడు ధర్మాధర్మముల నీతి నియమముల పోకడ ఎలా ఉంటుందో వివరించటం కొనసాగించాడు.

మనము మాట్లాడుట వలన ఇతరులకు సంతోషము కలిగేట్టయితేనే మాట్లాడాలి. లేదంటే మౌనం వహించటమే మేలు. లోకమున సమస్యలు, గౌరవాలు, ఆదరణలు అన్నీ మాటలవలననే వచ్చుచున్నవి. అందువలన జాగ్రత్తగా, నేర్పుగా మాట్లాడాలి. గొడ్డలితో నరికిన చెట్టు గూడా మళ్ళీ చిగురిస్తుంది. కానీ, మాటలవలన చెడిన బంధం తిరిగి జత కాదు. శరీరమునందు గుచ్చుకొన్న బాణములు సులువుగా తీయ వచ్చును.

కానీ మాటలవలన విరిగిన మనస్సును ఎప్పుడూ జోడించలేము (శ్లో: తనువున విరిగిన యలుగుల ననువుగ బుచ్చంగవచ్చు నతి నిష్ఠురతన్ మనమున నాటిన మాటలు విను మెన్ని యుపాయముల వెడలునే అధిపా). ధర్మజుడు మిమ్మల్నెవరినీ దూషించువాడు కాడు. కానీ, నీ కొడుకులు పాండవులను అనరాని మాటలనని దినము లేదు. కాలము హితము కానప్పుడు మంచి మాటలు నచ్చవు. అటువంటి సమయంలో అహితములైన మాటలే నచ్చుతాయి.

అధికారమునకు, దేశకాలమునకు తగినట్టి వేషమ్ము ధరించుట అవశ్యము. తనను తాను పొగడుకొన కూడదు. ఇతరులు నొప్పించినా తిరిగి వారిని తిట్టకుండుట, ఒకరికిచ్చినదానికి వగయ కుండుట, ఎన్ని కష్టములు వచ్చినా న్యాయమైన నడవడికను కోల్పోకుండుట వంటివి రాజుకు చాలా అవసరం. తమ స్థాయి వారితోనే సంబంధబాంధవ్యాలను నెరపాలి.

'చూడు ధృతరాష్ట్ర, నేను పేర్కొన్న లక్షణములన్నీ ధర్మజునిలో పుష్కలంగా ఉన్నాయి. నీ బిడ్డలలో లేవు. యుధిష్ఠరుని మనసేమిటో నీకు స్పష్టంగా తెలుసు. అతని భూభాగం అతనికిచ్చి హాయిగా ఉండు. అది కాక ఆ భూభాగం కొట్టేయాలని చూస్తే అది నీకు దక్కదు. నీకు దుఃఖమే మిగులుతుంది. మనం నైతిక వర్తనులమైనప్పుడే సుఖం, శాంతి లభిస్తాయి' అని చెప్పి విదురుడు ధృతరాష్ట్రుడి వద్ద శలవు తీసుకోని రాజ మందిరం వీడాడు.

(భక్తి మాసపత్రిక, ఏప్రిల్ 2025)

15

నృసింహుడు తెలుగువాడే!

శ్రీ మహావిష్ణు అవతారాలలో నాలుగో అవతారంగా సుప్రసిద్ధమైన నరసింహావతారం తెలుగు వారికే ప్రత్యేకమా అన్నట్లు ఉంటుంది. తెలుగు రాష్ట్రాలలో ఉన్నన్ని నరసింహ స్వామి ఆలయాలు దక్షిణాదిన ఏ రాష్ట్రంలోనూ లేవు. అలాగే ఉత్తరాదిన కూడా ఎక్కడా ప్రసిద్ధ నరసింహ ఆలయాలు ఉన్నట్లు మనకు కానరాదు. దశావతారాలలో కొన్ని అవతారాలు పరిసమాప్తి అయినాయి. కొన్ని కాలేదు. కానివాటిలో వరాహ, నరసింహ అవతారాలు ప్రధానమైనవి. ప్రతి ఏటా వైశాఖ మాసంలో చతుర్దశి రోజున ఈ నృసింహ జయంతిని జరుపుకొనే ప్రత్యేకత ప్రధానంగా తెలుగు రాష్ట్రాలలో, తరువాత కర్ణాటక రాష్ట్రంలోనే కనిపిస్తుంది.

ఆశ్చర్యమేమంటే వ్యాస భాగవతంలోని నృసింహ అవతారం ప్రహ్లాద చరిత్రలో కనిపిస్తుంది. భక్తవరదుడైన శ్రీమహావిష్ణువు తన అంశాన హిరణ్యకశిపుడికి జన్మించిన ప్రహ్లాదుడిని రక్షించేందుకు, హిరణ్యకశిపుడిని

సంహరించేందుకు ఈ నృసింహావతారం ఎత్తారని భాగవతం చెబుతుంది. ఆ విధంగా చూస్తే ఉత్తరాది వాడైన వ్యాస భగవానుడు, ఆయన రాసిన భాగవతంలోని శ్రీమహావిష్ణు అవతారాల ఆలయాలు ఉత్తరాదిన ప్రముఖంగా కనిపించాలి. అక్కడ ఆ అవతారాలకు దేవాలయాలు, పుణ్యక్షేత్రాలు ఉండి ఉండాలి. అవి భక్తి తత్వానికి, మహిమాన్వితకు ప్రతీకలై విలసిల్లాలి. కానీ, ఉత్తరాదిన కాశ్మీరం నుంచి ఒరిస్సా దాకా, లేక మహారాష్ట్ర, సౌరాష్ట్ర దాకా శ్రీ మహావిష్ణు అవతారాలలోని శ్రీ రామ, శ్రీకృష్ణ అవతారాలే ప్రధానంగా కనిపిస్తాయి.

అందుకు భిన్నంగా మన రాష్ట్రంలోని శ్రీకాకుళంలో 'శ్రీకూర్మం' ఆలయం కూర్మావతారానికి ప్రతీకగా నిలిచింది. తమిళనాడులో శ్రీముష్ణం దగ్గర సుప్రసిద్ధ భూవరాహస్వామి ఆలయం ఉంది. తిరుమలలో శ్రీభూవరాహస్వామి వారిని దర్శించనిదే శ్రీవేంకటేశ్వరుని దర్శనం ఫలించదన్న నియమం ఉంది. సికింద్రాబాదులో పాత గాంధీ హాస్పిటల్ వీధిలో చాలా పెద్ద భూవరాహస్వామి దేవాలయం ఉంది. ఆ దగ్గరలోనే 'ధర్మకాట' మార్కెట్ దగ్గర ప్రధాన రోడ్డుపై అత్యంత పురాతన శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయం ఉంది.

ఇక తెలంగాణా, ఆంధ్రా రాష్ట్రాలలో లెక్కకు మించిన నరసింహ స్వామి ఆలయాలున్నాయి. ఇవన్నీ కూడా అద్భుతమైన క్షేత్ర మహిమ, స్థల పురాణం, భక్త గాథలతో ముడిపడి ఉన్నవే. ఇవి ఏ క్షేత్రానికదే అన్నంత భక్తి పారవశ్యం తొణికిస్తాయి. యాద్రాద్రిలో నెలకొన్న శ్రీ యాదాద్రి లక్ష్మీ నరసింహ స్వామి, మల్లూరుగుట్టపై వెలసిన హేమాచల లక్ష్మీ నరసింహస్వామి, నల్లగొండ, కరీంనగర్ జిల్లాలో నెలకొన్న నల్లగొండ లక్ష్మీ నరసింహ స్వామి, ధర్మపురి లక్ష్మీ నరసింహ స్వామి, శ్రీ మత్స్యగిరి

లక్ష్మీ నరసింహ స్వామి, కామారెడ్డి దగ్గర చౌక్కాపూర్ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయాలున్నాయి. వీటి స్థల మహిమలు వివరించాలంటే ఎంత చెప్పినా చాలదు.

కానీ, ఒక్క ముక్కలో చెప్పాలంటే మల్లూరుగుట్ట నరసింహస్వామి రాతి గుహలో వెలిసిన మూర్తి. కానీ, రాయిలాగా ఉండడు. స్వామి హృదయం పైన ఎక్కడ వేలుతో నొక్కినా మనిషి శరీరం లోనికి పోయినట్టు మనిషి వేలుకూడా లోనికి వెళుతుంది. ఈ స్వామి స్వయం భూవు. ఆ దివ్య గాథ వింటే మనస్సు పులకిస్తుంది. అలాగే మత్స్యగిరి నరసింహ స్వామి పుష్కరిణిలో చేపలు నుదిటి పై వైష్ణవ నామాలుంటాయి. ఎవరో పెట్టినవి కావు. స్వయంభూ నామాలవి. ఇలాంటి చేపలు మళ్ళీ ఎక్కడా కానరావు.

ఇక ఆంధ్ర రాష్ట్రం మాటకొస్తే ఇక్కడ ప్రతి 100 కి మీ కు ఒక నరసింహ క్షేత్రం ఉందనిపిస్తోంది. ఏందుకంటే ఇక్కడ దాదాపు 32 నరసింహ స్వామి దేవాలయాలున్నాయి. వేదాద్రి, సింహాచలం, పెంచెల కోన, అహోబిలం, పెన్న అహోబిలం, కదిరి నరసింహ, సింగరాయకొండ, మంగళగిరి ఆలయాలు అత్యంత పురాతనమైనవి. ఇవి ఎక్కువగా కొండ, నదీ తీర, అడవి ప్రాంతాలలో ఉన్నాయి. ఇవిగాక సింగర కొండ, మట్టపల్లి, కోరుకొండ, కందుకూరు మాల్యాద్రి నరసింహస్వామి, వేదగిరి, అంతర్వేది లాంటి పలు ఇతర ప్రదేశాలలో కూడా సుప్రసిద్ధ నరసింహస్వామి ఆలయాలున్నాయి.

మహాకవి శ్రీనాథుడు వేదాద్రి నరసింహుని దర్శించి అక్కడ కొంత కాలం ఉండి, భీమేశ్వరపురాణం రాశారని వేదాద్రి దేవస్థానం వారు వేసిన 'వేదాద్రి నరసింహ మహాత్మ్యం' పుస్తకంలో ఉంది. అలాగే 'అపర

ఆదిశంకరుడు'గా కీర్తి పొందిన బెల్లంకొండ రామారాయ కవీంద్రులు గూడా వేదాద్రిలో యోగసాధన, తపస్సు చేసేందుకు అక్కడే చాలా కాలం ఉన్నారని రామారాయ కవి స్వీయ చరిత్ర చెబుతుంది.

'బ్రహ్మాండే పతనాదిదోశకలుషే స్వర్గాదిలోకే క్వ ।
నానాహం స్థాతు మిహోత్సాహే తవ పదం భవ్యం విదోషం స్వయం ॥
ఆరోధుమ్ పర ముత్సహే కరుణయా నిశ్రేణికాం మే పరాం ।
యోగానంద నృసింహ! తావక పదాంభోజాత భక్తిమ్ దిశ' ॥

– అని రాశారు బెల్లంకొండ రామారాయకవి తన 'శ్రీ వేదాద్రి యోగానంద నృసింహ స్తోత్రం'లో.

ఇక్కడ నరసింహ స్వామి అయిదు రూపాలలో ఉంటారు. జ్వాలా నరసింహుడు, యోగా నంద నరసింహుడు, కృష్ణా నదిలో సాలిగ్రామ నరసింహుడు, వీర నరసింహస్వామి, లక్ష్మీ సింహుడు. నిజానికి తొలిసారిగా మనం ఇక్కడ చెంచు లక్ష్మిని నరసింహుడితో చూస్తాం. ఆంధ్ర రాష్ట్రంలో అత్యంత పురాతనమైన నరసింహాలయంలో ఈ చెంచులక్ష్మిని స్వామితో చూడటం భక్తులకు ఎంతో ఆనందాన్నిస్తుంది. ఇక్కడ అమ్మ వారు గిరిజన స్త్రీ అలంకారంతో ఉంటూ చూపరులకు ముచ్చట గొలుపుతుంది. ఇక్కడ నరసింహస్వామి ఆలయం కృష్ణా నది పక్కనే తెలంగాణా, ఆంధ్రాలను వేరు చేస్తూ ఉంటుంది. నదికి ఆవల నల్లగొండ, ఇటువైపు కృష్ణా జిల్లా ఉంటాయి. అటు నుంచి ఇటుకు బల్లకట్టు పడవలుంటాయి. ఇటునుంచి అటుకు ఏమీ ఉండవు. ఇందుకో కారణం చెబుతారు. అది ఒక ప్రసిద్ధ యోగి జీవితంతో ముడివడిన కథ. అయితే అది ప్రస్తుతం అసంగతం కనుక వివరించటంలేదు.

ధర్మపురికి చెందిన శేషప్ప కవి 'శ్రీ నారసింహ శతకం ' రాశారు. ఇతను 18వ శతాబ్దానికి చెందిన వాడు. శ్రీ లక్ష్మీ నారసింహుని మహాభక్తుడు. ఆద్యంతం భక్తి రస ప్రధానంగా రాసిన ఈ శతకం భక్తులకు కొంగు బంగారమై విలసిల్లుతుంది.

'భూషణవికాస! శ్రీధర్మపుర నివాస! దుష్టసంహార! నరసింహ! దురితదూర!' – అనే మకుటంతో ఈ నూరు పద్యాలను రాశారు శేషప్ప కవి.

సీ. నరసింహ? నీ దివ్య – నామమంత్రముచేత, దురితజాలము లన్ని –
దోలవచ్చు, నరసింహ ? నీ దివ్య – నామమంత్రముచేత, బలువైన
రోగముల్ – పాపవచ్చు, నరసింహ ? నీ దివ్య – నామమంత్రముచేత,
రిపుసంఘముల సంహ – రింపవచ్చు నరసింహ ?
నీ దివ్య – నామమంత్రముచేత, దండహస్తుని బంట్ల–దరమవచ్చు ॥

– అని సీస పద్యంలో రాసి, ముక్తాయింపుగా తేట గీతితో ఈ క్రింది చరణాలతో ముగిస్తాడు. ఇందులో ఏ పదము అర్ధంకానిది లేదు. గొప్ప భక్తి లక్షణం అలతి అలతి పదాలతో చెప్పటం.

తే. భళిర ? నే నీ మహామంత్ర
బలముచేతఎదివ్య వైకుంఠ పదవి సాధింపవచ్చు॥
భూషణవికాస ? శ్రీధర్మ – పురనివాస ?
దుష్టసంహార ? నరసింహ – దురితదూర ॥

– అటువంటి భక్తుడే ధర్మపురికి చెందిన సంగనభట్ల చిన్న రామకృష్ణయ్య. ఈయన ధర్మపురి నివాసి.

'నరసింహాయని భక్తిని ధరజనులందరును
నిన్ను తగ కొలువంగా।
కరువును కాటకమెల్లను ।
సరగున మాయమ్ము జేయు సామీ నృహరీ ॥

– అని 'నృహరి శతకం' రాశారు సంగనభట్ల చిన్న రామకృష్ణయ్య. ధర్మపురి నరసింహుని భక్తి యందు తగుల్కొని జీవించు ఈ సంగనభట్ల వారు ఘనాపాటీల వంశస్థుడు. తెలుగు పండితోత్తముడు. 'నరహరి నామము దలచిన ధరణిని పాపములు పోయి దండిగ జనముల్। విరివిగా పుణ్యము పొందన్, నరకములేదు సుమ్మి నరులకు నృహరీ' ॥ అంటాడు చిన్న రామకృష్ణయ్య.

సింహాచల నారసింహుడిపై శతకం రాసిన మరో మహా కవి గోకులపాటి కూర్మనాథ కవి. ఇతడు విజయనగరం జిల్లా రామతీర్థం వాసి. 18వ శతాబ్దానికి చెందిన వాడు. దాదాపు 1720 ప్రాంతాలలో జన్మించాడని చరిత్రకారుల నమ్మకం. ఈ శతకం పేరు 'సింహాద్రి నారసింహ శతకం'. దీనిని 'ఉత్తమ అధిక్షేప శతకం' అని గాని, 'చారిత్రక శతకం' అని కానీ అంటారు. ఈ శతకం కవికి ఘనకీర్తి తెచ్చిపెట్టింది. ఎందుకంటే శతకాలు కేవలం నీతి లేక భక్తి సుబోధకాలే కానీ, మహిమలు చూపేవి కావు. కానీ, గోకులపాటి కూర్మనాథ కవి రాసిన ఈ 'సింహాద్రి నారసింహ శతకం' మహిమను ప్రదర్శించింది. ఇది శతక చరిత్రలోనే అత్యంత అరుదైన ఘటన.

శతక కారులలో శతక రచనతో నార సింహుని అనుగ్రహం సాధించిన తొలి కవిగా గోకులపాటి కూర్మనాథ కవి అగ్రస్థానంలో చిర స్థాయిగా ఉంటారు. ఇంచుమించు ఇదే విధమైన వ్యాఖ్య చేశారు మహాకవి

ఆరుద్ర. 'ఆంధ్ర సృష్టిని నిలుపమని సింహాద్రి నారసింహుని అర్థించిన కవిగా తెలుగు భక్తి సాహిత్యంలో ఇతని సృష్టి నిలుస్తుంది'అంటారు మహాకవి ఆరుద్ర తన 'సమగ్ర ఆంధ్ర సాహిత్యం'లో.

ఔర! నిజామాడ నిష్టురం బౌ నటంద్రు ।
కాక రోషంబు కలిగిన, గఠిన యవన సేన॥
నిర్జించి యీ ఆంధ్ర సృష్టి నిల్పు ।
వైరి హరరంహ సింహాద్రి నారసింహ

– అని గర్జిస్తాడు, ఆక్రోశిస్తాడు కూర్మనాథ కవి. 'వైరి హరరంహ సింహాద్రి నారసింహ' మకుటంతో గోకులపాటి కూర్మనాథ కవి రాసిన ఈ శతకానికి గొప్ప చారిత్రక నేపథ్యం ఉంది.

పద్దెనిమదవ మధ్య భాగంలో అంటే దాదాపు క్రీ శ 1753లో కళింగాంధ్ర, ఉత్తరాంధ్రలు తురకసైన్యాల దోపిడీలతో అల్లకల్లోల మవుతున్నాయి. అప్పట్లో హైద్రాబాదు నవాబు ఢిల్లీ చక్రవర్తి ఔరంగజేబుకు సామంతులుగా ఉండేవారు. ఉత్తర సర్కారులు వీరి ఆధీనంలో ఉండేవి. ఔరంగజేబు ప్రతినిధి అయినా ఫకీర్ అలీ ఖాన్ వద్ద విజయనగర సంస్థానాధీశుడైన మొదటి ఆనంద గజపతి రాజు, అనకాపల్లి పాలకుడైన 'హెూల్ కాలం' ద్వారా కొంత ధనం అప్పుగా తీసుకొని తిరిగి సకాలంలో చెల్లించకపోవడం వలన అలీఖాన్ గ్రామాలపై పడి దోచుకోవటం మొదలు పెట్టాడు. అందులో భాగంగా స్త్రీలను చెరబట్టడం, దేవాలయాలను ధ్వంసం చేయటం విశృంఖలంగా సాగుతున్న రోజులవి.

అదేసమయంలో దక్కను సుబేదారు 'సలాబత్ జంగ్'ఉత్తర సర్కారులను ఫ్రెంచ్ వారికి కౌలుకు ఇచ్చాడు. వాటిని స్వాధీనం చేసుకోమని ఫ్రెంచ్ దొర బుస్సీ మచిలీపట్నం గవర్నరు మారిసన్ ను ఉత్తరాంధ్రకు

పంపాడు. శ్రీకాకుళంలో ఫౌజుదారుగా ఉన్న జాఫర్ అలీ ఖాన్ తిరుగుబాటు చేశాడు. అతడు మరాఠాలతో చేతులు కలిపి ఉత్తర సర్కారులను దోచుకోవటం మొదలు పెట్టాడు. మారాఠాల దండు ఉత్తర సర్కారు ప్రజలను దోచుకొంటుంటే, తురక సైన్యాలు దేవాలయాలను ధ్వంశం చేయసాగాయి.

విజయనగర సంస్థానాధీశుడు పెద్ద విజయరామరాజు వీరిని నిలువరించి లేకపోయాడు. ఈ నేపథ్యంలోనే సింహాచల ఆస్థానంలో గుమాస్తాగా పని చేస్తున్న కూర్మనాథుడు తీవ్ర కలత చెంది, సింహాద్రి అప్పన్నను ఆదుకొమ్మని ఆక్రోశిస్తూ ఈ శతకం రాశాడు. ఈ శతకంలో మూడవ పద్యంనుంచి 67వ పద్యం వరకూ తురక సైన్యాల చేతులలో ప్రజలు పడుతున్న పాట్లను కళ్ళకు కట్టినట్టు చిత్రించాడు. స్వామి వారికి ఆయన పరాక్రమం గుర్తు చేసి శత్రువులను శీఘ్రంగా ప్రారదోలమని వేడుకొన్నాడు. ఎంతసేపటికి స్వామి వారు కరుణించకపోవటంతో 'నీవు కూడా తురకలతో కలిసిపోయావా?' అని ఆక్రోశిస్తాడు. అప్పటికే సింహాచలంలోకి తురక సైన్యాలు ప్రవేశించిన వార్తా కూర్మనాధుడికి అందుతుంది. 67వ పద్యం పూర్తయ్యే సరికి స్వామి వారి అనుగ్రహం సాకారమైంది. సింహాచలం గుహల్లో మంటలు చెలరేగాయి. అక్కడున్న తేనెపట్లు అంటుకున్నాయి. వాటినుండి గండు తుమ్మెదలు భయంకరంగా చెలరేగి, ప్రళయకాల మేఘాల్లా తురక సైనికులను కప్పి వేసి, తమ ఉక్కు ముక్కులతో వారిని కరిచి, కండలు ఊడిపడేలా చీల్చి చెండాడి వారి నెత్తురు పీల్చి, భయకంపితులైన తురకలను సింహాచలంనుండి విశాఖపట్టణం లోని ఆశీలుమెట్టు వరకూ తరిమేశాయి. ఈ కారణంగా ఆశీలుమెట్టుకు 'తుమ్మెదలమెట్టు'అని మరో పేరుకూడా వచ్చిందని ప్రజలలో నానుడి.

'పాశ్చాత్యుల నమాజుపై బుద్ధి పుట్టెనో, వేమౌనుల జపముపై మనసు రోసి … తురకల యీదునందు ముదంబు కల్గె,నో భక్త నిత్యాత్స వాసరతమాని వాండ్రు దుర్మార్గులయ్యామో వ్రతము చెడ్డ సుఖము దక్కదుబీ వడి ఢీల్లీ చొరగం దోలు వారసీ కాధిపుల పటాపంచలుగాను, వైరి హర రంహ , సింహాద్రి నారసింహ (80వ పద్యం)' ఆయన తనపద్యాలలోని ఆర్తిని చాలా దీనంగా నివేదించుకొన్నాడు స్వామికి. తన ఈ ప్రార్థనంతా తెలుగు సృష్టిని రక్షించమని, పదిలంగా ఉంచమని. తెలుగు జాతి నాశనం అవకూడదనే తన ఆవేదనంతా.

ఇలా తెలుగు రాష్ట్రాలలోని ఒక్కో నారసింహ క్షేత్రం ఒక భక్తి రసామృత సముద్రం. ఇవన్నీ వింటే, కంటే ఏమని పిస్తుంది. తెలుగువారికోసమే నారసింహుడు ఇక్కడ నెలకొని ఉన్నాడాని పించదు. అందుకే నృసింహుడు తెలుగువాడే. తెలుగు సృష్టిని రక్షించినవాడే తెలుగు వారి తండ్రి, లోక రక్షకుడు. ఆయన నారసింహుడే.

(భక్తి మాసపత్రిక మే 2025)

16
సాధక బాధకాలు

'సాధక బాధకాలు' అనే సమాసం నిత్య వ్యవహారికంలో అందరం వాడుతున్నా ప్రధానంగా ఆ సమాసం ఆధ్యాత్మికమైనది. దైవకటాక్షం కోసం తపించే వాళ్ళు చాలా కష్టాలు ఓర్చుకోవలసి ఉంటుంది. సంసార జీవితంలో మనిషికి ఎదురయ్యే కష్టాలు ఒక ఎత్తైతే, సన్యాసం తీసుకొనే వాళ్ళ కష్టాలు మరో ఎత్తు. ఈ ప్రపంచంలో అందరూ ఏ కష్టం లేకుండా సులభంగా అన్నీ పొందాలనుకొంటారు. అది మానవ నైజం. కొంచెం తెలివిగలవాళ్ళు ఈ తలనొప్పులన్నీ ఎందుకు అనుకొని 'దేవుడులేడు, దెయ్యం లేదు. అంతా మానవ కల్పితం' అని జీవితం హాయిగా గడిపేస్తుంటారు. ఈ మేకపోతు గాంభీర్యం అంతా ఏ ఒడుదుడుకులు లేకుండా సజావుగా జీవితం సాగినంతవరకే. ఎక్కడైనా తేడా కొట్టిందో, వెంటనే లోపలనుంచి ఏదో ఒక అంతర్గత వాక్కు వినిపిస్తుంది. ఆ వినిపించే వాక్కు ఆలకించేవాడు ఆ క్షణమే దైవాన్వేషణ మొదలు పెడతాడు.

అలా ఒకసారి స్వామి వివేకానంద, సన్యాసిగా మారకముందు తనకు కనిపించిన ప్రతి సాధువును 'నీవు దైవాన్ని చూసావా?' అని అడిగేవాడు. ఎవ్వరూ ఆయనకు సంతృప్తి కరమైన సమాధానం ఇవ్వలేకపోయారు. కారణం వాళ్లంతా దైవాన్వేషకులే కాని దైవాన్ని సాక్షాత్కరించుకొన్న వారు కాదు. అలానే ఆయన ఒకసారి కోల్కత్తాలోని తన స్నేహితుడింటికి ఆహుతుడై వచ్చిన శ్రీ రామకృష్ణ పరమహంసనూ అడిగాడు –'మీరు దైవాన్ని చూసారా?' అని. అందుకు ఆయన ఏమీ తడువుకోకుండా 'ఓ చూశాను, నిన్ను ఇప్పుడు చూస్తున్నట్లు గానే ఆయనను ఎన్నో సార్లు దగ్గరనుండి చూశాను' అని బదులిచ్చాడు. వెంటనే ఆయన 'మరి నాకూ చూపించగలరా?' అని అడిగాడు. నువ్వు దక్షిణేశ్వరం కాళీ మాత మందిరానికి రా! అక్కడ నీకు దైవాన్ని చూపుతాను' అని చెప్పి వెళ్లిపోయారు.

ఆ తరువాత సన్యాసి కాక పూర్వం నరేన్ అని పేరున్న ఈ 18 ఏళ్ల కుర్రవాడు ఎలా స్వామి వివేకానంద అయినది ప్రపంచం అంతా ఎరిగినదే. ఈ వివేకానందుడే తరువాత కాలంలో 'దైవ సాక్షాత్కారం' కావాలంటే ఏం చేయాలి, ఎలా చేస్తే ఆ పరబ్రహ్మ దర్శనం ప్రాప్తిస్తుందో వివరిస్తూ 'రాజయోగ' అనే పేరుతో పుస్తకం రాశారు. ఇదే పతంజలి యోగ సూత్రాలకు తొలిశాస్త్రీయ వ్యాఖ్యానం. ఆధునిక మానవ శరీర శాస్త్రం ఆధారంగా, వైద్య శాస్త్ర పరిభాషలో ఆయన ఆధ్యాత్మిక సాధనకు ఉపకరించే నాడులను ఏ సంకోచానికి తావు లేకుండా సోదాహరణంగా, సవివరంగా రాయటం జరిగింది. వివేకానందుని తరువాత కేవలం మహర్షి అరబిందు మాత్రమే అతి క్లిష్టమైన ఈ సాధన ప్రక్రియను తిరిగి ఆంగ్లంలో రాశారు. అవే నేటికున్న పతంజలి యోగ శాస్త్రానికి సాధనా వివరణ పుస్తకాలు.

స్వామి వివేకానంద 'రాజయోగ' రహస్యాలు చెబుతూ 'ఏ ప్రయత్నం చేయకుండానే దేవుడ్ని చూడాలనుకునే వారు సోమరిపోతులు. కష్ట పడకుండా జీవితంలో తిండి, డబ్బులు కూడా రావే. మరి ఈ చరాచర సృష్టికి కారణమయి, సర్వదుఖ?లయం చేసే ఆ ఈశ్వరుడి దర్శనం కావాలంటే కొంచెమైనా కష్టం చేయాలి గదా!'అని చెప్పాడు. ఒక్క భారత దేశం మినహా ఇతర పాశ్చాత్యా దేశాలన్నీ 'కష్టే ఫలి' అనే కార్మిక సూత్రాన్ని నమ్ముతాయి కాబట్టి స్వామిజి మాటలను హేతుబద్ధంగా భావించారు అమెరికన్ శ్రోతలు.

స్వామీజి మనిషి మేధస్సుకు, ఇతర జీవుల మేధస్సుకు మధ్యనున్న తేడాను తొలుత శాస్త్రీయంగా వివరించాడు తన ఉపన్యాస పరంపరలో భాగంగా. మానవ మేధస్సు తాలూకు శక్తిని వివరిస్తుంటే ప్రతి ఒక్కరికి 'ఔరా మన శరీరంలోని 'మెదడు' అనే అంగంలో ఇంత శక్తి నిక్షేపం అయి ఉందా? ' అని ఆశ్చర్యం కలగక మానదు. ఇదే పతంజలి యోగ సూత్రాలలో తొలి ప్రకరణం 'ఏకాగ్రత '. 'ది పవర్ అఫ్ మైండ్' అనే పుస్తకంలో ఈ 'ఏకాగ్రత' ఎలా ప్రతిమనిషిలో నిక్షిప్తమై ఉందో, అయినా మనిషి తనలోని నిక్షిప్తమైన ఈ శక్తిని ఎందుకు వాడటంలేదో వివరించారు. అందుకు కారణం 'మోహం'. ఈ ప్రపంచం లోని ప్రక్రుతి సహజ సౌందర్యాలకు, కృత్రిమ సౌకర్యం, వినోదాల పట్ల మనిషి ఏర్పరచుకొన్న 'భ్రమ'నే ఇందుకు కారణం అని వివరించారు స్వామి వివేకానంద.

నేడు మనమంతా 'ఒత్తిడి' అనే ఒక మానసిక రోగాన్ని ఎదుర్కొంటున్నాము. అసలు ఈ ఒత్తిడి నుంచి విముక్తి కలిగించేది 'ఏకాగ్రతనే'. కానీ, ఇది పొందాలంటే కొంత జ్ఞానం ఉండాలి. 'మనకేది బలమిస్తుందో అది జ్ఞానం, ఏది భయపెడుతుందో అది అజ్ఞానం' అంటారు

స్వామి వివేకానంద. దీనినే ఆయన మరో మాటలో ఇలా చెప్పారు– 'నమ్మకమే జీవనం, భయం మరణం' అని.

ప్రతి మనిషికి ఉండవలసిన కనీస తొలి జ్ఞానం ఏమిటంటే వ్యక్తి తనను తాను సృష్టించుకోలేదు. ఈ సృష్టి తాను సృష్టించలేదు. 'నేను, నాది' అని ఏదీ లేదు. ఈ ప్రపంచం పరిణామ శీలం కలిగినది. ఇవ్వాళ ఉన్నట్లు రేపు ఉండదు. అనుక్షణం నశిస్తూ, తిరిగి ఉత్పత్తి అవుతూ సాగిపోయే సృష్టిలో ఏదీ శాశ్వతం కాదు. ఇటువంటి సృష్టికి కారణమైన వాడే ఈశ్వరుడు. ఆ ఈశ్వర దర్శనం కావాలంటే అచంచలమైన ఏకాగ్రత అవసరం. ఈ సృష్టి లోని అశాశ్వతమైనవన్నీ తిరస్కరించి, శాశ్వతమైన ఈశ్వరుడే సత్యమన్న విశ్వాసంతో సాగే సాధననే 'ఏకాగ్రత' అంటారు.

ఇక్కడ మనకు అర్థమయ్యే తొలి శాస్త్ర విజ్ఞాన విషయమేమిటంటే 'ఏకాగ్రతకు, మానవ శ్వాసకు మధ్య నున్న విలోమ సంబంధం'. ఎంత దీక్షతో, ఏకాగ్రతతో మనిషి ఒక చదువో, సినిమానో చూస్తుంటే అతని శ్వాస చర్య అంత తక్కువ ఉంటుంది. ఈత కొట్టేవారు ఈత పందెంలో నెగ్గాలంటే శ్వాసను అదుపుచేయాలి. ఎంత తక్కువ శ్వాస తీసుకొంటే అంత వేగంగా ఈదుతాడు. అలాగే పరిగెత్తగలుగుతాడు. ఇవన్నీ మనకు నిత్య జీవితంలో అనుక్షణం కనిపించే తార్కాణాలు. కరాటే, కుంఫు వంటి సైనిక విద్యలు అభ్యసించే వారు శ్వాసపై సాధించే అదుపుతో శరీరాన్ని ఇనుపముక్క చేయగలరు. ఆకాశంలో ఎగర గలరు. పల్టీలు కొట్టగలరు. గాలిలో ఎగిరే పక్షులన్నీ శ్వాసపై అదుపుతోనే జీవిస్తున్నాయి. హనుమంతుడు సముద్ర లంఘనం కూడా శ్వాస నిరోధంతోనే సాధ్యమైంది. అలా శ్వాసపై నియంత్రణ తోనే ఏకాగ్రత సిద్ధిస్తుంది. ఈ విధంగా

సిద్ధించే 'ఏకాగ్రత'తోనే అపార జ్ఞాన మార్గాలు తెరుచుకొంటాయి. సృష్టిరహస్యాలు బోధపడతాయి. ఇది భగవత్ దర్శనానికి తొలిమెట్టు.

కొందరు ఈశ్వర సాక్షాత్కారానికై చేసిన ప్రయత్నాన్ని 'ఏకాగ్రత' దగ్గరనే ఆపేస్తారు అనేక కారణాలవలన. అయితే మరు జన్మకు కూడా ఈ జన్మలో సాధించిన ఏకాగ్రత ఫలం పుట్టుకతోనే వస్తుంది. అందువల్ల సాధకుడు ఆధ్యాత్మిక సాధనలో ఎక్కడ ఆగిపోయినా భగవంతునితో ఆ బంధం పూర్తిగా తెగిపోదు. ఆ వ్యక్తి కోరుకొంటే ఆ ఏకాగ్రత ఫలంగా ఈ జన్మలో గొప్ప శాస్త్రవేత్త, సంగీతకారుడు, కళాకారుడు, ఇలా ఏదైనా కాగలడు. ఆ విధంగా సమాజంలో గుర్తింపు, ధనం, కీర్తి సాధించుకొని జీవితం ముగించుకొని వెళ్ళిపోతాడు. కానీ, ఈశ్వర కటాక్షం అక్కడితో ముగుస్తుంది కాబట్టి మళ్ళి జనన, మరణ చక్రంలో పడి అందరి లాగే జీవితం గడుపుతుంటాడు. ఒక్క 'ఏకాగ్రత' సాధన ఇంత లౌకిక , అలౌకిక లాభాలకు మార్గం వేస్తున్నది.

ఇక్కడ తెలుసుకోవలసిన సత్యం మరొకటి ఉంది. 'ఏకాగ్రత' సాధన కాలంలో త్వరగా సాధన సిద్ధించేందుకు, ఏ కర్మల పాప దోషాలు అంటకుండా ఉండేందుకు 'యమ' నియమాలు పాటించాలి. యమనియమాలనంగానే భయపడవలసిన దేమి లేదు. ఈ 'ఏకాగ్రత 'తో ఈశ్వర కటాక్షం గురించి సాధన చేసే కాలంలో శారీరకంగా, మానసికంగా ఎటువంటి దుష్ట కార్యాలు చేయరాదు. అంతే. మితాహారం తీసుకోవాలి. అతి ఆహారం నిద్రనిస్తుంది. అప్పుడు ఏకాగ్రత సిద్ధించటం కష్టం.

ఇంతకు ముందు చెప్పినట్టు 'ఏకాగ్రత'కు 'శ్వాస'కు మధ్య విలోమ సంబంధం ఉందనటంలో మరో సృష్టి రహస్యం ఇమిడి ఉంది.

అదేమిటంటే మనిషి 'పరాన్నజీవి'. అంటే తన ఆహారం కోసం చెట్లనో, మొక్కలనో, జంతువులనో ఆశ్రయిస్తాడు. పతంజలి యోగ శాస్త్రం మనిషిని 'పరాన్న' స్థితి నుంచి విముక్తి చేసే గొప్ప సాధన మార్గం. అంటే మనిషి ఎంత తక్కువ శ్వాస పీల్చుకొంటే, అంత ఎక్కువగా జీవిచగలడు. అంటే మానవ ఆయుర్దాయం మనిషి పీల్చుకొనే శ్వాసలో ఉంది. మనిషి 'ఏకాగ్రత' తో ముందు తక్కువ శ్వాస తీసుకోవటం అలవాటైన తరువాత, క్రమంగా సాధనలో ముందుకు వెళ్లే స్థితిలో ఆహారం లేకుండా కేవలం శ్వాసపైనే ఉండగలుగుతారు. ఇలా కేవలం శ్వాసపైనే జీవించిన యోగులు గతంలోనూ ఈ దేశంలోనే ఉన్నారు. ఇప్పుడూ ఉన్నారు. భగవాన్ శ్రీ రమణ మహర్షి నెలల తరబడి శారీరక స్పృహ లేకుండా విరూపాక్ష గృహాలలో ఉండేవారు. కానీ, ఒక్క సారి స్పృహలోకి వచ్చాక విపరీతమైన ఆకలితో భిక్ష పాత్ర తీసుకొని తిరువణ్ణామలై వీధుల్లోకి పరిగెత్తే వారు. ఇలా ఒకసారి భోజనం చేస్తే వచ్చే శక్తితో మళ్ళీ చాలాకాలం వారు శ్వాస నిరోధించి ధ్యానంలో ఉండేవారు.

అన్నింటికీ మించి 'ఏకాగ్రత'తో ఎవరు శ్వాసని తక్కువ తీసుకొంటారో వారిలో విపరీతమైన శక్తి ఉద్భవిస్తుంది. ఇది చెబితే నమ్మ శక్యంగా ఉండదు. అనుభవంలో తెలుస్తుంది. అందువల్ల వారికి ఎక్కువ ఆకలి ఉండదు. అదంతటదే ఆకలిని తగ్గిస్తుంది. ఇదేదో అనారోగ్యం అని భయపడనక్కరలేదు. అయితే అసలంటూ కొంత ఆహారం, నీరు తీసుకోక తప్పదు. క్రమంగా 'ఇంద్రియ' బంధాలు తెంచుకోవటం, కల్పించుకోవటం వరకే ఇదైనా అవసరం. ఈ స్థితిని 'ప్రత్యాహారం' అంటారు. ఈ స్థితిలో ఇంద్రియాలు మనం చెప్పినట్టు వింటాయి. సాధన అంటే ఏమిటో తెలియని మానవుడు ఇంద్రియాలు చెప్పినట్టు తోలు

బొమ్మలా ఆడుతుంటాడు. మనస్సు చెప్పినట్టు వింటూ పరాధీనమై వర్తిల్లి పతనమై పోతాడు.

అంటే ఏకాగ్రత, ధ్యానం, ప్రత్యాహారం అనే పతంజలి చెప్పిన మూడు దశలు మానవ జీవితాన్ని పూర్తి స్వేచ్ఛ తో నింపుతాయి. శ్వాస తో అవసరం ఉండదు. ఆకలి, దప్పిక ఉండవు. ఇంద్రియాలు సాధకుడు చెప్పినట్టు వింటాయి. ఇది జీవన్ముక్త స్థితికి మరో మెట్టు. దీని తరువాత స్థితి 'సమాధి' స్థితి. ఈ స్థితిలో ఆత్మ బ్రహ్మ ముఖ ద్వారం వద్ద ఉండి 'బ్రహ్మానందాన్ని' (రాగ ద్వేష, విషయం వ్యామోహం లేక సర్వం బ్రహమయంగా గుర్తించే స్థితి) అనుభవిస్తుంటుంది. కానీ, ఎప్పుడు తిరిగి దేహంలోకి రావాలని సంకల్పిస్తే అప్పుడు తిరిగి దేహంలోకి చైతన్యమే రాగలుగుతుంది. ఇందుకు స్వల్ప దేహభావాన్ని ఆ పరబ్రహ్మ అనుగ్రహిస్తాడు. ఆయన అనుగ్రహం లభించాకనే జీవుడు, దేహాన్ని వీడి పరబ్రహ్మలో భాగం అయిన 'బ్రహ్మలోకం' చేరతాడు.

అద్భుతమైన ఈ రాజ యోగ రహస్యాలు మానవజాతికి వివేకానందుడు అందించటంలో రెండు రహస్యాలున్నాయి. ఒకటి భారతీయ యోగ శాస్త్రం విజ్ఞాన ఖని అని, పాశ్చాత్యా శాస్త్ర పరీక్షలకు ధీటుగా నిలుస్తుందని తెలపటం. రెండవది మనిషిని 'పరాధీనం' నుంచి నిజమైన విముక్తుడిని చేయటం. ఇక్కడ గ్రహించవలసిన విషయం ఏమిటంటే ఈ సాధన మార్గంలో ఆహారం, నీరు, ప్రాపంచిక ఇంద్రియ మొహాలు త్యజించడానికి సాధకుడు సిద్ధమైనా కొన్ని అగ్నిపరీక్షలు ఎదురుకాక తప్పదు. అందులో ముఖ్యమైనవి కామిని, కాంచనాలు.

సహజంగా మనిషికి కొంత కామిని (స్త్రీ వ్యామోహం), కాంచనం (ధన, కనక, వస్తు, వాహన వ్యామోహం) కోరికలుంటాయి. జీవితం తాలూకు స్థితులను బట్టి వీటి హెచ్చు తగ్గులు మారుతుంటాయి. ఒక

స్థితిలో పూర్తి వైరాగ్యం కలగవచ్చు. అలా మనిషి వైరాగ్యంతో, ప్రాపంచిక విషయ విముఖతతో ఈశ్వర పాదాలను శరణు జొచ్చి, వీటన్నింటినుంచి విముక్తి, స్వేచ్ఛనిచ్చే ఈ సాధన మార్గం ఎంచుకోవచ్చు. కానీ, సాధనలో మగ్నం అయినాక తిరిగి ఈ ప్రాపంచిక విషయాలు సాధకుల ముందుకు వచ్చి విపరీతంగా ఆకర్షించే ప్రయత్నం చేస్తాయి.

మహనీయులైన శ్రీ తాడేపల్లి రాఘవ నారాయణ శాస్త్రి గారి జీవిత చరిత్ర చూస్తే కేవలం 'ఈ కామినీ' పరీక్షలో నెగ్గలేదనే ఆ పరాశక్తి/ పరాభట్టారిక ఆయనను తిరిగి భూమి మీదకు పంపించిందని తెలుస్తుంది. తిరిగి ఈ జన్మలో ఆయన ముక్తి మార్గం ప్రవేశించాక కూడా అందమైన స్త్రీ రూపంలో ఆయనను వివశుడిని చేసే ప్రయత్నాలు జరుగుతాయి. అవన్నీ ఆ జగన్మాత మాయ గా గ్రహించి ఆయన ఆమెనే ప్రార్థించి మాయ స్త్రీ నుంచి విముక్తి పొందాడని వారి జీవితం మనకు తెలుపుతుంది. పతంజలి యోగ సూత్రాలలో స్వామి వివేకానంద ఇట్టి ప్రమాదాలను ప్రతి చోటా వివరిస్తాడు. సాధారణ మనిషి జీవితం ఎలా 'దినగండం నూరేళ్ళ ఆయుష్షుగా' సాగుతుందో, సాధకుడి జీవితం గూడా పరీక్షలకు గురవుతుంది. కానీ, ఈశ్వరుడే తిరిగి కాపాడుకొంటాడని 'గీత' మనకు భరోసా ఇస్తుంది. ఇలా వచ్చిందే 'సాధక బాధకాలు' పదం.

(భక్తిమాస పత్రిక, జూన్ 2025)

17
నృహరి శతకం

పరుగున ననుగావు మనుచు/వెరపున నేవేడుకొందు విష్ణూయనుచున్//
సరగున కాపాడుటకును/మొరవిని రావేమి తండ్రి ముదమున నృహరీ

– అంటూ ధర్మపురి నృసింహునికి తన మొర వినిపించారు సంగనభట్ల చిన్న రామకృష్ణయ్య అత్యంత భక్తి, ప్రపత్తులతో. ఈయన ధర్మపురి నివాసి.

ఎందుకో గానీ నృసింహ స్వామిపై రాసిన శతకాలే వేళ్ళపై లెక్క పెట్టవచ్చు. అవిగూడ 18వ శతాబ్దంలో తొలిసారిగా కనిపిస్తాయి. మొట్ట మొదట నారసింహ శతకం రాసింది ధర్మపురి శేషప్ప. ఇతను 18వ శతాబ్దానికి చెందిన వాడు. శ్రీ లక్ష్మీనారసింహుని మహాభక్తుడు. ఆద్యంతం భక్తి రస ప్రధానంగా రాసిన ఈ శతకం భక్తులకు కొంగు బంగారమై విలసిల్లుతుంది.

'భూషణవికాస! శ్రీధర్మ పుర నివాస!
దుష్ట సంహార! నరసింహ! దురిత దూర!'

– అనే మకుటంతో ఈ నూరు పద్యాలను రాశారు శేషప్ప కవి.

సీ. నరసింహ నీ దివ్య – నామమంత్రముచేత, దురితజాలము లన్ని – దోలవచ్చు, నరసింహ నీ దివ్య – నామమంత్రముచేత, బలువైన రోగముల్ – పాపవచ్చు, నరసింహ । నీ దివ్య – నామమంత్రముచేత, రిపుసంఘముల సంహ – రింపవచ్చు నరసింహ । నీ దివ్య – నామమంత్రముచేత, దండహస్తుని బంట్ల – దరమవచ్చు

– అని సీస పద్యంలో రాసి, ముక్తాయింపుగా తేట గీతితో ఈ క్రింది చరణాలతో ముగిస్తాడు. ఇందులో ఏ పదము అర్థంకానిది లేదు. గొప్ప భక్తి లక్షణం అలతి అలతి పదాలతో చెప్పటం.

తే. భళిర । నే నీ మహామంత్ర
బలముచేత దివ్య వైకుంఠ పదవి సాధింపవచ్చు
భూషణవికాస । శ్రీధర్మ – పురనివాస ।
దుష్టసంహార నరసింహ – దురితదూర ।

ధర్మపురిలో పవిత్ర గోదావరీ నది ప్రవాహ ప్రాంతంలో నెలకొని ఉన్న ఈ నృసింహ పుణ్య క్షేత్రం అత్యంత విశిష్టమైనది. కొన్ని కథనాల ప్రకారం బమ్మెర పోతన ఈ పుణ్య క్షేత్రంలో నదీ స్నానం ఆచరిస్తుండగా శారదా దేవి ప్రత్యక్షమై భాగవతాన్ని తెలుగులో అనువదించమని చెప్పగా, ఆ క్షణమే ఆయన భాగవత రచనకు శ్రీ కారం చుట్టారట.

కడు ఉన్నతమైన సంప్రదాయ బ్రాహ్మణ కుటుంబంలో జన్మించిన సంగనభట్ల వంశీకుడైన చిన్న రామకృష్ణయ్య సంస్కృతాంధ్రాలలో విద్యాభ్యాసానంతరం అక్కడే అధ్యాపకుడిగా ఆంధ్రాన్ని బోధిస్తూ, భక్తితో ధర్మపురి శ్రీనృహరిని నిత్యారాధన చేస్తూ రాసిన శతకం ఇది. తన తల్లిదండ్రులైన దామోదరమ్మ, పాపయ్యలకే అంకితమిచ్చిన కంద పద్య

కుసుమహారం ఈ శతకం. మొల్ల రామాయణం కంద పద్యాలకు ప్రతీక. అలాగే రామకృష్ణయ్య 'నృహరి' శతకం కూడా ఆసాంతం 'కందం'లో సాగింది. కందం గొప్పతనమేమిటంటే 'భక్తి'ని వ్యక్తపరచటంలో దాని పదాలు సామాన్యుడికి దగ్గరగా ఉంటాయి.

కందము ఛందముగా గొని, నందముగా నుండుననియు నతి
కురుచయనిన్ ॥ విందుగ నీ కిచ్చితి నే వందనము చేయుచుంటి
భక్తిని నృహరీ ॥

– అంటూ తన కంద పద్య ధార మొదలుపెట్టారు చిన్న రామకృష్ణయ్య.

'నరసింహాయని భక్తిని ధరజనులందరును నిన్ను తగ కొలువంగా ।
కరువును కాటకమెల్లను । సరగున మాయమ్ము జేయు సామీ నృహరీ ॥

– అని, 'నరహరి నామము దలచిన ధరణిని పాపములు పోయి దండిగ జనముల్ విరివిగా పుణ్యము పొందన్, నరకములేదు సుమ్మి నరులకు నృహరీ – అని మనసారా కీర్తిస్తారు శతక కర్త చిన్న రామకృష్ణయ్య.

సాధారణంగా శతక సాహిత్యంలో కనబడని ఒక సాంప్రదాయం ఈ శతకంలో కనిపిస్తుంది. చిన్న రామకృష్ణయ్య ఈ శతకం తన తల్లి దండ్రులకివ్వాలన్న సంకల్పం ముందే ఉండటంవలన కాబోలు, ఈ శతకంలో తల్లి దండ్రులను స్తుతి చేశారు.

దామోదర పాపయ్యల
నోమగ నైకేక సుతుగ నుదయించుచునే
నీ మహిమల నెల్ల బొగడ
నామముచే రామకృష్ణ నైతిని నృహరీ.

అంతేగాక తన పూర్వ కవి శేషప్పను స్తుతిస్తూ కూడా పద్యాలు చెప్పారు శతక కర్త. సాధారణంగా 'బోద్ధారో మత్సరగ్రస్తాః' అని భర్తృహరి సుభాషితాలలో చెప్పినట్టుకాక, 'శేషప్ప శతకము జదువ, /దోషమ్ములు జాడలేక తొలగుచు చనగా – భూషణ వికాస యనుచును/భాషించెను దివ్యమకుట భాసుర నృహరీ॥' – అని, మరోచోట 'ఉత్తముడౌ శేషప్ప కవి /పొత్తము నెత్తుచును జదువ పుత్తడి ముక్తిన్ /భక్తులకును విత్తమ్మవ /చిత్తపు తత్తరము లేక చేనిడు నృహరీ' – ఈ శతకంలో ప్రహ్లాద చరిత్ర, నృహరి అవతార విశేషాలు, వేదాంత విషయాలు, సూక్తులను నిక్షిప్తం చేశారు. 'బాలుడు ప్రహ్లాదునికై /శ్రీలోలా స్థంభమున వసించితివీవె// బేలయగు కృష్ణ మానము// చేలమ్ముల నిల్పితీవె శీఘ్రము నృహరీ ॥' – అని ప్రహ్లాదవరదుడిని కీర్తించాడు.

అంతేగాక, 'రక్తము చిందించిన ప్రేవుల, నుక్తుల రానీయకుండ నుసురల గొనుచున్//శక్తుడు హిరణ్య కశ్యపు ముక్తికి నీవైతివయ్య మూలము నృహరీ//' అని కూడా హిరణ్యకశ్యపుడిని ఎలా ఉద్ధరించింది చెప్పుకొచ్చాడు.

నృహరి మహిమలను వేనోళ్ళ కొనియాడుతూ గజేంద్రుని, శబరిని, ద్రౌపదిని, కుంతిని కాపాడిన ఆయన కరుణను తెగ పొగిడినాడు. మరి నాపై ఎందుకు ఈ నిర్దయ అని రామదాసులా నిలదీస్తాడు. వనితలు, బాలురను, రైతులను, భక్తులను బోవమని వేడుకొంటాడు. ధర్మపురి యాత్ర జేస్తే మర్మము బోధపడుతుందంటాడు. 'నారాయణ నీగానము, నారద తుంబురులకే మరి నరులకు తరమే//, పరమాత్మా నీ నామము కరముగభజియించి నిన్ను గాంచెద నృహరీ' – ఈ కవి శేఖరుడికి నృహరిలో కనిపించనిదేమున్నది. ఆయన ఆర్తత్రాయపరాయణుడు. అందరి

కష్టములను ఎరిగినవాడు. నేడు రైతులు, పంటలు సుభిక్షమవునట్లు చూడుము వరదా అని అర్థిస్తాడు. సుమారు 130 కంద పద్యములతో సాగిన ఈ భక్త కవి చివరన ఈ శతకం భక్తితో విశ్వాసంతో పఠించిన ఖచ్చితముగా బాధలు తొలగి సుఖము కలుగును అని ఫల శృతి కూడా చేస్తాడు. ఈ మాత్రం ఫలం లేకపోతే ఆ స్వామిని స్తుతించడం ఎందుకు నోరు నొప్పిపుట్టేలా?

శ్రీ మహావిష్ణు అవతారాలలో నాలుగో అవతారంగా సుప్రసిద్ధమైన నరసింహావతారం తెలుగు వారికే ప్రత్యేకమా అన్నట్లు ఉంటుంది. తెలుగు రాష్ట్రాలలో ఉన్నన్ని నరసింహ స్వామి ఆలయాలు దక్షిణాదిన ఏ రాష్ట్రంలోనూ లేవు. అలాగే ఉత్తరాదిన కూడా ఎక్కడా ప్రసిద్ధ నరసింహ ఆలయాలు ఉన్నట్లు మనకు కానరాదు. దశావతారాలలో కొన్ని అవతారాలు పరిసమాప్తి అయినాయి. కొన్ని కాలేదు. కానివాటిలో వరాహ, నరసింహ అవతారాలు ప్రధానమైనవి.

ఆశ్చర్యమేమంటే వ్యాస భాగవతంలోని నృసింహ అవతారం ప్రహ్లాద చరిత్రలో కనిపిస్తుంది. భక్తవరదుడైన శ్రీమహావిష్ణువు తన అంశాన హిరణ్యకశిపుడికి జన్మించిన ప్రహ్లాదుడిని రక్షించేందుకు, హిరణ్యకశిపుడిని సంహరించేందుకు ఈ నృసింహావతారం ఎత్తారని భాగవతం చెబుతుంది. ఆ విధంగా చూస్తే ఉత్తరాది వాడైన వ్యాస భగవానుడు, ఆయన రాసిన భాగవతంలోని శ్రీమహావిష్ణు అవతారాల ఆలయాలు ఉత్తరాదిన ప్రముఖంగా కనిపించాలి. అక్కడ ఆ అవతారాలకు దేవాలయాలు, పుణ్యక్షేత్రాలు ఉండి ఉండాలి. అవి భక్తి తత్వానికి, మహిమాన్వితకు ప్రతీకలై విలసిల్లాలి. కానీ, ఉత్తరాదిన కాశ్మీరం నుంచి ఒరిస్సా దాకా, లేక మహారాష్ట్ర, సౌరాష్ట్ర దాకా శ్రీ మహావిష్ణు అవతారాలలోని శ్రీ రామ,

శ్రీకృష్ణ అవతారాలే ప్రధానంగా కనిపిస్తాయి.

ఇక తెలంగాణా, ఆంధ్రా రాష్ట్రాలలో లెక్కకు మించిన నరసింహ స్వామి ఆలయాలున్నాయి. ఇవన్నీ కూడా అద్భుతమైన క్షేత్ర మహిమ, స్థల పురాణం, భక్త గాథలతో ముడిపడి ఉన్నవే. ఇవి ఏ క్షేత్రానికదే అన్నంత భక్తి పారవశ్యం తొణికిస్తాయి.

సింహాచల నారసింహుడిపై శతకం రాసిన మరో మహా కవి గోకులపాటి కూర్మనాథ కవి. ఇతడు విజయనగరం జిల్లా రామతీర్థం వాసి. 18వ శతాబ్దానికి చెందిన వాడు. దాదాపు 1720 ప్రాంతాలలో జన్మించాడని చరిత్రకారుల నమ్మకం. ఈ శతకం పేరు 'సింహాద్రి నారసింహ శతకం. దీనిని 'ఉత్తమ అధిక్షేప శతకం' అని గాని, 'చారిత్రక శతకం' అని కానీ అంటారు. ఈ శతకం కవికి ఘనకీర్తి తెచ్చిపెట్టింది. ఎందుకంటే శతకాలు కేవలం నీతి లేక భక్తి సుబోధకాలే కానీ, మహిమలు చూపేవి కావు. కానీ, గోకులపాటి కూర్మనాథ కవి రాసిన ఈ 'సింహాద్రి నారసింహ శతకం మహిమను ప్రదర్శించింది. ఇది శతక చరిత్రలోనే అత్యంత అరుదైన ఘటన.

'ఆంధ్ర సృష్టిని నిలుపమని సింహాద్రి నారసింహుని అర్థించిన కవిగా తెలుగు భక్తి సాహిత్యంలో మహా కవి గోకులపాటి కూర్మనాథ కవి సృష్టి నిలుస్తుంది'అంటారు సాటి కవులు.

మహాకవి శ్రీనాథుడు వేదాద్రి నరసింహుని దర్శించి అక్కడ కొంత కాలం ఉండి, భీమేశ్వరపురాణం రాశారని వేదాద్రి దేవస్థానం వారు వేసిన 'వేదాద్రి నరసింహ మహాత్మ్యం'పుస్తకంలో ఉంది. అలాగే 'అపర ఆదిశంకరుడు'గా కీర్తి పొందిన బెల్లంకొండ రామారాయ కవీంద్రులు గూడా వేదాద్రిలో యోగసాధన, తపస్సు చేసేందుకు అక్కడే చాలా కాలం

ఉన్నారని రామారాయ కవి స్వీయ చరిత్ర చెబుతుంది.

ఇలా పెక్కురీతులలో భక్తుల ప్రేమను, భక్తిని ఆకట్టుకున్న శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ధర్మపురి, సింహాచలం, వేదాద్రి, మంగళగిరి వంటి చెప్పలేని పుణ్యక్షేత్రాలలో నెలకొని ఉన్నారు. చివరగా 'శేషుని పానుపుపైనన్, భూషణముల నెల్ల దాల్చి, పురుషోత్తమ నీ వేషము గాంచెడి వెస, సంతోషము నాకుదుము వసుధ తోరము నృహరీ' – అంటూ ఆ నరసింహ స్వామిని వేడుకతో ప్రార్థించుదాము.

(సింహగిరి మాసపత్రిక, జులై 2025)

18

ఇచ్చిపుచ్చుకోవటం - ఆధ్యాత్మిక ప్రాశస్త్యం

ఇచ్చి పుచ్చుకోవటం' అనేది ఆధ్యాత్మిక ప్రపంచం నుంచి లౌకిక ప్రపంచానికి దిగుమతైన పదం అని చెప్ప వచ్చును. దీనికి గొప్ప తాత్విక చరిత్ర ఉంది. ఒక రకంగా దేవతలనుంచి మనుషులకు పాకిన సంస్కృతి ఇది అని చెప్పవచ్చును. కర్మశేషం వలన దేహం కలుగుతుందని, దేహం వదిలి పునర్జన్మరాహిత్యం జరగటానికి 'ఈశ్వరార్పితం'గా కర్మలు నిర్వర్తించమని ఉపనిషత్తులు చేసే బోధకు 'ఇచ్చి పుచ్చుకోవటం'తో సంబంధం ఉంది.

మనిషైన వాడు 'తనను తాను సృష్టించుకోలేదని, తనతో ఏమీ తేలేదని తెలుసుకోవడానికి' ఎంతో కాలం పట్టదు. జన్మనెత్తిన కొద్దికాలానికే ప్రతి మనిషికీ ఇది అర్థం అవుతుంది. అయినా ప్రాపంచిక ఆకర్షణ, అందుకు అనులోమంగా కలిగే కోరికలు మనిషిని కర్మ ప్రేరితం చేసి, ఆ కర్మల ఫలాలను ఈ జన్మలోనే పొందాలనే ఆశకు గురిచేస్తుంది.

కృష్ణ పరమాత్మ మానవులు భగవంతుని ఎందుకు ఆరాధిస్తారో అర్జునుడికి వివరిస్తూ, నాలుగు రకాల మనుషులు తనను ఆశ్రయిస్తుంటారని గీతలో అంటాడు.

''చతుర్విధా భజన్తే మాం జనాః సుకృతినోర్జున । ఆర్తోజిజ్ఞాసురర్థార్థీజ్ఞానీచ భరతర్షభ' । – అంటే ఆర్తులు, జిజ్ఞాసులు, ధన కనక వస్తు వాహన ఐశ్వర్యాలు కోరుకొనే వారు (అర్ధ కాములు), జ్ఞానులు అనే నాలుగు రకాల మనుషులు ఈశ్వర కటాక్షం కోసం తపిస్తుంటారు అని అర్థం. ఇదిగో ఇక్కడే కాముకులై కర్మలు నిర్వర్తించే వారు తాము చేసే ప్రార్ధనల, జప, తపాల ఫలాలన్నీ ఆ ఈశ్వరుడికే సమర్పించాలి అనే నియమం ఆధ్యాత్మిక సంస్కృతి నుంచి ప్రపంచం లోకి వచ్చింది. అందుకు ప్రతిఫలంగా ఎవరు ఏది కోరుకొంటే ఈశ్వరుడు దానిని అనుగ్రహిస్తాడని దీని అర్థం. ముముక్షుత్వం కోరుకొనేవారికి మోక్షం, ఆర్తులకు కష్టాలనుంచి విముక్తి, అర్ధకాముకులకు ఐశ్వర్యం అన్నీ లభిస్తాయి. ఇలా 'ఇచ్చి పుచ్చుకోవటం' అనేది ఆధ్యాత్మిక సంస్కృతి నుంచి లౌకిక ప్రపంచంలోకి ప్రవహించింది.

ఇప్పుడు లౌకిక ప్రపంచంలోకి ఎలా వచ్చిందో భాగవత రామాయణ మహాభారతాదులలోని కొన్ని ఘటనలను చూద్దాం. కృష్ణుడు సందీప మహర్షి ఆశ్రమంలో ఉన్నప్పుడు ఆయనకు సుదాముడనే బాల్య మిత్రుడుండేవాడు. తరువాత కాలంలో వారిరువు గృహస్థాశ్రమంలోకి వెళ్ళాక కృష్ణుడు యాదవ రాజుగా ద్వారకాధీషుడయ్యాడు. సుదాముడు బీదరికంతో కట్టుకునేందుకు సరైన వస్త్రములు కూడా లేని కుచేలుడు అయినాడు. తన బీదరికం పోగొట్టమని రాజైన కృష్ణుడిని అర్థించడానికి

ద్వారకకు వెళ్తాడు కుచేలుడు. తన చిన్న నాటి మిత్రుని ఆర్థిక స్థితి ఎరిగి కూడా కృష్ణుడు కుచేలుడిని తనకోసం ఏమితెచ్చావని అడుగుతాడు. కృష్ణుడి లాంటి మహారాజుకు ఇవ్వగలిగినది తనవద్ద ఏమీ లేదని తెలిసి సాధారణంగా వచ్చిన కుచేలుడు ఆ ప్రశ్నకు బిక్కచచ్చిపోతాడు జవాబు చెప్పలేక.

అప్పుడు కృష్ణుడే కుచేలుడిపై వస్త్రం తీసి అందులో దారిలో ఆకలివేస్తే తినడానికి కుచేలుని భార్య కట్టిచ్చిన అటుకులను తీసుకొని మూడు పిడికెళ్లు తన నోట్లో వేసుకొంటాడు. ఆ తరువాత కొద్దిరోజులు తన ఇంటిలో ఉంచుకొని తగు మర్యాదలు చేసి కుచేలుడికి వీడ్కోలు పలుకుతాడు. తన బీదరికం పోగొట్టమని అడుగుదామని వచ్చినా అడగలేక ఆత్మాభిమానంతో తిరుగుముఖం పట్టిన కుచేలుడు ఇంటికి వెళ్లి చూస్తే అష్టైశ్వర్యాలు కలిగి వైభవంగా ఉన్న తన ఇల్లూ , ఇల్లాలు కనిపిస్తారు. అంతా ఆ కృష్ణుడి అనుగ్రహం అని భావిస్తారు. ఇలా మూడు పిడికెళ్లు అటుకులు తీసుకొనే ఈశ్వరుడైన కృష్ణుడు కుచేలునికి అంత ఐశ్వర్యాన్ని ప్రసాదించాడు.

అలాగే రాయమాయణంలో విశ్వామిత్రుడు అప్పుడప్పుడే నూనూగు మీసాలు వస్తున్న రాములవారిని తనతో పంపమని, తాము చేసే యజ్ఞ యాగాదులకు రాక్షసులనుంచి రక్షణ కోసం రాముడే కావాలని దశరథుడిని పట్టుబట్టి తనతో తీసుకెళ్తాడు. రాముడు యాగరక్షణ చేయటం ప్రారంభించాక ఆయనకు అనేక అస్త్ర, శాస్త్రాలను తన మంత్ర శక్తితో ఇచ్చి ఆయనను సృష్టి లోనే అజేయమైన వీరుడిగా మారుస్తాడు విశ్వామిత్రుడు. ఇక రామాయణం లోతుల్లోకి వెళ్తే సుగ్రీవుడిని తన అన్న

వాలినుంచి రక్షిస్తానని,అందుకు బదులుగా తన భార్య అయిన సీతామహాసాధ్వి ఎక్కడుందో వానరులద్వారా శోధించి తనకు తెలపాలని కోరుతాడు శ్రీరాముడు. కోరిన విధంగానే రామచంద్రుడు వాలి వధ చేయగా, సుగ్రీవుడు తన వానర సైన్యం నలుదిక్కులా పంపి సీతమ్మ తల్లి చిరునామా కనుక్కొంటాడు. ఇలాంటివి రామాయణంలో కోకొల్లలు. విభీషణుడికి శరణం ప్రసాదించి, లంక గుట్టుమట్టులు, రావణుడి ఆనుపానులు తెలుసుకొని రావణసంహారం చేసి, తిరిగి విభీషణుణ్ణి లంకకు పట్టాభిషిక్తుడిని చేశారు శ్రీ రామచంద్రుడు.

కృష్ణుడు ఒకసారి కత్తితో ఎదో పనిచేస్తుండగా పొరపాటున ఆయన చేయి కోసుకొంటుంది. ఆ క్షణంలో అక్కడ ఉన్న సోదరి ద్రౌపది తన చీరె అంచు చించి శ్రీకృష్ణుని చేతి రక్తం బయటికి రాకుండా గట్టిగ కట్టు కడుతుంది. ఇందుకు బదులుగా ద్రౌపది వస్త్రాపహరణమప్పుడు కృష్ణుడు ఆమెకు వస్త్ర దానం చేసి ఆమె మానం కాపాడాడని కొందరు విజ్ఞులు వ్యాఖ్యానిస్తుంటారు. వరుసకు సోదరి అయిన ద్రుపదరాజ తనయకు కృష్ణుడు భగవంతుడని ఆదినుంచి ఖచ్చితంగా తెలుసు.

ఇలాంటివి బుద్ధ జాతక కథలలో కూడా వస్తాయి. బుద్ధుడొకసారి తన జీవిత చరమాంకంలో భారత దేశ పర్యటనగావిస్తూ ఒక కుగ్రామానికి చేరి చెట్టుకింద బస చేస్తారు. ఆ ఊరి ప్రజలంతా బుద్ధ భగవానుని దివ్య తేజస్సును గ్రహించి, ఆయనకు ఆహారానికి, తాగటానికి వసతులు ఏర్పాటు చేసి ప్రతి ఒక్కరు తమ వంతుగా ఏవో కొన్ని ఆహార పదార్థాలు వారికి ప్రతి దినం సమర్పించుకొనేవారు. వాటిని ఆయన, ఆయన పరివారం స్వీకరించేవారు. అయితే ఆ ఊరులోని ఒక ముసలావిడ కడు పిసినారి.

ఆవిడ పిల్లికి కూడా బిచ్చం పెట్టినటువంటిది కాదు. ఆ విషయం ఆ నోటా ఈ నోటా విని స్వయంగా బుద్ధుడే ఒక రోజు ఉదయాన్నే ఆమె ఇంటికి బిచ్చం కోసం వెళ్ళాడు. ఆమె వీరిని చూడగానే వెళ్ళిపో అని చెబుతుంది. బుద్ధ భగవానుడు వెళ్లిపోక అక్కడే అలానే నిల్చుని ఉంటాడు. ఆవిడ పలుసార్లు చెప్పినా ఆయన వెళ్ళక ఉండిపోవడంతో, ఆమెకు తీవ్ర కోపం వచ్చి ఇల్లలికే గుడ్డను బుద్ధ భగవానుని మీదకు విసిరివేస్తుంది. అది తీసుకొని బుద్ధుడు అక్కడినుంచి వెళ్ళిపోతారు.

కొంతకాలానికి ఆ ఊరు దగ్గరలోని నది పొంగి ఊరిని ముంచేస్తుంది. అందరూ నిరాశ్రయులవుతారు. వారంతా బుద్ధభగవానుని చెంతకు చేరి రక్షించమని కోరుతారు. బుద్ధుడు వారందరిని తీసుకెళ్లి ఒక మంచి ఎత్తైన ప్రదేశంలో ఉండేలా ఆశ్రయం కలిపించి, అన్న పానాదులకు ఇబ్బంది లేకుండా కాపాడతారు. వారికి బట్టలు కూడా అందిస్తారు. కానీ ఈ పిసినారి ముసలి దానికి ఆమె విసిరేసిన అలుకు గుడ్డనే ఇచ్చి, దానితో వచ్చిన నాలుగు శనగ గింజలనే ఆహారంగా ఆమెకు అందిస్తారు. అలా ఆమెకు తన పిసినారి గుణం ఎంత తప్పో తెలియచేస్తారు.

ఇలాంటి ఆధ్యాత్మిక ఉపపత్తుల సారాంశమేనేమో బహుశ మనం గుడికి వెళ్ళితే పండో, ఫలమో, దక్షిణో దేవుడికి సమర్పించి రావాలని ఒక ఆచారం అమలులోకి వచ్చింది. ఆ విధంగా దయ, దానం, దక్షిణ ఈశ్వరార్పిత కర్మలకు మొదటి మెట్లు. ఇచ్చి పుచ్చుకోవటం అనేది సత్కర్మ కాబట్టి ఇది మనుషలలో సాత్విక లక్షణాలను, మానవత్వాన్ని, దైవీ సంపత్తును పెంచుతుంది. ఇవి ప్రతిఒక్కరూ అలవరుచుకొంటే నిత్య

ఈశ్వరారాధన చేసినట్టే. పశువులకు, పక్షులకు అంత అన్నం, నీరు కలిపించటం ప్రతిమానవుని ధర్మం. ఇలా ఆచరించే కర్మల ఫలం ఈశ్వరార్పితం కాబట్టి కాముకులైన మానవులకు ఈశ్వరానుగ్రహం ఎప్పుడూ ఉంటుంది. అంతే గాదు, జంతు పక్షుల ప్రేమలకు కూడా పాత్రులమవుతాము.

19
ఇప్పటికి మన గురువు పరబ్రహ్మమైన సాయి నాథుడే!

ఇప్పటికి మన గురువు, సద్గురువు, జగద్గురువు సాయి నాథుడే. 'ఎలా చెబుతారు? ఎన్నోఆధ్యాత్మిక మార్గాలు, ఎందరో గురువులున్నారు కదా! అలాంటప్పుడు సాయిబాబానే నేటి మన గురువు అని చెప్పటం సబబేనా?' అని ఎవరైనా ప్రశ్నించవచ్చు. ప్రశ్నించాలి కూడ. ఇందుకు సమాధానం లేకపోలేదు. రెండు రకాలైన సమాధానాలు ఉన్నాయి.

ఒకటి ఈ కాలానికి మనకు ఉపదేశించి, జ్ఞాన మార్గాన నడిపించేది ఎవరో పరబ్రహ్మనే నిర్ధారిస్తారు. ఎందరు ఆత్మ సాక్షాత్కారం పొందిన గురువులున్నా, జగన్నియామక శక్తి, జగత్తును సక్రమ మార్గంలో నడిపించే అధికారం ఆ ఈశ్వరుడు నిర్ణయించిన వారికే దక్కుతుందని బ్రహ్మసూత్రాలు చెబుతున్నాయి. వారే సద్గురువులు, జగద్గురువులూనూ. వేదం ప్రకారం 24 తత్వాలతో ముడిపడిన ఈ విశ్వానికి 24 మంది

గురువులు అధిపతులుగా ఉంటారు ఎల్లవేళలా. వీరందరికీ జగద్గురు స్థాయి ఉంటుంది. కానీ, వారిలో ఒకరికే ఆ పరబ్రహ్మ 'జగద్గురు' స్థాయి కలిగిస్తాడు. మిగిలిన వారు కేవలం సద్గురువులే.

వీరు గాక ఆత్మ సాక్షాత్కారం పొందిన గురువులు ఎంతోమంది అన్ని కాలాలలో ఉన్నారు. ఇప్పుడూ ఉన్నారు. కానీ, వారికి ఈశ్వరుడు ఏమి నిర్దేశించారో అవి మాత్రమే వారు చేస్తారు. అంతమాత్రానికే, వారంతా 'సద్గురువులు', 'జగద్గురువులు' కారు. ఇందుకు చిన్న ఉదాహరణ శ్రీ కృష్ణ పరమాత్మ. ద్వాపర యుగంలో కుడా ఎందరో యోగులు, అద్వైత ఋషులు ఉన్నారు. ఇప్పటికన్నా అప్పటి వారి సంఖ్య ఎక్కువ కూడ. అయినా శ్రీకృష్ణ పరమాత్మ ఒక్కరే 'జగద్గురువు' అని గీత చెబుతోంది. 'కృష్ణం వన్దే జగద్గురుం'కు అర్థమే ఇది.

రెండవది, ఒక కాలంలో యోగులందరూ ఒకే యోగిని 'జగద్గురువు'గా పేర్కొని, 'ఆత్మ సాక్షాత్కార మార్గానికి ఆ గురువే సరైన మార్గ దర్శకుడని నిర్ధారించటం. ఉదాహరణకు రమణ భగవానులు, రామకృష్ణ పరమహంస, వివేకానంద, కంచి పరమాచార్య, షిర్డీ సాయిభగవాన్ ఒకే కాలంలో జీవించారు. వీరుగాక ఎంతోమంది దత్తాత్రేయ పరంపర యోగులు మహారాష్ట్ర, కర్ణాటక, మధ్యప్రదేశ్ లలో కూడా ఉండే వారు. వీరంతా తమ దగ్గరకొచ్చిన ఆత్మజ్ఞాన సాధకులను సాయిబాబా దగ్గరకే పంపించే వారు. అలా శ్రీ రమణ భగవాన్ తననే పరమాత్మని నమ్మి కొలిచిన బి.వి. నరసింహ స్వామిని పదేళ్ల సేవానంతరం 'సాయిబాబానే నీ గురువు' అని షిర్డీ పంపించి వేశారు.

అప్పటికి సాయినాథుడు కాలం కూడా చేశారు. అయితే ఏమి? పంపించింది శ్రీ రమణ భగవానులు కదా! నరసింహ స్వామికి బాబా సంపూర్ణ అనుగ్రహం సిద్ధించింది. ఆశేష హిమాచలం నుంచి కన్యాకుమారి వరకు కాలి నడకన పర్యటిస్తూ సాయిబాబా ప్రచారం చేశారు బి. వి. నరసింహ స్వామి. 'సాయిబాబా: భక్తుల అనుభవములు' అంటూ నాలుగు సంపుటాలను ఆంగ్లంలో ముద్రించారు. సాయిబాబా కాలంలో సాయిబాబా దర్శనం చేసికొన్న ప్రతి భక్తుడి అనుభవం, హేమాడపంత్ రాసిన 'సాయి సచ్చరిత్ర' పారాయణ గ్రంథంలోని భక్తులందరినీ కలిసి వారి అనుభవాలను ఒక చోట చేర్చి రాశారు బి వి నరసింహ స్వామి. ఊరూరా సాయి మందిర ప్రతిష్టాపన చేశారు. అలా తొలి ప్రతిష్టాపన చేసిందే కర్నూలు లోని సాయిబాబా మందిరం. ఈ రోజు షిర్డీ సాయి మందిరంలో బాబా భక్తుల చిత్తరువుల మధ్యలో బి.వి. నరసింహ స్వామి ఫోటో దివ్యంగా మెరుస్తూ కనిపిస్తుంది.

అంతేగాదు, రమణ భగవాన్ తన వద్దకు వచ్చిన శిష్యులలో చాలామందిని షిర్డీ వెళ్లి బాబా దర్శనం చేయమని పంపించేవారు. వారిలో ఆర్థర్ ఆస్బోర్న్ లాంటి వారు కూడా ఉన్నారు. బి వి నరసింహ స్వామి లాగానే ఆర్థర్ ఆస్బోర్న్ కూడా శ్రీ రమణ భగవానుల గురించి విస్తృతంగా రాసి, పుస్తకాలను ముద్రించారు.

'సాయి సచ్చరిత్ర' ప్రారంభ అధ్యాయం నుంచే గురువు, గురువు ప్రాధాన్యత గురించి వివరణ ఉంటుంది. మరే ఇతర యోగుల జీవిత గ్రంథాలలో ఇలా ఉండదు. పత్తి నారాయణ రావు రాసిన ప్రతినే 'పారాయణ

గ్రంథం' గా పరిగణిస్తారు షిర్డీ సాయి సంస్థాన్ వారు. ఇతరులవి కావు. ఎందుకంటే 'సాయి సచ్చరిత్ర' తెలుగు ప్రతిని బాబా స్వయంగా తాకి పవిత్రం చేసి, ఆమోదించారు. అలానే, మరాఠీలో హేమాడ్ పంతు రాసిన గ్రంథాన్ని కూడా బాబా తన హస్తంతో తాకి, ఆమోదించి పవిత్రం చేసి ఉన్నారు.

బాబా అనుమతితో రాసిన భక్తుల రచనలకే బాబా అనుగ్రహం లభించింది. సాధకులకు, ముక్తి మార్గం, వైరాగ్యంతో దేవుని శరణు జొచ్చినవారికి కుండలినీ శక్తితో ఆధ్యాత్మిక అనుభవం కలిగించగల శక్తి ఆ అనుగ్రహం పొందిన రచనలకే ఉంది. బాబా తన హస్తంతో తాకి ఆ రచనలలో తన శక్తిని నిక్షేపించటం వలన అది సాధ్యమైంది. సావిత్రిబాయి టెండూల్కర్, హేమాడ్ పంతు, పత్తి నారాయణ రావు, ఉపాసని బాబా, దాసగణు మహారాజ్ ఇలా కొద్దిమంది ఎంపిక చేసిన బాబా భక్తుల రచనలకే బాబా అనుగ్రహం నేటికీ ఉంది.

బాబా పారాయణ గ్రంధము కూడా గీతలా 'జ్ఞాన షట్కమ్' తో ఆరంభమవుతుంది. 'తొలి అధ్యాయం లోనే 'జ్ఞానం' ఆవశ్యకత, గురు అనుగ్రహంతో ఎలా గట్టిగా జ్ఞానంనే స్థిరంగా పట్టుకొని ఉండగలం' అన్నది ప్రస్తావిస్తారు హేమాడ్ పంతు. కబీర్ దాస్, ఆయన శిష్యుడి మధ్య జరిగే సంభాషణతో ఈ అధ్యాయం ఆరంభం చేస్తారు. ఇందులో తిరగలి, అందులో వేసే ధాన్యం, ఆ ధాన్యాన్ని విసరడం ప్రధాన విషయాలు. 'తిరగలి' చరాచర పాంచ భౌతిక ప్రపంచం. అందులో పడే ధాన్యం ఈ ప్రపంచం పట్ల మొహంతో వర్తిల్లే 'మనుష్యులు'. తిరగలి తిప్పే కొయ్య

పిడి 'జ్ఞానం'. కబీర్ శిష్యుడు తన గురువుతో 'అయ్యో, నేను కూడా ఈ తిరగలిలో పడే ధాన్యంలా నలిగి, నశించి పోతాగదా' అని వాపోయినప్పుడు ప్రక్కనే ఉన్న కబీర్ 'అలా చింతించనవసరం లేదు. పిడి అనే 'జ్ఞానం' ను గట్టిగా పట్టుకో. అప్పుడు నువ్వు తిరగలి లో పడవు' అని సముదాయిస్తారు.

ఈ కథకు బాబాతో సంబంధం ఏమిటంటే 'బాబా ప్రతిదినం తన మసీదులో ఒక పట్టాపై తిరగలి పెట్టి, ఆ తిరగలిలో తాను బిచ్చం ఎత్తగా వచ్చిన బియ్యాన్ని వేసి, తిరగలి ఆడించేవారు. ఆ తరువాత ఆ పిండిని షిర్డి నాలుగు దిక్కులా చల్లే వారు. అలా ఆ ఊరి పాపాలను శమింప చేయటమే గాక, పెరిగిన పాపాల వలన కలిగే రోగాలను రాకుండా చేసే వారు. బాబా బ్రతికున్న ఎనభై ఏళ్లలో ఏనాడు షిర్డీలో ఎటువంటి అంటువ్యాధి రాకుండా బాబా కాపాడే వారని భక్తుల అనుభవం చెబుతుంది.

బాబా జీవితం శ్రద్ధగా పరిశీలిస్తే ఆయన ఉపనిషత్తుల్లో పేర్కొన్నట్టు నిజమైన యోగిలా జీవించే వారు. రోజూ భిక్షాటన చేసే వారు. కేవలం ఏడు గృహాలలో పెట్టిన ఆహారం మాత్రమే తీసుకొనేవారు. తెచ్చిన ఆహారం పక్షులకు, చీమలకు, కుక్కలకు పెట్టే వారు. రోజూ తన దగ్గరకు వచ్చే ఆందరినీ దక్షిణ అడిగే వారు. వారు ఎంత అడిగితే అంత ఇవ్వాలి. వారు రెండు రూపాయలు అడిగితే రెండే రూపాయలు మాత్రమే తీసుకొనేవారు. ఎక్కువ ఇచ్చినా తీసుకోరు. ఏ రోజు దక్షిణ డబ్బులు ఆ రోజే భక్తులకు, ముఖ్యంగా బీద భక్తులకు, ఆర్థిక కష్టాలలో ఉన్నవారికీ ఇచ్చేవారు. ఆయన ఏనాడూ తన దగ్గర ఒక్క పైసా ఉంచుకోలేదు.

వచ్చే ప్రతి భక్తుడి మనస్సులో ఏముందో ముందే వారికి తెలిసేది. దుష్టమైన ఆలోచనలతో, ధనాపేక్షతో వచ్చే వారిని బాబా మసీదు మెట్లు కూడా ఎక్కనిచ్చే వారు కాదు. బాబాకు సర్వాంతర్యామిత్వం ఉండేది. అదే ఇందాక చెప్పిన 'జగన్నియామక' శక్తి. ఒకసారి షిర్డీలో మెరుపులు, పిడుగులుతో భారీ వర్షం పడటం మొదలైంది. పాపం పేద షిర్డీ ప్రజలు వచ్చి బాబా మసీదులో తలదాచుకున్నారు. వర్షం క్షణ క్షణానికి పెరగసాగింది. ఊరు కొట్టుకు పోతుందేమోనన్న భయంతో వారు సాయిబాబాను శరణు వేడారు. అప్పటిదాకా మౌనంగా ఉన్న బాబా, మసీదు బయటికి వచ్చి మూడు సార్లు బిగ్గరగా 'ఇక చాలు, ఆగు' అని అరిచారు. అంతే! నిముషాలలో వర్షం ఆగిపోయింది.

బాబాకు పంచ భూతాలపై పూర్తి అధికారం ఉండేది. ఆయన శిర్డిలో ఉన్నంత కాలం మసీదులో నిత్యాగ్ని హెూత్రం ఉండేది. ఒకసారి ఎందుకో ఆ అగ్ని ప్రజ్వరిల్లి మసీదు దంతెల దాకా పోయింది. దంతెలు అంటుకొంటాయేమోనని అక్కడ కూర్చున్న భక్తులు భయపడ్డారు. కానీ, వారి భయం గ్రహించిన బాబా ఒక్క సారి తన చేతిలోని సటకాను నేలపై కొట్టి 'తగ్గు, తగ్గు' అన్నారు. అంతే! ఒక్కసారిగా ఆ ఎగసిన జ్వాలలు సమసిపోయి చిన్నగా అగ్ని హెూత్రంలో మండటం అందరూ గమనించారు.

ఇంకొక సారి సాయి పరమ భక్తుడైన దాసగణు తాను కాశీకి వెళ్లాలనుకొంటున్నానని, అనుమతిమ్మని కోరగా, 'కాశీ ఇదిగో ఇక్కడే వుంది' అని సటకాతో నేలపై కొట్టగానే, భూమిలోంచి నీళ్లు పెల్లుబికి

వచ్చాయి. సాయి నాథుని ఈ లీల చూసి దాసగణు ఒక్కసారిగా బాబా లీలను ప్రశంసిస్తూ గానం అందుకొన్నాడు. దాసగణు నారద సంప్రదాయ హరిదాసు. ఎప్పుడూ బాబా లీలనే పాడుతూ ఊరూరూ తిరిగే వాడు.

బాబా తన వద్దకు వచ్చే భక్తుల జీవన మార్గాలను భక్తి, వైరాగ్య, జ్ఞాన మార్గాల వైపు మళ్లించేవారు. 'గురువు' ఆవశ్యకత గురించి బాబా గొప్పగా బోధించేవారు. ఆధ్యాత్మిక మార్గమందు వ్యక్తులకు స్వేచ్ఛ ఉన్న మాట నిజమే అనే వారు. కానీ, గురువు చెప్పినది వినకపోయినా, లేక గురువుకు స్వయంగా ఆధ్యాత్మిక అనుభవం లేకపోయినా శిష్యులు గోతిలో పడటం ఖాయం అని కూడ చెప్పేవారు. తన గురువు తనను రెండు రూపాయలు 'దక్షిణ' ఇమ్మని అడిగారని, ఆ రెండు రూపాయలు చెల్లించగానే ఆయన తనకు ముక్తి మార్గ ద్వారాలు తెరిచాడని, తాను ఆ మార్గంలో బ్రహ్మానందం అనుభవించానని చెప్పారు. ఇంతకీ ఆ రెండు రూపాయాలేమిటంటే గురువు పట్ల 'అచంచలమైన విశ్వాసం', 'ఓర్పు'. వీటినే ఆయన 'శ్రద్ధా, సబూరి' అని చెప్పే వారు.

ఎవరైతే తమ గురువు పట్ల ఈ రెండూ కలిగి ఉంటారో, వారిని సంసారమనే సముద్రంనుంచి ఒడ్డుకు సులువుగా తీసుకెళ్తానని చెప్పేవారు. సాయి భక్తులైన హేమాడ్ పంతు, కాకాసాహెబు దీక్షిత్, నానా సాహెబ్ చందోర్కర్, దాసగణు, దేవి దాస్, మేఘా, ఇలా ఎందరో సాయి బాబాను 'గురువు, దైవం' గా జీవితమంతా ఆశ్రయించి సునాయాస ముక్తిని పొందారు.

బాబా జ్ఞాన బోధ ఉపనిషద్ రుషి ప్రమాణంగా, ఆచరణాత్మకంగా ఉండేది. ఆయన దగ్గరికి ఉద్దండులైన పండితులు వచ్చి, తాము చాలా గొప్ప వారిమనే అహంతో విర్ర వీగుతుండే వారు. వారు కాకాసాహెబు దీక్షిత్ వాడాలో గాని, సాఠే వాడాలో గాని చేసే వాదనలన్నీ బాబా గ్రహిస్తుండేవారు. సందర్భం వచ్చినప్పుడు వారికి జ్ఞాన బోధ చేసి 'అహంకారం' అనే మానసిక రుగ్మత నుంచి విముక్తి కలిగించే వారు. అప్పుడు వారు నిజమైన ఆనందం, జ్ఞానం బాబానించి గ్రహించి పలుమార్లు నమస్కరించి తమ స్వప్రదేశాలకు వెళ్తుండే వారు.

ఒక సారి నానా సాహెబ్ చాందోర్కర్ కు గూడా ఈ అనుభవం కలిగించారు సాయి నాథుడు. నానాసాహెబ్ గొప్ప సంస్కృత పండితుడు. కానీ, గీత అర్థం కావాలంటే స్వీయ ఆధ్యాత్మిక అనుభూతి కలిగి ఉండాలి. అది లేకపోవటం వలన చాలామందికి గీత అర్థం కాదు. అలా ఒకసారి 'గురువు జ్ఞానం ఉపదేశిస్తాడని, అప్పుడే మనిషికి జ్ఞానం కలుగుతుందని' బాబాతో అంటాడు. అంటమే గాక, ఈ క్రింది పద్యం చదివి దానికి తనకు తెలిసిన పాండిత్య అర్థం చెబుతాడు. అప్పుడు బాబా నానాకు 'జ్ఞానం' ఉపదేశించాడు. 'అజ్ఞానం పోగొడితే మిగిలేది జ్ఞానమే కదా' అని అర్థం విడమరచి చెబుతాడు.

తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా ।
ఉపదేక్ష్యంతి తే జ్ఞానం జ్ఞానినస్తత్త్వదర్శినః ॥

అనే గీతా శ్లోకం 'జ్ఞానోపదేశం' చేసే వారే 'గురువు' అని చెబుతుంది. అంతేగాదు, అటువంటి గురువును వినయంతో అర్థవంతమైన ప్రశ్నలతో

సేవతో కటాక్షించు కొంటే వారు అజ్ఞానాన్ని తొలగిస్తారు అని చెబుతుంది. 'అజ్ఞానం' తొలగితే ఉండేది జ్ఞానమే కదా! అంటే ఇక్కడ గురువు జ్ఞానం బోధించాడా, లేక అజ్ఞానం తొలగించాడా? 'అదే పాండిత్యానికి , అనుభవానికి ఉన్న తేడా' అని నానాకు అర్థమైంది.

ఈ శ్లోకం ద్వారా సాయిబాబా తన వద్ద భక్తులు ఎలా మెలగాలో కూడా సున్నితంగా బోధించారు. బాబా ద్వారా చాలామంది ఐహిక కోరికలు పొంది ఉండవచ్చు. కానీ, అన్నిటికన్నా బాబానుంచి భక్తులకు లభించింది 'జ్ఞానమే'. అందుకే సాయి బాబా ఇప్పటికి మన జగద్గురువు.

(భక్తి మాసపత్రిక, జులై 2025)